# బృహదారణ్యకోపనిషత్

## మధు కాండము అధ్యాయము - 2

## ఉపోద్ఘాతము

మొదటి రెండు అధ్యాయాలను కలిపి మధు కాండము అంటారని, మొదటి అధ్యాయము అధ్యారోపప్రధానం అయితే, రెండవ అధ్యాయం అపవాదప్రధానం అనీ చూశాము.

మొదటి అధ్యాయానికీ, రెండవ అధ్యాయానికీ రెండు విధాల సంబంధం ఉంది. ఆ సంబంధం లేకపోతే, అవి విడివిడి అంశాలుగా మిగిలిపోతాయి. అంశాలు ఇటుకలు అయితే, శాస్త్రం ఇల్లులాంటిది. ఇటుకలను ఒక క్రమపద్ధతిలో పేర్చి, సిమెంటు పెడితేనే మనం నివసించేందుకు వీలైన ఇల్లుగా రూపుదిద్దుకుంటుంది. అలాగే అంశాల మధ్య సంబంధం తెలియకపోతే, మన జ్ఞానం పరిపూర్ణం అవదు. ఇటుకలను బంధించే సిమెంటులాంటి సంబంధాన్ని సంగతి అంటారు శాస్త్రంలో. అందువల్ల ఒక అధ్యాయమునుంచి ఇంకో అధ్యాయముకు వెళ్ళేటప్పుడు, వాటి మధ్య సంబంధం తెలియాలి. తార్కికంగా ఒకదానినుంచి ఒక దానిలోకి వెళ్ళాలి.

కొంతమంది భగవద్గీతను తాము అప్పుడప్పుడూ విన్నామంటారు. ఉదాహరణకు 1957లో 13వ అధ్యాయము వింటే, 1958లో మూడవ అధ్యాయము విన్నామంటారు. కాని అలా చేయటంవల్ల పూర్తి లాభాన్ని పొందలేరు. సంగతి తెలుసుకోవాలి.

మరి, మొదటి అధ్యాయాన్ని దేనితో ముడిపెడతాము? కర్మకాండతో ముడిపెడతాము. ఉపనిషత్తు జ్ఞానకాండ కాబట్టి, కర్మకాండ జ్ఞానకాండ ముందు వస్తుంది కాబట్టి, ఉపనిషత్తుకు కర్మకాండతో ఉన్న సంబంధం గురించి చూడాలి. అందువల్ల బృహదారణ్యకోపనిషత్తు భాష్యం సంబంధభాష్యంతో మొదలవుతుంది. సంగతికి మరోపేరు సంబంధం.

మొదటి అధ్యాయములో రెండు అంశాలు చర్చించబడ్డాయి.

1. అధ్యారోపం
2. విద్యా-అవిద్యా సూత్రాలు

**ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి** 1-4-7 - విద్యాసూత్రం

**అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసాఽవన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవగ్ం స దేవానామ్॥**
1-4-10 అవిద్యాసూత్రం.

ఇప్పుడు, అంటే రెండవ అధ్యాయంలో అపవాదం గురించి రావాలి.

విద్యా–అవిద్యా సూత్రాల్లో అవిద్యా సూత్రానికి మొదటి అధ్యాయంలోనే వివరణ వచ్చేసింది. అందుకని విద్యాసూత్రం వివరణ రావాలి. విద్యాసూత్రం అంటే జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని సూచిస్తుంది.

రెండవ అధ్యాయంలో కూడా ఆరు బ్రాహ్మణాలు ఉన్నాయి. వాటిల్లోని అంశాలు ఇవి

1–3 బ్రాహ్మణములు – అపవాదం
4వ బ్రాహ్మణము – విద్యాసూత్రం
5వ బ్రాహ్మణము – సర్వాత్మభావన
6వ బ్రాహ్మణము – గురుశిష్య పరంపర

ఈ నేపథ్యంతో రెండవ అధ్యాయంలోకి అడుగుపెడదాము. ఈ బ్రాహ్మణము అజాతశత్రువు అనే రాజుకు, గార్గ్య అనే బ్రాహ్మణునికి మధ్య జరిగిన సంవాదం. గార్గి అనే స్త్రీ తర్వాత వచ్చే అధ్యాయాల్లో వస్తుంది. ఇక్కడ వచ్చింది గార్గ్య అనే బ్రాహ్మణుడు. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, క్షత్రియుడైన రాజు గురువు అవుతాడు. బ్రాహ్మణుడు శిష్యుడవుతాడు.

ఈ కథనుబట్టి పూర్వకాలంలో రాజుల్లో కూడా జ్ఞానులున్నారనే విషయం తేటతెల్లమవుతున్నది. గీతలో శ్రీకృష్ణభగవానుడు రాజర్షి గురించి చెబుతాడు; అజాతశత్రువు అటువంటి ఒక రాజర్షి. అజాతశత్రువు గురువు కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని అజాతశత్రు బ్రాహ్మణం అంటారు. ముందుగా గురుశిష్యులను పరిచయం చేస్తుంది ఉపనిషత్తు.

## 2.1 – అజాతశత్రు బ్రాహ్మణము

మంత్రం 2.1.1

**ఓమ్, దృప్తబాలాకిర్హానూచానో గార్గ్య ఆస స హోవాచాజాతశత్రుం కాశ్యం బ్రహ్మ తే బ్రవాణీతి స హోవాచాజాతశత్రుస్సహస్రమేతస్యాం వాచి దద్మో జనకో జనక ఇతి వై జనా ధావన్తీతి ॥**

**దృప్తబాలాకిర్హానూచానో గార్గ్య ఆస** – ఒకానొకప్పుడు గార్గ్య అనే ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. అతని ఇంకోపేరు బాలాకీ. గర్గ్య గోత్రానికి చెందినవాడు కాబట్టి గార్గ్యుడు. బలాకీ పుత్రుడు కాబట్టి బాలాకీ. అతను వేదపారంగతుడు. బోధ చేసే సామర్థ్యం కూడా ఉంది. దృప్త – జ్ఞానం ఉంది కాని, జ్ఞానం ఉందన్న గర్వం కూడా ఉంది.

**స హోవాచాజాతశత్రుం కాశ్యమ్** – కాశీరాజు అయిన అజాతశత్రువు దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. అతనికి కాశీరాజు జ్ఞాని అని తెలియదు. గార్గ్య ఎదురుగా ఉన్న రాజును తక్కువగా అంచనా వేసుకున్నాడు. తన గురించి గొప్పగా భావించుకున్నాడు. దాని ఫలితమేమిటో ముందు ముందు చూస్తాము.

**బ్రహ్మ తే బ్రవాణీతి** – నీకు బ్రహ్మ గురించి చెబుతాను అన్నాడు.

**స హోవాచ అజాతశత్రుః** – అతనితో అజాతశత్రువు ఇలా అన్నాడు.

**సహస్రమేతస్యాం వాచి దద్మః** – బ్రహ్మ గురించి చెబుతాననగానే సంతోషంగా అతనికి వేయి ఆవులను ఇస్తానని మాట ఇచ్చేశాడు. ఎందుకు? అతనే కారణం చెప్పాడు.

**జనకో జనక ఇతి వై జనా ధావన్తీతి** – మామూలుగా అందరూ జనకుని దగ్గరకే వెళతారు. ఆయనే గొప్ప జ్ఞాని. ఆయనే దానం చేస్తాడు అనుకుంటారు. కనీసం ఒకరన్నా తన దగ్గరకు వచ్చాడని మురిసిపోయాడు.

### మంత్రాలు 2.1.2 నుంచి 2.1.13 వరకు ఉపోద్ఘాతము–

ఈ మంత్రాలు చూసేముందు, బోధ ఎలా కొనసాగుతుందో చూద్దాము. గార్గ్య బ్రహ్మ గురించి చెబుతానన్నాడు. అతనికి తెలిసింది సగుణబ్రహ్మ గురించి మాత్రమే. సగుణబ్రహ్మను హిరణ్యగర్భ అని, సోపాధికబ్రహ్మ అని, సవిశేషబ్రహ్మ అని కూడా అంటారు. నిర్గుణబ్రహ్మ ఈ హిరణ్యగర్భ కన్నా ఎక్కువ. కాని గార్గ్యకు తెలియదు, అజాతశత్రువుకు తెలుసు.

అందువల్ల గార్గ్య హిరణ్యగర్భ గురించి చెప్పబోయినప్పుడల్లా, అజాతశత్రువు నాకు ఇది తెలుసు, నేను దీనిమీద ఉపాసన చేశాను అని చెప్పాడు. అలా పన్నెండు మంత్రాల్లో హిరణ్యగర్భమీద పన్నెండు ఉపాసనల గురించి చెప్పాక, ఇంతేనా అతనికి తెలిసిందని అజాతశత్రువు అడిగాడు. గార్గ్య తలవంచుకుని అంతకన్నా తెలియదన్నాడు.

అజాతశత్రువు జ్ఞాని అని తెలియక, తనకు తెలిసిన జ్ఞానం అల్పమేనని తెలియక, అజాతశత్రువుకు బోధ చేస్తానని గర్వంగా ముందుకు వచ్చాడు. కాని తనకు తెలిసింది తక్కువేనని తెలిశాక, తన ఓటమిని సహృదయంతో ఒప్పుకుని, అజాతశత్రువుకు శిష్యునిగా మారిపోయాడు. రాజు కూడా అంతకన్నా సహృదయతతో, శిష్యుడు పాటించాల్సిన నియమాలను పక్కకు పెట్టి, అతన్ని చేయి పట్టుకుని తీసుకువెళ్ళి తన బోధ మొదలుపెట్టాడు.

2 నుండి 13 వరకు గార్గ్యబోధ, 16 నుండి 20 వరకూ అజాతశత్రువుబోధ. మధ్యలో గురుశిష్యులు తారుమారు అవుతారు. రెండవ మంత్రం అర్థం చూస్తే 13 వరకూ సారాంశం అదే. ఈ మంత్రాల్లో హిరణ్యగర్భ ఉపాసన గురించి చెబుతాడు.

వ్యష్టి సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉంటాయి. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, చత్వారి అంతఃకరణాని. వీటిని కరణాలు అంటారు. వీటికి సమష్టిపరంగా అధిష్ఠానదేవతలు ఉంటారు. ఉదాహరణకు కన్నుకు అధిష్ఠానదేవత – సూర్యుడు; వాక్కుకు అధిష్ఠానదేవత అగ్ని; మనస్సుకు అధిష్ఠానదేవత చంద్రుడు. సాంకేతిక పరంగా చెప్పాలంటే కరణం అధ్యాత్మం, కార్యం అధిదైవం, కరణాలన్నీ కలిసి వ్యష్టి అయితే, అధిష్ఠాన దేవతలందరూ కలిసి హిరణ్యగర్భ అవుతారు.

ఎలాగైతే ఒక కరణం మనకొక అంగమో, అలా ఒక అధిష్ఠానదేవత, హిరణ్యగర్భకు ఒక అంగం లేదా అవయవం. అందువల్ల ఈ అధిష్ఠానదేవతల్లో ఎవరినన్నా ప్రతీకగా తీసుకుని, ఆ ప్రతీకమీద హిరణ్యగర్భను ఆవాహన చేసి, ఉపాసన చేయాలి. అలాంటి ఉపాసనలు కొన్ని చెప్పాడు గార్గ్య.

మంత్రం 2.1.2

**స హోవాచ గార్గ్యో య ఏవాసావాదిత్యే పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా అతిష్ఠాస్సర్వేషాం భూతానాం మూర్ధా రాజేతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తేఽతిష్ఠాస్సర్వేషాం భూతానాం మూర్ధా రాజా భవతి ॥**

ఈ మంత్రం అర్థం చూస్తే 13వ మంత్రం వరకూ అలాగే కొనసాగుతుంది కాబట్టి అర్థం చేసుకోవటం తేలిక.

మంత్రం 2: ఆదిత్య ఉపాసన – **అతిష్ఠా, మూర్ధా, రాజా**

**స హోవాచ గార్గ్యః** – గార్గ్యుడు అజాతశత్రువుతో చెప్పాడు.

**య ఏవాసావాదిత్యే పురుషః** – ఆదిత్యునిమీద

**ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి** – హిరణ్యగర్భ ఉపాసన చేస్తాను.

**స హోవాచాజాతశత్రుః** – గార్గ్యతో అజాతశత్రువు అన్నాడు;

**మా మా** – వద్దు, వద్దు;

**ఏతస్మిన్ సంవదిష్ఠాః** – ఈ విషయం నాకు చెప్పవద్దు.

**అతిష్ఠాః సర్వేషాం భూతానాం మూర్ధారాజేతి వా** – ఈ సూర్యుడు శ్రేష్ఠుడు, పుజ్యనీయుడు, దీప్తిమంతుడు

**అహమేతముపాస ఇతి** – నేను ఈయనను ఈ లక్షణాలతో ఉపాసన చేస్తాను.

**స య ఏతమేవముపాస్తే** – ఎవరైతే ఈ విధంగా గుణవిశిష్ట ఆదిత్య ఉపాసన చేస్తారో,

**అతిష్ఠాః సర్వేషాం భూతానాం మూర్ధా రాజా భవతి** – అతను కూడా సూర్యునిలాగే శ్రేష్ఠుడు, పూజ్యనీయుడు, దీప్తిమంతుడు అవుతాడు.

ఈ గుణాలు నిజానికి హిరణ్యగర్భకు చెందినవి. ఆ గుణాలను ఆదిత్యమీద ఆరోపించి ఉపాసన చేయాలి.

**యథా యథోపాసతే తదేవ భవతి** – ఆలంబనమీద హిరణ్యగర్భకున్న ఏ గుణాలను ఆరోపించి హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో వారికి ఆయా గుణాలు ప్రతిఫలంగా వస్తాయి.

మంత్రం 2.1.3

**స హోవాచ గార్గ్యో య ఏవాసౌ చన్ద్రే పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా బృహన్ పాణ్డరవాసాస్సోమో రాజేతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తేఽహరహర్హ సుతః ప్రసుతో భవతి నాస్యాన్నం క్షీయతే ॥**

మంత్రం 2.1.4

**స హోవాచ గార్గ్యో య ఏవాసౌ విద్యుతి పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠాస్తేజస్వీతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే తేజస్వీ హ భవతి తేజస్వినీ హాస్య ప్రజా భవతి ॥**

మంత్రం 2.1.5

స హోవాచ గార్గ్యో య ఏవాయమాకాశే పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠాః పూర్ణమప్రవర్తీతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే పూర్యతే ప్రజయా పశుభిర్నాస్యాస్మాల్లోకాత్ప్రజోద్వర్తతే ॥

మంత్రం 2.1.6

స హోవాచ గార్గ్యో య ఏవాయం వాయౌ పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా ఇన్ద్రో వైకుణ్ఠోఽపరాజితా సేనేతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే జిష్ణుర్హాపరాజిష్ణుర్భవత్యన్యతస్త్యజాయీ ॥

మంత్రం 2.1.7

స హోవాచ గార్గ్యో య ఏవాయమగ్నౌ పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా విషాసహిరితి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే విషాసహిర్హ భవతి విషాసహిర్హాస్య ప్రజా భవతి ॥

మంత్రం 2.1.8

స హోవాచ గార్గ్యో య ఏవాయమప్సు పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠాః ప్రతిరూప ఇతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే ప్రతిరూపగ్ం హైవైనముపగచ్ఛతి నాప్రతిరూపమథో ప్రతిరూపోఽస్మాజ్జాయతే ॥

మంత్రం 2.1.9

స హోవాచ గార్గ్యో య ఏవాయమాదర్శే పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా రోచిష్ణురితి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే రోచిష్ణుర్హ భవతి రోచిష్ణుర్హాస్య ప్రజా భవత్యథో యైస్సన్నిగచ్ఛతి సర్వాగ్ంస్తానతిరోచతే ॥

మంత్రం 2.1.10

స హోవాచ గార్గ్యో య ఏవాయం యన్తం పశ్చాచ్ఛబ్దోఽనూదేత్యేతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా అసురితి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే సర్వగ్ం హైవాస్మింల్లోక ఆయురేతి నైనం పురా కాలాత్ప్రాణో జహాతి॥

### మంత్రం 2.1.11

**స హోవాచ గార్గ్యో య ఏవాయం దిక్షు పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా ద్వితీయోఽనపగ ఇతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే ద్వితీయవాన్ హ భవతి నాస్మాద్గణశ్ఛిద్యతే ॥**

### మంత్రం 2.1.12

**స హోవాచ గార్గ్యో య ఏవాయం ఛాయామయః పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా మృత్యురితి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్తే సర్వగ్ం హైవాస్మింల్లోక ఆయురేతి నైనం పురా కాలాన్మృత్యురాగచ్ఛతి॥**

### మంత్రం 2.1.13

**స హోవాచ గార్గ్యో య ఏవాయమాత్మని పురుష ఏతమేవాహం బ్రహ్మోపాస ఇతి స హోవాచాజాతశత్రుర్మా మైతస్మిన్ సంవదిష్ఠా ఆత్మన్వీతి వా అహమేతముపాస ఇతి స య ఏతమేవముపాస్త ఆత్మన్వీ హ భవత్యాత్మన్వినీ హాస్య ప్రజా భవతి స హ తూష్ణీమాస గార్గ్యః॥**

**హిరణ్యగర్భ ఉపాసన**

| **మంత్రం** | **ఆలంబన** | **గుణాలు** | **ఫలం** |
|---|---|---|---|
| 2 | ఆదిత్యుడు | అతిష్ఠా, మూర్ధా, రాజా | అతిష్ఠా, మూర్ధా, రాజా అవుతాడు. |
| 3 | చంద్రుడు | బృహన్, పాండరవాసాః సోమోరాజా | రాత్రింబవళ్ళు సోమరసాన్ని దంచుతాడు, అన్నానికి లోటుండదు. |
| 4 | విద్యుత్తు | తేజస్వి | తేజస్వి అవుతాడు; సంతానం కూడా తేజస్సు పొందుతారు. |
| 5 | ఆకాశం | పూర్ణుడు, అప్రవర్తి | పూర్ణుడు, శాంతమూర్తి అవుతాడు. |
| 6 | వాయువు | ఇంద్రుడు, వైకుంఠుడు, అపరాజితా సేన | చురుకుగా ఉంటాడు; పరాజయమును పొందదు. |
| 7 | అగ్ని | విషాసహి | ఇతరులను సహిస్తాడు, పిల్లలు కూడా ఇతరులను సహిస్తారు. |
| 8 | జలము | ప్రతిరూపం | సమానరూపం ఉన్న పుత్రుడు పుడతాడు. |
| 9 | అద్దం | రోచిష్ణువు | దీప్తిమంతుడవుతాడు. సంతానం కూడా దీప్తిమంతులవుతారు. తన దగ్గరకి వచ్చిన వారందరినీ మించి దీప్తిమంతుడు అవుతాడు. |

| | | | |
|---|---|---|---|
| 10 | శబ్దం | అసువు (పరుగెత్తేవాని ఆయాసం) | పూర్ణాయుష్షు ఉంటుంది; అపమృత్యుదోషం అంటదు. |
| 11 | దిక్కు | ద్వితీయం ఉన్నవాడు, విడిపోనివాడు | తోడు గలవాడు అవుతాడు. అనుచరుడు విడిపోడు. |
| 12 | నీడ | మృత్యువు | పూర్ణాయుష్షు ఉంటుంది. అపమృత్యుదోషం అంటదు. |
| 13 | ఆత్మ (బుద్ధి) | ఆత్మన్వీ | మనోజయం పొందుతాడు. పుత్రులు కూడా మనోజయం పొందుతారు. |

**మంత్రం 3: చంద్ర ఉపాసన – బృహన్ పాణ్డరవాసాః సోమో రాజేతి వా –** చంద్రుడు మహాత్ముడు; తెల్లని వస్త్రాలు కలవాడు, రాజు. ఎవరైతే చంద్రునిమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తాడో అతను రాత్రింబవళ్ళు సోమరసాన్ని దంచుతాడు. అంటే యజ్ఞాలు చేస్తాడు. అన్నానికి లోటు ఉండదు. తెల్లని వస్త్రాలు అంటే శుభ్రమైన వస్త్రాలు అని తీసుకోవాలి.

**మంత్రం 4: విద్యుత్తు ఉపాసన – తేజస్వీ –** మెరుపు దీప్తివంతంగా ఉంటుంది కాబట్టి ఎవరైతే మెరుపుమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, అతను కూడా అందరిలో ఒక మెరుపులా తాను మెరవటమే కాదు, తన సంతానం కూడా మెరుస్తారు.

**మంత్రం 5: ఆకాశ ఉపాసన – పూర్ణమప్రవర్తి –** అప్రవర్తి అంటే క్రియలు చేయని వాడు. అంటే శాంతం కింద తీసుకోవాలి. ఎవరైతే ఆకాశంమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, అతను కూడా పూర్ణుడు, శాంతమూర్తి అవుతాడు.

**మంత్రం 6: వాయు ఉపాసన – ఇంద్రో వైకుంఠోఽ పరాజితా సేనా –** ఇంద్రుడంటే ఈశ్వరుడు; వైకుంఠుడు అంటే తమోగుణము లేనివాడు; శక్తివంతుడు. అపరాజితా సేనా అంటే పరాజయము నెరుగని సేన ఉన్నవాడు. ఎవరైతే వాయువుమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో అతను కూడా ఇంద్రుడు, వైకుంఠుడు, అపరాజితా సేన అవుతాడు.

**మంత్రం 7: అగ్ని ఉపాసన – విషాసహి –** అగ్నికి బిరుదు విషాసహి. అగ్ని సర్వభక్షకుడు. ఏది ఇచ్చినా తింటాడు. ఏది ఇచ్చినా తింటాడు అంటే క్షమాగుణం లేదా తితిక్ష ఉన్నవాడు అవుతాడు. ఎవరైతే అగ్నిమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, అతను కూడా క్షమాగుణం పొంది, ఇతరులను సహిస్తాడు. అతనే కాదు, అతని సంతానం కూడా ఇతరులను సహిస్తారు.

**మంత్రం 8: జల ఉపాసన – ప్రతిరూపం –** ప్రతిరూపం అంటే సమానరూపం. ఎవరైతే జలంమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, అతనికి ప్రతిరూపమే వస్తుంది కాని, ప్రతిరూపం కానిది రాదు. అంతేకాదు, తనలాగా ఉండే పుత్రప్రాప్తి కలుగుతుంది.

**మంత్రం 9: ఆదర్శ ఉపాసన – రోచిష్ణువు** – రోచిష్ణువు అంటే దీప్తి గలవాడు. మనస్సు అద్దంలా స్వచ్ఛంగా ఉంటుంది. ఎవరైతే అద్దంమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తాడో, అతను కూడా దీప్తిమంతుడవుతాడు. అతని సంతానం కూడా దీప్తిమంతులవుతారు. తన దగ్గరకి వచ్చిన వారందరినీ మించి దీప్తిమంతుడు అవుతాడు.

**మంత్రం 10: శబ్ద ఉపాసన – అసుః –** అసుః అంటే ప్రాణం. ఎవరైతే పరిగెత్తేవాని ఆయాసం (శబ్దం)మీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తాడో, అతనికి కూడా పూర్ణాయుష్షు ఉంటుంది. అపమృత్యుదోషం అంటదు.

**మంత్రం 11: దిక్షు ఉపాసన – ద్వితీయోఽనపగ –** దిక్కుల గురించి మాట్లాడేటప్పుడు తూర్పు చెపితే, పడమర గురించి కూడా చెపుతాము. ద్వితీయం అంటే రెండోది ఉన్నవాడు; అనపగః అంటే విడిపోనివాడు. ఎవరైతే దిక్కుమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తాడో, అతను తోడు గలవాడు అవుతాడు. అనుచరుడు విడిపోడు.

**మంత్రం 12: భయ ఉపాసన –మృత్యువు –** మృత్యువు అంటే ఇక్కడ అజ్ఞానం. అజ్ఞానమే మృత్యుభయానికి కారణం. ఎవరైతే ఛాయమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తాడో అతనికి కూడా పూర్ణాయుష్షు ఉంటుంది. అపమృత్యుదోషం అంటదు. అజ్ఞాననివృత్తి కలుగుతుంది.

**మంత్రం 13: బుద్ధి ఉపాసన – ఆత్మన్వీ –** ఆత్మన్వీ అంటే మనోజయం లేదా ఆత్మ సంయమనం. ఎవరైతే ఆత్మమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, అతనుకూడా మనోజయం పొందుతాడు. పుత్రులు కూడా మనోజయం పొందుతారు.

హిరణ్యగర్భ అంటే సమష్టి దేవతలకు అధిష్ఠానదేవత అని చూశాము. ఈ దేవతలు వ్యష్టిలోని అంగాలకు అధిష్ఠానదేవతలని కూడా చూశాము. అందువల్ల అధిష్ఠానదేవతమీద హిరణ్యగర్భ ఉపాసన చేసేటప్పుడు, వారికి తగ్గ అంగాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. అంటే సూర్యుడు చక్షువుకు అధిష్ఠానదేవత. కన్ను అధ్యాత్మకం. సూర్యుడు అధిదైవం. ఈ రెండింటినీ కలిపి ఒకటే ఆలంబనంగా తీసుకుని సమష్టిహిరణ్యగర్భ ఉపాసన చేయాలి.

**స హ తూష్ణీమాస గార్గ్యః** – దీని తర్వాత గార్గ్యుడు నిశ్శబ్దంగా ఉన్నాడు.

ఇక్కడితో గార్గ్యునకు తెలిసినదంతా అయిపోయింది. అతను చెప్పినదంతా అజాతశత్రువుకు ముందే తెలుసు. అందువల్ల చెప్పటం ఆపేశాడు.

## మంత్రం 2.1.14

**స హోవాచాజాతశత్రురేతావన్నూ 3 ఇత్యేతావద్ధీతి నైతావతా విదితం భవతీతి స హోవాచ గార్గ్య ఉప త్వా యానీతి ॥**

**స హోవచాజాతశత్రురేతావన్నూ 3 ఇతి** – అజాతశత్రువు నీకు ఇంతే తెలుసా అని అడిగాడు. నువ్వు పరబ్రహ్మ గురించి మాట్లాడతానన్నావు. కాని అది తెలిసినట్టు లేదు అని అర్థం వస్తుంది ఆ ప్రశ్నలో.

**ఏతావద్ధీతి** – అంతే తెలుసు అని గార్గ్యుడు జవాబు చెప్పాడు.

**నైతావతా విదితం భవతీతి** – ఇంతే తెలిస్తే, అంటే హిరణ్యగర్భ గురించి మాత్రమే తెలిస్తే బ్రహ్మ గురించి తెలిసినట్టు కాదని అజాతశత్రువు చెప్పాడు.

**అవ్యక్తం వ్యక్తమాపన్నం మన్యంతే మామ్ అబుద్ధయః** – గీత 7.14

హిరణ్యగర్భ గురించి మాత్రమే తెలిస్తే అది జ్ఞానం కిందకు రాదు. సంసార విముక్తి కలుగదు. అందువల్ల ఈ జ్ఞానం బ్రహ్మజ్ఞానం కిందకి రాదని చెప్పాడు.

**స హోవాచ గార్గ్య ఉప త్వా యానీతి** – నేను నిన్ను (ఉపదేశంకోసం) శరణు వేడుచున్నాను అని చెప్పాడు గార్గ్యుడు.

## మంత్రం 2.1.15

**స హోవాచాజాతశత్రుః ప్రతిలోమం చైతద్యద్బ్రాహ్మణః క్షత్రియముపేయాద్బ్రహ్మ మే వక్ష్యతీతి వ్యేవ త్వా జ్ఞపయిష్యామీతి తం పాణావాదాయోత్తస్థౌ తౌ హ పురుషగ్ం సుప్తమాజగ్మతుస్తమేతైర్నామభిరామంత్రయాంచక్రే బృహన్ పాండరవాసస్సోమరాజన్నితి స నోత్తస్థౌ తం పాణినాఽఽ పేషం బోధ యాఞ్చకార స హోత్తస్థౌ ॥**

**స హోవాచాజాతశత్రుః ప్రతిలోమం చైతత్** – అతనితో అజాతశత్రువు ఇది విపరీతంగా ఉంది అన్నాడు. ఏమిటది?

**బ్రాహ్మణః క్షత్రియముపేయాద్బ్రహ్మ మే వక్ష్యతీతి** – బ్రాహ్మణుడు క్షత్రియుని దగ్గరకు వెళ్ళటం. ఎందుకు? క్షత్రియుడు నాకు బ్రహ్మవిద్యను నేర్పిస్తాడు అనుకుని వెళ్ళటం.

పూర్వం క్షత్రియులూ, బ్రాహ్మణులూ కూడా వేదాన్ని అభ్యసించినా క్షత్రియులు వేదాన్ని బోధించకూడదు. బ్రాహ్మణుడు మాత్రమే బోధించాలి. బ్రాహ్మణునికి ఆరు ధర్మాలు ఉన్నాయి. అవి –

1. అధ్యయనం – వేదం నేర్చుకోవటం.
2. అధ్యాపనం – వేదాన్ని నేర్పించటం.
3. యజనం – యజ్ఞం చేయటం.
4. యాజనం (యాచనం కాదు) – యజ్ఞాన్ని చేయించటం.
5. దానం – దానం చేయటం.
6. పరిగ్రహం – దానాన్ని స్వీకరించటం.

క్షత్రియులకు ఇందులో మూడు వర్తిస్తాయి. వారు వేదాన్ని నేర్చుకోవచ్చు. కాని, నేర్పించలేరు; యజ్ఞం చేయవచ్చు కాని, యజ్ఞాన్ని చేయించలేరు; దానం చేయగలరు కాని దానాన్ని స్వీకరించలేరు. అందువల్ల అజాతశత్రువు గార్గ్యునికి చెప్పలేదు.

**వ్యేవ త్వా జ్ఞపయిష్యామీతి** – అయినా నీకు నేను చెబుతాను.

**తం పాణావాదాయోత్తస్థౌ** – మామూలుగా గురువు దగ్గరకు శిష్యుడు సమిథలు తీసుకుని వెళ్ళి, నమస్కారం చేసి, గురువుకు దగ్గరగా కూర్చోవాలి. గురువు అతనికి ఉపనయనం చేసి బోధ మొదలుపెడతాడు. ఇక్కడ అటువంటి

పద్ధతులేవీ పాటించనవసరం లేకుండానే, నేను నీకు బోధిస్తాను అన్నాడు అజాతశత్రువు. ఇది అజాతశత్రువు ఉన్నత సంస్కారానికి ప్రతీక. అందువల్ల గార్గ్యుని చేతులను పట్టుకుని లేచి నిలబడ్డాడు. లేచి ఏం చేశాడు?

**తౌ హ పురుషగ్ం సుప్తమాజగ్మతుః** – వారు నిద్రపోతున్న ఒక వ్యక్తి దగ్గరకు వెళ్ళారు.

**తమేతైర్నామభిరామన్త్రయాఞ్చక్రే** – నిద్రపోతున్న వాడిని ఈ క్రింది పేర్లతో పిలిచాడు. ఏమిటవి?

**బృహన్ పాణ్డరవాసః సోమరాజన్నితి** – అతనిని బృహత్, పాండరవాసః, సోమరాజన్ అనే పేర్లతో పిలిచాడు. అంటే మహాత్ముడు, తెల్లని వస్త్రాలు గలవాడు, రాజు.

**స నోత్తస్థౌ**– అతను లేవలేదు.

**తం పాణినాఽ ఽ పేషం బోధయాఞ్చకార స హోత్తస్థౌ** – ముందు శరీరాన్ని తాకాడు – అతను లేవలేదు. ఆపేషం అంటే తీవ్రంగా కుదిపాడు. అప్పుడు లేచాడు అతను.

అక్కడితో అతనితో పని అయిపోయింది. లేపినతన్ని ఏం చేశారో మనకనవసరం. దీన్నించి ఏం నేర్పించాడో చూడాలి. శంకరాచార్యులవారు దీన్ని విశ్లేషించారు. ఒక ముక్కలో చెప్పాలంటే –

**స్థూల సూక్ష్మ వ్యతిరిక్తః ఆత్మ**

1. ఆత్మ స్థూలశరీరం కాదు – అజాతశత్రువు నిద్రపోతున్న అతని శరీరం ముట్టుకున్నా, అతను లేవలేదు. తర్వాత తీవ్రంగా కుదిపితే లేచాడు. దీన్నిబట్టి ఒక విషయం తేటతెల్లమవుతున్నది. ఆత్మ స్థూలశరీరం కాదు. స్థూలశరీరమయితే, ముట్టుకోగానే అతను లేచి ఉండేవాడు. కాని కుదిపాక లేచాడు అంటే ఆత్మ స్థూలశరీరం కాదు కాని, స్థూలశరీరంతో కలిసి ఉంది. ఈ అనుబంధం స్థాయిలు మారుతూ వస్తాయి. పూర్తి స్థాయి అనుబంధం, కొంతమేరకు అనుబంధం, అసలు లేకపోవటం. ఇలా అనుబంధం స్థాయి మారుతూ వస్తున్నదంటే, దాని వెనుక ఏదో ప్రత్యేక కారణం ఉండి ఉంటుంది.

2. శరీరం కర్మఫలం – సుషుప్తిలో ఈ అనుబంధం లేదు. ఈ అనుబంధాన్ని కలుగచేసే ఆ కారణం మాయమవుతుంది. శాస్త్రం ప్రకారం ఈ స్థాయీభేదాలు కర్మవల్ల ఏర్పడుతాయి. జీవుడు శరీరంతో మమేకం చెందినప్పుడు సుఖదుఃఖాలద్వారా తన పుణ్యపాపాలను క్షయం చేసుకోగలడు. కాని సుషుప్తిలో ఉన్నప్పుడు శరీరం పడుకుంటుంది కాబట్టి, అనుభవించలేకపోతే పుణ్యపాపాలను క్షయం చేయలేరు. పుణ్యపాపాలు అందరికీ సమానంగా ఉండవు కాబట్టి, దేహ అభిమానం కూడా అందరికీ ఒక్కలాగా ఉండదు.

   అందువల్ల కొందరు చీమ చిటుక్కుమంటే లేస్తే, కొందరు ఎంత అరచి గీపెట్టినా లేవరు. ప్రారబ్ధకర్మ తక్కువ ఉంటే, కంటినిండా నిద్రపోతారు. ఎక్కువ ఉంటే అవస్థపడతారు. అందువల్ల శరీరం కర్మఫలం అని తెలుస్తున్నది.

3. ఆత్మ ప్రాణం కాదు – ఆత్మ ప్రాణానికి కూడా భిన్నంగా ఉంది. ప్రాణం అంటే అధ్యాత్మం, అధిదైవం – రెండూ తీసుకోవాలి. అజాతశత్రువు నిద్రపోతున్న అతన్ని బృహత్ పాండరవాస, సోమరాజు అని పిలిచాడు. ఇవి హిరణ్యగర్భ నామాలు. వ్యష్టిపరంగా ప్రాణానికి నామాలు. ఆత్మ ప్రాణమయితే, ఈ పేర్లతో పిలవగానే, అతను పలికి ఉండేవాడు.ఎందుకంటే నిద్రలో కూడా ప్రాణం పనిచేస్తుంది.

సుషుప్తిలో అన్ని అంగాలూ పడుకున్నా, ప్రాణం మాత్రం పనిచేస్తుంది. ప్రాణం పనిచేయకపోతే నిద్రపోతున్న వ్యక్తిని మరణించినట్టుగా భావిస్తారు. అందువల్ల ప్రాణం జవాబు చెప్పలేదంటే, ఆత్మ ప్రాణం కాదు.

4. ఆత్మ ఇంద్రియాలు కాదు – ఆత్మ ప్రాణ వ్యతిరిక్తం అంటే, ఇంద్రియ వ్యతిరిక్తం కూడా. ఎందుకంటే ప్రాణశక్తివల్లే జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పనిచేస్తున్నాయి. ప్రాణంవల్లే తక్కిన అంగాలు పనిచేస్తున్నాయి కాబట్టి దాన్ని అంగిరసం అంటారు అని ముందు అధ్యాయంలో చూశాము. అంతేకాదు, ఇంద్రియాలు వాటికున్న విశేష గుణాలనూ, వాటితోపాటు వాటి పేర్లను కూడా ప్రాణానికి ధారపోశాయని ఛాందోగ్యోపనిషత్తులో చూస్తాము. అందువల్ల ఇంద్రియాలను కూడా ప్రాణాలనే వ్యవహరిస్తారు. ముఖ్యప్రాణం అంటే పంచప్రాణాలు. ప్రాణం అంటే సందర్భాన్నిబట్టి ఇంద్రియాలు అని వ్యవహరిస్తారు. అందువల్ల ఆత్మ సూక్ష్మశరీరవ్యతిరిక్తం.

5. ఆత్మ కరణాలద్వారానే ప్రకటితమవుతుంది – ఆత్మ స్థూలశరీరానికి, సూక్ష్మశరీరానికి భిన్నంగా ఉంటే, అజాతశత్రువు పిలిచినప్పుడు ఆత్మ ఎందుకు పలుకలేదు? ఎందుకంటే ఆత్మ నిర్వికారం, నిర్విశేషం. సవిశేషాలైన కరణాలద్వారానే (ఇంద్రియాలద్వారానే) పనిచేస్తుంది. సుషుప్తిలో ఇంద్రియాలు, మనసు, శరీరం అన్నీ పడుకుంటాయి కాబట్టి ఆత్మకు ప్రతిబింబమాధ్యమం పనిచేయటం లేదు కాబట్టి ప్రకటితమవలేదు.

ఈ అంశాలన్నింటినీ మళ్ళీ ఒకసారి చూస్తే –

1. ఆత్మ స్థూలశరీరం కాదు.
2. శరీరం కర్మఫలం.
3. ఆత్మ ప్రాణం కాదు.
4. ఆత్మ ఇంద్రియాలు కాదు(సూక్ష్మశరీరం కాదు).
5. ఆత్మ కరణాలద్వారానే ప్రకటితమవుతుంది.

## మంత్రం 2.1.16

**స హోవాచాజాతశత్రుర్యత్రైష ఏతత్సుప్తో౽భూద్య ఏష విజ్ఞానమయః పురుషః క్వైష తదా౽భూత్తుత ఏతదాగాదితి తదు హ న మేనే గార్గ్యః ॥**

ఆత్మ స్థూల, సూక్ష్మశరీరవ్యతిరిక్తం కాబట్టి, అవి సుషుప్తిలో లయమవుతాయి కాబట్టి, అజాతశత్రువు ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకుని, ఈ ప్రశ్న అడుగుతాడు. కార్యకరణసంఘాతము అయిన శరీరానికి భిన్నమైన ఆత్మ సుషుప్తిలో ఎక్కడ ఉంటుంది? ఎక్కడనుంచి వచ్చింది? ఒక్కముక్కలో చెప్పాలంటే ఆత్మ స్వరూపం ఏమిటి?

సుషుప్తిలో జీవాత్మ లయమయే ఆ స్వస్వరూపం ఏమిటి? ఇది ప్రశ్న. గార్గ్యునికి ఆ జవాబు తెలియలేదు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**స హోవాచాజాతశత్రుః** – అజాతశత్రువు అన్నాడు.

**యత్రైష ఏతత్సుప్తో౽ భూత్** – నిద్రపోతున్నప్పుడు;

**య ఏష విజ్ఞానమయః పురుషః** – ఈ జీవాత్మ; విజ్ఞానమయః పురుషః.ఇది జీవాత్మకు ఇంకోపేరు.

**క్వైష తదా౽ భూత్** – అప్పుడు ఎక్కడ ఉంది?

**కుత ఏతదాగాత్**– ఈ విధంగా ఎక్కడ్నుంచి వచ్చింది?

**తదు హ న మేనే గార్గ్యః** – ఈ విషయం గార్గ్యునకు తెలియలేదు.

ఏదైనా ఒక వస్తువు లయమవ్వాలంటే దాని కారణంలో లయమవుతుంది. ఉదాహరణకు ఆభరణాలను కరిగిస్తే బంగారం అవుతుంది. కుండ పగిలితే మట్టి అవుతుంది. అల లయమయితే నీరు అవుతుంది. అదే విధంగా జీవాత్మ వ్యక్తిగా పనిచేస్తున్నది. సుషుప్తిలో వ్యక్తిత్వం కోల్పోయి, వ్యవహారాలు ఆపేసింది అంటే తన స్వస్వరూపంలో లయమవాలి.

జీవాత్మ స్వరూపం ఏమిటి? అది ఎందులో లయమవుతుంది? జీవాత్మస్వరూపమే పరమాత్మస్వరూపం. సుషుప్తిలో జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది. జాగ్రదావస్థలో పరమాత్మ స్వరూపంనుంచి బయటకు వచ్చి మళ్ళీ జీవాత్మస్వరూపాన్ని పొందుతుంది.

మనం నిద్రలో నీరులాగా ఉంటాము. జాగ్రదావస్థలో అలలలాగా ఎగసిపడతాము. ఇంకో భాషలో చెప్పాలంటే సుషుప్తిలో నిర్విశేషజ్ఞానంగా ఉంటే, జాగ్రదావస్థలో సవిశేషజ్ఞానంగా వ్యవహరిస్తాము. మనం నిర్విశేషజ్ఞానంలో ఉంటే పరమాత్మ, సవిశేషజ్ఞానంగా వ్యవహరిస్తే జీవాత్మ అవుతాము.

## మంత్రం 2.1.17

**స హోవాచాజాతశత్రుర్యత్రైష ఏతత్సుప్తో౽ భూద్య ఏష విజ్ఞానమయః పురుషస్తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ య ఏషో౽ ంతర్హృదయ ఆకాశస్తస్మిన్ శేతే తాని యదా గృహ్ణాత్యథ హైతత్పురుషస్స్వపితి నామ తద్గృహీత ఏవ ప్రాణో భవతి గృహీతా వాగ్గృహీతం చక్షుర్గృహీతం శ్రోత్రం గృహీతం మనః ॥**

ఈ మంత్రంలో సుషుప్తి అవస్థలో జీవాత్మ ఏమవుతుందో వివరిస్తున్నాడు అజాతశత్రువు. సుషుప్తిలో జీవాత్మ పరమాత్మలో ఎలా లయమవుతుందో చెబుతున్నాడు. ఇది అర్థం చేసుకోవాలంటే, ముందు ఉపనిషత్తు వివరించిన మన స్వస్వరూపాన్ని తెలుసుకోవాలి. మన స్వస్వరూపం పరమాత్మస్వరూపం లేదా నిర్విశేషచైతన్యస్వరూపం. దాన్నే సాక్షిచైతన్యం అని కూడా అంటారు. అంటే నేను సాక్షిచైతన్యాన్ని.

సాక్షిచైతన్యమైన నాకు ఒక ఉపాధి లేదా కరణం ఉంది. దాన్నే మనస్సు లేదా బుద్ధి లేదా అంతఃకరణం అంటారు. అంతఃకరణం పదాన్ని తీసుకుందాము. సర్వవ్యాపకమైన మహదాకాశం, కుండలో ఘటాకాశంగా వ్యవహరించబడినట్టుగా, సర్వవ్యాపకమైన సాక్షి అంతఃకరణంలో ప్రతిబింబించేసరికి, చిదాభాస అయింది. ఇంకోమాటలో చెప్పాలంటే, నిర్విశేషచైతన్యం అయిన నేను చిత్‌ను, అంతఃకరణంతో కూడిన నేను చిదాభాసగా వ్యక్తమవుతున్నాను.

చిత్ నా స్వభావం. చిదాభాస నా స్వభావం కాదు, ఆగంతుకం. అంటే అది వచ్చిపోయేది. అశాశ్వతమైనది. చిదాభాసస్వరూపం అంతఃకరణమీద ఆధారపడి ఉంది. అంతఃకరణం చురుకుగా ఉంటే, చిదాభాస చురుకుగా ఉంటుంది. అంతఃకరణవల్ల నాకొక ఉపాధి, ఒక పరిమితి ఏర్పడుతున్నది.

జాగ్రదావస్థలో అంతఃకరణం శరీరం అంతటా వ్యాపించి, శరీరం అంచులకు వచ్చి, ఇంద్రియలద్వారా వ్యవహారం నడుపుతున్నది. ఇంద్రియాలు పనిచేస్తున్నప్పుడు చిదాభాస అయిన నేను ప్రమాతా, జ్ఞాతా, శ్రోతా అవుతున్నాను. నిర్విశేష చైతన్యం అయిన నేను చిదాభాసద్వారా ఇలా ప్రమాతా, జ్ఞాతా, శ్రోతా అయినప్పుడు జీవాత్మ అవుతున్నాను.

జాగ్రదావస్థలో చిదాభాసగా అయిన నేను, సుషుప్తిలో అంతఃకరణం పడుకోవడంవల్ల, చిదాభాసగా వ్యక్తమవను. నన్ను ప్రతిబింబించే మాధ్యమం పడుకోవటంవల్ల ప్రతిబింబ చైతన్యంగా (చిదాభాసగా) ప్రకటితమవుతున్న నేను నా స్వస్వరూపంగా మిగులుతాను. నా స్వస్వరూపం నిర్విశేషచైతన్యం. నా ఆగంతక స్వరూపం అంతఃకరణమీద ఆధారపడి ఉంది. అది పనిచేస్తుంటే నేను జీవాత్మను. అది లయమయితే పరమాత్మను. అందువల్ల సుషుప్తిలో నన్ను స్వపితి అంటారు. స్వ అపీతో భవతి. నా ఆగంతుక స్వభావాన్ని వదిలేసి, నా స్వస్వరూపంలో లయమవుతాను.

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**స హోవాచాజాతశత్రుః** – అజాతశత్రువు ఇలా అన్నాడు.

**యత్రైష ఏతత్సుప్తోఽభూద్య ఏష విజ్ఞానమయః పురుషః** – ఈ జీవాత్మ సుషుప్తిలో నిద్రించినప్పుడు, చిదాభాసను సూర్యకిరణాలతో పోల్చవచ్చు. సూర్యకిరణాలు వచ్చిపోతాయి కాని ప్రకాశించే సూర్యుడు ఎప్పుడూ అలాగే ఉంటాడు. అలాగే ప్రకాశించే చైతన్యం ఎప్పుడూ అలాగే ఉంటుంది. సూర్యకిరణాలలాంటి చిదాభాస వచ్చిపోతుంది. జాగ్రదావస్తలో నేను సూర్యకిరణాలలాగా ఉంటే, సుషుప్తిలో సూర్యుడిలా ఉంటాను. ఈ జీవాత్మ ఏం చేస్తుంది?

**తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ** – విషయం ప్రకాశక సామర్థ్యాన్ని తీసుకుంటుంది. అంటే అనుభవించే ఇంద్రియాలను లయం చేస్తుంది. ఏది? జీవాత్మ. ఎలా చేస్తుంది? విజ్ఞానేన – చిదాభాసద్వారా. అంటే చిదాభాసను లయం చేయటంద్వారా ఇంద్రియాలను లయం చేస్తుంది. ఎందులోకి లయం చేస్తుంది?

**య ఏషోఽన్తర్హృదయ ఆకాశః** – హృదయ ఆకాశంలో లయం చేస్తుంది. హృదయంలో మనస్సు ఉంది. మనస్సులో ఆకాశం లేదా పరమాత్మస్వరూపం ఉంది. ఈ పరమాత్మ ఎవరు?

**తస్మిన్ శేతే** – పరమాత్మ నిర్విశేషచైతన్యం. ఈ జీవాత్మ ఈ నిర్విశేషచైతన్యంలో లయమవుతుంది.

**తాని యదా గృహ్ణాత్యథ హైతత్పురుషః స్వపితి నామ** – అలా తన స్వస్వరూపంలో లయమయినప్పుడు, జీవాత్మను స్వపితి అంటారు.

> **సతా సోమ్య తదా సంపన్నో భవతి** – ఛాందోగ్యం 6.8.1

అంటే స్వస్వరూపంలో లయమవుతాడు. స్వస్వరూపం నిర్విశేషచైతన్యం. కుండ మట్టిలో లయమయినట్టుగా నేను విశేషజ్ఞానాన్ని లయం చేస్తాను.

**తద్గృహీత ఏవ ప్రాణో భవతి** – ఆ సమయంలో ప్రాణం (ఘ్రాణేంద్రియం) లయమవుతుంది.

**గృహీతా వాగ్గృహీతం చక్షుర్గృహీతం శ్రోత్రం గృహీతం మనః** – వాక్కు, కన్ను, చెవి, మనస్సులు కూడా లయమవుతాయి.

విశేషజ్ఞానం లయమవటంవల్ల నేను ఆనందాన్ని పొందుతాను.

దీనివల్ల ఒక ముఖ్యవిషయం తెలుస్తుందంటున్నారు శంకరులవారు. ఇంద్రియాలు వచ్చిపోయేవి అంటే అది జీవాత్మ స్వరూపం కాదు. ఇంద్రియాలు మేలుకొని ఉన్నప్పుడు నేను జ్ఞాతా, శ్రోతా అవుతున్నాను కాని అవి పడుకున్నప్పుడు నేను జ్ఞాతను కాను, శ్రోతను కాను. సుషుప్తిలో నేను ప్రత్యేక వ్యక్తిని కాను. సగుణ ఆత్మను కాను. ఇవి నా ఆగంతుక లక్షణాలు. అందువల్ల నేను సంసారిని కూడా కాదు. సంసారం మనస్సుకు, శరీరానికి చెందినది. మనశ్శరీరాలు నేను వేసుకునే తాత్కాలిక వేషాలు. సుషుప్తిలో నేను ఈ వేషాలను తీసివేసి, నా నాటకానికి తెర దింపుతున్నాను.వేషం వేస్తే జీవితం ఒక నాటకం, వేషం తీసేస్తే నేను స్వేచ్ఛాజీవిని. ముక్తపురుషుడిని.

మళ్ళీ ఒకసారి టూకీగా చూస్తే –

1. ఇంద్రియాలు వచ్చిపోయేవి.
2. మనశ్శరీరాలు నేను తాత్కాలికంగా వేసుకున్న వేషం.
3. అందువల్ల సంసారిత్వం కూడా తాత్కాలికం.

## మంత్రం 2.1.18

**స యత్రైతత్స్వప్న్యయా చరతి తే హాస్య లోకాస్తదుతేవ మహారాజో భవత్యుతేవ మహాబ్రాహ్మణ ఉతేవోచ్చావచం నిగచ్ఛతి ॥**

**స యథా మహారాజో జానపదాన్ గృహీత్వా స్వే జనపదే యథాకామం పరివర్తేతైవమేవైష ఏతత్ప్రాణాన్ గృహీత్వా స్వే శరీరే యథాకామం పరివర్తతే ॥**

ఇంతకుముందు మంత్రంలో సుషుప్తిలో నేను నిర్విశేషచైతన్యాన్ని అని చూశాము. జాగ్రదావస్థలో నేను శ్రోతా, జ్ఞాతాలాంటి వేషాలు వేసుకుని జీవాత్మగా వ్యవహారం నడుపుతున్నానని చూశాము. ఇప్పుడు స్వప్నావస్థను వివరిస్తున్నది శాస్త్రం.

శాస్త్రం ప్రకారం ఒక వ్యక్తి శరీరంలో అనేక నాడులు ఉన్నాయి. అంతఃకరణం ఈ నాడులద్వారా తిరుగుతుంది. అంతఃకరణంతో పాటు చిదాభాస కూడా తిరుగుతుంది. జాగ్రదావస్థలో గోళకాలదాకా వెళ్ళి, వాటి ఇంద్రియశక్తిద్వారా బాహ్యప్రపంచాన్ని అనుభవిస్తుంది. సుషుప్తిలో పూర్తిగా లయమవుతుంది. ఇంతవరకూ ఇంతకుముందు చూశాము. ఇప్పుడు స్వప్నావస్థను చూస్తాము.

స్వప్నావస్థలో చిదాభాసతో కూడిన అంతఃకరణం పూర్తిగా లయమవదు. పూర్తిగా వ్యవహారమూ నడపదు. శరీరమూ, ఇంద్రియాలూ పనిచేయవు. కాని, మనస్సు పనిచేస్తుంది. అందువల్ల చిదాభాస+మనస్సు రెండు కలిసి, లోపల ఉన్న నాడుల్లో తిరుగుతాయి.

స్వప్నావస్థలో కూడా కొన్ని పుణ్యపాపకర్మలు వాసనల రూపంలో ప్రోగుపడిన వాటిలో కొన్ని, క్షయమవుతాయి. ఏ వాసనలు క్షయమవుతాయన్నది ఎటువంటి కర్మలు ప్రధానంగా ఉన్నాయన్న దానిమీద ఆధారపడి ఉంటుంది. స్వప్నావస్థలో కూడా జీవి నాడుల్లో తిరుగుతుంది కాని అది అరవిచ్చిన పువ్వులా ఉంటుంది. జాగ్రదావస్థలో పూర్తిగా వికసించిన పుష్పంలా ఉంటే, సుషుప్తిలో విచ్చుకోని మొగ్గలా ఉంటుంది. పూర్తిగా వికసించిన పుష్పం జీవాత్మ. మొగ్గ పరమాత్మ. స్వప్నంలో కూడా జీవి శుద్ధచైతన్యం కాదు. ఎందుకంటే ఇంకా మనస్సు పనిచేస్తూనే ఉంటుంది. అందువల్ల స్వప్నంలో స్వాప్నిక కర్తృత్వం, స్వాప్నిక భోక్తృత్వం అనుభవిస్తుంది. ఈ వ్యష్టిబుద్ధి కూడా ఆగంతుక స్వభావం కాని స్వస్వరూపం కాదు. ఎప్పుడైతే స్వప్నం కరిగిపోతుందో, ఈ స్వభావం మాయమయిపోతుంది.

మనస్సు, హృదయంలో లయమయినప్పుడు నిర్విశేషచైతన్యం మాత్రమే మిగులుతుంది. జీవి స్వస్వరూపంలో లయమవుతుంది కాని, వచ్చిన చిక్కేమిటంటే, తను స్వస్వరూపంలో లయమయినట్టుగా జీవికి తెలియదు. నా స్వస్వరూపంలో ఉండటానికి నాకు శాస్త్రం అవసరం లేదు కాని నా స్వస్వరూపం ఏమిటో తెలుసుకోవటానికి శాస్త్రం కావాలి. మనం జాగ్రద్ ప్రపంచంలో చేసే మన కార్యకలాపాలను మన స్వస్వరూపం అనుకుంటాము.

ఆత్మవిద్య పొందితే సుషుప్తిలో ఉన్నది స్వస్వరూపంలో అనీ, జాగ్రద్ ప్రపంచంలో ఉన్నది ఆగంతుక స్వరూపం అనీ తెలుస్తుంది. జాగ్రద్ అవస్థ ఆగంతుకం అనీ, సుషుప్తి స్వస్వరూపం అనీ ఎలా చెప్పగలవు అని పూర్వపక్షి ప్రశ్నిస్తాడు. ప్రయత్నం లేకుండా ఏ అవస్థలో ఉంటే అది స్వస్వరూపం అనీ, బాహ్యపరిస్థితులతో కలిసింది ఆగంతుకం అనీ శంకరులవారు వివరిస్తారు.

జాగ్రదావస్థలో నేను కరణాలను వాడుతాను. త్రిపుటి ఉంటుంది. అంటే ఉదాహరణకు ప్రమాతా అనే నేను కన్ను అనే ప్రమాణాన్ని వాడి, రంగులు, రూపాలు అనే ప్రమేయాన్ని చూస్తాను. కాని సుషుప్తిలో ప్రమాణం లయమవుతుంది కాబట్టి ప్రమేయం ఉండదు. ఈ రెండూ లేకపోయేసరికి నేను ఉండను అనకూడదు. ప్రమాతగా ఉండను. ప్రమాతా అనే గుణం ఉండదు. శుద్ధచైతన్యంగా మిగులుతాను. అది నా స్వస్వరూపం.

నీరు, మంచుగడ్డ, ఆవిరి మూడూ రూపాంతరాలు. ఈ మూడింటిలోనూ ఏది స్వస్వరూపం అంటే నీరు అని చెబుతాము. ఎందుకు? ఏ ప్రయత్నం లేకుండా, సాధారణ పరిస్థితుల్లో లభ్యమయ్యేది నీరు. దాన్ని మంచుగా గానీ, ఆవిరిగా గానీ మార్చాలంటే దానికి ప్రయత్నం చేయాలి.

స్వప్నావస్థలో అంతఃకరణంతో చిదాభాస కలవటంవల్ల పరమాత్మకు జీవాత్మగా కొత్తపేరు వస్తుంది. ఆ జీవాత్మ ఈ క్రింది కర్మఫలాలను అనుభవిస్తుంది. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**స యత్రైతత్స్వప్న్యయా చరతి** – స్వప్నావస్థలో తిరుగుతున్న జీవాత్మ

**తే హాస్య లోకాః** – ఈక్రింది కర్మఫలాలను అనుభవిస్తుంది. ఏమిటవి?

**తదుతేవ మహారాజో భవతి** – అక్కడ తను మహారాజా అన్నట్టుగా ఉంటాడు;

**ఉతేవ మహాబ్రాహ్మణ** – లేదా తను గొప్ప జ్ఞాని అన్నట్టుగా ఉంటాడు.

**ఉచ్చావచం నిగచ్ఛతి** – ఉన్నతంగా లేదా హీనంగా ఉంటాడు. అప్పుడు ఏం చేస్తాడు?

**స యథా మహారాజో జానపదాన్ గృహీత్వా స్వే జనపదే యథాకామం పరివర్తతే** – ఎలాగైతే మహారాజు తన సామ్రాజ్యంలోని జనులను తన అధీనంలో ఉంచుకుని తన సామ్రాజ్యంలో యథేచ్ఛగా సంచరిస్తాడో,

**ఏవమేవైష ఏతత్ప్రాణాన్ గృహీత్వా స్వే శరీరే యథాకామం పరివర్తతే** – అదే విధంగా అతను స్వప్న ఇంద్రియాలను గ్రహించి, తన శరీరంలో యథేచ్ఛగా తిరుగుతాడు.

## మంత్రం 2.1.19

**అథ యదా సుషుప్తో భవతి యదా న కస్యచన వేద హితా నామ నాడ్యో ద్వాసప్తతిస్సహస్రాణి హృదయాత్పురీతతమభిప్రతిష్ఠన్తే తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే ॥**

**స యథా కుమారో వా మహారాజో వా మహాబ్రాహ్మణో వాఽతిఘ్నీమానన్దస్య గత్వా శయీతైవమేవైష ఏతచ్ఛేతే ॥**

17వ మంత్రంలో సుషుప్తి గురించి చూశాము. ఇక్కడ దాని గురించే మరికొంత సమాచారం ఇస్తుంది ఉపనిషత్తు.

**అథ యదా సుషుప్తో భవతి యదా న కస్యచన వేద** – ఎప్పుడైతే జీవాత్మ నిద్రిస్తుందో, అప్పుడు ఏ విషయమూ తెలియదు.

**హితా నామ నాడ్యో ద్వాసప్తతిస్సహస్రాణి** – హితా అనే డెబ్బై రెండు వేలనాడులు

**హృదయాత్పురీతతమభిప్రతిష్ఠంతే** – హృదయంనుంచి శరీరం అంతటా వ్యాపించి ఉన్నాయి

**తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే** – వాటిద్వారా వెనక్కి వెళ్ళి హృదయంలో నిద్రిస్తుంది

శుద్ధచైతన్యం ఎన్నటికీ విశేషజ్ఞానం పొందలేదు. ఎందుకంటే విశేషజ్ఞానం పొందాలంటే విశేషవృత్తులు ఉండాలి. అవి అంతఃకరణంద్వారా పనిచేస్తాయి. సుషుప్తిలో అంతఃకరణం లయమవుతుంది కాబట్టి శుద్ధచైతన్యం ప్రమాతా అవలేదు. అయితే చైతన్యం ఉందని ఎలా తెలుసు? ఏమీ ఆలోచనలు లేవు అని తెలుసుకునేది ఒకటి ఉంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది. దాన్నే నిర్విశేషచైతన్యం అంటారు. ఈ నాడులద్వారా అంతఃకరణంతో కూడిన చిదాభాస జాగ్రదావస్థలో శరీరం చివరిదాకా తిరుగుతుంది. స్వప్నావస్థలో లోపల నాడుల్లో తిరుగుతుంది. సుషుప్తిలో హృదయంలో లయమవుతుంది.

పడుకున్న మనిషిని ముట్టుకున్నప్పుడు, శుద్ధచైతన్యం ఉన్నా తెలియదు. ఎందుకంటే ప్రమాణం ఉపయోగించే చిదాభాస లయమవుతుంది. ప్రమాణం లేని శుద్ధచైతన్యం ప్రకటితమవదు. సుషుప్తి అవస్థ ఎటువంటి అవస్థ? మహాదానందం పొందే అవస్థ. ఎందుకు? పరిమితులు లేవు. సంసారం లేదు. కుటుంబ చింతలులేవు. అనుబంధాలు లేవు. ఉద్యోగచికాకులు లేవు. భార్యలేదు, పిల్లలు లేరు. మిమ్మల్ని చికాకుపరిచేవేవీ లేవు. అందుకే ఆనందమే ఆనందం.

**అతిఘ్నీమానందస్య గత్వా శయీత అవతిష్ఠేత–** అతిశయేన దుఃఖం హంతీత్యతిఘ్నీ ఆనందస్య అవస్థా సుఖావస్థా – దుఃఖాన్ని పోగొట్టే అతిశయించిన ఆనందంయొక్క అవస్థను అతిఘ్నీ అంటారు. ఎందుకంత ఎక్కువ స్థాయిగా వర్ణించింది ఉపనిషత్తు? మనం జాగ్రదావస్థలోనూ ఆనందాన్ని పొందుతాము. కాని అది ప్రియ, మోద, ప్రమోదాలు మాత్రమే. అంటే కొంచెం ఎక్కువ తక్కువలుగా ఉన్న ఆనందం. రెండు సమస్యల మధ్య వచ్చే కొద్దిపాటి తెరిపి ఆనందం. జాగ్రదావస్థలో అతిఘ్నీ ఆనందాన్ని జాగ్రదావస్థలో కూడా ముగ్గురు పొందుతారు. **స యథా కుమారో వా మహారాజో వా మహాబ్రాహ్మణో వా** – పిల్లవాడు గాని, మహారాజు గాని, గొప్ప బ్రాహ్మణుడు గాని ఏ విధంగా ఆనందం పొందుతాడో;

**ఏవమేవైష ఏతచ్ఛేతే** – అదే విధంగా అతను పడుకుంటాడు.

పిల్లవాడు, రాజు, మహాబ్రాహ్మణులను ఎందుకు పేర్కొంది? పిల్లవాడు తన సహజస్వరూపంలో ఉంటాడు. కాబట్టి అతనికి అప్పుడే కోరికలు ఉండవు. కోరికలవల్ల వచ్చే బాధలు ఉండవు; మహారాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అంటారు కదా! రాజు కావాలనుకుంటే కొండమీద కోతినైనా తెప్పించుకోగలడు. మహాబ్రాహ్మణుడంటే మహాజ్ఞాని. జ్ఞానికి కోరికలు అన్నీ ఒక్కసారిగా తీరిపోతాయి.

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సః** – తైత్తిరీయం

అంటే అతనికి పూర్ణత్వభావన కలగటంవల్ల కోరికలు ఉండవు.

ఈ విధంగా జీవాత్మ పరమాత్మస్వరూపంలో లయమయి, జవాబు చెప్పలేదు.

## మంత్రం 2.1.20

**స యథోర్ణనాభిస్తంతునోచ్చరేద్యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగా వ్యుచ్చరంత్యేవమేవాస్మాదాత్మనస్సర్వే ప్రాణాస్సర్వే లోకాస్సర్వే దేవాస్సర్వాణి భూతాని వ్యుచ్చరంతి తస్యోపనిషత్సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్ ॥**

ఇప్పటిదాకా జీవాత్మ సుషుప్తిలో నిర్విశేషచైతన్యరూపంలో ఉంటుందనీ, జాగ్రదావస్థలో సవిశేషచైతన్యంగా వ్యవహరిస్తుందనీ చూశాము. ఈ శ్లోకంలో ఈ నిర్విశేషచైతన్యమే జగత్కారణం అని చెబుతున్నాడు అజాతశత్రువు. నిర్విశేషచైతన్యం మన స్వస్వరూపం. అందులో మనం సుషుప్తిలో లయమవుతాము. ఆ చైతన్యంనుంచే లోకాలు, మనుష్యులు, దేవతలు అందరూ వచ్చారని చెప్పి, జీవాత్మ పరమాత్మ ఐక్యం కూడా సూచిస్తున్నాడు.

జీవాత్మ, పరమాత్మల ఐక్యం సూచించటానికి ఉపనిషత్తు రెండు ఉదాహరణలనిస్తున్నది. రెండూ ముండకోపనిషత్తులో కూడా వస్తాయి.

**స యథోర్ణనాభిస్తంతునోచ్చరేత్** – మొదటి ఉదాహరణ ఊర్ణనాభి (సాలెపురుగు). సాలెపురుగే ఉపాదానకారణం, నిమిత్తకారణం. తనలోంచే దారాన్ని తీసుకుని, తనే తన గూడును తయారుచేసుకుంటుంది. ఆ విధంగా బ్రహ్మే ఉపాదానకారణం, నిమిత్తకారణం కూడా.

**యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగా వ్యుచ్చరంతి** – అగ్నినుంచి నిప్పురవ్వలు ఏర్పడటం రెండవ ఉదాహరణ. ఇక్కడ కార్యకారణ సంబంధం చూస్తాము. అగ్ని కారణం, నిప్పురవ్వలు కార్యం. కారణం లక్షణాలు కార్యంలోకి వెళతాయి అని నిరూపించటానికి ఈ ఉదాహరణ. అగ్నికి రెండు లక్షణాలు ఉన్నాయి. కాంతి, వేడి – ఆ లక్షణాలను నిప్పురవ్వల్లో కూడా చూస్తాము. ఇంకొక అంశం అగ్ని ఏకం, నిప్పురవ్వలు అనేకం. అలాగే పరమాత్మ స్వరూపం సత్‌చిత్ ఆనందం. జీవాత్మ స్వరూపం కూడా అదే.

**చిదానంద రూపః శివోహం శివోహమ్**
**పరమాత్మ ఏకం, జీవాత్మలు అనేకం**

**ఏవమేవ అస్మాదాత్మనస్సర్వే ప్రాణాస్సర్వే లోకాస్సర్వే దేవాస్సర్వాణి భూతాని వ్యుచ్చరంతి** – ఒక్క అగ్నినుంచి అనేక నిప్పురవ్వలు వచ్చినట్టుగా, ఈ ఆత్మనుంచి అనేకం పుట్టుకొచ్చాయి. సర్వే ప్రాణాః అంటే ఇక్కడ ఇంద్రియాలు. ఇంద్రియాలు; పద్నాలుగు లోకాలు; ఇంద్రుడు, వరుణుడులాంటి దేవతలు; సకల జీవులు పుట్టాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే సృష్టి మొత్తం జరిగింది. బ్రహ్మ సృష్టికారణం అని చెపితే, బ్రహ్మ స్థితికారణం, లయకారణం కూడా. బ్రహ్మ ఎవరు? నిర్విశేష చైతన్యస్వరూపం అయిన నేను. ఇదే కైవల్యోపనిషత్తులో కూడా చూస్తాము.

**మయ్యేవ సకలం జాతమ్, మయి సర్వం ప్రతిష్ఠితమ్**
**మయి సర్వం లయం యాతి**

**తస్య ఉపనిషద్** – తస్య అంటే ఆత్మ. జీవాత్మ పరమాత్మల ఐక్యం సూచించే ఆత్మ. అవస్థాత్రయ వివేకంద్వారా అజాతశత్రువు జీవాత్మ, పరమాత్మల ఐక్యం చూపించాడు. ఉపనిషత్తు అంటే ఇక్కడ అర్థం రహస్యనామం. ఆత్మ, బ్రహ్మతత్త్వం అని పిలిచే దానియొక్క రహస్యనామం ఉపనిషత్తు.

**సత్యస్య సత్యమితి** – ఇది సత్యానికి సత్యం. గార్గ్య, అంటే ఏమిటి అన్నట్టుగా కనుబొమ్మలు పైకి లేపి ఉండవచ్చు. అందువల్ల గురువే వివరిస్తున్నాడు.

**ప్రాణా వై సత్యం తేషామేవ సత్యమ్ ఇతి**– ప్రాణాలే సత్యం. ఇది వాటి సత్యం. ప్రాణం అంటే ముందు వాక్యంలో వచ్చిన సృష్టి మొత్తం – **సర్వే ప్రాణాస్సర్వే లోకాస్సర్వే దేవాస్సర్వాణి భూతాని**

అంత వివరణ వద్దనుకుంటే సృష్టి మొత్తం. సృష్టిని సత్యం అని ఎందుకన్నది ఉపనిషత్తు? వేదాంతంలో జగత్తును మిథ్యగా తోసివేస్తాము కదా!

ఉపనిషత్తు దాన్ని వ్యావహారిక సత్యం అంది. జగత్తు మిథ్య అంటే జగత్తు ఉనికి అసలు లేదని కాదు; దానికి స్వతంత్రంగా (పరమాత్మ లేకుండా) ఉనికి లేదని; జగత్తును అనుభవిస్తాము. వ్యవహారం నడుపుతాము, దానివల్ల ప్రయోజనం ఉంది. అందువల్ల జగత్తును వ్యావహారిక సత్యం అంటాము.

ఇంకొక భాష్యకారుడు 'సత్యం' పదాన్ని సత్+త్యత్‌గా విడదీశాడు. సత్ అంటే మూర్తప్రపంచం అంటే కంటికి కనబడే ప్రపంచం; త్యత్ అంటే అమూర్తప్రపంచం లేదా కంటికి కనపడని ప్రపంచం. లేదా సత్ అంటే స్థూలప్రపంచం,

త్యత్ అంటే సూక్ష్మప్రపంచం అనవచ్చు. అందువల్ల సత్యం అంటే మూర్తామూర్తాప్రపంచం లేదా వ్యావహారిక సత్యం జగత్తు అనవచ్చు.

ఆత్మ ఈ సత్యానికి సత్యం అంటే ఈ వ్యవహారిక సత్యానికి సత్యం. ఆత్మ పారమార్థిక సత్యం.

వేదాంతం మూడు రకాల సత్యాల గురించి చెబుతుంది.

1. ప్రాతిభాసిక సత్యం – స్వప్న ప్రపంచం. నాకు మాత్రమే చెందినది. దాని కాలపరిమితి చాలా చిన్నది. నిద్రలేస్తే స్వప్నం కరిగిపోతుంది.
2. వ్యావహారిక సత్యం – జాగ్రద్ ప్రపంచం. ఇది కూడా స్వప్నం లాంటిదే, వేదాంతపరంగా చూస్తే, ఇది ఒక కాలంలో ఉండి, ఇంకోకాలంలో ఉండదు. పైగా దీనికి స్వతంత్రంగా ఉనికి లేదు.
3. పారమార్థిక సత్యం – ఆత్మ, ప్రపంచం ఆత్మ అనకూడదు. సత్యం అంటే మూడుకాలాల్లోనూ ఉండేది. త్రికాలేపి తిష్ఠతి. పారమార్థిక సత్యానికి ఎదిగితే, అంటే ఆత్మజ్ఞానం పొంది, ఆ నిష్ఠలో ఉంటే, ఈ వ్యావహారిక సత్యం కూడా కలలా తెలుస్తుంది. కాకపోతే ప్రాతిభాసిక సత్యం విషయంలో నిద్రలేస్తే కల కరిగిపోతుంది. కాని వ్యావహారిక సత్యం విషయంలో పారమార్థిక స్థాయికి ఎదిగినా జాగ్రద్ ప్రపంచం మాయమవదు. అలాగే ఉంటుంది. కాని మన దృక్పథం మారుతుంది.

ద్వైతం అంటే రెండు కదా అలాంటప్పుడు మూడు సత్యాలు ఉన్నాయని ఎలా చెబుతారు అంటే పేరుకు మూడు ఉన్నా, ప్రాతిభాసిక సత్యం, వ్యావహారిక సత్యం రెండూ మిథ్యే, ప్రాతిభాసిక సత్యం స్వప్నం అని తెలుస్తుంది. వేదాంతం జాగ్రద్ ప్రపంచాన్ని కూడా స్వప్నం అని వివరిస్తుంది. అందువల్ల బ్రహ్మసత్యం, జగన్మిథ్య. మిథ్యకు ఇంకోపేరు ప్రాతిభాసిక సత్యం, వ్యావహారిక సత్యం. వీటిని అనుభవిస్తాము కాబట్టి సత్యం; అవి మూడు కాలాల్లోనూ ఉండవు కాబట్టి మిథ్య. ఆత్మ నిత్యముక్తస్వరూపం.

## సత్యస్య సత్యం భాష్యం

**తస్యోపనిషత్సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్**

సత్యానికి సత్యం దాని రహస్యనామం. ప్రాణాలే సత్యం. ఇది వాటి సత్యం.

ఈ వాక్యంమీద శంకరులవారు మహాభాష్యం చెప్పారు. దాని సారాంశం చూద్దాము. మీమాంస అంతా తస్యోపనిషద్ (తస్య+ఉపనిషత్తు) అనే వాక్యంమీద జరుగుతుంది. ఇక్కడ ఉపనిషత్తు అంటే రహస్యనామం. తస్య అనే పదం ఒక సర్వనామం; అందువల్ల ఈ సర్వనామం ఏ నామవాచకాన్ని సూచిస్తోంది? ఇది చర్చనీయాంశం. దాని రహస్యనామం – సత్యస్య సత్యం. దేని రహస్యనామం?

**ఆత్మనస్సర్వే ప్రాణాస్సర్వే లోకాస్సర్వే దేవాః సర్వాణి భూతాని వ్యుచ్చరంతి**

ఉపనిషత్తు ఆత్మ అంది గాని, అది జీవాత్మో పరమాత్మో చెప్పలేదు. దానివల్ల వివరంగా విచారణ జరుగుతుంది. ఈ మొత్తం విచారణ తేలిగ్గా అర్థమవటానికి దీన్ని మూడు భాగాలుగా విడగొడదాము.

**భాగం 1**

ఈ మొదటి భాగంలో శంకరులవారు ఇద్దరు పూర్వపక్షులను ప్రవేశపెట్టి, వారి వాదనలు చెప్పాక, తన జవాబును చెబుతారు.

పూర్వపక్షి 1: తస్య అంటే జీవాత్మ. అందువల్ల రహస్యనామం జీవాత్మకే వర్తిస్తుంది.

పూర్వపక్షి 2: తస్య అంటే పరమాత్మ. అందువల్ల సత్యస్య సత్యం నామం పరమాత్మకే వర్తిస్తుంది. కాని పరమాత్మ వేరు; జీవాత్మ వేరు.

సిద్ధాంతి: ఎ) తస్య అంటే పరమాత్మే. జీవాత్మ కాదు.

బి) పరమాత్మ, జీవాత్మ వేరు వేరు కాదు. రెండూ ఒకటే.

ఇప్పుడు ఈ వాదనలను వివరంగా చూద్దాము. పూర్వపక్షి అంటే పక్షి కాదు, పూర్వపక్షానికి చెందినవాడు. ఇతను వేదపూర్వభాగం అంటే కర్మకాండకు ప్రాముఖ్యతనిస్తాడు. సిద్ధాంతి అంటే శంకరులవారు. ఆయనది సిద్ధాంతం అనీ, అద్వైతవేదాంతం అనీ అంటారు.

పూర్వపక్షి 1: ఈ బ్రాహ్మణము బ్రహ్మవిద్య గురించి చెబుతున్నది.

బ్రహ్మ తే బ్రవాణీతి – గార్గ్యుడు అజాతశత్రువును సమీపించి బ్రహ్మ గురించి చెబుతానన్నాడు. అలాగే తర్వాత వచ్చే 14 మంత్రాల వరకూ బ్రహ్మ గురించి చెప్పాడు.

బ్రహ్మ మే వక్ష్యతీతి – ఒక బ్రాహ్మణుడు, తనకు బ్రహ్మ గురించి ఉపదేశిస్తాడని ఆశించి క్షత్రియుని దగ్గరకు వెళ్ళటం విపరీతం అన్నాడు అజాతశత్రువు. గార్గ్యుడు చెప్పింది సగుణబ్రహ్మ గురించి. అజాతశత్రువు చెప్పింది నిర్గుణబ్రహ్మ గురించి.

మొత్తానికి ఈ బ్రాహ్మణము బ్రహ్మవిద్య గురించి. అందులో ఏమాత్రం సందేహం లేదు ఈ పూర్వపక్షికి.

బ్రహ్మవిద్య బోధిస్తానని అజాతశత్రువు ఏం చేశాడు? నిద్ర పోతున్న జీవుని దగ్గరకు గార్గ్యను తీసుకువెళ్ళాడు. అతన్ని లేపటానికి ప్రయత్నించి దాని తర్వాత మూడు అవస్థలలోనూ – జాగ్రద్, స్వప్న, సుషుప్తి – ఉన్నది జీవాత్మే అని విశ్లేషించాడు.

జీవాత్మే జాగ్రద్, స్వప్నావస్థల్లో ప్రపంచాన్ని అనుభవిస్తుంది. జీవాత్మే పుణ్యపాపాలను అనుభవిస్తుంది. జీవాత్మే సుషుప్తి అవస్థలో లయమవుతుంది. దీన్నిబట్టి బ్రహ్మ అంటే జీవాత్మ అని చాలా స్పష్టంగా తెలుస్తున్నది. అందువల్ల బ్రహ్మవిద్య అంటే జీవాత్మవిద్య.

తర్వాత ఈ బ్రాహ్మణంలోనే ఆత్మను జగత్కారణంగా వర్ణించింది ఉపనిషత్తు. బ్రహ్మ అంటే జీవాత్మ కాబట్టి, ఈ జీవాత్మే జగత్కారణం కూడా. అసలు పరమాత్మ ప్రసక్తే ఎక్కడా లేదు. అందువల్ల బ్రహ్మవిద్య అంటే ఇది స్పష్టంగా జీవాత్మవిద్య. ఆ జీవాత్మే జగత్కారణం. అంతేకాదు జీవాత్మ బ్రహ్మ కర్త, భోక్తా, సంసారి అంటాడు. ఎలా తెలుసు అంటే జాగ్రద్, స్వప్నావస్థల్లో వ్యవహారం నడుపుతున్నాడు కదా అంటాడు.

**బ్రహ్మవిద్య అంటే కర్తృ, భోక్తృ సంసారి జీవాత్మవిద్య**

ఈ జీవాత్మ సుషుప్తిలో వ్యవహారం నడపకపోవచ్చు కాని అప్పుడు కూడా సంసారిగానే పరిగణించాలి. ఎందుకు? అవస్థ మారినంత మాత్రాన స్వరూపం మారదు. జీవాత్మ స్వరూపం ఏమిటి? సంసారిత్వం, కర్తృత్వం, భోక్తృత్వం– మూడు అవస్థల్లోనూ ఉంటుంది. ఉదాహరణకు ఒక అతను తెలివితక్కువవాడు అనుకుందాము. ప్రస్తుతం మాట్లాడే అవస్థలో ఉన్నాడు. కాసేపయ్యాక మాట్లాడటం మానేస్తే నిశ్శబ్ద అవస్థలో ఉంటాడు. అప్పుడు తెలివైనవాడా, తెలివితక్కువ వాడా, తెలివితక్కువ వాడు ఏ అవస్థలోనైనా తెలివితక్కువవాడిగానే ఉంటాడు.

ఇంకొక ఉదాహరణను కూడా చూస్తాము. ఒక ఆవును తీసుకుంటే ఆ ఆవు పడుకున్నా, కూర్చున్నా, నిల్చున్నా, నడుస్తున్నా ఆవే అవుతుంది కాని గుర్రం అవదు కదా! అలాగే జాగ్రద్ పురుషుడు, స్వప్నపురుషుడు, సుషుప్తి పురుషుడు – అనేవి మూడు అవస్థలు. అతని స్వభావం కర్తా, భోక్తా, సంసారి. మొదటి రెండింటిలో వ్యవహారం నడుపుతున్నాడు కాని, మూడవ అవస్థలో నడపటం లేదు. అంతే తేడా.

ముందు అధ్యాయంలో అహం బ్రహ్మాస్మి వచ్చింది. దానికేం చెబుతావు అంటే కర్తా భోక్తా సంసారి జీవాత్మ అయిన నేను బ్రహ్మను అంటాడు. **కర్తా భోక్తా సంసారిఏవ బ్రహ్మ**

ప్రతిమహావాక్యం కూడా జీవాత్మనైన నేను పరమాత్మను అంటుంది. అసంసారి పరమాత్మ అంటూ ఎవరూ లేరు. కర్తాభోక్తా సంసారిగా అవస్థలు పడుతున్న జీవాత్మ ఎలా జగత్కారణం కాగలదు? జీవాత్మ ఒక కుర్చీనే సరిగ్గా సృష్టించలేడు. ఒక వంట బ్రహ్మాండంగా చేయలేడు. అటువంటి అల్పజ్ఞుడు, అల్పశక్తిమంతుడు, కర్తా భోక్తా సంసారి ఈ జగత్తు మొత్తాన్ని సృష్టించగలడా?

దానికి పూర్వపక్షి శ్రుతిమీద భారం వేసేస్తాడు. నన్నెందుకు అడుగుతారు ఆ ప్రశ్న? తెలియని విషయం తెలుసుకోవటానికే ఉంది శాస్త్రం. శాస్త్రాన్ని ప్రశ్నించకూడదు. శాస్త్రంమీద నమ్మకం ఉండాలి. సృష్టి ఎలా జరిగిందో మనకు తెలియదు. అది అపౌరుషేయ విషయం. దానికి శాస్త్రమే ప్రమాణం. శాస్త్రం జీవాత్మ జగత్కారణం అంటున్నది. అది ఒప్పుకు తీరాలి అంటాడు.

పూర్వపక్షి వాదన మళ్ళీ టూకీగా చూస్తే

ఎ) ఇక్కడ చర్చనీయాంశం బ్రహ్మవిద్య.

బి) ఆ బ్రహ్మ జీవాత్మ.

సి) జీవాత్మ మూడు అవస్థల్లోనూ కర్తా భోక్తా సంసారి.

డి) ఆ జీవాత్మ జగత్కారణం. అందువల్ల –

ఇ) బ్రహ్మ విద్య అంటే కర్తృ భోక్తృ సంసారి జీవాత్మ, జగత్కారణం జీవాత్మ గురించిన విద్య.

పూర్వపక్షి 2 వాదన: ఇతను కూడా ఈ అధ్యాయం బ్రహ్మవిద్య గురించే చెబుతున్నదని అంటాడు. ఆ విషయంలో ఎవరికీ సందేహం లేదు. చర్చ వచ్చింది తస్య ఎవరు? అన్న అంశంమీద. ఈ పూర్వపక్షి ముందు పూర్వపక్షి వాదనను ఖండించి వేస్తాడు. అతని వాదన అసంబద్ధంగా ఉందంటాడు. బ్రహ్మ అంటే అసంసారి పరమాత్మ. బ్రహ్మ అంటే సంసారి జీవాత్మ కాదు.

అసంసారి పరమాత్మవిద్య అయితే, అజాతశత్రువు నిద్రిస్తున్న జీవుని దగ్గరకు ఎందుకు వెళ్ళాడు?

దానికి ఈ పూర్వపక్షి జవాబు, మంత్రాన్ని సరిగ్గా చదవండి.

**య ఏషో౽న్తర్హృదయ ఆకాశస్తస్మిన్ శేతే** – 2.1.17

సుషుప్తిలో జీవాత్మ హృదయాకాశంలో నిద్రిస్తుంది. అంటే జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది. ఆ విధంగా పరమాత్మ అంటే అసంసారి పరమాత్మలో, జీవాత్మ లయమవుతుంది. అంటే దీని అర్థం, అజాతశత్రువు జీవాత్మ గురించి చెప్పటం లేదు, పరమాత్మ గురించి చెబుతున్నాడు అని అర్థం అయింది.

ఆ విధంగా ఆజాతశత్రువు జీవాత్మను పరిచయం చేసి, జీవాత్మద్వారా పరమాత్మను పరిచయం చేస్తున్నాడు. ఎటువంటి పరమాత్మ? అసంసారి పరమాత్మ, జీవాత్మను తనలో లయం చేసుకునే పరమాత్మ. అంటే పరమాత్మ జీవాత్మకు ఆశ్రయం. అందువల్ల తర్వాత ఆత్మ జగత్కారణం అన్నప్పుడు జీవాత్మ కాదు, జీవాత్మకు భిన్నంగా ఉండి జీవాత్మకు ఆశ్రయం అయిన పరమాత్మకు వర్తిస్తుంది.

మనం సంసారి జీవాత్మ అయితే, పరమాత్మ అసంసారి పరమాత్మ. అందువల్ల పరమాత్మ, జీవాత్మకు భిన్నంగా ఉన్నాడు. భిన్నంగా ఉన్న ఆ పరమాత్మే జగత్కారణం. ఆయనే సత్యస్య సత్యం.

**బ్రహ్మవిద్య అంటే జీవాత్మకు భిన్నంగా ఉన్న అసంసారి పరమాత్మ విద్య**

జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని ఒప్పుకోకపోతే, ఆ ఐక్యాన్ని సూచించే మహావాక్యాలను ఎలా సమర్థిస్తావు?

దానికి ఈ పూర్వపక్షి జవాబు – ఇటువంటి మహావాక్యాలు అర్థవాద వాక్యాలు అంటారు. అర్థవాద వాక్యాలకు విడిగా ఉనికి లేదు. వాటిని దేన్నైనా స్తుతించటానికి వాడుతారు. అందువల్ల ఈ అర్థవాద వాక్యాలకు ప్రాముఖ్యతనిచ్చి నేను పరమాత్మ అనుకోకూడదు. అలా చెపితే అది మహాపాపం. మహానేరం. పరమాత్మ ఏమో అసంసారి, జగత్కారణం. మనమేమో మామూలు సంసారులం. కర్తా భోక్తలం. నిద్రలోను, ప్రళయంలోనూ పరమాత్మలో లయమవుతాము. అందువల్ల బుద్ధిగా దేవునికి పూజ చేసి, ఆయన దీవెనలు పొందండి. అంతేకాని నేను ఆయనా ఒకటే అనకండి అంటాడు.

అందువల్ల బ్రహ్మవిద్య అంటే అసంసారి పరమాత్మ, జగత్కారణమైన పరమాత్మ విద్య. ఆ పరమాత్మ జీవాత్మకు భిన్నంగా ఉన్నాడు.

సిద్ధాంతి వాదన: ఆదిశంకరులవారు ఇద్దరి వాదనలనీ ఒక్క వాక్యంతో ఖండించి వేస్తారు. దాన్ని అనుప్రవేశ శ్రుతి అంటారు.

**తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్** – తైత్తిరీయం

సృష్టి చేశాక, పరమాత్మే సృష్టిలో ప్రవేశించాడు.

**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత** – ఐతరేయం

బ్రహ్మరంధ్రం చీల్చుకుని, భగవంతుడు ఆ ద్వారంద్వారా లోపలికి ప్రవేశించాడు.

ఉపనిషత్తే అసంసారి పరమాత్మను పరిచయం చేస్తున్నది కాబట్టి పరమాత్మ లేదు అని మొదటి పూర్వపక్షి చేసిన వాదనను ఖండించటం అయిపోయింది.

పరమాత్మ అనుప్రవేశం చేశాడు. అంటే ఈశ్వరుడే ఇప్పుడు జీవాత్మకు భిన్నంగా ఉన్నాడు అని రెండవ పూర్వపక్షి చేసిన వాదనను కూడా ఖండించటం అయిపోయింది. అందువల్ల జీవాత్మ, పరమాత్మ భిన్నం కాదు. ఏకమే. దీన్నినిరూపించటానికి శ్రుతిలో అనేక మహావాక్యాలు ఉన్నాయి.

**తత్త్వమసి; అహం బ్రహ్మ అస్మి**

అందువల్ల జీవాత్మే పరమాత్మ; పరమాత్మే జీవాత్మ. వాటిలోని విశేషణాలు తీసేస్తే మిగిలేది ఆత్మ పదం మాత్రమే. ఈ ఏకాత్మనే సత్యస్యసత్యం అంటారు.

సిద్ధాంతి వాదను మళ్ళీ టూకీగా చూస్తే – పూర్వపక్షులిద్దరి వాదనా తప్పే.

ఎ) పరమాత్మ లేదు వాదనకు జవాబు పరమాత్మ ఉన్నాడు.

బి) పరమాత్మ జీవాత్మకు భిన్నం వాదనకు జవాబు పరమాత్మ జీవాత్మలు ఐక్యం.

రెండింటికీ జవాబు – పరమాత్మ అనుప్రవేశ శ్రుతి.

**బ్రహ్మవిద్య అంటే ఏకాత్మే జగత్కారణం; ఆ ఏకాత్మ విద్య**

**భాగం 2**

జీవాత్మ పరమాత్మల ఐక్యం సూచించినప్పుడు భేదవాది ప్రవేశిస్తాడు. అతన్ని ఖండిస్తూ భేద–అభేదవాది కూడా రంగంలోకి దిగి మధ్యేమార్గాన్ని సూచిస్తాడు. శంకరులవారు ముందు భేద అభేద వాదిని ఖండించి, తరువాత భేదవాదిని కూడా ఖండిస్తారు.

భేదవాది: జీవాత్మ పరమాత్మల ఐక్యం కుదరదు.

భేద–అభేదవాది: జీవాత్మ పరమాత్మలు ఒక కోణంలో ఐక్యం, ఇంకో కోణంలో భిన్నం.

సిద్ధాంతి: జీవాత్మ, పరమాత్మలు అభిన్నం.

ఇప్పుడు వారి వాదనలను వివరంగా చూద్దాము.

1. భేదవాది వాదన: జీవాత్మ, పరమాత్మలు ఒక్కటే అంటే అది అనేక సమస్యలకు దారి తీస్తుంది. అనుభవం జీవాత్మ సంసారి అంటున్నది. శాస్త్రం పరమాత్మ అసంసారి అంటున్నది. అంటే ఒకటి అనుభవసిద్ధం, ఇంకోటి శాస్త్రప్రమాణం. అలా రెండు భిన్నంగా ఉన్న వాటిని ఒకటిగా చూస్తే, రెండు సమస్యలు ఉత్పన్నమవుతాయి. జీవాత్మ=పరమాత్మ అంటే సమస్యలు ఏమిటి?

   ఎ) జీవాత్మ సంసారి; జీవాత్మ పరమాత్మ అభిన్నం అంటే పరమాత్మ కూడా సంసారి అవాలి. అది చాలా దారుణం. ఘోరమైన తప్పు. ఈశ్వరుణ్ణి కింది స్థాయికి దింపివేస్తున్నారు. ఇది శాస్త్రవిరోధం అవుతుంది.

బి) ఈ వాక్యాన్ని రెండో వైపునుంచి చూస్తే పరమాత్మ అసంసారి; జీవాత్మ పరమాత్మలు అభిన్నం అంటే జీవాత్మ కూడా అసంసారి అవాలి. జీవాత్మ కూడా అసంసారి అయితే, ఇంక శాస్త్రోపదేశం ఎందుకు? ఇవన్నీ సంసార నివృత్తికోసం కదా! జీవాత్మ సంసారి కాదు, పరమాత్మలాగా అసంసారి అంటే, ఇంక శాస్త్రం అనవసరం. దీనివల్ల శాస్త్రం అనవసరం అవుతుంది.

దీనికి శంకరులవారు జవాబు చెప్పేలోపు భేద-అభేదవాది రంగప్రవేశం చేస్తాడు.

2. భేద-అభేదవాది వాదన: పూర్వపక్షిని భేదవాది అంటారు. సిద్ధాంతిని అభేదవాది అంటారు. సిద్ధాంతి అంటే శంకరులవారి వాదన. ఇది అద్వైతసిద్ధాంతం. భేద-అభేదవాదిది మధ్యస్థ వాదన. జీవాత్మ, పరమాత్మల మధ్య పూర్తిగా భేదం లేదు. పూర్తిగా అభేదం లేదు అంటాడు. దాన్ని ప్రతిపాదించిన వారు భర్తృప్రపంచం. ఇంచుమించు ఇదే సిద్ధాంతం నేటి విశిష్టాద్వైతానిది. విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించినవారు రామానుజాచార్యులవారు. శంకరులవారి కాలంలో వీరు లేరు. అందుకని ఇప్పుడు విశిష్టాద్వైతాన్ని ఖండించటానికి, అప్పుడు శంకరులవారు భేద-అభేదవాదిని ఖండించిన మార్గాన్నే ఎన్నుకుంటారు.

జీవ ఈశ్వరులు భిన్నంగా ఉన్నారు అంటే ఐక్యాన్ని సూచించే శ్రుతివాక్యాలను ఖండించలేము. జీవ ఈశ్వరులు ఐక్యం అంటే పైన భేదవాది చెప్పిన రెండు దోషాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందువల్ల భేద-అభేదవాది ఏమంటాడు? జీవ ఈశ్వరులది కార్యకారణ సంబంధంగా తీసుకోవాలి అంటాడు. కార్యకారణ సంబంధం తీసుకుంటే, వాటి రెండింటి మధ్య భేదమూ ఉంది; అభేదమూ ఉంది. ఉదాహరణకు కుండ-మట్టినే తీసుకోండి.

ఎ) అభేదం: కుండ వేరు, మట్టి వేరు అనలేము. ఎందుకంటే మట్టి లేకుండా కుండకు ఉనికి లేదు. అందువల్ల రెండూ అభేదం.

బి) భేదం: అలాగని అభేదం అందామా అంటే వాటి నామరూపాల్లో భేదం ఉంది. ఒకటి కుండ, ఒకటి మట్టి. ఒకదాని బదులు ఇంకోదాన్ని వాడలేము. అంతేకాదు కర్మభేదం కూడా ఉంది. కుండ వ్యవహారానికి పనికివస్తుంది కాని, మట్టి పనికిరాదు. మట్టిలో నీళ్ళు నింపుకోలేము. అందువల్ల కుండ వేరు, మట్టి వేరు.

పై రెండు వాదనలవల్ల మట్టి, కుండా ఇటు పూర్తిగానూ అభేదం కాదు. అటు పూర్తిగానూ భేదం కాదు. భేద-అభేద వాదం అంటే ఏకత్వంలో భిన్నత్వం. భిన్నత్వంలో ఏకత్వం. ఇదే సూత్రాన్ని జీవ, ఈశ్వరులకు చూద్దాము.

ఎ) అభేదం: జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనలేము. ఎందుకంటే పరమాత్మ లేకుండా జీవాత్మకు విడిగా ఉనికి లేదు. అందువల్ల రెండూ అభేదం.

బి) భేదం: అలాగని అభేదం అందామా అంటే వాటి నామరూపాల్లో, కర్మల్లో భేదం ఉంది. అందువల్ల జీవాత్మ వేరు, పరమాత్మ వేరు.

ముందు శంకరులవారు వీరి వాదనను ఖండిస్తారు. వారి వాదనను మూడు అంశాలుగా తీసుకుని ఒక్కొక్కదాన్నీ ఖండించుకు వస్తారు.

ఎ) భేద–అభేదవాది వాదన: అనేక పరమాత్మలు, అనేక జీవాత్మలు ఉన్నారు. వాటిలో ఒక పరమాత్మ జీవాత్మ అయింది. జీవాత్మగా మారిన పరమాత్మ విషయంలో ఆ రెండింటి మధ్య భేదం లేదు. కాని తక్కిన పరమాత్మలు అలాగే ఉన్నాయి కదా! ఆ పరమాత్మలకూ, జీవాత్మలకూ భేదం ఉంది. ఆ విధంగా భేద–అభేదం ఉంది.

కుండ–మట్టి ఉదాహరణను చూడండి. అనేక మట్టి ముద్దలు ఉంటే, వాటిల్లోంచి ఒక మట్టి ముద్ద కుండగా మారింది. కాని మట్టి ముద్దలు ఇంకా ఉన్నాయి.

సిద్ధాంతి జవాబు: పరమాత్మ ఏకం. ఈ వాదనను ఒప్పుకోలేము. ఉదాహరణ విషయంలో చెల్లుతుంది కాని, పరమాత్మ విషయంలో చెల్లదు. శాస్త్రం పరమాత్మ ఒక్కడే ఉన్నాడని చెబుతున్నది.

బి) భేద–అభేదవాది వాదన: ఒక్కడే పరమాత్మ ఉన్నాడంటే, ఆ ఒక్క పరమాత్మ పరిణామం చెంది జీవాత్మ అయ్యాడు. ఉదాహరణకు పాలు పెరుగుగా మారటం. పెరుగు పాలనుంచే వచ్చింది కాబట్టి రెండూ ఒకటే; పెరుగయ్యాక పాల లక్షణాలు పెరుగులో లేవు కాబట్టి రెండూ వేరు వేరు వస్తువులు. నామరూపకర్మల్లో తేడా ఉంది. అలా భేద–అభేదం ఉంది.

సిద్ధాంతి జవాబు: పరమాత్మ నిర్వికారం – పరమాత్మకు వికారాలు లేవు. అంటే మార్పులు లేవు. జీవాత్మకే షడ్వికారాలు ఉన్నాయి. పరమాత్మకు లేవు కాబట్టి, ఆయన మార్పు చెంది జీవాత్మ అయ్యే ప్రసక్తి లేదు.

సి) భేద–అభేదవాది వాదన: పరమాత్మ మొత్తం పరిణామం చెందదు. ఆయనలో ఒక భాగం మార్పు చెందుతుంది. కాని తక్కిన భాగం అలాగే ఉంటుంది. దీన్ని **ఏకదేశ వికారం** అంటారు. మారిన భాగం అభిన్నంగా ఉంటే, మారని భాగం భిన్నంగా ఉంటుంది. ఆ విధంగా జీవ, ఈశ్వరులకు ఒక కోణంలో బేధం లేదు. ఇంకో కోణంలో భేదం ఉంది. అలా అయితే నువ్వు సంసారి అన్నా, నువ్వు ముక్తుడవు అన్నా సరిపోతుంది.

సిద్ధాంతి జవాబు: పరమాత్మ నిష్కళుడు – అంటే అవయవాలు లేవు. పరమాత్మకు అవయవాలు లేవు. ఒకవేళ అవయవాలు ఉంటే అది అనిత్యం అవుతుంది. అవయవాలు ఉంటే మార్పుకు లోనవుతుంది. మార్పుకు లోనయ్యేది శాశ్వతం కాదు. కాని పరమాత్మ శాశ్వతం. అందువల్ల పరమాత్మకు అవయవాలు ఉన్నాయి అంటే అది శ్రుతి విరోధం అవుతుంది.

డి) భేద–అభేదవాది వాదన: ఏకదేశ వికారంమీదే అతని వాదన కొనసాగుతున్నది. దీనికి అతను అనుభవపరంగా, శాస్త్రపరంగా కూడా వాదిస్తాడు.

1) అనుభవపర వాదన: ఎడారి ఉదాహరణ తీసుకోండి. పృథివే ఎడారిగా మారింది. కాని పృథివి లక్షణాలు ఎడారికి లేవు. అందులో ఏమీ పండవు. ఎడారి ఎలా పృథివినుంచి పరిణామం చెందిందో, అలా జీవాత్మ పరమాత్మనుంచి పరిణామం చెందింది.

2) శ్రుతి ప్రమాణం: అగ్ని విస్ఫులింగ ఉదాహరణ తీసుకోండి. విస్ఫులింగం అంటే నిప్పురవ్వలు. అవి అగ్ని నుంచే వస్తాయి. అగ్ని ఏకం, నిప్పురవ్వలు అనేకం. నిప్పురవ్వల్లో అగ్నికున్న వేడి, కాంతి లక్షణాలు ఉన్నాయి.

అలా అవి అభిన్నం. కాని అగ్ని కాల్చినట్టుగా నిప్పురవ్వలు దేన్నీ కాల్చలేవు. అలా అవి భిన్నం. అలా జీవాత్మ పరమాత్మలో ఒక భాగం. పరమాత్మ అగ్ని అయితే, ఆయన్నుంచి వెలువడిన నిప్పురవ్వలే జీవాత్మలు.

సిద్ధాంతి జవాబు: ఉదాహరణను కావాల్సినంత మేరకే తీసుకోవాలి. ఉదాహరణను సరిగ్గా అర్థం చేసుకోకపోతే, సిద్ధాంతాన్ని తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. దానివల్ల మోక్షానికి దూరమవుతాము. ఒక ఉదాహరణను శ్రుతి ఇచ్చినప్పుడల్లా మూడు అంశాలను గుర్తుంచుకోవాలి.

– అలౌకిక విషయాన్ని అలౌకిక విషయంతో వివరిస్తే అర్థం కాదు.

– అలౌకిక విషయాన్ని లౌకిక ఉదాహరణద్వారా వివరించాలి.

– అలౌకిక విషయం లౌకిక ప్రమాణాన్ని ఖండించకూడదు.

ఇప్పుడు ఈ సూత్రాలను విస్ఫులింగ ఉదాహరణకు అన్వయించి చూద్దాము.

– శ్రుతి జీవాత్మ పరమాత్మల అనుబంధం గురించి వివరించబోతున్నది.

– శ్రుతి వాడిన లౌకిక ఉదాహరణ అగ్ని–నిప్పురవ్వలు.

ఇంతవరకూ సరిపోయింది. అలౌకిక విషయాన్ని చెబుతున్నది, లౌకిక ఉదాహరణ తీసుకుంది. కాని భేద –అభేదవాది వాదనను ఒప్పుకుంటే, మూడవ సూత్రం వర్తించదు. ఏమిటది? అలౌకికవిషయం లౌకికప్రపంచాన్ని ఖండించకూడదు. భేద–అభేదవాదుల వాదన ఈ విషయంలో విశిష్టాద్వైతుల వాదనకు సరిపోతుంది. పరమాత్మకు జీవాత్మలనే అవయవాలు ఉన్నాయి. అగ్నికి నిప్పురవ్వలనే అవయవాలు ఉన్నట్టుగా, పరమాత్మకు జీవాత్మలనే అవయవాలు ఉన్నాయి అనేది వారి వాదన.

కాని పరమాత్మను సావయవంగా తీసుకుంటే, ఆయనకు వికారాలు (మార్పులు) ఉన్నట్టు వస్తుంది. ఎందుకంటే అవయవాలు ఉన్నదానికి పుట్టుక ఉంటుంది. పుట్టుక ఉన్నదానికి వికారాలు ఉంటాయి. వికారాలు ఉన్నదానికి నాశనం కూడా ఉంటుంది. సంసారం ఉంటుంది.

భేద–అభేదవాది వాదన: పరమాత్మ సావయవమే కాని, సవయవ సూత్రం పరమాత్మకు వర్తించదు. పరమాత్మ నిత్యం. పరమాత్మ నిత్యం అని శ్రుతి కూడా అంటుంది.

సిద్ధాంతి వాదన: పరమాత్మ సావయవం కాని నిత్యం అనే వాదన చెల్లదు. అది యుక్తి విరోధం, శ్రుతి విరోధం కూడా. అందువల్ల విస్ఫులింగ ఉదాహరణను లౌకిక ప్రమాణానికి వ్యతిరేకంగా తీసుకోకూడదు. జీవాత్మ, పరమాత్మలో ఒక భాగం అనకూడదు.

ఆ దృష్టాంతం చెల్లదు అంటే ఎందుకు ఇచ్చినట్టు అనిపించవచ్చు. దృష్టాంతాన్ని ఎలా అన్వయించాలో తెలుసుకోవాలి. ప్రమాణం నిర్వచనం – ఇంకో ప్రమాణం చెప్పిన దాన్ని ఖండించకూడదు. తెలిసిన విషయాన్ని చెప్పకూడదు.

శాస్త్రప్రమాణం – అది అగ్ని–నిప్పురవ్వల ఉదాహరణద్వారా ఇంకో ప్రమాణాన్ని ఖండించటం లేదు. అంటే అది యుక్తి విరోధంగా కాని, ప్రత్యక్షప్రమాణ విరోధంగా గాని లేదు. అలాగని తెలిసిన విషయాన్నీ చెప్పటంలేదు.

కారణలక్షణాలు కార్యంలోకి వస్తాయి అని చెప్పటానికి ఈ ఉదాహరణను ఎంచుకున్నది. అగ్నికి రెండు లక్షణాలు ఉన్నాయి – కాంతి, వేడి. అగ్నినుంచి పుట్టిన నిప్పురవ్వలకు కూడా ఆ రెండు లక్షణాలు ఉన్నాయి– కాంతి, వేడి.

అలాగే పరమాత్మ లక్షణం సత్ చిత్ ఆనంద రూపం. జీవాత్మకు కూడా ఆ లక్షణాలు ఉన్నాయి. అందువల్ల ఈ దృష్టాంతం అంగ–అంగీ సంబంధం బోధించటానికి కాదు. జీవాత్మ, పరమాత్మ ఐక్యం బోధించటానికి ఇవ్వబడింది. అలా తీసుకుంటేనే మిగతా చోట్ల కూడా సరిపోతుంది.

అంతేకాదు ఉపక్రమ–ఉపసంహారం చూసినా కూడా జీవ ఈశ్వరుల ఐక్యమే సూచిస్తున్నాయి. ఉపక్రమ ఉపసంహారం అంటే ప్రారంభం, ముగింపు. ఒక గ్రంథం దేనితో ప్రారంభించి, దేనితో ముగుస్తుందో అది ఆ గ్రంథంయొక్క తాత్పర్యం. వేదాంతం ఏకత్వంతో ప్రారంభించి, ఏకత్వంతో ముగుస్తుంది.

అందువల్ల అగ్ని–నిప్పురవ్వల ఉదాహరణనుంచి పరమాత్మ జీవాత్మల మధ్య ఉన్నది అంగీ అంగ సంబంధం అని చెప్పకూడదు. దాన్ని కార్యకారణ సంబంధంగా తీసుకుంటే అది సాత్త్విక జ్ఞానం అవుతుంది. భేదభావాన్ని చూపిస్తే అది రాజసజ్ఞానం అవుతుంది. అందువల్ల జీవాత్మ పరమాత్మల మధ్య భేదం లేదని నిరూపిస్తారు శంకరులవారు. ఒకవేళ భేదం ఉన్నట్టు కనపడినా అది ఔపాధిక భేదం అవుతుంది అంతే.

ఈ సందర్భంలో శంకరులవారు చిన్న వయసులోనే తప్పిపోయిన ఒక రాజకుమారుని కథ చెబుతున్నారు. చిన్నవయస్సులో తప్పిపోయిన రాజకుమారుడు కిరాతకుల జాతిలో పెరుగుతున్నాడు. అతనికి తాను రాజవంశానికి చెందినవాడినని తెలియదు. రాజకులానికి చెందిన వాడైనా కిరాతకుల పెంపకంలో ఉన్నాడు. అందువల్ల కిరాతకులు చేసే పనులనే చేస్తుండేవాడు. రాజ్యం ఏలాల్సిన వాడు అల్పమైన పనులను చేస్తున్నాడు. దయాళువు ఒకాయనకు అతను రాజకుమారుడని తెలిసి, అతను కిరాతకుడు కాదని, రాజకుమారుడని ఉపదేశించాడు. ఆ ఉపదేశాన్ని పొందాక, అతను కిరాతక జాతిని, కిరాతక పనులను ఒదిలిపెట్టి, రాజాస్థానానికి తిరిగివచ్చాడు.

అదే విధంగా, జీవాత్మ పరమాత్మ, కాని స్థూల, సూక్ష్మశరీరాలతో సన్నిహితంగా ఉండటంవల్ల, నేను శరీరాన్ని, నేను మనస్సును, నేను పరిచ్ఛిన్నుడను అనుకుంటున్నాడు. నిజానికి అతను నిత్య, ముక్త, శుద్ధ పరమాత్మ కాని అతను నేను అనాథను, నేను దీనుడను, నేను అల్పుడను అని అనుకుంటున్నాడు. ఎందుకు? శరీర అభిమానంవల్ల. మహారాజులాగా సంచరించాల్సిన జీవి. సంసారబాధలను అనుభవిస్తున్నాడు.

**యథాహిః ద్వైతమ్ ఇవ భవతి**

భేదభావం గురించి చెప్పినప్పుడల్లా శ్రుతి 'ఇవ' పదం వేస్తుంది. 'ఇవ' అంటే ఉన్నట్టుగా. అందువల్ల నిజంగా భేదభావం లేదు. ఉన్నట్టుగా అనిపిస్తుంది.

జీవాత్మ పరమాత్మల మధ్య సంబంధం అంగ–అంగీ సంబంధం కాదు. జీవాత్మ పరమాత్మల మధ్య భేదం లేదు. ఈ వాదనతో భేద–అభేదవాదిని ఖండించాడు.

**భాగం 3**

శంకరులవారు భేదవాది వాదనకు జవాబు ఇచ్చేలోగా, అతను రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ వస్తాడు. ఈసారి భేదవాది నాలుగు దోషాలను ఎత్తి చూపుతాడు.

భేదవాది చూపిన దోషాలు -

ఎ. జ్ఞానకాండ అప్రమాణం

బి. కర్మకాండ అప్రమాణం

సి. ప్రత్యక్ష విరోధం

డి. అనుమాన విరోధం

ఒక విషయంమీద వాదోపవాదాలు జరిగేటప్పుడు వాటికి మూడు ప్రమాణాలు వాడుతారు. అవి శ్రుతి, యుక్తి, అనుభవం. జ్ఞానకాండ, కర్మకాండ శ్రుతి; అనుమానం యుక్తి; ప్రత్యక్షం అనుభవం. ఈ మూడూ జీవ–ఈశ్వరుల ఐక్యాన్ని ఒప్పుకోవటం లేదని భేదవాది చెబుతున్నాడు. ఒక్కొక్కటి వివరంగా చూద్దాము.

ఎ) **జ్ఞానకాండ అప్రమాణము:** ఒకవేళ ఉపనిషత్తు అభేదాన్ని బోధిస్తున్నట్లయితే, ఉపనిషత్తు తనకు తాను వ్యతిరేకంగా చెబుతున్నది. అప్పుడు, అప్రమాణం అవుతుంది. జీవాత్మ సంసారి, పరమాత్మ నిత్యముక్తుడు. ఉపనిషత్తు నిత్యముక్త పరమాత్మకు బోధించటం లేదు. సంసారి జీవాత్మకు బోధిస్తున్నది. అతన్ని బద్ధుడిగా భావించి అతను శాస్త్రం నేర్చుకుంటే, తర్వాత మోక్షం పొందుతాడు అంటున్నది. సంసారి జీవాత్మకు బోధిస్తున్నట్లయితే, జీవాత్మ పరమాత్మలు ఒకటే అని ఎలా చెబుతుంది? అందువల్ల జ్ఞానకాండ అప్రమాణం.

బి) **కర్మకాండ అప్రమాణము:** ఒకవేళ జీవాత్మ పరమాత్మలు ఒకటే అంటే,పరమాత్మ అసంసారి కాబట్టి జీవాత్మ కూడా అసంసారి అవాలి. సంసారి జీవాత్మ లేనప్పుడు సాధ్యసాధనల బోధ ఎందుకు? యజ్ఞయాగాదులు, ఊర్ధ్వలోకాలు ఎందుకు? జీవాత్మ కర్త అయితే, ఊర్ధ్వలోకాలకు వెళ్ళి భోక్తగా అనుభవిస్తాడు. జీవాత్మ అకర్తా, అభోక్తా అయితే కర్మకాండ అవసరం ఉండదు. అందువల్ల కర్మకాండ అప్రమాణం.

సి) **ప్రత్యక్ష విరోధము:** మన కళ్ళముందే అనేక జీవులను చూస్తున్నాము. ఒకరు భోగభాగ్యాలతో తులతూగుతుంటే, ఇంకొకరు దరిద్రంలో మునిగి తేలుతున్నారు. ఒకరు విరాగి అయితే ఇంకొకరు కామక్రోధాలకు బానిస అవుతున్నారు. అందువల్ల ప్రత్యక్షంలో ఆత్మభేదం అనుభవంలోకి వస్తున్నది. పైగా ఈ భేదాలు శరీరానికో, మనస్సుకో చెందినవి కావు. ఎందుకంటే అవి జడం, ఆత్మ ఒక్కటే చైతన్యం. అందువల్ల సుఖదుఃఖాలు చేతన ఆత్మకే చెందుతాయి కాని, జడమైన అనాత్మకు కావు. అందువల్ల ప్రత్యక్ష విరోధం.

డి) **అనుమాన విరోధము:** జీవాత్మ,పరమాత్మల ఐక్యం అనుమానం కూడా ఒప్పుకోదు. ఇంచుమించు ఇందాకటి వాదనే. జీవికీ జీవికే పోలిక లేదు. అలాంటప్పుడు జీవి, పరమాత్మ ఒకటి ఎలా అవుతారు? సుఖదుఃఖాలను ఆత్మ అనుభవిస్తుంది కాబట్టి జీవాత్మ, పరమాత్మ ఐక్యం కుదరదు.

అందువల్ల అభేదాన్ని బోధించే ఉపనిషత్తు అప్రమాణం. దీనివల్ల కర్మకాండ, యుక్తి, అనుభవం కూడా అప్రమాణం. దాని బదులు భేదాన్ని బోధించే కర్మకాండ ప్రమాణం అంటే, దానికి దీటుగా అనుభవం, యుక్తి కూడా నిలుస్తాయి.

సిద్ధాంతి వాదన: శంకరులవారు ఒక్కొక్కదాన్ని ఖండించుకుంటూ వస్తారు.

ఎ) జ్ఞానకాండ అప్రమాణ ఖండన: శ్రుతి తనకు తాను వ్యతిరేకంగా చెప్పటమూ లేదు, అది అప్రమాణమూ కాదు. ప్రమాణం కొత్త జ్ఞానాన్ని అందచేస్తుంది. ప్రమాణం ఇచ్చిన జ్ఞానాన్ని ఖండించలేము. కన్ను ఒక ప్రమాణం. కన్ను మనకు అనేక రంగులను చూపిస్తుంది. రంగుల ద్వారా మనకు కొత్త జ్ఞానాన్ని అందచేస్తుంది. దాన్ని ఖండించలేము. అలాగే ఉపనిషత్తు ప్రమాణం. అది కొత్త జ్ఞానాన్ని ఇస్తుంది. ప్రమాణం అంటే కొత్త జ్ఞానాన్ని ఇవ్వాలి. వేరే ప్రమాణం చెప్పినదాన్ని ఖండించకూడదు, చెప్పకూడదు. మీరు ప్రమాణమైన ఉపనిషత్తును అప్రమాణమని అనుమాన ప్రమాణంద్వారా చెబుతున్నారు. అది చెల్లదు. అది కొత్త జ్ఞానాన్ని ఇస్తున్నది. అప్రమాణం అని మీరంటే, ఉపనిషత్తు ప్రమాణం కాదు అనే మీ వాక్యం కూడా అప్రమాణం అవుతుంది.

ఉపనిషత్తు తనకు తాను వ్యతిరేకంగా చెబుతున్నది. ఇది పూర్వపక్షి వాదన. ఇది కూడా సత్యంకాదు. ఉపనిషత్తు ఎక్కడా లక్ష్యార్థంగా ద్వైతాన్ని బోధించటం లేదని శంకరులవారు చెబుతున్నారు. ఉపనిషత్తు తాత్పర్యం అద్వైతం మాత్రమే. అందువల్ల తనకు తాను వ్యతిరేకంగా చెప్పటం లేదు.

ఉపనిషత్తు ద్వైతాన్ని పేర్కొని ఉండవచ్చు. ఉపనిషత్తు సంసారి జీవాత్మ గురించి చెప్పి ఉండవచ్చు. అంతమాత్రాన సంసారి జీవాత్మకు బోధ చేస్తున్నట్టు కాదు అర్థం.

బోధ చేయటానికి, దాని గురించి చెప్పటానికి చాలా వ్యత్యాసం ఉంది. మనం మన అజ్ఞానంవల్ల సంసారి జీవాత్మ గురించి మాట్లాడుతాము. ఉపనిషత్తు మీరు సంసారి జీవాత్మగా పొరపాటు పడుతున్నారని ఎత్తి చూపిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి తాడును చూసి పామనుకుని భయపడతాడు. 'అదుగో పాము' అంటాడు. అతని భయం పోగొట్టటానికి మనమేమంటాము? 'నువ్వు పాము అనుకుంటున్నది పాము కాదు. అదుగో చూడు అది తాడు మాత్రమే అంటాము.' ఆ వివరణ ఇచ్చేటప్పుడు ఒకటికి రెండుసార్లు పాము, పాము అంటాము. అంత మాత్రంచేత అక్కడ పాము ఉన్నట్టు మనం ఒప్పుకుంటున్నట్టా? కాదు కదా!

మనం 'పాము' పదాన్ని ఉపయోగించినంత మాత్రాన, మనం పాము ఉన్నట్టుగా స్వీకరించినట్టుగా తీసుకోకూడదు. మనం పాము గురించి వాడిన మాటలను ప్రమాణంగా భావించకూడదు. ఇదే సూత్రం సంసారి జీవాత్మ పదానికి వర్తిస్తుంది. మనం మనను సంసారి జీవాత్మలుగా భావించుకుని పొరపాటు పడుతున్నాము. శ్రుతి, మీరుసంసారి జీవాత్మ అనుకుంటున్నది పొరపాటు. అది మీ భ్రమ అని చెబుతున్నది. అందువల్ల శ్రుతి సంసారి జీవాత్మ పదాన్ని వాడితే అది ప్రమాణవాక్యంగా తీసుకోకూడదు. అభేదవాక్యాలనే ప్రమాణవాక్యాలుగా తీసుకోవాలి. అందువల్ల శ్రుతి సంసారి జీవాత్మ అంటే అది ప్రమాణవాక్యం కాదు. అది మన వాదనను ఖండించటానికి వాడే అనువాద వాక్యం. శ్రుతి ఎప్పుడూ చెప్పేది ఒకటే – జీవాత్మ, పరమాత్మల ఐక్యం. అందువల్ల ఉపనిషత్తు లేదా జ్ఞానకాండ అప్రమాణం కాదు.

బి) కర్మకాండ అప్రమాణ ఖండన: ఉపనిషత్తు అభేదాన్ని బోధిస్తే కర్మకాండ అప్రమాణం అవుతుంది అనేది పూర్వపక్షి వాదన. దీనికి కూడా శంకరులవారి జవాబు అదే. కర్మకాండ అప్రమాణం అనేది వారి అనుమానం (తర్కం).

కర్మకాండ మనకు స్వర్గం గురించి, కర్మల గురించి, కర్మఫలాల గురించి జ్ఞానాన్ని ఇస్తుంది. జ్ఞానం ఇచ్చేది ప్రమాణం. అది స్పష్టంగా తెలుస్తూనే ఉంది. జ్ఞానాన్ని ఇచ్చే దాన్ని అప్రమాణం అని ఎలా అంటారు?

కర్మకాండ సాధ్యసాధన భేదం గురించి మాట్లాడుతుంది నిజమే. కాని అది అద్వైతానికి భిన్నంగా లేదు అంటారు శంకరులవారు. ఎందుకు? కర్మకాండ దాన్ని ఎప్పుడూ సత్యం అనలేదు.

నిజానికి అజ్ఞానిదృష్టిలో ఉన్న భేదభావాన్నే వేదం పరిగణనలోకి తీసుకుంది. మనలో భేదదృష్టి ఉండటంవల్ల కొన్ని సాధనసాధ్యాలను విధించింది తప్పితే, వేదం ఎన్నడూ ఇది సత్యం అని చెప్పలేదు. అందువల్ల కర్మకాండ మాట్లాడే సాధ్యసాధన సంబంధాలు మిథ్యా ప్రపంచంలోకి వస్తాయి. ఈ భేదాలు మిథ్యా ప్రపంచంలో ఉన్నాయి. ఉదాహరణకు అగ్నిహోత్రం చేస్తే స్వర్గలోకానికి వెళతారనీ, పుత్రకామేష్టి యాగం చేస్తే పుత్రులు పుడతారనీ చెబుతుంది. అంటే ఒక మిథ్యాసాధనకూ, ఇంకో మిథ్యాసాధ్యానికీ మధ్య ఉన్న సంబంధాన్ని చెబుతున్నది. మనకు తెలియని విషయాలను గురించి చెబుతుంది కాబట్టి అది ప్రమాణం. అది ఎన్నడూ అది సత్యం అని గాని, అది సత్యఫలాన్ని ఇస్తుందని గాని చెప్పలేదు. అందువల్ల కర్మకాండ మిథ్యాభేదం గురించి చెబుతుంది.

జ్ఞానకాండ సత్య అభేదం గురించి చెపితే, కర్మకాండ మిథ్యాభేదం గురించి చెబుతుంది.

కర్మకాండ మిథ్యా ద్వైతం గురించి చెబుతుంది
జ్ఞానకాండ సత్య అద్వైతం గురించి చెబుతుంది

అలాంటప్పుడు ఒకదానొ్నకటి ఖండించే ఆస్కారం ఏది? అందువల్ల అద్వైతం అన్ని సిద్ధాంతాలనూ ఒప్పుకుంటుంది. తక్కిన సిద్ధాంతాలవారు వ్యావహారిక భేదంమీద అంతకంతకూ వివరణ ఇస్తారంటుంది అద్వైతం. విశిష్టాద్వైతుల సిద్ధాంతం, ద్వైత సిద్ధాంతం – ఏదైనా ఒప్పుకుంటారు అద్వైత వేదాంతులు. కాకపోతే ఒక కొసమెరుపు వేస్తారు దానికి – అవన్నీ వ్యావహారిక సత్యానికి చెందినవి సుమా అంటారు.

వారు ఈశ్వరపూజ చేయమంటే, వ్యావహారికంగా ఈశ్వరపూజ చేయాలని అద్వైతం కూడా అంటుంది. నేను వ్యష్టిశరీరాన్ని అయితే, ఈశ్వరుడు సమష్టి శరీరం. వ్యావహారిక జీవుడు, వ్యావహారిక ఈశ్వరునిలో ఒక భాగం. అంగీ అంగ సంబంధం ఉంది అంటే ఒప్పుకుంటాము. ఈశ్వరునికి నమస్కారాలు చేస్తాము. కాని, అదే సమయంలో అద్వైతం ఏవ సత్యం అంటాము. ఇది పారమార్థిక స్థాయికి చెందినది.

**కర్మకాండ వ్యావహారిక సత్యం**
**జ్ఞానకాండ పారమార్థిక సత్యం**

అందువల్ల కర్మకాండ అప్రమాణం కాదు.

సి) ప్రత్యక్ష విరోధ ఖండన: జీవికీ జీవికీ మధ్య అనేక భేదాలు ఉన్నాయి. కొందరికి పుణ్యం ఎక్కువ ఉంటే కొందరికి పాపం ఎక్కువ ఉంటుంది. ఇవి అనుభవించేది చేతన ఆత్మ కాబట్టి ఆత్మలు అనేకం. పరమాత్మ కేవలం పుణ్యస్వరూపుడు, సకల గుణాభిరాముడు కాబట్టి, జీవ ఈశ్వర ఐక్యం ఊహించలేము. ఇది పూర్వపక్షి వాదన.

దానికి శంకరులవారు ఆకాశ ఉదాహరణ తీసుకుంటారు. ఈ పూర్వపక్షి తర్కశాస్త్రాన్ని నమ్ముతాడు. ఇటువంటి వారిని తార్కికులు అంటారు. అతని వాదన ప్రకారం ఆకాశం ఏకం, నిత్యం, జననమరణరహితం. నిరవయవం, అంతేకాదు ఆకాశానికి శబ్దగుణం ఉందంటారు వారు.

తార్కికుల పూర్వపక్షి వాదన: తార్కికులు ఆకాశాన్ని ఏకం, శబ్ద ఆశ్రయం అంటారని చూశాము కదా! వారికి కూడా పూర్వపక్షులు ఉంటారు అంటే వారి వాదనను ఖండించేవారు వేరే వారు ఉంటారు. వారు ఈ వాదనను ఒప్పుకోరు. ఈ పూర్వపక్షులు ఆకాశంలో అనేక ప్రాంతాల్లో అనేక శబ్దాలు ఉంటాయి అంటారు. ఉదాహరణకు ఒక హాల్లో ఒక ప్రసంగం జరుగుతున్నది అనుకోండి. పక్కగదిలో ఎవరో, అదే సమయంలో పాట పాడుతున్నారు. అంటే భిన్నశబ్దాలు వినిపిస్తున్నాయి కదా! కాబట్టి ఆకాశంలో అనేక శబ్దాలు ఉన్నాయి. అందువల్ల అనేక శబ్ద ఆశ్రయాలు ఉన్నాయి. అంటే అనేక ఆకాశాలు ఉన్నట్టు అవుతుంది.అలాంటప్పుడు ఒకటే ఆకాశం ఉందని ఎలా చెప్పగలవు?

తార్కికుని జవాబు: ఆకాశం నిజానికి ఒక్కటే. అనేక ఆకాశాలు ఉన్నట్టు కనిపిస్తే అది ఔపాధిక భేదం. అంటే భిన్న ఉపాధుల్లో ఆకాశం ప్రకటితమవుతుంది. కాని నిజానికి ఉన్నది ఒకటే ఆకాశం. శబ్దభేదం గది ఉన్న ఆకారంబట్టి వస్తోంది. గది చిన్నదైనా, గదిని తీసేసినా మళ్ళీ శబ్దాలు మారుతాయి. శబ్దభేదం ఉంటే ఆకాశభేదం ఉన్నట్టు కాదు. శబ్దభేదం ఉపాధిభేదంవల్ల తప్ప ఆకాశంవల్ల కాదు.

దీనికి సిద్ధాంతి జవాబు:

1. ఇదే నా జవాబు కూడా అంటున్నారు శంకరులవారు. పుణ్యపాపాల భేదాలు ఉపాధి భేదాలు తప్ప ఆత్మభేదాలు కావు. ఆత్మలు అనేకం లేవు. భేదం ఉపాధికి చెందినది.
2. ఇది కాక శంకరులవారు ఇంకో వాదన కూడా చేస్తున్నారు. ఆత్మ విషయంలో ప్రత్యక్షభేదం గురించి మాట్లాడలేము. ఎందుకు? ఆత్మ అప్రత్యక్షం. అది ప్రత్యక్ష విషయం కాదు. ఆత్మను చూడలేనప్పుడు అది ఒకటా, అనేకమా అనేది ఎలా చెబుతాము? శరీరం ప్రత్యక్షం, శరీరభేదం ప్రత్యక్షం; మనస్సు ప్రత్యక్షం, మనోభేదం ప్రత్యక్షం. కాని ఆత్మ అపరోక్షం. అలాంటప్పుడు ప్రత్యక్షభేదం గురించి ఎలా చెబుతాము? అందువల్ల ఆత్మ ప్రత్యక్ష విరోధం కాదు.

డి) అనుమాన విరోధ ఖండన: ఈ విషయం గురించి చర్చిస్తుంటేనే శంకరులవారికి తార్కికులమీద చాలా కోపం వస్తుంది. వారిని చాలా తీవ్రంగా విమర్శిస్తారు. సాధారణంగా శంకరులవారు ఎవరినీ తక్కువ చేసి మాట్లాడరు. కాని ఇక్కడ వారిని పశువులతో పోలుస్తారు. వారికి కొమ్ములు, తోక ఒక్కటే తక్కువ అంటారు. వారిమీద ఆయనకు వ్యక్తిగతంగా ఏమీ కోపం లేదు.వారు శ్రుతి ప్రమాణంకు విరుద్ధంగా వెళుతున్నందుకు ఈ కోపం ప్రదర్శించారు. ఆత్మభేదం చూపించటానికి వారు రెండు వాదనలు చేస్తారు.

1) వారి మొదటి వాదన కొంచెం సూక్ష్మంగా ఉంటుంది కాబట్టి కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తార్కికులు, న్యాయవైశేషికులు తర్కంద్వారా ఆత్మలు అనేకం ఉన్నాయి అంటారు. వారి ఉద్దేశంలో అనుమానం (తర్కం) కూడా ఒక క్రియ. క్రియ అంటే పనిని తెలిపేది.

సిద్ధాంతి ప్రశ్న: మీ ఉద్దేశంలో క్రియ ఎవరు చేస్తారు? క్రియలో ఈ అనుమానక్రియ కూడా వస్తుంది. అందుకని ఈ వాదన ఇక్కడ అవసరమే.

తార్కికుల జవాబు: తార్కికులు దాన్ని కారకసాధ్యక్రియ అంటారు. అంటే అనేక కారకాలవల్ల జరిగిన ఒక కర్మ. కారకాలంటే విభక్తి ప్రత్యయాలు. కర్త, కర్మ, కారణం, సంప్రదానం మొదలైనవి. ఈ విభక్తి ప్రత్యయాలన్నీ క్రియకు చెందుతాయి. కారకాలన్నీ కలిసి ఒక క్రియను ఉత్పన్నం చేస్తాయి. ఇది ప్రాథమిక అర్థం.

సిద్ధాంతి ప్రశ్న: ఒక కారకం క్రియను ఉత్పన్నం చేస్తుందా, అనేక కారకాలు కలిసి ఉత్పన్నం చేస్తాయా?

తార్కికుల జవాబు: ఒక్క కారకం ఉత్పన్నం చేయలేదు,అనేక కారకాలు కలిసి క్రియను ఉత్పన్నం చేస్తాయి.

సిద్ధాంతి వాదన: ఇది సబబు కాదు.

1) ఒక్క వ్యక్తి ఏమీ పని చేయలేకపోతే, ఒక సమూహం ఎలా క్రియను ఉత్పన్నం చేస్తుంది? ఉదాహరణకు ఒక గదిలో పదిమంది ఉన్నారు. వారిని ఒక్కొక్కరినీ ఒక పూజకు చందా ఇవ్వమని అడిగాము. ఎవరూ ఇవ్వలేదు. అప్పుడు ఆ సమూహంనుంచి వచ్చిన డబ్బు ఎంత? ఏమీ లేదు. ఒక కారకం ఏమీ పని చేయకపోతే, అన్నీ కలిసి ఎలా పనిచేస్తాయి?

2) ఒక సమూహం అంటూ లేదు. అది మిథ్య. ఎందుకు? వ్యష్టికి భిన్నంగా సమష్టి లేదు. అందువల్ల వ్యష్టి చేయకపోతే సమష్టిగా పని అవదు.

తార్కికుల జవాబు: ఒక్కొక్క కారకం తన పని తాను చేస్తుంది. అప్పుడు అన్ని కారకాల పనులు కలిపితే ప్రధానక్రియ అవుతుంది. కారకం విడిగా చేసేది అవాంతరక్రియ. అన్నీ కలిపి ఉత్పన్నం చేసేది ప్రధానక్రియ. అందువల్ల ఒక ప్రధానకర్మ, దానికి ఆరు అవాంతరక్రియలు ఉన్నాయి.

సిద్ధాంతి వాదన: ప్రధానకర్మ చేయటానికి ఆరు కారకాలు కావాలి అంటున్నారు. ఒక్కొక్క కారకానికి అవాంతరక్రియ ఉందంటున్నారు. ఇప్పుడు ఒక్కొక్క కారకం ఒక పని చేయాలంటే దానికి మళ్ళీ ఆరు కారకాలు కావాల్సి ఉంటుంది. మళ్ళీ దానికి వేరే కారకాలు.అలా ఒక్కొక్కటీ చిన్న కర్మలు చేస్తూ పోతుంటే, ముఖ్య కర్మను ఎప్పుడు చేస్తారు?

అందువల్ల క్రియ ఎలా జరుగుతుందో మీరు ఎన్నటికీ వివరించలేరు. అది ఒక అంతుపట్టని సమస్య. ఎవరు కర్మ చేస్తారు? అనుమాన కర్త ఎవరు? అసలు అనుమానకర్త ఎవరో మీరు చెప్పలేకపోయినప్పుడు, అనుమానక్రియ గురించి చెప్పే హక్కు మీకెక్కడ ఉంది? అందువల్ల ముందు అనుమానకర్త ఎవరో తెలుసుకుని రండి, అప్పుడు మీ అనుమానం నిజమో కాదో తేల్చుకుందాము.ఆ విధంగా తర్కశాస్త్రంయొక్క మూలాన్నే కదలించి వేస్తారు.

2) ఇంకో వాదన కూడా చేస్తారు శంకరులవారు. అది చాలా తేలికైనవాదన. అనుమాన ప్రమాణం ఏది తీసుకున్నా అది ప్రత్యక్ష ప్రమాణంమీద ఆధారపడి ఉంటుంది. ప్రత్యక్ష ప్రమాణం లేకుండా, అనుమాన ప్రమాణం వాడలేరు. ప్రత్యక్షప్రమాణంద్వారా కొంత సమాచారాన్ని సేకరించాలి. దాన్ని లింగం అంటారు. ఆ లింగాన్ని ఆధారం చేసుకుని, తర్కం ఉపయోగించి, ఒక నిర్ణయానికి వస్తారు.

ఉదాహరణకు చంద్రుని గురించి తార్కికంగా చెప్పాలంటే, ముందు చంద్రునిమీద ఉన్న మట్టిని, రాళ్ళను పరిశీలించాలి కాని, భూమిమీద ఉన్న మట్టినో, రాళ్ళనో కాదు. అందువల్ల దేని గురించి తార్కికంగా చెప్పాలో, దానినుంచే సమాచారం సేకరించాలి.

ఇప్పుడు ఆత్మ గురించి తార్కికంగా చెప్పాలంటే, ఆత్మనుంచే సమాచారాన్ని సేకరించాలి. కాని ఆత్మ ప్రత్యక్ష ప్రమాణానికి అందదే! మరి ఆత్మ గురించి తర్కం ఎలా ఉపయోగిస్తారు? అందువల్ల మీకు కలిగే సుఖదుఃఖాలు, పుణ్యపాపాలు, రాగద్వేషాలు, ధర్మాధర్మసంస్కారాలు అన్నీ ఆత్మకు చెందినవని వీరు పొరపడుతున్నారు కాని అది నిజం కాదు. ఆ భేదాలు అనాత్మకు చెందినవి. క్షేత్రభేదాన్ని క్షేత్రజ్ఞునికి ఆపాదిస్తున్నారు.

అందువల్ల అనుమాన విరోధం కాదు.

ఆ విధంగా శంకరులవారు అన్ని వాదనలనూ ఖండించారు. బ్రహ్మవిద్య అంటే జీవ, ఈశ్వరుల ఐక్యం బోధించే విద్య అని శంకరులవారు శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాలద్వారా నిరూపించగలరు.

**తస్యోపనిషత్సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** 2.1.20

ఇంతసేపూ మనం చూసింది దీనిమీద భాష్యం. ఆత్మ రహస్యనామమైన సత్యస్య సత్యం ఇంతవరకూ చర్చనీయాంశం అయింది. చివరగా శంకరులవారు, వాదనద్వారా నిరూపించిన విషయం ఇది.

### సత్యస్య సత్యమ్ – జీవాత్మ నిర్వచనం; అది పరమాత్మకు అభిన్నం

ఇంకా వివరంగా చెప్పాలంటే, ఇది జీవాత్మ నిర్వచనం; నిద్రలోంచి లేపబడిన జీవాత్మ; అవస్థాత్రయ సాక్షిగా నిరూపించబడిన జీవాత్మ; తర్వాత జగత్ కారణంగా చూపబడిన జీవాత్మ; విస్ఫులింగ జీవాత్మ; పరమాత్మకు అభిన్నంగా ఉన్న జీవాత్మ సత్యస్య సత్యం.

### విస్ఫులింగ జీవాత్మ అభిన్న జగత్కారణభూత పరమాత్మ లక్షణం

ఈ వాదనలకు ముక్తాయింపుగా శంకరులవారు తార్కికులను అద్భుతంగా వర్ణిస్తారు. వారు వాదించి, పోట్లాడి, గోల చేస్తారు కాని, ఎంత చేసినా అద్వైతతత్త్వాన్ని అర్థం చేసుకోలేరు. నైషా తర్కేన మతి రాపనేయా

అందువల్ల తర్కశాస్త్రం జోలికి వెళ్లకుండా వేదాంతాన్ని అర్థం చేసుకోమని సలహా ఇస్తున్నారు శంకరులవారు.

ఇక్కడితో సత్యస్య సత్యం భాష్యం ముగిసింది.

## 2.2 - శిశు బ్రాహ్మణము

**తస్యోపనిషత్సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** - 2.1.20

దాని రహస్యనామం సత్యస్య సత్యమ్. ప్రాణాలే సత్యం. ఇది వాటి సత్యం.

ఈ మాటలతో మొదటి బ్రాహ్మణం ముగిసింది. ఇది అంటే పరమాత్మకు అభిన్నంగా ఉన్న జీవాత్మ సత్యస్య సత్యం అని అనేక వాదప్రతివాదనలద్వారా శంకరులవారు నిరూపించారు.

అందులో మొదటి సత్యం ప్రాణాలు అనీ, రెండవ సత్యం ఆత్మ అనీ తెలుసుకున్నాము. దానివల్ల సత్యస్య సత్యాన్ని ప్రధానసత్యం అని కూడా అనవచ్చు. రెండు, మూడు బ్రాహ్మణాలు ఈ రెండు సత్యాలమీద వ్యాఖ్యానం. ఆ బ్రాహ్మణాల పేర్లు శిశుబ్రాహ్మణం, మూర్తామూర్త బ్రాహ్మణం. రెండవ బ్రాహ్మణంలో ప్రాణం గురించి వివరణ ఉంటుంది. మూడవ బ్రాహ్మణంలో మొత్తం ప్రపంచం రెండుగా విభజించబడింది. మూర్తప్రపంచం, అమూర్తప్రపంచం – అంటే రూపం ఉన్న, కంటికి కనబడే,స్థూలప్రపంచం; అమూర్తప్రపంచం అంటే రూపం లేని, కంటికి కనబడని, సూక్ష్మప్రపంచం. ప్రపంచం మొత్తం మూర్తామూర్తప్రపంచం.

మూర్తప్రపంచానికి ఉన్న నాలుగుపేర్లలో 'సత్' ఒకటి; అమూర్త ప్రపంచానికి ఉన్న నాలుగు పేర్లలో 'త్యత్' ఒకటి – సత్+త్యత్ కలిపితే సత్యం అవుతుంది. మొత్తం సత్+త్యత్= సత్యమ్.

ప్రపంచం సత్యం అయితే సత్యంకి ఇంకొక అర్థం మూర్తామూర్తప్రపంచం. శిశుబ్రాహ్మణంలో ప్రాణం స్థూల, సూక్ష్మశరీరం అని వస్తుంది. స్థూల, సూక్ష్మశరీరం మూర్తామూర్తాత్మకం అని మూర్తామూర్త బ్రాహ్మణంలో వస్తుంది. మూర్తామూర్త ప్రపంచం సత్యం. ఈ విధంగా మొదటి సత్యం – ప్రాణా వై సత్యం నిరూపించబడుతుంది. మూర్తామూర్త బ్రాహ్మణం చివర్లో రెండవ సత్యం అంటే సత్యస్య సత్యం నిర్వచనం వస్తుంది. అది

మూర్తామూర్త సత్యస్య, మూర్తామూర్త ప్రపంచస్య సత్యస్య, స్థూల, సూక్ష్మశరీరాత్మక సత్యస్య సత్యమ్.

మొదటి సత్యాన్ని మిథ్యగా నిషేధించటంద్వారా రెండవ సత్యాన్ని వెలిబుచ్చటం జరుగుతుంది. దీన్ని నేతి–నేతి పద్ధతి అంటారు. మొదటి సత్యంలో రెండు భాగాలు ఉన్నాయి. మూర్తప్రపంచం, అమూర్తప్రపంచం. ఆ రెండింటినీ మిథ్యగా నిషేధిస్తే మిగిలేది కేవలం ఆత్మే. వాటిని తోసిపుచ్చుతున్నాము కాబట్టి నేతి నేతి అంటున్నాము. నేతి అంటే న యితి – న అంటే నిషేధం. మూర్తామూర్త ప్రపంచాన్ని వ్యావహారిక సత్యంగా నిషేధిస్తే, నిషేధింపబడని దానిగా, పారమార్థిక సత్యం మిగులుతుంది. అందువల్ల ఈ రెండు బ్రాహ్మణాలలో బోధ మూడు దశల్లో సాగుతుంది.

1. ప్రాణం = స్థూల, సూక్ష్మశరీరం.
2. స్థూల, సూక్ష్మశరీరం = మొదటి సత్యం
3. మొదటి సత్యంనుంచి రెండవ సత్యానికి వెళ్ళటం.

ఈ నేపథ్యంలో శిశు బ్రాహ్మణములో అడుగుపెడదాము. ప్రాణానికి మూడు అర్థాలున్నాయి.

1. మామూలుగా ప్రాణం అంటే పంచప్రాణాలు లేదా ముఖ్యప్రాణాలు.
2. పంచకర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలను కూడా ప్రాణాలు అంటారు.

దీనికి ఈ ఉపనిషత్తులోనూ, ఛాందోగ్యోపనిషత్తులోనూ ఒక కథ చూస్తాము. ప్రాణానికి శ్రేష్ఠం, జ్యేష్ఠం అని రెండు గుణాలుంటే ఇంద్రియాలకు ఒక్కొక్కటే ఉంటాయి. ప్రాణం గొప్పదనమేమిటి, మా తక్కువేమిటి అని అవి బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకుంటే, మీరు ఒక్కొక్కళ్ళూ ఒక సంవత్సరం పాటు బయటకు వెళ్ళిచూడండి అన్నాడు. అలా అవి వెళ్లినా ఏమీ మార్పులేదు కాని, ప్రాణం వెళ్ళటానికి లేవబోతుంటేనే ఇంద్రియాలశక్తి కూడా క్షీణించసాగింది. అప్పుడు అవి ప్రాణాన్ని వెళ్ళవద్దని బ్రతిమాలుకుని, వాటికున్న గుణాలను కూడా ప్రాణానికి ధారపోశాయి. అంతేకాదు వాటి పేర్లను కూడా ధారపోసాయి. 'ఇకమీదట మా పేరు ఇంద్రియాలు కాదు, ప్రాణాలు" అన్నాయి. అందుకే ముండకంలో ఇంద్రియాలను ప్రాణాలుగా వ్యవహరిస్తారు.

3. స్థూల, సూక్ష్మశరీరం.

తైత్తిరీయోపనిషత్తులో ప్రాణానికీ, శరీరానికీ మధ్య ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం చూస్తాము. ప్రాణంవల్లే శరీరానికి చేతనశక్తి, క్రియాశక్తి సమకూరుతాయి. ఇంకో కోణంలో చూస్తే ప్రాణశక్తి శరీరం అనే పెట్టెలో ఉన్నప్పుడే వ్యవహారం నడపగలుగుతుంది. ప్రాణశక్తిలో ఇంద్రియాలు కూడా వస్తాయని ముందే చూశాము.

ఈ బ్రాహ్మణంలో స్థూల, సూక్ష్మశరీరం అర్థం వస్తుంది. దీన్ని కార్యకరణసంఘాతము అని కూడా అంటారు. ఇంగ్లీషులో బిఎమ్ఎస్ (బాడీ–మైండ్–సెన్స్ కాంప్లెక్స్) అంటారు. ఈ బ్రాహ్మణంలో కూడా ప్రాణానికి ఒక రహస్యనామం వాడుతున్నది శ్రుతి. అంతకు ముందు ఆత్మకు రహస్యనామం సత్యస్య సత్యం అని చూశాము. ఇప్పుడు ప్రాణానికి రహస్యనామం **శిశువు**. రహస్యనామాలు అర్థమయితే, బ్రాహ్మణము తేలికగా అర్థమవుతుంది.

శిశువు అంటే పిల్లవాడు. భాష్యకారులు వత్సః లేదా దూడ అని అర్థం చెబుతారు. అందువల్ల శిశు బ్రాహ్మణము అంటే ప్రాణ బ్రాహ్మణమే.

శిశువుతో ప్రాణాన్ని ఎందుకు పోల్చింది ఉపనిషత్తు? శంకరులవారు దానికి విశ్లేషణ యిస్తారు. చిన్నపిల్లవానికి రాగద్వేషాలు ఉండవు. అందువల్ల వాటిద్వారా ఏర్పడే బాహ్యవిషయాలమీద ఆసక్తి కూడా ఉండదు. అలాగే ప్రాణానికి కూడా రాగద్వేషాలు ఉండవు. ప్రాణాన్ని 'శుద్ధం' అంటారు. రాగద్వేషాలు, బాహ్యవిషయాలమీద ఆసక్తి ఇంద్రియాలకే ఉంటాయి. ప్రాణం రాగిలోనూ, విరాగిలోనూ ఒక్కలాగే ఉంటుంది. కర్మేంద్రియాలు నిరంతరం పనిచేస్తూనే ఉంటాయి.

బృహదారణ్యకంలోనే మొదటి అధ్యాయంలో ఈ విషయం వచ్చింది. శుద్ధి, అశుద్ధి ఇంద్రియాలకు చెందుతుంది కాని ప్రాణానికి అంటదు. ప్రాణం శుద్ధం. అందువల్ల ప్రాణాన్ని అలాంటి శుద్ధమైన శిశువుతో పోల్చింది ఉపనిషత్తు. ప్రాణం గురించి కొన్ని అంశాలు చెప్పి, చివరికి ప్రాణం కార్యకరణసంఘాతం అని నిరూపిస్తుంది.

మంత్రం 2.2.1

**యో హ వై శిశుగ్ం సాధానగ్ం సప్రత్యాధానగ్ం సస్థూణగ్ం సదామం వేద సప్త హ ద్విషతో భ్రాతృవ్యానవరుణద్ధి ॥**
**అయం వావ శిశుర్యో౽ యం మధ్యమః ప్రాణస్తస్యేదమేవాధానమిదం ప్రత్యాధానం ప్రాణః స్థూణాన్నం దామ ॥**

ఈ మంత్రం సారాంశాన్ని చూద్దాము. ప్రాణాన్ని శిశువుతో పోల్చింది. శిశువు అంటే దూడగా తీసుకుంటాము. దూడకు సంబంధించి నాలుగు అంశాలు ఉంటాయి. ఆధానం, ప్రత్యాధానం, స్థూణం, దామం.

ఆధానం అంటే దూడ ఉండే చావడి. దూడ ఆ చావడి అంతటా ఉండదు కదా! ఒకచోట ఉంటుంది. అది ఉండే ఒక ముఖ్యమైన చోటును ప్రత్యాధానం అంటారు. దాన్ని ఒక దుంగకు ఆ ముఖ్యమైన చోట కట్టేస్తారు. దాన్ని స్థూణం అంటారు. ఆ స్థూణానికి కట్టే తాడును దామం అంటారు.

ఇప్పుడు ప్రాణం విషయానికొస్తే ప్రాణం శరీరంలో ఉంటుంది కాబట్టి, శరీరాన్ని ఆధానం అంటారు. ప్రాణం శరీరం అంతటా ఉన్నా అది ప్రత్యేకంగా కనబడే ప్రత్యేకమైన ప్రాంతం ఉంది శరీరంలో. అది తల. ఎందుకంటే ప్రాణం ఏడు ఇంద్రియాల రూపంలో తలలో ఉంది. ఏమిటది? రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒకనోరు. అందువల్ల తలను ప్రత్యాధానం అంటారు. దూడ పారిపోకుండా దుంగకు కట్టినట్టుగా, ప్రాణం శరీరంనుంచి వెళ్ళిపోకుండా ఉండాలంటే దానికి బలం కావాలి. అందువల్ల ప్రాణశక్తి స్థూణం. దుంగకు కట్టి వేసే తాడు, దామం . ప్రాణానికి బలాన్నిచ్చేది అన్నం. అందువల్ల అన్నం దామం. అన్నం సమృద్ధిగా తింటేనే ప్రాణశక్తి నిలుస్తుంది. ఇప్పుడు వీటినే ఒక పట్టికలో చూద్దాము.

| | **దూడ (శిశువు)** | **ప్రాణం** |
|---|---|---|
| 1. ఆధానమ్ | చావడి | శరీరం |
| 2. ప్రత్యాధానమ్ | ఒక ప్రత్యేక ప్రదేశం | తల |
| 3. స్థూణమ్ | దుంగ | ప్రాణశక్తి |
| 4. దామమ్ | తాడు | అన్నం |

ఇక్కడ ఉపనిషత్తు దీన్ని ఒక ఉపాసనగా కూడా సూచిస్తున్నది.

**యథా యథోపాసతే తదేవ భవతి**

ఎలా ఉపాసన చేస్తే అలా ఫలం దక్కుతుంది. రాగద్వేషాలు లేని అమాయక శిశువుమీద ఉపాసన చేస్తే, ఉపాసకుడు కూడా శిశువంత అమాయకుడవుతాడు. గుర్తుంచుకోండి, శిశువంత అమాయకుడవుతాడు కాని అజ్ఞాని కాడు. అంటే శిశువులాగా శుద్ధ అంతఃకరణ పొందుతాడు.

అందువల్లనే, జ్ఞానిని శిశువుతో పోలుస్తారు. మనం చిన్నపిల్లలుగా ఉండగా, మనసారా నవ్వుతాము. ప్రతి చిన్నవిషయం కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. వయస్సు పెరిగే కొద్దీ, నవ్వటం, అది కూడా మనసారా

నవ్వటం, మర్చిపోతాము. మళ్ళీ జ్ఞానిగా ఎదిగితే, మర్చిపోయిన అమాయకత్వంలోకి మళ్ళీ వెళతాము. ఈ ఉపాసన రాగద్వేషాలను పారద్రోలి, అమాయకత్వాన్ని వెనక్కి తీసుకువస్తుంది. ఇంకోమాటలో చెప్పాలంటే ఇంద్రియ జయం కలుగుతుంది. ఇంద్రియాలే మన శత్రువు. అవి ఎంతసేపూ పాపకర్మలు చేస్తూ, మనను నరకానికి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తాయి. ఇంద్రియాలు బాహ్యాముఖంగా ఉంటాయి కాబట్టి, అవి మనకు శత్రువులు. ఈ ఉపాసన వాటిని జయించటానికి తోడ్పడుతుంది.

## మంత్రం 2.2.2

**తమేతాస్సప్తాక్షితయ ఉపతిష్ఠంతే తద్యా ఇమా అక్షన్ లోహిన్యో రాజయస్తాభిరేనగ్ం రుద్రోఽన్వాయత్తోఽథ యా అక్షన్నాపస్తాభిః పర్జన్యో యా కనీనకా తయాఽఽదిత్యో యత్కృష్ణం తేనాగ్నిర్యచ్ఛుక్లం తేనేంద్రోఽధరయైనం వర్తన్యా పృథివ్యన్వాయత్తా ద్యౌరుత్తరయా నాస్యాన్నం క్షీయతే య ఏవం వేద ॥**

ఈ మంత్రంలో ప్రాణస్తుతి జరుగుతున్నది. వ్యష్టిపరంగా ప్రాణం అయితే, అది సమష్టిపరంగా హిరణ్యగర్భ; వ్యష్టిపరంగా సూక్ష్మశరీరం అయితే సమష్టి పరంగా సూక్ష్మప్రపంచం అని మర్చిపోకూడదు. ఇప్పుడు ఆ ప్రాణాన్ని దేవతలు పూజిస్తున్నట్టుగా వర్ణిస్తున్నది. ఎలా పూజిస్తున్నారు? అనేక కానుకలను ఇవ్వటంద్వారా. ఎక్కడ పూజిస్తున్నారు? ఇంతకుముందు మంత్రంలో ప్రాణశక్తి ప్రత్యేకంగా ఉండే స్థానం తల అని చూశాము కదా. అందువల్ల ప్రత్యాధానం అయిన తల ప్రాణానికి విశేషస్థానం. తలలో కూడా కళ్ళు చాలా ముఖ్యం. మనం పొందే జ్ఞానంలో 90 శాతం జ్ఞానాన్ని కళ్ళద్వారా పొందుతాము. అందువల్లనే మన చిన్నారులను మనసారా 'కన్నా' అని పిలుచుకుంటాము. అంతేకాదు, కళ్ళలో కూడా కుడికన్ను ఇంకా శక్తివంతమైనది, శాస్త్రం ప్రకారం. అందువల్ల ప్రాణశక్తి శరీరంలో ఉంది; అది కూడా తలలో ఉంది; తలలో కూడా కళ్ళలో ఉంది; అది కూడా కుడికన్నులో ఉంది.

నిజానికి పరమాత్మ అంతటా ఉన్నా కూడా, ఒక ప్రత్యేకమైన గుడికి, ప్రత్యేకమైన ద్వారంలో వెళ్ళి, గర్భగుడిలో ఉన్న పరమాత్మను ఆరాధిస్తాము. అలాగే దేవతలు, ప్రాణాన్ని కళ్ళద్వారా ఉపాసిస్తున్నారు. ఉన్నదొకటే కన్ను. అక్కడ కూడా పోటీ వస్తున్నది. అందువల్ల ఏడుగురు దేవతలు కంటిలోని ఏడు భాగాలను ఉపాసన చేస్తున్నారు.

రుద్రుడు కంటిలోని ఎఱ్ఱభాగాన్ని పూజిస్తున్నాడు. కొంతమంది కళ్ళలో రక్తనాళాలు ఎఱ్ఱగా కనిపిస్తాయి చూడండి అవి. పర్జన్యదేవత (వరుణదేవుడు) కంటినీరును పూజిస్తున్నాడు. కంటిలో నీరు ఎప్పుడూ ఉండాలి. కంటిలో తేమ ఆ నీటివల్లే ఉంటుంది. మూడవ దేవత ఆదిత్యుడు.ఆయన కనుపాపను పూజిస్తున్నాడు. కనుపాప అంటే కంటిలోని నల్లగుడ్డులో ఉన్న చిన్న రంధ్రం. దానిద్వారానే మనం చూడగలుగుతాము.

అగ్నిదేవత కంటిలోని నల్లగుడ్డును అంటే కృష్ణభాగాన్ని; ఇంద్రదేవత శుక్లభాగాన్ని లేదా తెల్లగుడ్డును పూజిస్తారు. పృథివీ దేవత కింద కనురెప్పను; స్వర్గలోకదేవత పై కనురెప్పను పూజిస్తారు. ఆ విధంగా ఏడుగురు దేవతలు, ప్రాణశక్తిని, కంటిలోని ఏడు భాగాలద్వారా పూజిస్తారు.

| | |
|---|---|
| దేవత | – కన్నులోని భాగం |
| రుద్రుడు | – ఎఱ్ఱ రక్తనాళాలు |
| పర్జన్యుడు | – నీరు |
| ఆదిత్యుడు | – కనుపాప |
| అగ్ని | – కృష్ణభాగం |
| ఇంద్రుడు | – శుక్లభాగం |
| భూమి | – క్రింది కనురెప్ప |
| స్వర్గలోకదేవత | – పై కనురెప్ప |

ఈ ప్రార్థనద్వారా దేవతలందరూ ప్రాణశక్తికి బలాన్నిస్తారు. దానికి ప్రతిఫలంగా ప్రాణశక్తి వారిని దీవిస్తుంది. ఇవి ఆత్మజ్ఞానానికి సంబంధించినవి కావు. కాని తర్వాత రాబోయే జ్ఞానానికి పునాది రాళ్ళు. ఇక్కడ కూడా మంద, మధ్యమ అధికారులకు ఉపాసనలను సూచిస్తున్నది ఉపనిషత్తు. ఈ ఉపాసకుని శక్తికి లోటు ఉండదు. అన్నానికి కొదవ ఉండదు.

రాబోయే మంత్రంలో ఉపనిషత్తే ఒక మంత్రాన్ని ఉటంకిస్తుంది.

## మంత్రం 2.2.3

**తదేష శ్లోకో భవతి । అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నస్తస్మిన్ యశో నిహితం విశ్వరూపమ్। తస్యాఽఽ ఉసత ఋషయస్సప్త తీరే వాగష్టమీ బ్రహ్మణా సంవిదానేతి । అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్న ఇతీదం తచ్ఛిర ఏష హ్యర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నస్తస్మిన్ యశో నిహితం విశ్వరూపమితి ప్రాణా వై యశో విశ్వరూపం ప్రాణానేతదాహ తస్యాసత ఋషయస్సప్త తీర ఇతి ప్రాణా వా ఋషయః ప్రాణానేతదాహ వాగష్టమీ బ్రహ్మణా సంవిదానేతి వాగ్ఘ్యష్టమీ బ్రహ్మణా సంవిత్తే ॥**

ముందు మంత్రంలో దేవతలు అందరూ ప్రాణశక్తిని ఎలా ప్రార్థించారో చూశాము. ఇప్పుడు ప్రాణంయొక్క గొప్పతనాన్ని సూచించే మంత్రాన్ని చూస్తాము. ముందు ప్రాణం అంటే ఇంద్రియాలు అంది. ఇప్పుడు ఇంద్రియ శక్తివల్లనే ప్రాణశక్తి ఉంది అంటున్నది. అంటే ప్రాణశక్తి ఇంద్రియ శక్తిద్వారా తెలుస్తుంది అంటున్నది.

**తదేష శ్లోకో భవతి** – దీని గురించి వేదపూర్వభాగంలోని మంత్రాన్ని చెప్పటమే కాక, దాని అర్థాన్ని కూడా ఇస్తున్నది ఉపనిషత్తు.

ఈ మంత్రం పూర్తిగా ఊహాజనితమైనది. దానికి ఉపనిషత్తు వివరణ ఇవ్వకపోతే అర్థం కావటం కష్టం. ఈ మంత్రం యజ్ఞంలో వాడే చమసపాత్రతో మన తలను పోలుస్తున్నది. అందులో సోమరసంలాంటివి పోసి తర్వాత వాటిని ఆహుతులుగా అగ్నిలో పోస్తారు.

**అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్న స్తస్మిన్ యశో నిహితం విశ్వరూపమ్** – ఆ పాత్ర ఎలా ఉంది? క్రిందివైపు నోరు, పైకి మట్ట ఉంది దానికి. ఎందుకంటే మన తలలో నోరుకూడా కిందివైపుకు ఉంది. చమసపాత్రలో ఉన్న సోమ రసాన్ని ఏడు ఇంద్రియాలతో పోల్చింది. సోమరసంతో సోమయాగం చేసే వ్యక్తిని సోమయాజి అంటారు. అతనికి బాగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. అలాగే మన ఇంద్రియాలు కూడా మనకు పేరు ప్రఖ్యాతులు తెస్తాయి. ఎలా? విజ్ఞానంద్వారా. ఇంద్రియాలద్వారా మనం జ్ఞానం, ప్రజ్ఞ పొందుతాము. ఒక శాస్త్రజ్ఞుడు పేరు ప్రఖ్యాతుల పొందినా, ఒక వైణికుడు పేరు ప్రఖ్యాతులు పొందినా అది వారి ఇంద్రియ శక్తివల్లనే అయ్యింది.

**తస్యాఽ ఽ సత ఋషయస్సప్త తీరే** – ఇంద్రియాలద్వారా జ్ఞానం పొంది, పేరు పొందుతారని చూశాము. ఇప్పుడు ఇంద్రియాలను సప్తఋషులతో పోలుస్తున్నది ఉపనిషత్తు. ఐదు ఇంద్రియాలను సప్తప్రాణాలు అని కూడా అంటారు. అవి – రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కుపుటాలు, ఒక నోరు. ఋషి అంటే జానాతి ఇతి ఋషి – జ్ఞానం ఉన్న వ్యక్తిని ఋషి అంటారు. ఇంద్రియాలు కూడా అనేక విషయాలను తెలుసుకుని జ్ఞానం పొందుతాయి కాబట్టి వాటిని ఋషులు అంటున్నది.

**వాగష్టమీ బ్రహ్మణా సంవిదానేతి** – ఋషులు చమసపాత్ర పైవైపు ఉన్నారు. సప్తఋషులతో పాటు ఇంకో ఋషి ఉన్నాడు. ఆ అష్టమఋషి పేరు వాక్కు. వాక్కును గొప్పగా ఎందుకు చెబుతున్నది? సప్త ఇంద్రియాలను చూసేశాము కదా అంటే అక్కడ రుచిచూసే నోరు అంటే అక్కడ జ్ఞానేంద్రియంగా చెప్పబడింది. ఇక్కడ కర్మేంద్రియాలుగా చెప్పబడింది. ఇక్కడ మాట్లాడే నోరు.
**వాగ్ఘ్యష్టమీ బ్రహణాసంవిత్తే** – ఇది వేదాలను పలుకుతుంది కాబట్టి గొప్పదయింది. బ్రహ్మ అంటే ఇక్కడ వేదాలు.

ఆ విధంగా, క్రిందవైపు నోరు ఉన్న ఆ చమస పాత్రలో ఎనిమిది అంశాలు ఉన్నాయి. ఆ విధంగా ప్రాణం గొప్పది. అది పేరు ప్రఖ్యాతులు తెస్తుంది. ఋషులతో పోల్చబడింది.

## మంత్రం 2.2.4

**ఇమావేవ గోతమభరద్వాజావయమేవ గోతమోఽయం భరద్వాజ ఇమావేవ విశ్వామిత్రజమదగ్నీ అయమేవ విశ్వామిత్రోఽయం జమదగ్నిరిమావేవ వసిష్ఠకశ్యపావయమేవ వసిష్ఠోఽయం కశ్యపో వాగేవాత్రిర్వాచా హ్యన్నమద్యతేఽత్తిర్హ వై నామైతద్యదత్రిరితి సర్వస్యాత్తా భవతి సర్వమస్యాన్నం భవతి య ఏవం వేద ॥**

ఈ ఏడు ఇంద్రియాలను సప్తఋషులతో పోల్చిందని చూశాము కదా! ఇప్పుడు ఉపనిషత్తు ఆ ఋషుల పేర్లను చెబుతున్నది. దీన్నిబట్టి మన ఇంద్రియాలు పవిత్రమైనవనీ, వాటి కీర్తిని మనం గుర్తించాలనీ తెలుస్తున్నది. కాని వాటి కీర్తిని, అవి పని చేయటం మానేసినప్పుడు, అంటే ఆలస్యంగా గుర్తిస్తాము. అందుకే అవి బాగా పనిచేసేటట్టుగా ఉన్నప్పుడే వాటి గొప్పతనాన్ని గుర్తించమంటున్నది ఉపనిషత్తు. వీటిని గుర్తించే పద్ధతి వీటిమీద ఉపాసన చేయటం. ఆ ఋషులు ఎవరు?

**ఇమావేవ గోతమభరద్వాజావయమేవ గోతమోఽ యం భరద్వాజ** – ఈ రెండే (చెవులు) గౌతమ, భారద్వాజులు. ఇదియే (ఈ చెవి) గౌతముడు, ఈ చెవి భరద్వాజుడు. ఏ చెవి ఎవరు? ఏదన్నా తీసుకోవచ్చు. కుడినుంచి మొదలుపెడితే గౌతముడు కుడిచెవి, భరద్వాజ ఎడమచెవి.

**ఇమావేవ విశ్వామిత్రజమదగ్నీ అయమేవ విశ్వామిత్రోఽ యం జమదగ్నిః** – ఈ రెండే (కళ్ళు) విశ్వామిత్ర, జమదగ్నులు. ఈ కన్ను విశ్వామిత్రుడు. ఈ కన్ను జమదగ్ని.

**ఇమావేవ వసిష్ఠ కశ్యపావయమేవ వసిష్ఠోఽ యం కశ్యపః** – ఈ రెండే (ముక్కుపుటాలు) వసిష్ఠ, కశ్యపులు. ఇది వసిష్ఠుడు, ఇది కశ్యపుడు.

**వాగేవాత్రిర్వాచా హ్యన్నమద్యతేఽ త్తిర్హ వై నామ** – ఇంతకుముందు నోరును రెండుగా చూశాము. రుచి చూసే నోరు, మాట్లాడే నోరు. మాట్లాడే నోరును కర్మేంద్రియం అన్నాము. ఇక్కడ అష్టమ ఇంద్రియంగా పేర్కొన్న వాక్కు గురించి వదిలేసి, రుచిచూసే నోరును గురించి చెబుతున్నది. దాన్ని అత్రిఋషితో పోలుస్తున్నది. అన్నం తినేది వాగింద్రియంతోనే కదా! అందువల్ల తినేది కాబట్టి అతిః అనే పేరు నిశ్చయంగా ప్రసిద్ధమైనది. అద ధాతువుకు తినటం అని అర్థం.

ఉత్తమ అధికారి సత్యస్య సత్యం అనే నిర్వచనంలోని మొదటి సత్యం ప్రాణం అని అర్థం చేసుకుని, తర్వాత రెండవ సత్యానికి వెళ్ళాలి. ముందు మనం ప్రథమ సత్యాన్ని విశ్లేషిస్తున్నాము. ఇది అర్థం చేసుకోలేని మధ్యమ, మంద అధికారులు ఉంటే వారు ఇంద్రియాలను సప్తఋషులుగా భావించి, వాటిమీద ఉపాసన చేయాలి. వారు ప్రాణాలే సత్యం అని అర్థం చేసుకుంటే చాలు. అది ఎలా అర్థం చేసుకుంటారు? ఋషి ఉపాసన చేయటంద్వారా.

**ఏతద్యదత్రిరితి సర్వస్యాత్తా భవతి సర్వమస్యాన్నం భవతి య ఏవం వేద** – ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తారో, వారు సకలమైన అన్న సముదాయాన్ని తింటారు. సర్వం అతనికి అన్నం అవుతుంది. విషం కూడా అతనినేమీ చేయలేదు. ఎటువంటి అన్నం కూడా అతనికి హాని చేయదు.

అతనికి అంతా అన్నం అవుతుంది అంటే అతను ఎవరికీ అన్నం అవడు అని కూడా అర్థం అంటారు భాష్యకారులు.

దీనితో శిశుబ్రాహ్మణం అయిపోయింది. ఇందులో సత్యస్య సత్యంలోని మొదటి సత్యం అయిన ప్రాణం గొప్పతనం చూశాము. ప్రాణానికి మూడు అర్థాలు ఉన్నాయనీ, మూడవ అర్థాన్ని ఈ సందర్భంలో తీసుకోవాలనీ కూడా చూశాము. మూడవ అర్థం కార్యకరణసంఘాతం.

# 2.3 - మూర్తామూర్త బ్రాహ్మణము

మూడవ బ్రాహ్మణాన్ని మూర్తామూర్త బ్రాహ్మణము అంటారు. మంత్రాలలోకి వెళ్ళేముందు, ఈ బ్రాహ్మణము సారాంశం చూద్దాము.

బ్రహ్మనిర్వచనం - సత్యస్య సత్యం. అంటే ఇక్కడ రెండు సత్యాలు ఉన్నాయి. మొదటి సత్యాన్ని ప్రాణం అంటారని కూడా చూశాము. ఉపనిషత్తే అంది - **ప్రాణా వై సత్యమ్** (2.1.20) ప్రాణం అంటే ఏమిటి? శిశు బ్రాహ్మణములో ప్రాణం అంటే కార్యకరణసంఘాతం అని చూశాము.

ఇప్పుడు ఈ బ్రాహ్మణము రెండు ముఖ్యమైన పనులు చేయాలి.

1. ప్రాణం సత్యం అని నిరూపించాలి.
2. ఎందుకు ప్రాణాన్ని సత్యం అంటున్నదో చూపించాలి.

ఇంకో విధంగా చెప్పాలంటే కార్యకరణసంఘాతాన్ని, లేదా దేహేంద్రియ మనోబుద్ధులను ఎందుకు సత్యం అంటున్నదో చూపించాలి. ఈ బ్రాహ్మణం చాలా ముఖ్యమైంది. ఎందుకంటే మూర్తామూర్త బ్రాహ్మణం లేకపోతే, ప్రాణా వై సత్యం పెద్ద అయోమయానికి దారి తీయవచ్చు.

ప్రాణా వై సత్యం అంటే కార్యకరణసంఘాతం సత్యం అని అర్థం కదా! సత్యం అంటే నిజం. అందువల్ల దీని అర్థం అక్షరాలా తీసుకుంటే కార్యకరణసంఘాతం నిజం అవుతుంది. ఎప్పుడైతే కార్యకరణసంఘాతం నిజం అవుతుందో, అప్పుడే జగత్తు కూడా నిజం అంటే సత్యం అవుతుంది. ఎందుకంటే జగత్తు కూడా కార్యకరణ సంఘాతమే. వ్యష్టిపరంగా స్థూల, సూక్ష్మశరీరాలు అంటే సమష్టిపరంగా స్థూల, సూక్ష్మప్రపంచాలు అంటాము.

స్థూల, సూక్ష్మ ప్రపంచాల సంఘాతమైన ఈ జగత్తు సత్యం అయితే, అద్వైతం కూకటి వేళ్ళతో సహా కొట్టుకుపోతుంది. ఎందుకు? అద్వైతంలో ప్రధాన అంశం జగత్ మిథ్య. శిశుబ్రాహ్మణం ప్రకారం ప్రాణం సత్యం. ప్రాణం అంటే వ్యష్టిపరంగా స్థూల, సూక్ష్మశరీరాలు, సమష్టిపరంగా స్థూల, సూక్ష్మప్రపంచాలు. అంటే జగత్తు సత్యం అని చెప్పినట్టవుతుంది.

విశిష్టాద్వైతం, ద్వైతం జగత్తు సత్యం అంటుంది. అద్వైతం మిథ్య అంటుంది. ఇలా రెండు వాదనలు ఉన్నప్పుడు ఎవరిది సరియైనదని ఎవరు నిర్ణయించగలరు? మానవమాత్రుడెవరూ చెప్పలేరు. శాస్త్రమే అంతిమ తీర్పునివ్వాలి. శాస్త్రం తీర్పేమిటి?

తక్కినవారు ఈ శిశుబ్రాహ్మణాన్ని చూపించి ఇదుగో ప్రాణం సత్యం అంటున్నది కాబట్టి జగత్తు సత్యం అని వాదిస్తారు. పైపెచ్చు శాస్త్రమే చెబుతున్నప్పుడు అద్వైతం ఎలా నిర్దాక్షిణ్యంగా జగత్తును మిథ్య అని తోసివేయగలుగుతోందని వారి వాదన. అద్వైతులు ఓడిపోకుండా, నిలదొక్కుకోవటానికి ఆధారం యిదుగో ఈ మూర్తామూర్త బ్రాహ్మణం. అదెలాసాధ్యం?

ముందు అధ్యాయంలో ప్రాణం సత్యం అంది నిజమే కాని, ఇక్కడ సత్యం అంటే ఏమిటో చెబుతున్నది. ద్వైతం, విశిష్టాద్వైతం ప్రకారం సత్యం అంటే నిజం. అందువల్ల వారు జగత్తు మిథ్య కాదు, నిజం అంటారు. కాని మూర్తామూర్త బ్రాహ్మణం ప్రకారం సత్యం అర్థం నిజం కాదు. నిజం కాకపోతే వేరే అర్థం ఏమిటి?

సత్యం అంటే మూర్తామూర్తాత్మకం. అంటే మూర్తప్రపంచం+అమూర్తప్రపంచం. అదెలా సత్యం? సత్ అంటే మూర్త అంశం. త్యత్ అంటే అమూర్త అంశం. రెండూ కలిపి సత్యం అంటే మూర్తామూర్తప్రపంచం. ఇప్పుడు దశలు చూద్దాము.

| | |
|---|---|
| సత్యస్య సత్యమ్ | = ప్రాణానాం సత్యమ్ |
| ప్రాణానాం సత్యమ్ | = కార్యకరణసంఘాతస్య సత్యమ్ |
| కార్యకరణసంఘాతస్య సత్యమ్ | = మూర్తామూర్తప్రపంచస్య సత్యమ్ |

అందువల్ల సత్యం అంటే నిజం కాదు, సత్యం అంటే మూర్తామూర్తప్రపంచం అని అర్థం. ప్రపంచం అంటే మూర్తామూర్తప్రపంచం అవనీ! సత్ అంటే మూర్తప్రపంచం. త్యత్ అంటే అమూర్తప్రపంచం అన్నారు బాగానే ఉంది. కాని సత్యం అంటే మూర్తామూర్తప్రపంచం అని అర్థం చెప్పినంతమాత్రాన అది అసత్యం ఎలా అవుతుంది? అది నన్ను ఖండించటం మాట అలా ఉంచి, మీకెలా తోడ్పడుతుంది? దీనివల్ల జగత్తు మిథ్య అని ఎలా చెప్పగలరు అంటారు తక్కినవారు.

శంకరులవారు, నిజమే ఉపనిషత్తు ప్రత్యక్షంగా మూర్తామూర్తప్రపంచం అసత్యం అని తోసివేయదు, కాని పరమాత్మను చూపించటానికి, మూర్తామూర్తప్రపంచాన్ని తోసివేస్తుంది అంటారు. 'నేతి, నేతి' అనే ప్రముఖ పదాలద్వారా మూర్తామూర్తప్రపంచాన్ని లేదంటుంది. పరమాత్మ **సత్యస్య సత్యం.** ప్రపంచాన్ని తోసివేయటం ద్వారా అది మిథ్య అని నిరూపించబడింది. ఎందుకంటే దేన్నైతే కాదనగలమో అది మిథ్య. ఆ విధంగా మూర్తామూర్తప్రపంచం అసత్యం.

ఆ విధంగా ఈ బ్రాహ్మణం మూర్తామూర్తప్రపంచం గురించి చెప్పి, తర్వాత దాన్ని ఖండించటంతో, అధ్యారోప – అపవాద న్యాయానికి ఈ బ్రాహ్మణం అద్భుతమైన ఉదాహరణ. అందువల్ల ఇది చాలా ప్రాముఖ్యత సంతరించుకున్న బ్రాహ్మణం కూడా. అధ్యారోప అపవాదంద్వారా శ్రుతి జగత్తు మిథ్య అని నిరూపిస్తుంది.

మొదటి భాగం మూర్త అమూర్తప్రపంచాన్ని పరిచయం చేస్తే, చివరి భాగం నేతి–నేతి పదాలద్వారా దాన్ని ఖండిస్తుంది. అధ్యారోప అపవాదం మూర్తామూర్తప్రపంచంద్వారా జరగటంవల్ల ఈ బ్రాహ్మణానికి మూర్తామూర్త బ్రాహ్మణం అని పేరు వచ్చింది.

ఈ మూర్తామూర్తప్రపంచాన్ని ఉపనిషత్తు రెండు భాగాలుగా విభజించింది. అధ్యాత్మస్థాయి, అధిదైవస్థాయి. అధిదైవస్థాయిలో ఆకాశం, వాయువు అమూర్తప్రపంచం; అగ్ని, జలం, పృథివి మూర్తప్రపంచం. అందువల్ల ప్రపంచం సత్+త్యత్ అంటే మూర్తామూర్తప్రపంచం అయింది. అలాగే వ్యష్టిపరంగా చూస్తే స్థూలశరీరం సత్ లేదా మూర్తం. సూక్ష్మశరీరం త్యత్ లేదా అమూర్తం. ఈ మూడూ బ్రాహ్మణాలూ కలిపి చూస్తేనే, ఆలోచనా పరంపర అర్థమవుతుంది. ఈ నేపథ్యంతో మొదటి మంత్రాన్నిచూద్దాము.

### మంత్రం 2.3.1

**ద్వే వావ బ్రహ్మణో రూపే మూర్తం చైవామూర్తం చ మర్త్యం చామృతం చ స్థితం చ యచ్చ సచ్చ త్యచ్చ ॥**

**రూపే** – ఈ పదాన్ని అక్షరాలా తీసుకుంటే ఆకారం. బ్రహ్మకు రెండు ఆకారాలు ఉన్నట్లు అర్థం వస్తుంది. బ్రహ్మకు రూపం లేదు. అందువల్ల రూపం అంటే ఆకారం అర్థం ఇక్కడ సరిపోదు. అందువల్ల శంకరులవారు యిక్కడ రూపే పదానికి లక్ష్యార్థం తీసుకున్నారు. ఏమిటది? బ్రహ్మస్వరూపాన్ని చూపించేది రూపం అన్నారు.

**ద్వే వావ బ్రహ్మణో రూపే** – బ్రహ్మస్వరూపాన్ని చూపించే ప్రమాణాలు రెండు ఉన్నాయి.ఏమిటవి?

**మూర్తం చైవామూర్తం చ** – అవి మూర్తం (రూపం కలది) – అమూర్తం (రూపం లేనిది). ఇవి బ్రహ్మను చూపించేవి అని ఎలా చెప్పగలము? ఎందుకంటే మూర్తామూర్తప్రపంచాన్నే అధ్యారోప, అపవాదానికి వాడింది ఉపనిషత్తు. అందువల్ల అది రూపం అయింది.

ఈ మూర్త అమూర్త జంటకు మరో మూడు పేర్లు ఇచ్చింది. ఏమిటవి?

**మర్త్యం చామృతం చ** – మూర్తం అంటే స్థూలమైనది. అమూర్తం అంటే సూక్ష్మమైనది. మర్త్యం అంటే మరణించేది, అమృతం అంటే మరణం లేనిది. అమృతం అంటే ఆత్యంతిక అమృతం కాదు. సాపేక్షిక అమృతం. స్థూలశరీరం మరణించాక కూడా సూక్ష్మశరీరం చాలా సుదీర్ఘమైన కాలం ఉంటుంది. ప్రళయంలో కూడా అవ్యక్తరూపంలో ఉంటుంది కాబట్టి అమృతం అన్నది. అందువల్ల మూర్తం మర్త్యం. అమూర్తం అమృతం.

**స్థితం చ యచ్చ** – స్థితం అంటే కదలనిది. యత్ అంటే కదిలేది. శంకరులవారు స్థితాన్ని పరిచ్ఛిన్నంగా వర్ణిస్తున్నారు. పరిచ్ఛిన్నం అంటే పరిమితమైనది. స్పష్టమైన పరిధులు ఉన్నది; యత్ అంటే అపరిచ్ఛిన్నం, పరిమితులు లేదా పరిధులు లేనిది. శరీరానికి పరిధి ఉంది కాని మనస్సుకు లేదు. శరీర కదలికలకు కొన్ని హద్దులు ఉన్నాయి కాని మనస్సుకు లేవు. మనస్సు ఎక్కడికన్నా వెళ్ళగలదు. అలాగని పూర్తిగా అపరిచ్ఛిన్నం కాదు. అలా పూర్తిగా అపరిచ్ఛిన్నం అయితే అది బ్రహ్మ అవుతుంది.

**సచ్చ త్యచ్చ** – అధిదైవపరంగా చూస్తే ఆకాశం, వాయువులకు హద్దులు లేవు. చివరి పదాలు సత్ చ, త్యత్ చ. ఈ రెండూ కలిపి సత్యం. అందువల్ల ఈ పదాలు చాలా ముఖ్యం. వీటి అర్థాలు ఏమిటి? శంకరులవారు సత్ అంటే ప్రత్యక్షగోచరం అనీ, త్యత్ అంటే అగోచరం లేదా ఇంద్రియ అగోచరం అనీ అంటున్నారు. స్థూలశరీరం ప్రత్యక్ష గోచరం అయితే సూక్ష్మశరీరం ఇంద్రియ అగోచరం.

అధిదైవపరంగా చూస్తే అగ్ని,జలం, పృథివి ప్రత్యక్ష గోచరం; ఆకాశం, వాయువు ఇంద్రియ అగోచరం. ఇవి బ్రహ్మరూపం. ఇకముందు అధిదైవ, అధ్యాత్మ విభజన వస్తుంది.

మంత్రం 2.3.2

**తదేతన్మూర్తం యదన్యద్వాయోశ్చాంతరిక్షాచ్చైతన్మర్త్యమేతత్ స్థితమేతత్సత్ ॥**

**తస్యైతస్య మూర్తస్యైతస్య మర్త్యస్యైతస్య స్థితస్యైతస్య సత ఏష రసో య ఏష తపతి సతో హ్యేష రసః॥**

అధిదైవ మూర్త అమూర్తప్రపంచాన్ని రెండు, మూడు మంత్రాల్లో చూస్తాము. ముందు మూర్తప్రపంచాన్ని చూస్తాము. అంటే ఈ మంత్రంలో అధిదైవమూర్తప్రపంచాన్ని చూస్తాము.

**తదేతన్మూర్తమ్** – ఇది మూర్తప్రపంచం.

**యదన్యద్వాయోశ్చాంతరిక్షాచ్చైతన్మర్త్యమేతత్** – ఆకాశం, వాయువుకు భిన్నంగా ఉన్న మూడూ అధిదైవమూర్తం. అవి అగ్ని, జలం, పృథివి. ఒక్కముక్కలో చెప్పాలంటే భూతత్రయం మూర్తం. మూడు భూతాలు మూర్తం. మూర్తం గురించి చెప్పిన మూడు పదాలనూ వాడింది ఉపనిషత్తు ఇక్కడ. ఇవి మర్త్యం, స్థితం, సత్.

ఈ భూతత్రయాత్మక ప్రపంచాన్ని అంటే అగ్ని, జలం, పృథివి ఉన్న ఈ మూర్తప్రపంచాన్ని ఒక్క ప్రతీకతో గుర్తుంచుకునేలా చేస్తున్నది ఉపనిషత్తు. ఈ మూడింటికీ కలిపి వాడిన ప్రతీక సూర్యమండలం.

**తస్యైతస్య మూర్తస్యైతస్య మర్త్యస్యైతస్య స్థితస్యైతస్య సత ఏష రసో య ఏష తపతి సతో హ్యేష రసః** – ఆకాశంలో ఏదైతే ప్రకాశిస్తున్నదో అదే ఈ మూడు భూతాలు లేదా మూర్త ప్రపంచానికి సారం.

ఏష రసో య ఏష తపతి – ఆకాశంలో తపిస్తున్న సూర్యుడు వీటి సారం.

ఛాందోగ్య ఉపనిషత్తులో సృష్టి ప్రకరణం గురించి చెప్పినప్పుడు, ఈ మూడు భూతాలనుంచే – అగ్ని, జలం, పృథివినుంచే – సృష్టి జరిగిందని వస్తుంది. ఈ మూడింటికీ ఎరుపు, తెలుపు, నలుపు రంగులను కూడా సూచిస్తుంది ఉపనిషత్తు. అవి వరుసగా ఎరుపు, తెలుపు, నలుపు. ప్రతికార్యం కూడా ఈ మూడు కారణాల సారం అని చెప్పటానికి ఛాందోగ్య ఉపనిషత్తు సూర్యుణ్ణి ఉదాహరణగా తీసుకుంది.

**యదాదిత్యస్య రోహితగ్ం రూపం తేజసస్తద్రూపమ్**

**యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్య...** – ఛాందోగ్యం 6.4.2

సూర్యునిలో ఎరుపురంగు ఏదైతే కలదో అది అగ్నితత్త్వం. తెలుపురంగు ఏదైతే కలదో, అది జలతత్త్వం. నలుపురంగు ఏదైతే కలదో అది పృథివితత్త్వం. అదే అర్థం ఇక్కడ కూడా. సూర్యమండలం మూర్తప్రపంచాన్ని సూచిస్తుంది. సతః అంటే తక్కిన మూడూ కూడా కలుపుకోవాలి. అవి – మూర్తం, మర్తం, స్థితం. ఇది మూర్తత్రయం. తర్వాత మంత్రంలో అధిదైవ అమూర్తప్రపంచం గురించి వస్తుంది.

మంత్రం 2.3.3

**అథామూర్తం వాయుశ్చాన్తరిక్షం చైతదమృతమేతద్యదేతత్త్యత్తస్యైతస్యామూర్తస్యైతస్యామృతస్యైతస్య యత ఏతస్య త్యస్యైష రసో య ఏష ఏతస్మిన్మణ్డలే పురుషస్త్యస్య హ్యేష రస ఇత్యధిదైవతమ్॥**

**అథామూర్తం వాయుశ్చాంతరిక్షం చ** – తర్వాత అమూర్తప్రపంచం వాయువు, ఆకాశం, భూతద్వయం అమూర్తప్రపంచం.

**ఏతదమృతమేతద్యదేతత్** – ఇది అమృతం, ఇది యత్, ఇది త్యత్.

**ఏతస్యామూర్తస్యైతస్యామృతస్యైతస్య యత ఏతస్య త్యస్యైష రసో య ఏష** – ఈ అమూర్తంయొక్క, ఈ అమృతం యొక్క, ఈ యత్‌యొక్క, ఈ త్యత్‌యొక్క సారం ఇతను. ఇతను ఎవరు?

**ఏతస్మిన్మండలే పురుషస్యస్య హ్యేష రస ఇత్యధిదైవతమ్** – సూర్యమండలంలో సూర్యదేవత శరీరం ఉంటుంది. దాన్ని సూర్యదేవత సూక్ష్మశరీరం అంటారు. మనం చూసేది ప్రకాశవంతమైన స్థూలశరీరం. సూర్యమండలం అంటే సూర్యస్థూలశరీరం. ఈ స్థూలశరీరంలో ఉన్న సూక్ష్మశరీరం సూర్యదేవత. ఇక్కడ సూర్యదేవత అంటే సమష్టి హిరణ్యగర్భ.

సమష్టి సూక్ష్మశరీరం లేదా హిరణ్యగర్భ సూక్ష్మశరీరం సూర్యమండలం వెనుక ఉంటుంది కాబట్టి, మనం సంధ్యావందనంలో పూజ చేసేది సూక్ష్మహిరణ్యగర్భకు. ఇక్కడ ఈ హిరణ్యగర్భ సూక్ష్మశరీరాన్ని పురుషః అంటున్నది ఉపనిషత్తు. బాగా గుర్తుంచుకోండి – సూర్య మండలం అంటే సమష్టి స్థూలశరీరం; పురుషః అంటే సమష్టిసూక్ష్మశరీరం.

మనం సూర్యుని సూక్ష్మశరీరాన్ని చూడలేము. అది అమూర్తం; అది త్యత్. త్యత్ అంటే ఇంద్రియ అగోచరం. అది ఆకాశం, వాయువులకు ప్రతీక. ఆకాశం,వాయువు కూడా అప్రత్యక్షం. సూక్ష్మశరీరం కూడా అప్రత్యక్షం.

ఇది అధిదైవ అమూర్తప్రపంచం. ఇప్పుడు భూతత్రయం, భూతద్వయం వచ్చాయి. అంటే సమష్టి స్థూలప్రపంచం, సమష్టిసూక్ష్మప్రపంచం ఉన్నాయి. ఇది అధ్యారోపభాగం. రెండింటినీ నేతి నేతి పదాలతో తోసివేయబోతున్నాము. దాన్ని అపవాదం అంటారు.

రాబోయే మంత్రంలో ఆధ్యాత్మ మూర్తప్రపంచం; అధ్యాత్మ అమూర్తప్రపంచం చూడబోతున్నాము.

అమూర్తప్రపంచ వాసనామయం రూపమ్.

## మంత్రం 2.3.4

**అథాధ్యాత్మమిదమేవ మూర్తం యదన్యత్ప్రాణాచ్చ యశ్చాయమంతరాత్మన్నాకాశ ఏతన్మర్త్యమేతత్ స్థితమేతత్సత్తస్యైతస్య మూర్తస్యైతస్య మర్త్యస్యైతస్య స్థితస్యైతస్య సత ఏష రసో యచ్చక్షుస్సతో హ్యేష రసః ॥**

**అథాధ్యాత్మమిదమేవ మూర్తమ్** – అధిదైవంనుంచి అధ్యాత్మంలోకి అడుగుపెడుతున్నాము. అందులో ముందుగా మూర్తప్రపంచం గురించి చెప్పబోతున్నది ఉపనిషత్తు. మూర్తప్రపంచం ఏది?

**యదన్యత్ప్రాణాచ్చ యశ్చాయమంతరాత్మన్నాకాశః** – ఆకాశం, ప్రాణాలకు భిన్నంగా ఉన్నది మూర్తప్రపంచం. ఇక్కడ ఆకాశం అంటే శరీరంలో ఉన్న ఆకాశం. మన శరీరంలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఆకాశం అంటారు. దీన్ని అంతరాకాశం లేదా అధ్యాత్మ ఆకాశం అంటారు. అలాగే ప్రాణం అంటే శరీరంలో ఉన్న వాయుతత్త్వం.

ఆకాశం, ప్రాణం కాని మూడూ అధ్యాత్మ మూర్తప్రపంచం. స్థూలశరీరారంభకం భూతత్రయం అంటే అగ్ని, నీరు, పృథివి. ఇవి స్థూలశరీరనిర్మాణానికి తోడ్పడతాయి. అందువల్ల స్థూలశరీరాన్ని మూర్తప్రపంచంగా అభివర్ణించవచ్చు. ఇక్కడ కూడా ముందు చూసిన మూడు పదాలూ వస్తాయి.

**ఏతన్మర్త్యమేతత్ స్థితమేతత్సత్తస్యైతస్య మూర్తస్య** – ఈ స్థూలశరీరం మర్త్యం; ఈ స్థూలశరీరం స్థితం; ఈ స్థూలశరీరం సత్.

తర్వాత అంశం ఏమిటి? అధిదైవ మూర్తప్రపంచానికి ఒక రసాన్ని చూశాము. ఇక్కడ కూడా అలా ఒక రసము ఉంది.

**ఏష రసో యచ్చక్షుస్సతో హ్యేష రసః** – ఆ రసం చక్షువు. కాని ఇక్కడ ఒక విషయం గమనించాలి. చక్షువు అంటే చక్షురింద్రియం కాదు. చక్షురింద్రియం జ్ఞానేంద్రియాలలో ఒకటి. అది సూక్ష్మశరీరంలో ఉంటుంది. అందువల్ల ఇక్కడ చక్షువు అంటే గోళకం, కన్నుయొక్క స్థూలభాగం. అంటే ఇది చక్షురింద్రియంయొక్క కనబడే భాగం. అందువల్ల ఇది అధ్యాత్మ మూర్తప్రపంచానికి ప్రతీక అయింది.

కన్నే ఎందుకు ఎన్నుకోవాలి? ఏ ముక్కునో తీసుకోవచ్చు కదా? దానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిని ఇంతకుముందు కూడా చూశాము. అన్నింటిలోకి కన్ను చాలా ముఖ్యమైన ప్రమాణం. మనం నేర్చుకునే జ్ఞానంలో అధికభాగం కన్నుద్వారా వస్తుంది. ఇంకొకటి మనకు ప్రియమైన బాబును 'కన్నా' అని ఆప్యాయంగా పిలుస్తాము. అంతేకాక తల్లిగర్భంలో శిశువు రూపుదిద్దుకుంటున్నప్పుడు, అన్ని అంగాలలోకి కన్ను మొదట రూపుదిద్దుకుంటుందని ఒక భాష్యకారుడు రాశాడు. కన్ను ఇంత ముఖ్యమైనది కాబట్టి విరాట్ ఉపాసన కన్నుమీద చేస్తాము. ఇంకా ముఖ్యమైన కారణం ఇంకొకటి ఉంది. అధిదైవప్రపంచంలో ప్రతీకగా సూర్యుడిని తీసుకుంది ఉపనిషత్తు. సూర్యుడు మన కన్నుకి అధిష్ఠానదేవత. అందువల్ల కూడా కన్ను ముఖ్యమైనది.

దీనితో అధ్యాత్మ మూర్తప్రపంచం అయింది; అది స్థూలశరీరం.

## మంత్రం 2.3.5

**అథామూర్తం ప్రాణశ్చ యశ్చాయమంతరాత్మన్నాకాశ ఏతదమృతమేతద్యదేతత్త్యత్తస్యైతస్యామూర్త స్యైతస్యామృతస్యైతస్య యత ఏతస్య త్యస్యైష రసో యోఽయం దక్షిణేఽక్షన్ పురుషస్త్యస్య హ్యేష రసః ॥**

**అథామూర్తం ప్రాణశ్చ యశ్చాయమంతరాత్మన్నాకాశః** – ఇప్పుడు అమూర్తప్రపంచం. అమూర్తప్రపంచం ప్రాణం, అంతరాకాశం. దీన్ని భూతద్వయం అంటారు లేదా సూక్ష్మశరీర అధ్యాత్మ భూతద్వయం అంటారు.

**ఏతదమృతమేతద్యదేతత్త్యత్** – ఇది అమృతం, ఇది యత్, ఇది త్యత్.

**యోఽయం దక్షిణేఽక్షన్ పురుషః** – ఇక్కడ మళ్ళీ ప్రత్యేకించి కుడి కన్ను ఈ అమూర్తప్రపంచంయొక్క రసము అంటున్నది. ఎందుకంటే సాధారణంగా ఎడమకన్నుకన్నా కుడికన్ను ఎక్కువ శక్తివంతంగా ఉంటుంది. దీనితో అధ్యాత్మ అమూర్తప్రపంచం కూడా అయిపోయింది.

దీని సారాంశం మళ్ళీ చూద్దాము.

| | | |
|---|---|---|
| అధిదైవ అమూర్తప్రపంచం | – | సమష్టి సూక్ష్మప్రపంచం |
| అధ్యాత్మ అమూర్తప్రపంచం | – | వ్యష్టి సూక్ష్మశరీరం |
| అధిదైవ మూర్తప్రపంచం | – | సమష్టి స్థూలప్రపంచం |
| అధ్యాత్మ మూర్తప్రపంచం | – | వ్యష్టి స్థూలశరీరం |

దీన్నించి ఒక ఉపసిద్ధాంతాన్ని చెప్పవచ్చు.

వ్యష్టి స్థూల, సూక్ష్మశరీరాలు = అధ్యాత్మ మూర్తం + అమూర్తం

మూర్తం = సత్; అమూర్తం = త్యత్;

మూర్తామూర్తం = సత్యం.

అధ్యాత్మ స్థూల, సూక్ష్మశరీరాలు = సత్ + త్యత్ = సత్యం.

అందువల్ల మూర్తామూర్తాలయిన ఈ స్థూల, సూక్ష్మశరీరాలు సత్యం; అంటే శాశ్వతం కాదు. పారమార్థిక సత్యమే నిత్యం.

## మంత్రం 2.3.6

**తస్య హైతస్య పురుషస్య రూపమ్। యథా మాహారజనం వాసో యథా పాణ్డ్వావికం యథేన్ద్రగోపో యథాగ్న్యర్చిర్యథా పుణ్డరీకం యథా సకృద్విద్యుత్తగ్ం సకృద్విద్యుత్తేవ హ వా అస్య శ్రీర్భవతి య ఏవం వేద ॥**

**అథాత ఆదేశో నేతి నేతి న హ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్త్యథ నామధేయగ్ం సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్ ॥**

ఈ మంత్రంలో సూక్ష్మశరీరంయొక్క వాసనల గురించి చెప్పబోతున్నది ఉపనిషత్తు. వాసన అంటే సంస్కారం. సూక్ష్మశరీరంలో, ఇంకా సరిగ్గా చెప్పాలంటే, మనస్సులో అనేక ముద్రలు ఏర్పడతాయి. మనిషి జీవితంలో కలిగిన అనుభవాలు, మనస్సుమీద ఒక చెరగని ముద్రను వేస్తాయి. ఆ ముద్రలనే వాసనలు అంటారు. అది మంచిముద్ర అవచ్చు, చెడుముద్ర అవచ్చు.

**తస్య హైతస్య పురుషస్య రూపమ్** – ఇక్కడ పురుషస్య అంటే సూక్ష్మశరీరంయొక్క రూపం. సూక్ష్మశరీరంయొక్క రూపం అని ఎలా చెప్పగలము? అంతకుముందు మంత్రం చూడండి. అందులో చక్షు గోళకం మూర్తప్రపంచాన్ని, చక్షురింద్రియం అమూర్తప్రపంచాన్ని సూచిస్తుందని చూశాము. అంటే స్థూలశరీరం మూర్తప్రపంచమనీ, సూక్ష్మశరీరం అమూర్తప్రపంచమనీ చూశాము. అందువల్ల పురుషస్య రూపం అంటే సూక్ష్మశరీరస్య లేదా అమూర్తప్రపంచస్య వాసనామయ రూపం.

బృహదారణ్యకోపనిషత్తులోని కొన్ని మంత్రాలను అర్థం చేసుకోవటం, ముఖ్యంగా వాటికి శంకరులవారి భాష్యం లేకపోతే అర్థం చేసుకోవటం చాలా కష్టం.

అందువల్ల ఇప్పుడు పురుషస్య రూపం అంటే సూక్ష్మశరీరంలో ఉన్న మనస్సులో ఉండే వాసనలు. దీని గురించి చెప్పటంద్వారా ఉపనిషత్తు, అమూర్తప్రపంచంలో వాసనలను కూడా కలుపుకోవాలని చెబుతున్నది. ఎందుకంటే మూర్తామూర్తప్రపంచాన్ని తోసిపుచ్చేటప్పుడు ఈ వాసనలను కూడా తోసిపుచ్చకపోతే, ఆ వాసనలు మనను పట్టుకు ప్రాకులాడుతాయి. అందువల్ల మూర్తామూర్తప్రపంచంతోపాటు వాసనలను కూడా త్రోసిపుచ్చాలి.

ఆ వాసనలను వర్ణించటానికి అనేక రంగులను ఉదాహరణగా చెప్పింది ఉపనిషత్తు.

**యథా మాహారజనం వాసో** – అంటే పసుపులో ముంచిన తెల్లగుడ్డ లాంటిది. వాసః అంటే వస్త్రం. పసుపులో ముంచిన తెల్లవస్త్రం ఎలా పూర్తిగా పసుపుగా మారిపోతుందో, అలా తెల్లవస్త్రంలాంటి మన మనస్సు కూడా బాహ్యప్రపంచపు అనుభవాలకు లోనయితే, అనేక వాసనల మయం అయిపోతుంది.

**యథా పాండ్వావికమ్**– అవిః అంటే గొర్రె. ఆవికం అంటే ఉన్నిదుస్తులు; పాండు అంటే పసుపుపచ్చని తెలుపు. అంటే పాండ్వావికం అంటే లేతపసుపు రంగు ఉన్న ఉన్ని దుస్తులు.

**యథేంద్రగోపః** – ఆరుద్ర పురుగు రంగు. అంటే ఎర్రటి ఎరుపు.

**యథాగ్న్యర్చిః** – అగ్నిజ్వాల ఎలా ఉంటుందో అలా ఉంటుంది. అంటే జ్వాల తెల్లని మెరిసే తెలుపు రంగులో ఉంటుంది.

**యథా పుండరీకం శుక్లమ్** – తెల్లకలువ. అగ్నిజ్వాల అంత తెలుపు కాదు. అంటే రంగుల్లోని హెచ్చుతగ్గులు చెప్పటంద్వారా ఆ వాసనలయొక్క తారతమ్యాలను చూపుతున్నది ఉపనిషత్తు. ముదురుపసుపు రంగు, లేతపసుపు రంగు, ఎర్రటి ఎరుపు, తెల్లటి తెలుపు, కాస్త తెలుపు – ఇలా వాటిని వర్ణించుకుంటూ వచ్చింది.

**యథా సకృద్విద్యుత్తగ్మ్** – ఒక్కసారి మిరుమిట్లు గొలిపే మెరుపులాగా ఉంది. ఇది ప్రత్యేకమైన ఉదాహరణ. ఇది హిరణ్యగర్భ మనస్సును సూచిస్తుంది. మెరుపు ఎలా అంతా ప్రకాశవంతం చేస్తుందో అలా హిరణ్యగర్భ మనస్సు అలా సర్వప్రకాశకంగా ఉంటుంది.

ఈ చర్చను ఒక ఉపాసనతో ముగిస్తున్నది ఉపనిషత్తు. అది మంద, మధ్యమ అధికారికి వర్తిస్తుంది. మెరుపుమీద ఉపాసన కేనోపనిషత్తులో కూడా వస్తుంది. ఈ ఉపాసన చేస్తే ఏ ఫలం వస్తుంది?

**సకృద్విద్యుత్తేవ హ వా అస్య శ్రీర్భవతి య ఏవం వేద** – ఇలా మెరుపంత ప్రకాశవంతమైన జ్ఞానం ఉన్న హిరణ్యగర్భమీద ఉపాసన చేసిన వ్యక్తికి మెరుపంత ప్రకాశవంతమైన ఐశ్వర్యం కలుగుతుంది. ఐశ్వర్యం అంటే పేరు ప్రఖ్యాతులు, జ్ఞానం కూడా కలుపుకోవచ్చు. ఈ ఉపాసన సందర్భాన్నిబట్టి వచ్చిందే కాని దీనికి అధ్యారోప అపవాదంతో సంబంధం లేదు. వాసనల గురించిన చర్చతో అధ్యారోప భాగం ముగిసింది. అంటే సత్యస్య సత్యంలో సత్యం భాగం ముగిసింది.

అపవాద భాగానికి వెళ్ళే ముందు అంటే సత్యస్య సత్యం చూసేముందు, పురుషస్య రూపంమీద శంకరాచార్యులవారు చిన్న విశ్లేషణ చేశారు. అది ముందు చూద్దాము.

# పురుషస్య రూపం భాష్యం

**తస్య హైతస్య పురుషస్య రూపమ్** – 2.3.6

ఈ పురుషస్య పదం రెండవ అధ్యాయంలో, మూడవ బ్రాహ్మణంలో ఆరవ మంత్రం మొదట్లో వస్తుంది. దీనిమీద శంకరులవారు ఎందుకు భాష్యం వ్రాస్తున్నారు? సాధారణంగా వేదాంతంలో పురుషః అంటే ఆత్మ. అది నిరూపించటానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

కాని ఇక్కడ శంకరులవారు పురుషః అంటే సూక్ష్మశరీరం లేదా లింగశరీరంగా తీసుకున్నారు. ఇంకా సరిగ్గా చెప్పాలంటే మనస్సు లేదా అంతఃకరణంగా తీసుకున్నారు. కాని కొందరు ఈ పురుషః పదాన్ని ఆత్మగా తీసుకునే ప్రమాదముంది. అందువల్ల వేరే దార్శనికుల విశ్లేషణలను తీసుకుని వాటిని ఖండిస్తున్నారు. ఇదీ ఈ భాష్యంయొక్క సారాంశం.

దీనికి నాలుగు రకాల అపోహలను పేర్కొంటున్నారు.

1. **యోగాచార బౌద్ధమతం** – వీరిది క్షణిక విజ్ఞానవాదన. ఈ మతం పురుషస్య అంటే ఆత్మయొక్క అని తీసుకుంది. అలా తీసుకుంటే ఏమవుతుంది? ఈ వాసనలన్నీ ఆత్మస్వరూపం అవుతాయి.

ఈ క్షణికవిజ్ఞానం ఏమిటి? క్షణక్షణమూ మనస్సులో మారే వృత్తులను ఆత్మ అంటుంది ఈ మతం. మనం వాటిని వృత్తులు అంటాము. ఒక్కొక్క వృత్తి ఒక్కొక్క జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఒక్కొక్క జ్ఞానంతో ఒక్కొక్క వాసన ఉంటుంది అంటాడు ఈ క్షణికవిజ్ఞానవాది. దాన్ని స్వభావం అంటాడు. అతను అసలు బాహ్యప్రపంచమే లేదు అంటాడు. కేవలం ఆలోచనల ప్రవాహమే ఉంది అంటాడు. కుండ జ్ఞానం కలిగినప్పుడు, బాహ్యంగా కుండ **ఉన్నట్టుగా** చూస్తాము అంటాడు.

అదెలా సాధ్యం అంటే కలలో జరిగేది అదే కదా. పులి ఆలోచన స్వప్నప్రపంచంలో పులిని సృష్టిస్తుంది; మనిషి ఆలోచన మనిషిని సృష్టిస్తుంది. అలాగే జాగ్రద్ ప్రపంచంలో కూడా కుండ ఆలోచన కుండను సృష్టిస్తుంది. అంతేకాని నిజంగా జాగ్రద్ ప్రపంచం లేదు.

అయితే ఆత్మ ఏమిటి? ఆత్మ అంటే ఈ క్షణిక విజ్ఞానపరంపర. ఈ క్షణిక విజ్ఞానానికి వాసనలు ఉన్నాయి. అవి మనిషి మనిషికీ మారతాయి.

అంటే పురుషస్యరూపమ్ = క్షణిక విజ్ఞానస్య వాసన = ఆత్మ.

**క్షణిక విజ్ఞానవాద ఖండన** – తమాషా ఏమిటంటే దీన్ని శంకరులవారు ఖండించరు. అందులో తప్పు ఉందని తెలుస్తూనే ఉందని ఆయన భావన. దీనికి జవాబు ఒక్కముక్కలో చెప్పవచ్చు. **ఆత్మనిత్య చైతన్యం**, అది క్షణికం కాదు. అందువల్ల వారి వాదన శ్రుతివిరోధం.

2. **తార్కిక నైయాయిక, వైశేషికుల వాదన** – వీరు కూడా పురుషస్య రూపంలో పురుషః అంటే ఆత్మగానే తీసుకుంటారు. కాని వీరు రూపం అంటే ఆత్మగుణాలుగా తీసుకుంటారు.

అందువల్ల పురుషస్య రూపమ్ = ఆత్మగుణం.

వారి వాదన ప్రకారం మనం జీవితంలో అనుభవించే సుఖదుఃఖాలన్నీ ఆత్మనుంచి పుట్టిన వాసనలే. జ్ఞానం పొందేది ఆత్మే; సుఖదుఃఖాలు అనుభవించేది ఆత్మే. దానికి ఈ పురుషస్యరూపం పదాలను వారు ఉటంకిస్తారు. పసుపులో ముంచిన తెల్లవస్త్రం పసుపుగా మారినట్టుగా ఆత్మగుణం కూడా మారుతుంది అంటారు వారు.

**తార్కిక నైయాయిక వైశేషికుల వాదన ఖండన** – దీన్ని కూడా అంతగా పట్టించుకోరు శంకరులవారు. దీనికీ జవాబు ఒకటే. ఇది శ్రుతివిరోధం. శ్రుతి **ఆత్మ నిర్గుణం, నిష్కళం** అని వర్ణిస్తుంది.

ఇంకొక కారణం కూడా చెప్పవచ్చు. సుఖదుఃఖాలలాంటి అనుభవాలన్నీ మనస్సుకు సంబంధించినవి కాని ఆత్మకు కాదు అని శ్రుతిస్మృతులు చెబుతాయి. అందువల్ల సుఖదుఃఖాలు అనాత్మక్షేత్రానికి చెందుతాయి కాని, ఆత్మ అనే క్షేత్రజ్ఞుడికి చెందవు. ఈ ఉపనిషత్తులోనే మొదటి అధ్యాయంలో ఈ విషయం చూశాము.

3. **భర్తృప్రపంచ వాదన** – ఈ భర్తృప్రపంచం చేసిన వాదనను వివరంగా చర్చిస్తారు శంకరులవారు. ఆయన పూర్వపక్షికి చెందినవారు.

పురుషస్యరూపమ్ = జీవాత్మ రూపం.

పురుషః అంటే జీవాత్మ. జీవాత్మ సంసారి. జీవాత్మకు సుఖం, దుఃఖం ఉంటాయి కాని పరమాత్మ అసంసారి. ఆయనకు సుఖం, దుఃఖం అంటవు.

**శంకరులవారి వాదన** – పురుషః అంటే జీవాత్మ అని అర్థం తీసుకుంటే ఈ జీవాత్మ పరమాత్మకు భిన్నంగా ఉందా, ఐక్యంగా ఉందా, పరమాత్మలో భాగంగా ఉందా అని అడుగుతారు శంకరులవారు. ఎలా చెప్పినా సమస్యే!

ఎ) **జీవాత్మ–పరమాత్మల భిన్నత్వం** – ఒకవేళ జీవాత్మ, పరమాత్మకు భిన్నంగా ఉంది అంటే ఇది కూడా శ్రుతి విరోధం అవుతుంది. జీవాత్మ–పరమాత్మల ఐక్యాన్ని బోధించే మహావాక్యాలన్నీ తప్పు అయిపోతాయి. అందువల్ల ఇది కుదరదు.

బి) **జీవాత్మ–పరమాత్మల ఐక్యం** – జీవాత్మ పరమాత్మల ఐక్యం తీసుకున్నా కూడా సమస్యే. జీవాత్మ, పరమాత్మలు ఒకటే, కాని ఈ వాక్యాన్ని విశ్లేషించటం కష్టమవుతుంది. పురుషః అంటే జీవాత్మ అన్నాడు; జీవాత్మ = పరమాత్మ అన్నాడు. అప్పుడేమవుతుంది? జీవాత్మ రూపం = పరమాత్మ రూపం అవుతుంది; అంటే పరమాత్మకు కూడా వాసనలు ఉన్నట్టు వస్తుంది. అప్పుడు పెద్ద సమస్య వస్తుంది. వాసనలు మారుతూ ఉంటాయి. ఆ వాసనలు పరమాత్మకు కూడా చెందుతాయంటే ఏమిటి అర్థం? పరమాత్మ కూడా మారుతూ ఉంటాడు. కాని పరమాత్మ నిర్వికారం. వికారాలు లేవు.

ఇంకొక సమస్య కూడా వస్తుంది. పురుషస్య రూపం = పరమాత్మ రూపం అయితే బ్రహ్మకు మూడు రూపాలు ఉన్నట్టు అవుతుంది. ఎందుకంటే ఈ బ్రాహ్మణం మొదట్లో బ్రహ్మకు రెండు రూపాలు ఉన్నాయి అని వచ్చింది.

**ద్వే వావ బ్రహ్మణో రూపే మూర్తం చైవామూర్తం చ** – 2.3.1

బ్రహ్మకు రెండు రూపాలు ఉన్నాయి, అవి మూర్తం, అమూర్తం అని చెప్పింది. కాని ఇప్పుడు వాసనలను పరమాత్మరూపంగా తీసుకుంటే బ్రహ్మకు మూడురూపాలు ఉన్నట్టు అవుతుంది. అవి మూర్తం, అమూర్తం, వాసనలు. ఉపక్రమ, ఉపసంహారం ఒక్కలాగే ఉండాలి. అంటే ఎలా మొదలుపెడితే అలాగే ముగించాలి. కాని ఇక్కడ ఉపక్రమ విరోధ దోషం కలుగుతుంది. అందువల్ల పురుషః అంటే పరమాత్మతో ఐక్యం అయిన జీవాత్మ అనటానికి కుదరదు.

జీవాత్మ పరమాత్మలు భిన్నం అంటే మహావాక్యవిరోధం అవుతుంది. అవి ఏకం అంటే ఉపక్రమవిరోధం అవుతుంది.

సి) **జీవాత్మ–పరమాత్మలో భాగం** – సరే జీవాత్మ పరమాత్మకు భిన్నమూ కాదు, ఏకమూ కాదు, జీవాత్మ పరమాత్మలో ఒకభాగం అన్నా కూడా సమస్య వస్తుంది. నిజానికి భర్తృప్రపంచం సిద్ధాంతం ఇదే. దీన్ని భేదాభేద వాదన అంటారు. అంటే జీవాత్మ పరమాత్మల మధ్య భేదమూ లేదు, అభేదమూ లేదు అంటారు వీరు. ఇది విశిష్టాద్వైతానికి దగ్గరగా ఉంటుంది. వీరు జీవాత్మ పరమాత్మలో ఒకభాగం అంటారు. అలాగన్నా కూడా రెండు సమస్యలు ఉన్నాయి.

i) **శ్రుతి విరోధం** – ఆత్మ నిష్కళం, నిరవయవం అంటుంది శ్రుతి. ఆత్మకు భాగాలు లేవు. ఘటాకాశం, మహాకాశాలను తీసుకుంటే ఘటాకాశం మహాకాశానికి భిన్నంగా లేదు; మహాకాశంలో భాగంగానూ లేదు; మహాకాశంలో ఐక్యమూ కాదు. ఎందుకంటే మహాకాశానికి భాగాలు లేవు. అలాగే ఆత్మలో భాగం అనటానికి ఆత్మకు భాగాలు లేవు.

ii) **పరమాత్మ మార్పు చెందుతాడు** – ఒకవేళ జీవాత్మ పరమాత్మలో భాగం అయితే, పరమాత్మ కూడా మార్పులకు లోనవుతాడు. ఎందుకంటే దేనికైతే భాగాలు ఉంటాయో, దానికి మార్పులు కలుగుతాయి.

**యత్ యత్ సావయవం తత్ తత్ సవికారం సావయవత్వాత్ ఘటవత్**

మనిషికి అవయవాలు ఉన్నాయి కాబట్టి, అతని అవయవాలు మార్పు చెందుతూ ఉంటాయి. ఆ అవయవాల మార్పిడి చెయ్యటమో, వాటిని తీసివేయటమే జరుగుతుంది. అదేవిధంగా పరమాత్మకు కూడా భాగాలు ఉంటే, ఆయన కూడా మార్పులకు లోనవుతాడు. అందువల్ల పురుషస్వరూపం = జీవాత్మరూపం వాదన కూడా చెల్లదు.

4. **సాంఖ్య వాదన** – పురుషః = మనస్సు అనే అంటారు వీరు కూడా. వీరి వాదన కొంతమేరకు వేదాంతానికి దగ్గరగా ఉంటుంది కాని పూర్తిగా కాదు. వారు వాసనలు మనస్సుకు చెందుతాయని అంటారు నిజమే కాని చిక్కు ఎక్కడ వస్తుందంటే ఆ మనస్సు స్వతంత్రమైనది అంటారు. వారు మనస్సుకు విడిగా ఉనికి ఉందంటారు. కాని అలాగంటే శ్రుతి దాన్ని నేతి నేతి వాక్యాలతో తోసిపుచ్చలేదు.

సత్యమైనదానిని, విడిగా ఉనికి ఉన్నదానిని శ్రుతి తోసిపుచ్చలేదు. ఇది నియమం. ఒకవేళ మనస్సును కూడా నేతి నేతి వాక్యాలతో తోసిపుచ్చవచ్చు అంటే, ఇదే నియమం ప్రకారం సత్యమైనది, విడిగా ఉనికి ఉన్నది అయిన ఆత్మను కూడా నేతి నేతి వాక్యాలతో తోసిపుచ్చవచ్చు.

అందువల్ల పురుషః = స్వతంత్రమైన మనస్సు కూడా చెల్లదు.

మరి పురుషస్య రూపం అంటే ఏమిటి?

పురుషస్య రూపం = జడ సూక్ష్మశరీరం = మనస్సు.

అమూర్త ప్రపంచం అయిన సూక్ష్మశరీరంలో ఉన్న మనస్సుకు చెందినవి ఈ వాసనలు.

**శంకరులవారి సిద్ధాంతం** – అందరూ పురుషః = ఆత్మ అంటుంటే, మనం మాత్రం పురుషః = మనస్సు, అది కూడా అస్వతంత్రమైన, జడమైన మనస్సు అని ఎందుకు తీసుకోవాలి? ఎందుకంటే అంతకుముందు మంత్రం పురుషస్య రూపం అని దేన్ని అంటున్నదో ప్రత్యేకించి చెబుతున్నది.

శంకరులవారి గొప్పతనం అదే. వారు ఏదైనా మంత్రాన్ని వ్యాఖ్యానించేటప్పుడు దాని ముందు, వెనుకలనున్న మంత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. **యోఽయం దక్షిణేఽక్షన్ పురుషః** – 2. 3. 5

కుడికన్నును సూక్ష్మశరీరానికి ప్రతీకగా తీసుకుంది ఉపనిషత్తు. ప్రాణాత్మక సూక్ష్మశరీరం గురించి చెప్పింది. అంతవరకూ సూక్ష్మశరీరం గురించి చెప్పి, హఠాత్తుగా ఆత్మ గురించి చెప్పదు.

దీనితో పురుషస్య రూపం భాష్యం కూడా అయిపోయింది.

**మంత్రం –2.3.6**

## అథాత ఆదేశో నేతి నేతి న హ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్త్యథ నామధేయగ్ం సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్ ॥

ఇప్పుడు సత్యస్య సత్యం భాగంలో అపవాద భాగం చూడబోతున్నాము. వాసనా సహిత మూర్తామూర్త ప్రపంచ అధ్యారోపం ముగిసింది. సత్యస్య సత్యంలో మొదటి సత్యం జగత్తు. సత్ అంటే మూర్తం, త్యత్ అంటే అమూర్తం. ఇప్పుడు అపవాదం చెప్పాలి. మొదటి సత్యాన్ని తిరస్కరించటంద్వారా రెండవ సత్యాన్ని నిలబెట్టాలి. అది పారమార్థిక సత్యం.

**అథ** – అథ అంటే తర్వాత. ఉపనిషత్తే చెబుతోంది తర్వాత అని. దేని తర్వాత? అధ్యారోపం తర్వాత. శంకరులవారు ఇంకా విపులంగా చెబుతున్నారు. **సత్యస్య రూపనిర్దేశానంతరమ్ –** సత్యం యొక్క స్వరూపాన్ని నిర్దేశించిన తరువాత

**అతః** – అందువలన, అధ్యారోపం అయినందువలన ఇక్కడనుంచి సత్యస్య సత్యం నిర్వచనం చూడబోతున్నాము. కాని దీని నిర్వచనం మొదటి సత్యానికి మూర్తామూర్త ప్రపంచం అని చెప్పినట్టుగా చెప్పటం లేదు. 'నేతి, నేతి' అని వ్యతిరేక పద్ధతిలో చెప్పబోతున్నది. నేతి నేతి అంటే న ఇతి, న ఇతి. ఇది కాదు, ఇది కాదు. అలా నేతి నేతి అంటూ ఉపాధులన్నిటినీ నిరాకరించటంద్వారా చెప్పే పద్ధతిని అపవాదం లేదా నిరాకరణం అంటారు.

ఇలా అపవాదం పద్ధతిలో ఎందుకు చెబుతున్నది ఉపనిషత్తు అని ప్రశ్న వేసి శంకరాచార్యులవారే జవాబు చెబుతున్నారు. ఎందుకంటే ఆత్మ సానుకూల నిర్వచనానికి అందదు.

అలా సానుకూల నిర్వచనం ఇవ్వాలంటే మాండూక్యోపనిషత్తులో చెప్పినట్టుగా ఐదు నియమాలకు లోబడి ఉండాలి. అవి ప్రత్యక్షం, గుణం, క్రియ, సంబంధం, జాతి.

1. **ప్రత్యక్షమ్** – ఇంద్రియ గోచరమై ఉండాలి. బ్రహ్మ అప్రత్యక్షం.
2. **గుణమ్** – గుణాన్నిబట్టి నిర్వచిస్తాము. బ్రహ్మ నిర్గుణం.
3. **క్రియ** – అది చేసే పనినిబట్టి నిర్వచిస్తాము. బ్రహ్మ అకర్తా.
4. **సంబంధమ్** – ఇంకొక వస్తువుతో ఉన్న సంబంధాన్నిబట్టి నిర్వచిస్తాము. బ్రహ్మ అసంగం.
5. **జాతి** – జాతి లక్షణాన్నిబట్టి నిర్వచిస్తాము. బ్రహ్మ ఏకం.

**శబ్ద ప్రవృత్తి నిమిత్త అభావత్**

ఈ లక్షణాలు లేనందువల్ల బ్రహ్మను సానుకూలంగా నిర్వచించలేము. సత్యం, జ్ఞానం, అనంతం, విజ్ఞానం, ఆనందం, అధిష్ఠానం, శుద్ధం వంటి నిర్వచనాలు సానుకూలంగా ఉన్నాయి కదా అనిపించవచ్చు. అది అధ్యాసవల్ల ఏర్పడిన నిర్వచనం. ఉదాహరణకు బ్రహ్మను సర్వజ్ఞుడు అంటాము. అది లేని గుణాన్ని ఆపాదించటంవల్ల, అంటే ఆయనకు జగత్కారణ బ్రహ్మ అనే కారణత్వాన్ని ఆపాదించటంవల్ల సర్వజ్ఞుడు అనే నిర్వచనం వచ్చింది. తర్వాత కారణత్వాన్ని నిషేధించినప్పుడు సర్వజ్ఞత్వం కూడా నిషేధిస్తాము. ఎప్పుడైతే లక్షణాలను పక్కనపెట్టి, ఉపాధి భేదాలన్నిటినీ త్రోసిపుచ్చి, బ్రహ్మయొక్క నిర్గుణస్వరూపాన్ని వర్ణిస్తామో అప్పుడు దాన్ని సాక్షాత్తుగా నిర్దేశించలేము.

నేతి నేతి అని ఉపనిషత్తు రెండుసార్లు ఎందుకు వాడింది? సంస్కృతంలో ఒక పదాన్ని రెండుసార్లు వాడితే సర్వాన్నీ తనలోనే ఇముడ్చుకుందని అర్థం. శంకరాచార్యులవారు ఒక ఉదాహరణనిస్తున్నారు.

**యథా గ్రామో గ్రామో రమణీయ ఇతి**

ఇదెలాగంటే, గ్రామం గ్రామం సుందరమైనది అంటే అన్ని గ్రామాలూ సుందరమైనవి అని అర్థం. అలాగే నేతి నేతి అంటే ఇంకొక మార్గం లేదు. అనాత్మను త్రోసిపుచ్చుతాము. ఆ అనాత్మ మూర్తప్రపంచం అవనీ, అమూర్తప్రపంచం అవనీ, వాసనలు అవనీ. అలా అన్నిటినీ నిరాకరిస్తే మిగిలేది –

**సత్యస్య సత్యమితి** – సత్యస్య సత్యం మిగులుతుంది. దాన్నే సాక్షిచైతన్యం అంటారు. ఎందుకు నేతి నేతి పద్ధతి వాడిందో, ఉపనిషత్తే వివరిస్తుంది.

**న హ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్తి** – నేతి నేతి అనే ఈ ఉపదేశాన్ని మించి గొప్పది మరొకటి లేదు. అది ఏమిటి? బ్రహ్మయొక్క నామం. అది సత్యస్య సత్యం. ఈ సత్యస్య సత్యాన్ని ముందు బ్రాహ్మణము చివర్లో రహస్యనామంగా చూశాము.

**ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** – బ్రహ్మ సత్యంయొక్క సత్యం. అంటే ప్రాణం (మూర్తామూర్త ప్రపంచం) సత్యం అయితే, బ్రహ్మ ఈ సత్యానికి సత్యం.

ఇప్పటి వరకూ రెండవ అధ్యాయంలో మూడు బ్రాహ్మణాలను చూశాము.

## మూడు బ్రాహ్మణముల సారాంశము

1. అజాతశత్రు బ్రాహ్మణము – జీవాత్మ, పరమాత్మల ఐక్యం. సుప్తపురుషుని విచారణ చేయటంద్వారా ఈ ఐక్యాన్ని చూశాము.
2. శిశు బ్రాహ్మణము – అధ్యారోపం.
3. మూర్తామూర్త బ్రాహ్మణము – అపవాదం

రెండు, మూడు అధ్యాయాలను కలిపి చూడాలి. రెండూ కలిపి అధ్యారోప అపవాద న్యాయాన్ని సూచిస్తాయి. అపవాదం నేతి నేతి పద్ధతిద్వారా జరిగింది. ఇది చాలా గొప్ప పద్ధతి, దీన్ని మించిన పద్ధతి ఇంకొకటి లేదు అని ఉపనిషత్తే చెప్పింది. ఈ పద్ధతిద్వారా ఎన్నో ముఖ్యమైన అంశాలను సూచిస్తున్నది ఉపనిషత్తు.

1. **జగన్మిథ్యా** – జగత్తును నిషేధించటంద్వారా జగత్తుయొక్క మిథ్యాత్వాన్ని సూచిస్తున్నది ఉపనిషత్తు. ఎందుకంటే నేతి అంటే న ఇతి. అంటే కనబడే ఈ జగత్తు అంతా. నేతి నేతి అని రెండుసార్లు చెప్పటంవల్ల ఈ కనబడే జగత్తంతా మిథ్య అని కొట్టి వేస్తున్నది.

**యత్ బాధ్యం తత్ మిథ్యా యత్ అబాధ్యం తత్ సత్యమ్**

బాధ్యం అంటే నిషేధించబడేది. దేన్నైతే కొట్టివేయగలమో అది మిథ్య. అంటే దేన్ని కొట్టివేయలేమో అది సత్యం. ఆ విధంగా జగత్తును కొట్టివేసింది కాబట్టి అది మిథ్య అయింది.

2. **బ్రహ్మ సత్యం** – బ్రహ్మను నిరూపించటానికి అన్నిటినీ కొట్టివేసింది కాని, బ్రహ్మను తోసివేయలేదు. అందువల్ల బ్రహ్మ సత్యం.

3. **నేను బ్రహ్మను** – కనబడే జగత్తునంతా కొట్టివేయగా మిగిలినదాన్ని బ్రహ్మ అన్నాము.

**నిషేధ అవధిరూపేణ అవశేషితమ్**

దేన్నైతే నిషేధించలేమో అది అధిష్ఠానం. దృశ్యప్రపంచాన్ని నిషేధించాక మిగిలిందేమిటి? దృశ్యాన్ని నిషేధిస్తే మిగిలేది దృక్ లేదా సాక్షి చైతన్యం

**దృగేవ న తు దృశ్యతే**

దృక్ అంటే నిషేధసాక్షి దృక్‌రూపేణ అవశిష్యతే. భాగవతంలో భగవంతుని పేరు నిషేధసాక్షి. ఈ నిషేధసాక్షి ఎవరో కాదు నేనే.

దృశ్యానికి విలక్షణంగా ఉండి, నిషేధసాక్షి అయి, సత్య అధిష్ఠానం అయిన పరమాత్మను నేనే. బ్రహ్మను నేనే అనేది మూడవ పాఠం.

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాఽపరః**

బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య, జీవుడే బ్రహ్మ అనే ఈ మూడు సత్యాలు ఈ నేతినేతి పద్ధతిద్వారా తెలుసుకుంటాము. ఒక్క దెబ్బకు మూడు పిట్టలు. అందువల్ల ఈ పద్ధతి ఇంత గొప్పది.

**న హ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్తి** – ఇతి న ఇతి న అనే దీనికంటే మరొక ఉపదేశము లేదు. ఉపనిషత్తే దీన్ని మించిన ఉపదేశం ఇంకొకటి లేదు అంటున్నది.

**అథ నామధేయగ్ం సత్యస్య సత్యమితి** – బ్రహ్మకు రహస్యనామం అయిన సత్యస్య సత్యం మళ్ళీ చెబుతున్నది. ఈ పేరును మొదటి బ్రాహ్మణం చివరిలో (2.1.20) పరిచయం చేసింది ఉపనిషత్తు. ఇక్కడ ఈ మూడవ బ్రాహ్మణంలో ముగిస్తున్నది (2.3.6).

**ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** – ప్రాణం సత్యం; దాని సత్యం బ్రహ్మ.

# 2.4 - మైత్రేయీ బ్రాహ్మణము

**బ్రహ్మవిద్యాయా అంగత్వేన సన్న్యాసో విధిత్సితః**

ఈ విధిమీద శంకరాచార్యులు భాష్యం రాశారు. ఇప్పుడూ రాశారు, తర్వాత కూడా రాశారు. మనం కూడా ఆ భాష్యాన్ని ఇప్పుడూ, అప్పుడూ కూడా చూద్దాము.

## సన్న్యాస భాష్యం - 1

సన్న్యాస ఆశ్రమధర్మం గురించి మాట్లాడేముందు, మనం కొన్ని ప్రాథమిక అంశాలను తెలుసుకోవాలి. అప్పుడే ఈ విశ్లేషణ అర్థమవుతుంది.

మన సాంప్రదాయంలో గృహస్థాశ్రమాన్ని వైదిక కర్మలను నిర్వహించటానికి అనువైన ఆశ్రమంగా భావిస్తారు. అసలు గృహస్థాశ్రమాన్ని నిర్దేశించిందే వైదికకర్మలను చెయ్యటానికి. ఆ విధంగా గృహస్థాశ్రమం సాధనం అయితే, వైదికకర్మలు సాధ్యం. అంటే గృహస్థాశ్రమం మార్గం అయితే వైదికకర్మలు గమ్యం.

గృహస్థాశ్రమాన్నే వైదికకర్మల అనుష్ఠానానికి అనువైనదిగా ఎందుకు భావిస్తారు? మన సాంప్రదాయంలో వైదికకర్మలను పాంక్తంకర్మ అంటారు. దీన్ని మొదటి అధ్యాయం చివర్లో కూడా చూశాము. ఏ వైదికకర్మ చెయ్యాలన్నా కూడా ఐదు అంశాలు కావాలి. అవి యజమాని, పత్ని, పుత్రుడు, మానుషవిత్తం, దైవవిత్తం. ఈ ఐదూ లేకపోతే అతను యజ్ఞం చెయ్యలేడు.

ఈ ఐదు అంశాలలోనూ నాలుగు అంశాలు గృహస్థాశ్రమంలోనే దొరుకుతాయి. అవి యజమాని అంటే భర్త; పత్ని అంటే భార్య; పుత్రుడు అంటే కొడుకు; మానుషవిత్తం అంటే డబ్బు. దైవవిత్తం అంటే వేదమంత్రాలు. బ్రహ్మచారి, వానప్రస్థి, సన్న్యాసులకు భార్యా, పిల్లలు ఉండరు. డబ్బు కూడా ఉండదు. వారు భిక్షాటనం చేసి జీవించాలి. నిజానికి గృహస్థే ఈ ముగ్గురినీ పోషించాలి. గృహస్థాశ్రమం ప్రత్యేకమైన ఆశ్రమం. ఎందుకంటే, అందులోనే వైదికకర్మలు సాధ్యం కాబట్టి. వైదికకర్మలు చెయ్యటం మానేస్తే గృహస్థాశ్రమం వీగిపోతుంది.

వేరే ఏదైనా కర్మను ఏ ఆశ్రమంలోనైనా సాధించవచ్చు కాని, వైదిక కర్మలు కాదు. వైదిక కర్మలవల్లనే గృహస్థ జీవనాన్ని కూడా ఆశ్రమ జీవనంగా అభివర్ణించింది ఉపనిషత్తు. దీని విలువ తెలియక ఇప్పటి తరం వారు పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారులుగా మిగిలిపోవటమో, విడాకులు తీసుకోవటమో చేస్తున్నారు. కొన్నాళ్ళయ్యాక గృహస్థాశ్రమం అంతమైనా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే గృహస్థాశ్రమంలో వైదికకర్మలను చేసి తీరాలనే నియమం తెలియదు ఇప్పుడు. అది కుటుంబాన్ని కలిపివుంచే ఒక అనుష్ఠానం.

అందువల్ల శంకరాచార్యులు గృహస్థాశ్రమం అంటే వైదిక కర్మల అనుష్ఠానం చేసే గృహస్థాశ్రమం, సన్న్యాసం అంటే వైదికకర్మలను వదిలివేయటం అంటారు. ఈ నేపథ్యంలో ఆయన రాసిన భాష్యాన్ని అర్థం చేసుకోవాలి. ఆయన సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలా వద్దా అని చర్చిస్తే, వైదికకర్మలను చెయ్యాలా వద్దా అని చర్చించినట్టు అర్థం. గృహస్థాశ్రమం వద్దు అంటే వైదికకర్మలు అవసరం లేదు అని అర్థం.

కాని ఈ రోజుల్లో గృహస్థు వైదికకర్మలనే చెయ్యటం లేదు. అందువల్ల ఇప్పటి కాలమాన పరిస్థితులకు ఈ సన్న్యాసభాష్యం సరిపోదు. కాని శంకరాచార్యులవారు చెప్పారు కాబట్టి చూద్దాము.

శంకరాచార్యులవారి భాష్యంలో ముఖ్యాంశం సన్న్యాసి వైదికకర్మలను చెయ్యాలా, త్యజించాలా అని. అనేక వాదోపవాదాలు అయ్యాక, వాటిని త్యజించాలి అని నిరూపిస్తారు శంకరాచార్యులవారు. వాటిలో నాలుగు వాదనలను చూద్దాము.

1. **జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది, కర్మవల్ల కాదు–** జ్ఞానంవల్ల మోక్షం వస్తుంది అని చెప్పినప్పుడు, దానితో కర్మ సముచ్చయం చెయ్యమని చెప్పలేము.

**జ్ఞానాత్ ఏవ అమృతత్త్వమ్ –** జ్ఞానంవల్లనే అమృతత్త్వం వస్తుంది అని ఈ ఉపనిషత్తులోనే బ్రహ్మవిద్య బోధించాక వస్తుంది. ఏవ చాలా ముఖ్యమైన పదం ఇందులో. ఏవ అంటే అది మాత్రమే. జ్ఞానంవల్ల మాత్రమే మోక్షం వస్తుంది అంటే కర్మ సహాయం అవసరం లేదు అని అర్థం.

అంతేకాకుండా, కర్మకాండలో కర్మపరంగా చూసినా కూడా కర్మను ఇహలోక, పరలోక సుఖాలకోసం నిర్దేశించింది కాని మోక్షంకోసం కాదు. జీవించి ఉండగా అనేక సుఖాలు పొందటానికి; మరణించాక భూలోక, భువర్లోక, సువర్లోకాలకు వెళ్ళటానికి మాత్రమే కర్మ పనికి వస్తుంది. మోక్షం గురించి ఎక్కడా చెప్పదు.

ఆ విధంగా ఎటు చూసినా మోక్షం పొందటానికి వైదికకర్మలు అవసరం లేదు.

2. **కర్మ సన్న్యాసం చెయ్యాలి–**

**కర్మ సన్న్యాసస్య బ్రహ్మవిద్యా అంగత్వేన విహితత్వాత్**

అంటే బ్రహ్మజ్ఞానం పొందటానికి కర్మను త్యజించాలి. దీనికి మూలమైన అనేక శ్రుతి వాక్యాలు, స్మృతివాక్యాలు ఉన్నాయి. బృహదారణ్యకంలోనే అనేక వాక్యాలు ఉన్నాయి. సంసారంలో సారం లేదు, అందువల్ల కర్మను త్యజించండి అంటుంది ఉపనిషత్తు.

3. **జ్ఞానకర్మల విరోధం –** జ్ఞానకర్మల సముచ్చయం కుదరదు. ఎందుకంటే రెండూ రెండు భిన్నధృవాల లాంటివి. కర్మ చేస్తే జ్ఞానసన్న్యాసం చెయ్యాలి; జ్ఞానం పొందాలంటే కర్మసన్న్యాసం చెయ్యాలి. అవి ఏ విధంగా భిన్నమో చూద్దాము.

ఎ) **కారణాలు భిన్నం –** కర్మ సకామకర్మ అయితే, జ్ఞానం నిష్కామం అవుతుంది. కర్మ రాగంతో కూడినది. కోరికలు ఉంటాయి. జ్ఞానం వైరాగ్యాన్ని బోధిస్తుంది.

బి) **స్వరూపాలు భిన్నం –** కర్మ ప్రవృత్తిమార్గం అయితే, జ్ఞానం నివృత్తిమార్గం. కర్మ చేసే వ్యక్తి ఆత్మనుంచి అనాత్మవైపు తిరిగితే, జ్ఞానం పొందే వ్యక్తి అనాత్మనుంచి ఆత్మవైపుకు తిరుగుతాడు. ఒకటి ఉత్తరధృవం అయితే, ఇంకొకటి దక్షిణధృవం.

సి) **ఫలాలు భిన్నం** – కర్మఫలం అనిత్యం. జ్ఞానఫలం నిత్యం. కర్మ అనిత్య ఆత్మకు తీసుకు వెళుతుంది. స్వర్గలోక ఫలం, బ్రహ్మలోకఫలాలు కూడా అనిత్యఫలాలలోకే వస్తాయి. జ్ఞానం అమృతత్వాన్ని ఇస్తుంది. అది నిత్యఫలం.

4. **అంగం** – ఈ మైత్రేయీ బ్రాహ్మణంలోనే సన్న్యాసం బ్రహ్మవిద్యా అంగం అని నిరూపించటానికి అనేక ఆధారాలున్నాయి.

ఎ) యాజ్ఞవల్క్యుడు సన్న్యాసం స్వీకరించటానికి నిర్ణయించుకున్నాడు.

బి) మైత్రేయి సన్న్యాసం స్వీకరించాకే బ్రహ్మవిద్యను బోధించాడు.

సి) విత్తనింద జరిగింది ఇందులో. విత్తనింద అంటే ధననింద. విత్తంవల్ల మోక్షం రాదు అని వస్తుంది. అంటే పరోక్షంగా కర్మవల్ల మోక్షం రాదని అర్థం వస్తుంది. ఎందుకు? ఇంతకుముందే చూశాము యజ్ఞం చెయ్యాలంటే పాంక్తంలో ఒక అంశం మానుషవిత్తం. అంటే ధనం. దైవవిత్తం అంటే వేదమంత్రాలు. కర్మనింద చేస్తే కర్మసన్న్యాసం చెయ్యమని పరోక్షంగా చెప్పటం. మనం పొగతాగటం నేరం అని చెపితే, ఎదుటి వ్యక్తిని పరోక్షంగా సిగరెట్టు తాగద్దు అని చెప్పినట్టు అర్థం. అలాగే విత్తాన్ని నిందిస్తే కర్మను నిందించినట్టు, కర్మను నిందిస్తే సన్న్యాసాన్ని నిర్దేశించినట్టు అర్థం.

డి) **వర్ణధర్మం** – ఉపనిషత్తు ప్రకారం బ్రహ్మవిద్య నేర్చుకున్నవాడే బ్రాహ్మణుడు. బ్రహ్మవిద్య నేర్చుకోకపోతే బ్రాహ్మణజాతిలో పుట్టినా కూడా, శాస్త్రం ప్రకారం అతను బ్రాహ్మణుడు కాదు. సర్వం బ్రహ్మమయం జగత్. వర్ణాశ్రమధర్మాలు కూడా కర్మ చెయ్యటానికే పాటిస్తారు. అంటే కొన్నికర్మలను బ్రాహ్మణుడు మాత్రమే చెయ్యగలడు. కొన్నికర్మలను క్షత్రియుడు మాత్రమే చెయ్యగలడు. ఆ విధంగా వర్ణాశ్రమధర్మాలు ధర్మ అనుష్ఠానంకోసం నిర్దేశింపబడ్డాయి. అందువల్ల ఆత్మజ్ఞానానికి అంగంగా సన్న్యాసాన్ని విధించింది శాస్త్రం అని అంటారు శంకరాచార్యులవారు.

కాని నేటి కాలమాన పరిస్థితుల్లో అప్పటి వర్ణాశ్రమధర్మాలు ఎవరూ పాటించటం లేదు. అందుకని శంకరులవారు సన్న్యాసాశ్రమం స్వీకరించాలని చెపితే, ఆయన ఉద్దేశం గృహస్థాశ్రమంలో చేసే వైదికకర్మలు త్యజించాలని అర్థం.

దీనితో సన్న్యాస భాష్యం – 1 అయిపోయింది.

ఈ నేపథ్యంతో ఈ మైత్రేయీ బ్రాహ్మణాన్ని అధ్యయనం చెయ్యాలి. ఈ మైత్రేయీ బ్రాహ్మణం ఈ బృహదారణ్యకంలోనే రెండుచోట్ల వస్తుంది. ఇప్పుడు రెండవ అధ్యాయం, నాలుగవ బ్రాహ్మణం అయితే మళ్ళీ నాలుగవ అధ్యాయంలో ఐదవ బ్రాహ్మణం కూడా మైత్రేయీ బ్రాహ్మణమే. ఇంచుమించు మంత్రాలన్నీ కూడా అవే. రెండవసారి వచ్చినప్పుడు మొదటి మంత్రం అదనంగా వచ్చింది, ఆఖరి మంత్రంలో కొన్ని వాక్యాలు అదనంగా చేర్చబడ్డాయి. అది తప్పితే మిగతాదంతా అక్షరాలా అవే మంత్రాలు. అందువల్ల ఈ బ్రాహ్మణము చాలా ముఖ్యమైన బ్రాహ్మణము.

ఈ బ్రాహ్మణం సన్న్యాస విధానాన్ని సూచిస్తోంది కాబట్టి అనేక ముఖ్యమైన వేదాంతమంత్రాలు ఇందులో ఉన్నాయి కాబట్టి కూడా ఈ బ్రాహ్మణం చాలా ముఖ్యమైన బ్రాహ్మణం. ఇందులో యాజ్ఞవల్క్యుడు, మైత్రేయీల మధ్య సంవాదం జరుగుతుంది. ఇది భార్యాభర్తల మధ్య సంవాదం కాబట్టి ముఖ్యమైనది కాకపోయినా, ఇందులో ఎన్నో అక్షరలక్షల విలువ చేసే వాక్యాలు ఉన్నాయి.

మామూలుగా బ్రాహ్మణం గురువు పేరుమీద ఉంటుంది కాని ఇక్కడ శిష్యురాలు మైత్రేయి పేరుమీద ఉంది. ఎందుకంటే తర్వాత వచ్చే మరికొన్ని బ్రాహ్మణాలలో కూడా గురువు యాజ్ఞవల్క్యే. అందువల్ల 3, 4 అధ్యాయాలను కలిపి **మునికాండము** లేదా **యాజ్ఞవల్క్య కాండము** అంటారు.

ఈ బ్రాహ్మణములో చర్చించిన ప్రధాన అంశం బ్రహ్మవిద్య అంటే జీవాత్మ, పరమాత్మ ఐక్యబోధ. బ్రహ్మవిద్యలోని మూడు ప్రధాన అంశాలు ఇందులో వివరంగా వస్తాయి. బ్రహ్మవిద్య సారాంశం –

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాఽ పరః**

ఇవి కాక, ఇంకో విషయాన్ని శంకరులవారు నొక్కి వక్కాణిస్తున్నారు. అది సన్న్యాసం. తన సంబంధ భాష్యంలో బ్రహ్మవిద్యలో అంగంగా సన్న్యాసం స్వీకరించటం సూచించబడిందని శంకరులవారు వివరిస్తారు.

ఈ బ్రాహ్మణం యాజ్ఞవల్క్య కథతో మొదలవుతుంది. యాజ్ఞవల్క్యుడు ఒక గొప్ప ఋషి. యాజ్ఞవల్క్యుడు యజుర్వేదంలో దిట్ట. ఆయన గురువు వైశంపాయనుడు ఒక సందర్భంలో తన శిష్యులందరినీ పిలిచి ఒక ప్రాయశ్చిత్తకర్మ చేయమని చెప్పాడు. దానికి అందరూ ఎందుకు, తనొక్కడే చేయగలనన్నాడు యాజ్ఞవల్క్యుడు. అతనికి విద్యాగర్వం వచ్చిందని గ్రహించిన గురువు, తను నేర్చుకున్నదాన్నంతా వమనం చేయమన్నాడు. అతను అలాగే చేశాడు. అలా వమనం చేయబడ్డ విద్యను, తిత్తిరిపక్షుల రూపంలో ఋషులు తిన్నారు. కాలుష్యంవల్ల నల్లబడ్డదానిని **కృష్ణయజుర్వేదం** అంటారు.

ఆ తర్వాత యాజ్ఞవల్క్యుడు సూర్యభగవానుణ్ణి తనకు మళ్ళీ విద్య బోధించమని అడిగాడు. తను ప్రయాణిస్తూ ఉంటాననీ, తనతో ప్రయాణించాల్సి ఉంటుందనీ సూర్యుడు చెప్పాడు. అందుకు ఒప్పుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. సూర్యుణ్ణి వాజసని అని కూడా అంటారు. అందువల్ల యాజ్ఞవల్క్యుణ్ణి వాజసనేయః అనీ, ఆయన నేర్చుకున్న విద్యను వాజసనేయి సంహిత అనీ అంటారు. దీన్నే శుక్లయజుర్వేదం అని కూడా అంటారు.

యాజ్ఞవల్క్యునికి ఇద్దరు భార్యలు – మైత్రేయి, కాత్యాయని. మైత్రేయికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. బ్రహ్మ గురించే ఎక్కువగా మాట్లాడుతుంది కాబట్టి ఆమెను **బ్రహ్మవాదిని** అంటారు. కాత్యాయని ఇంటికే పరిమితమై పోయింది.

యాజ్ఞవల్క్యుడు బ్రహ్మవిద్య పొందాక, సన్న్యాసం స్వీకరించాలనుకున్నాడు. సన్న్యాసంలో రెండు రకాలు ఉంటాయి – వివిదిషా సన్న్యాసం, విద్వత్ సన్న్యాసం. వివిదిషా సన్న్యాసం జ్ఞానం పొందటానికి స్వీకరిస్తే, విద్వత్ సన్న్యాసం నిదిధ్యాసనం చేసుకోవటానికి స్వీకరిస్తారు. యాజ్ఞవల్క్యునికి జ్ఞానం వచ్చింది కాబట్టి అతను

స్వీకరించాలనుకున్నది విద్వత్ సన్న్యాసం. ఆ విషయం మైత్రేయితో చెబుతాడు. ఈ నేపథ్యంతో మొదటి మంత్రంలోకి అడుగు పెడదాము.

## మంత్రం 2.4.1

**మైత్రేయీతి హోవాచ యాజ్ఞవల్క్య ఉద్యాస్యన్ వా అరేఽ హమస్మాత్ స్థానాదస్మి హన్త తేఽ నయా కాత్యాయన్యాఽ ంతం కరవాణీతి ॥**

**మైత్రేయీతి హోవాచ యాజ్ఞవల్క్యః** – యాజ్ఞవల్క్యుడు, మైత్రేయితో ఇలా చెప్పాడు–

**ఉద్యాస్యన్ వా అరేఽ హమస్మాత్ స్థానాదస్మి** – అరే అనే పదంతో ఆమెను సంబోధిస్తున్నాడు. నేను గృహస్థాశ్రమంనుంచి పై ఆశ్రమానికి వెళ్ళాలనుకుంటున్నాను అన్నాడు. నేను సన్న్యాసం స్వీకరించాలనుకుంటున్నాను అనటం లేదు. సన్న్యాసం స్వీకరించటం అంటే తన ఆశ్రమధర్మాన్ని నిర్వర్తించకుండా పారిపోవటం కాదని నిరూపించాలనుకున్నాడు.

మూడు ఆశ్రమాలు తీసుకుంటే అవి బ్రహ్మచర్యం, గార్హస్థం, సన్న్యాసం. బ్రహ్మచారి పరిధి చాలా తక్కువ ఉంటుంది. తనూ, తన విద్య తప్ప బాహ్యప్రపంచంతో సంబంధం ఉండదు. గృహస్థు విషయానికి వచ్చేసరికి అతని పరిధి కొంచెం పెరుగుతుంది. కాని అది తనూ, తన కుటుంబం వరకే విస్తరించి ఉంటుంది. అదే సన్న్యాసి విషయం తీసుకుంటే అతని పరిధి ఎంతో విస్తారంగా ఉంటుంది. జగత్కళ్యాణం గురించి ఆలోచిస్తాడు అతను. అందువల్ల ఉద్యాస్యన్ పదాన్ని వాడాడు. నేను పైకి ఎదగాలనుకుంటున్నాను అన్నాడు.

అహమస్మాత్ స్థానాత్ – నేను ఉన్న స్థానంనుంచి అని అర్థం. నేను ఉన్న స్థానంనుంచి పైకి వెళదామను కుంటున్నాను అనే ఈ పదాలు తీసుకున్నారు శంకరులు. ఈ బ్రాహ్మణము సన్న్యాసాన్ని స్తుతిస్తున్నదని చెప్పటానికి ఇది ఒక సూచన.

**హంత తేఽ నయా కాత్యాయన్యాఽ ంతం కరవాణీతి** – నీకు, కాత్యాయనికి మధ్య ఉన్న సంబంధం ముగిస్తాను. మైత్రేయికి, కాత్యాయనికి మధ్య సంబంధం విడిగా ఏమీలేదు. యాజ్ఞవల్క్యుని ద్వారానే ఉంది. అతను వెళ్ళిపోయాక వారి మధ్య గొడవలు రాకూడదనే ఉద్దేశంతో వారిద్దరి మధ్య ఆస్తి పంపకాలు చేస్తానని చెప్పాడు. అంతం కరవాణీతికి సంబంధం అనే పదం కలుపుకోవాలి. తర్వాత వచ్చే మంత్రంవల్ల ఆస్తి పంపకాలు చేద్దామను కున్నాడని అర్థం చేసుకోవాలి.

## మంత్రం 2.4.2

**సా హోవాచ మైత్రేయీ। యన్ను మ ఇయం భగోస్సర్వా పృథివీ విత్తేన పూర్ణా స్యాత్కథం తేనామృతా స్యామితి నేతి హోవాచ యజ్ఞావల్క్యో యథైవోపకరణవతాం జీవితం తథైవ తే జీవితగ్ం స్యాదమృతత్వస్య తు నాశాస్తి విత్తేనేతి ॥**

**సా హోవాచ మైత్రేయీ** – ఈ మైత్రేయి యిలా చెప్పింది.

**యన్ను మ ఇయం భగోస్సర్వా పృథివీ విత్తేన పూర్ణా స్యాత్** – ఓ భగవాన్! ఒకవేళ డబ్బుతో నిండివున్న ఈ పృథివి అంతా నాది అయినా కూడా,

**కథం తేనామృతా స్యామితి** – నేను అమృతత్వాన్ని (మోక్షాన్ని) పొందుతానా?

యన్ను అంటే ఒకవేళ. భగవాన్ అని భర్తను సంబోధిస్తున్నది. పూర్వం భర్తను అలా గౌరవించేవారు. భర్త ఇంత సునాయాసంగా తన యావదాస్తినీ వదులుకుని సన్యాసం స్వీకరించటానికి వెళుతున్నాడంటేనే, అతనికి యింతకన్నా ఎక్కువ విలువైనదేదో దక్కిందని గ్రహించింది ఆమె. మైత్రేయిని బ్రహ్మవాదిని అంటారని ముందే చూశాము కదా! అందుకని ఆస్తి వివరాలు అడగకుండా, తనే ఎదురుప్రశ్న వేసింది. మీరు యిచ్చే ఆస్తి విషయం పక్కనపెట్టి, ఒకవేళ నాకు ఈ భూమ్మీద ఉన్న ఆస్తి అంతా వచ్చినా కూడా, నేను అమృతత్వాన్ని పొందుతానా అని అడిగింది.

మరణం అనేది ఎంత గొప్ప ఐశ్వర్యవంతునికైనా తప్పదు. ఐశ్వర్యం అపూర్ణం. దానితో పూర్ణత్వం కుదరదు.

మొత్తం ఆస్తి అంతా ఉన్నా కూడా తైత్తిరీయం ఆనంద మీమాంసను విశ్లేషిస్తూ మనిషి ఆనందం ఒక యూనిట్ మాత్రమే అంటుంది. దానికి వందరెట్లు మనుష్యగంధర్వ ఆనందం ఉంటుంది. ఇంక మోక్షం గురించి చెప్పాలా?

**నేతి హోవాచ యాజ్ఞవల్క్యః** – కాదు అన్నాడు యాజ్ఞవల్క్యుడు. కాదు అంటే ఆమె చెప్పింది సరికాదు అని కాదు అర్థం. అవును, నువ్వు చెప్పింది నిజమే, మోక్షాన్ని పొందలేవు అన్నాడు.

**యథైవోపకరణవతాం జీవితం తథైవ తే జీవితగ్ం స్యాత్** – భోగసామగ్రులతో కూడివున్న వారి జీవితం ఎట్లా ఉంటుందో, నీ జీవితం కూడా అట్లాగే ఉంటుంది. డబ్బు తృప్తినివ్వదు.

అంటే ధనంవల్ల ప్రయోజనం లేదా? ధనం ఇచ్చే ప్రయోజనం ఏమిటో స్పష్టంగా చెబుతున్నాడు యాజ్ఞవల్క్యుడు. సుఖసాధనలు ఉన్న వ్యక్తి జీవితం సుఖంగా ఉండవచ్చేమో కాని ఆనందంగా ఉండదు.

ధనం మంచాన్ని కొనగలదు కాని నిద్రను కొనలేదు
ధనం మనుష్యులను కొనగలదు కాని ప్రేమను కొనలేదు
ధనం ఆహారాన్ని కొనగలదు కాని ఆకలిని కొనలేదు
ధనం భోగాలను కొనగలదు కాని శాంతిని కొనలేదు

అలా ఎన్నైనా చెప్పకుంటూ పోవచ్చు. అదే అర్థం వస్తుంది ఈ మంత్రంలో. పూజ్య స్వామీజీ ధనవంతుడు, పేదవాడు అని విడిగా లేరు అంటారు. రెండే తెగలు ఉన్నారుట –

డబ్బున్న ఐశ్వర్యవంతుడు, డబ్బులేని పేదవాడు

ఎందుకలా అన్నారు అంటే పేదవాడు డబ్బుకోసం వెంపర్లాడుతాడు సరే, ఐశ్వర్యవంతుడు కూడా డబ్బు కోసమే వెంపర్లాడుతాడు. ఉన్నకొద్దీ ఇంకా కావాలనిపిస్తుంది అందరికీ, ఎక్కడో మైత్రేయి, నచికేతుడులాంటి వారికి తప్ప.

**అమృతత్వస్య తు నాశాస్తి విత్తేనేతి** – ఇది అక్షరలక్షలు పలికే వాక్యం. శంకరులవారు తరచు దీన్ని ఉటంకిస్తుంటారు.

**అమృతత్వస్య తు నాశా అస్తి విత్తేన**

ధనంవల్ల అమృతత్త్వం లభిస్తుందనే ఆశ లేదు. అందువల్ల సుఖాలను పొందటానికి ఐశ్వర్యాన్ని ఉపయోగించండి; శాంతి పొందటానికి ఉపనిషత్తుల బోధకు రండి.

ఇక్కడ కూడా శంకరులవారు ఒక లక్ష్యార్థాన్ని గ్రహిస్తున్నారు – మన సాంప్రదాయంలో వైదికకర్మను చేయటానికి కావాల్సిన అంశాలలో ఒకదానిగా ధనాన్ని పరిగణిస్తారు. ఏదైనా కర్మ చేయాలంటే దాన్ని పాంక్తం కర్మ అంటారు, ఎందుకంటే దానికి ఐదు అంశాలుండాలి. అవి – యజమాని, పత్ని, పుత్రుడు, మనుష్యవిత్తం, దైవవిత్తం. మనుష్యవిత్తం అంటే డబ్బు, దైవవిత్తం అంటే యజ్ఞాల గురించిన జ్ఞానం. అందువల్ల విత్తం సాధన అయింది, కర్మ సాధ్యం అయింది.

విత్తంవల్ల మోక్షం రాదు అని చెప్పటంవల్ల అర్థం ఏమిటి? డబ్బుతో చేసే కర్మను కూడా నిషేధించినట్టే. అంటే కర్మవల్ల మోక్షం రాదు. సాధనను కొట్టివేస్తే సాధ్యాన్ని నిషేధించినట్టే అర్థం.

ధనంవల్ల అమృతత్త్వం లభించదు అన్న వాక్యాన్ని కూడా సన్న్యాసం పరంగా చెప్పినట్టు తీసుకుంటారు శంకరులవారు. సన్న్యాసి శుద్ధపురుషుని క్రింద వస్తాడు. అతనిలో కర్తృత్వభావన ఉండదు. అతను జ్ఞానమార్గాన్ని ఎన్నుకుంటాడు.

## మంత్రం 2.4.3

**సా హోవాచ మైత్రేయీ యేనాహం నామృతా స్యాం కిమహం తేన కుర్యాం యదేవ భగవాన్ వేద తదేవ మే బ్రూహీతి ॥**

**సా హోవాచ మైత్రేయీ** – ఆ మైత్రేయి ఈ విధంగా చెప్పింది;

**యేనాహం నామృతా స్యాం కిమహం తేన కుర్యామ్** – 'దేనితో నేను అమరురాలను కాలేనో, దానితో నేనేం చేయాలి?' భూలోకంలో ఉన్న ఆస్తి మొత్తం ఉన్నా, దానితో నాకు మోక్షం రాదని మీరే చెబుతున్నారు కదా! అలాంటి ఆస్తిని నాకెందుకు యిస్తున్నారు? దానితో నేనేం చేసుకోను?

మైత్రేయిని నచికేతునితో పోల్చవచ్చు. నచికేతునికి కూడా యమధర్మరాజు ఇహలోక, పరలోక సుఖాలు ఎన్ని యిస్తానని చెప్పినా అతను లొంగలేదు. ఆత్మజ్ఞానమే కావాలని పట్టు పట్టాడు. అలాగే మైత్రేయి కూడా యాజ్ఞవల్క్యుడు యిస్తానన్న ఆస్తిని తృణప్రాయంగా చూసింది. అంతేకాదు;

**యదేవ భగవాన్ వేద తదేవ మే బ్రూహీతి** – ఓ భగవాన్, మీరేం నేర్చుకున్నారో అది నాకు నేర్పండి అని కోరింది.

ఇంత ఆస్తిని భర్త సునాయాసంగా వదిలి వెళ్ళిపోతున్నాడంటే, అతనికి యింతకన్నా విలువైనదేమిటో దొరికి ఉంటుందని గ్రహించింది ప్రాజ్ఞురాలైన మైత్రేయి. అందువల్లనే అమృతత్త్వం ఆస్తివల్ల వస్తుందా అని అడిగింది.

మీరు ఏ జ్ఞానం పొందారో, మీరు దేంట్లో ఆనందం ఉందనుకుని ఈ గృహస్థాశ్రమాన్నే కాదనుకుని సన్న్యాసం స్వీకరిద్దామనుకున్నారో, ఆ జ్ఞానాన్ని నాకు కూడా బోధించండి అని కోరింది.

నిజమైన ఐశ్వర్యం ఆత్మజ్ఞానం. దానిముందు ప్రాపంచిక సుఖాలు వెలవెలబోతాయి. అటువంటి ఆత్మజ్ఞానాన్ని కోరింది మైత్రేయి. అందుకే భర్తను భగవాన్ అని సంబోధించింది. శిష్యురాలిగా అవటానికి తన సంసిద్ధతను తెలియజేసింది దీనిద్వారా. అటువంటి శిష్యురాలు దొరకటంవల్ల యాజ్ఞవల్క్యుడు కూడా ఆనందించాడు.

## మంత్రం 2.4.4

**స హోవాచ యాజ్ఞవల్క్యః ప్రియా బతారే నస్సతీ ప్రియం భాషస ఏహ్యాస్స్వ వ్యాఖ్యాస్యామి తే వ్యాచక్షాణస్య తు మే నిదిధ్యాసస్వేతి ॥**

**స హోవాచ యాజ్ఞవల్క్యః ప్రియా బతారే నస్సతీ** – యాజ్ఞవల్క్యుడు బదులు చెబుతున్నాడు. అర్జునుడు కృష్ణభగవానుణ్ణి శరణుజొచ్చి శిష్యునిగా మారినట్టుగా, మైత్రేయి కూడా శిష్యురాలిగా మారింది. అటువంటి శ్రద్ధ ఉన్న శిష్యుణ్ణి ఏ గురువూ కాదనలేడు. అందువల్ల ఓ మైత్రేయీ, నువ్వు నాకు నచ్చావు అన్నాడు. అంతకు ముందు కూడా నువ్వు నాకు ప్రియమైనదానివి. ఇప్పుడు యింకా నచ్చావు. ఎందుకు?

**ప్రియం భాషసే**– నాకు ప్రియమైన మాటలు మాట్లాడుతున్నావు. ముందే మైత్రేయికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉందని చూశాము. అందువల్ల యాజ్ఞవల్క్యుడు నేర్చుకున్నదేదో తనూ నేర్చుకోవాలన్న తపన కలిగింది.

**ఏహ్యాస్స్వ వ్యాఖ్యాస్యామి** – రా, వచ్చి నా దగ్గరగా కూర్చో. నీకు వివరించి చెబుతాను. ఆత్మజ్ఞానం అడగందే యివ్వకూడదు, అలాగని ఎవరైనా శ్రద్ధ చూపి అడిగితే చెప్పననకూడదు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు రా చెబుతాను అన్నాడు.

**తే వ్యాచక్షాణస్య తు మే నిదిధ్యాసస్వేతి** – నేను వివరించి చెబుతున్నప్పుడు, నువ్వు ఆ విషయాన్ని ఏకాగ్రతతో విను అన్నాడు. ఈ వాక్యం కూడా సన్న్యాసాశ్రమాన్ని సూచిస్తున్నదంటారు శంకరులవారు. మైత్రేయి అతని భార్యగా కాక, శిష్యురాలిగా నేర్చుకుంది విద్య. అందువల్ల ఆత్మజ్ఞానం పొందటానికి సన్యసించాలంటారు శంకరులవారు. ఎందుకంటే ఇప్పుడు వీరిరువురి మధ్య ఉన్నది భార్యాభర్తల అనుబంధం కాదు, గురుశిష్యుల సంబంధం.

## మంత్రం 2.4.5

**స హోవాచ న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవత్యాత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి । న వా అరే జాయాయై కామాయ జాయా ప్రియా భవత్యాత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి । న వా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ పుత్రాః ప్రియా భవన్తి । న వా అరే విత్తస్య కామాయ విత్తం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ విత్తం ప్రియం భవతి। న వా అరే బ్రహ్మణః కామాయ బ్రహ్మ ప్రియం భవత్యాత్మనస్తు కామాయ బ్రహ్మ ప్రియం భవతి ।**

**న వా అరే క్షత్రస్య కామాయ క్షత్రం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ క్షత్రం ప్రియం భవతి । న వా అరే లోకానాం కామాయ లోకాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ లోకాః ప్రియా భవన్తి। న వా అరే దేవానాం కామాయ దేవాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ దేవాః ప్రియా భవన్తి । న వా అరే భూతానాం కామాయ భూతాని ప్రియాణి భవన్త్యాత్మనస్తు కామాయ భూతాని ప్రియాణి భవన్తి । న వా అరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి । ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయ్యాత్మనో వా అరే దర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానేనేదం సర్వం విదితమ్ ॥**

ఇక్కడినుంచి యాజ్ఞవల్క్యుని బోధ మొదలవుతుంది. ఈ మంత్రం వైరాగ్యాన్ని పెంపొందించటానికి చెప్పబడింది. మైత్రేయి వైరాగ్యాన్ని ప్రదర్శించినా కూడా ఆమెకు తీవ్రముముక్షుత్వం ఉందో లేదో పరీక్షించటానికి చెప్పబడింది. ఇది చాలా ముఖ్యమైన మంత్రం.

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**

అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. అంతేకాదు, అందరికీ ఒక షాక్ ట్రీట్‌మెంట్ యిచ్చే వాక్యం. భర్తకు, పిల్లలకు అంకితమయిపోయాను, నాకంటూ ప్రత్యేకం ఏమీ లేదు, నాది నిస్వార్థప్రేమ అని అనుకునే మనందరికీ ఒక పిడుగులాంటి సూత్రం. మనం ఎవరిని ప్రేమించినా వారిని ప్రేమించటంవల్ల మనకు ఆనందం కలుగుతుంది కాబట్టి ప్రేమిస్తున్నాము అనేది ఈ మంత్రం సారాంశం. మనం ప్రేమించే వస్తువులు, మనుష్యులు, లోకాల పట్టిక వస్తుంది యిందులో. ఈ భావన ఇదే ఉపనిషత్తులో మొదటి అధ్యాయంలో చూచాయగా చెప్పబడింది.

అన్నిటికన్నా అత్యంత గొప్ప ప్రేమ మనను మనం ప్రేమించుకోవటం. పిల్లలకన్నా, డబ్బుకన్నా, అన్నిటికన్నా మనమీద మనకు ప్రేమ ఎక్కువ అని అంతకుముందు కూడా వచ్చింది. ఎందుకు అని ఆలోచిస్తే దానికి మూడు కారణాలు చెప్పవచ్చు.

1. **స్వతఃసిద్ధ ప్రేమ** – మనను మనం ప్రేమించుకోవటం అనేది స్వతఃసిద్ధంగా ఏర్పడుతుంది. మనని మనం పాపాయిగా ఉండగా ప్రేమించుకున్నాం; యవ్వనంలో ఉండగా ప్రేమించుకున్నాం; నడివయస్సులో ఉండగా ప్రేమించుకున్నాం; ఇప్పుడు వృద్ధాప్యం వచ్చినా కూడా ప్రేమించుకుంటూనే ఉన్నాము.

2. **సర్వజనీన సత్యం** – తేనె తియ్యగా ఉంటుందనేది సర్వజనీన సత్యం. అదెంత సత్యమో మనని మనం ప్రేమించుకుంటామనేది కూడా అంత సర్వజనీన సత్యం. నాకు మాత్రమే నామీద నాకు ప్రేమ ఉండటం కాదు, మీకు కూడా మీమీద మీకు ప్రేమ ఉంటుంది.

3. **నిరుపాధిక ప్రేమ** – అంతేకాదు మనమీద మనకు ప్రేమ బేషరతుగా ఉంటుంది. నేను యవ్వనంలో ఉండనీ; వృద్ధాప్యంలో అడుగు పెట్టనీ; డబ్బులో మునిగితేలనీ; పేదరికంలో మగ్గనీ; నేను విద్యాధికుడిని కానీ; అల్పజ్ఞుడిని కానీ; ఏది ఏమైనా నామీద నాకు ప్రేమ ఉంటూనే ఉంటుంది. అందువల్ల దాన్ని నిరుపాధిక ప్రేమ అంటారు. ఉపాధి అంటే షరతులతో కూడినది; నిరుపాధిక ప్రేమ అంటే బేషరతుగా ఉన్నది.

ఇప్పుడు ఎదుటివారిమీద మనకుండే ప్రేమస్వరూపాన్ని ఈ అంశాల పరంగా చూస్తే ఎలా ఉంటుందో చూద్దాము.

1. **ఆగంతుక ప్రేమ** – అది స్వతఃసిద్ధ ప్రేమ కాదు. ఇతను నా భర్త, వీరు నా పిల్లలు అన్న భావనను పెంపొందించుకోవటంవల్ల ఏర్పడిన ప్రేమ. అంటే కావాలని ఏర్పరచుకున్న ప్రేమ.

2. **గౌణప్రేమ** – ఎప్పుడైతే అది పెంపొందించుకున్న ప్రేమ అవుతుందో అప్పుడే అది సర్వజనీనంగా ఉండదు. దీన్ని గౌణప్రేమ అంటారు. అందరికీ అందరిమీదా ప్రేమ సమానంగా ఉండదు. ఇంకా మాట్లాడితే ఎదుటి వారు నామీద చూపించిన ప్రేమనుబట్టి నా ప్రేమ ఉంటుంది.

3. **సోపాధిక ప్రేమ** – ఈ ప్రేమ షరతులతో కూడుకున్నది. ఎదుటివారు నాకు ఆనందాన్ని కలుగజేస్తే, నేనూ వారిని ప్రేమిస్తాను. లేకపోతే నేను ప్రేమించను. ఇది బేషరతుగా ఉండదు. నా భర్త నన్ను హింసిస్తున్నాడు, నాకు ఏమీ చేయడు, నన్ను ప్రేమించడు, అందువల్ల నేను అతన్ని ప్రేమిస్తున్నాను అని ఏ భార్యా కూడా చెప్పదు. అలాగే భర్త కూడా. డబ్బుంటే స్నేహితులు బెల్లం చుట్టూ ఈగల్లాగా చేరతారు, డబ్బు లేని మరుక్షణం మాయమవుతారు అనేది జగమెరిగిన సత్యం.

ఈ సోపాధిక ప్రేమనుంచి ఆఖరికి భగవంతుడు కూడా తప్పించుకోలేడు. ఆయన మన కోరికలు తీర్చినంత వరకూ మనం ఆయనను పూజిస్తాము. మనకు ఏదైనా పెద్ద దుర్ఘటన సంభవిస్తే ఆ దేవుడ్ని కూడా దూషించటానికి వెనుకాడము. పూజ పుస్తకాలన్నీ కట్టకట్టి తీసుకువెళ్ళి చెత్తబుట్టలో పడేస్తాము. ఎందుకు? ఆయన మనకు మంచి చేయలేదు కాబట్టి!

మనం ప్రేమించిన వ్యక్తి మనను మోసం చేస్తేనో, మనను తిరిగి ప్రేమించకపోతేనే అది మనకు పెద్ద షాక్. దాన్నించి తేలికగా కోలుకోలేము. అందువల్ల ప్రేమ పెళ్ళిళ్ళలో పెళ్ళయ్యాక మారాడు అనే మాట తరచు వినిపిస్తూంటుంది. మనం కోరినట్టు అతను ఉండకపోతే మనం తట్టుకోలేము. ఎవరూ బేషరతుగా ప్రేమను అందించలేరు. ఒకమాట గుర్తు పెట్టుకోవాలి! ఆమాటకొస్తే మీరు కూడా ఎవరినీ బేషరతుగా ప్రేమించలేరు. ఆఖరికి దేవుడినైనా సరే! అలాంటప్పుడు ఎదుటివ్యక్తినుంచి మీరెలా బేషరతుగా ప్రేమను ఆశించగలరు?

అందువల్ల ఎదుటివ్యక్తిమీద ప్రేమను సోపాధిక ప్రేమ, ఆగంతుక ప్రేమ, గౌణప్రేమ అంటారు. అది స్వచ్ఛమైన ప్రేమ కాదు. నామ్‌కే వాస్తే ప్రేమ లేదా గౌణప్రేమ అంటారు. ఎందుకు? ఎప్పుడైతే ప్రేమ షరతులతో కూడినదో, అది వచ్చిపోయే ప్రేమ అవుతుంది. కోరిక తీరితే ప్రేమ పొంగుకొస్తుంది; కోరిక తీరక పోతే ద్వేషం ముంచుకొస్తుంది. అందువల్ల అది స్వతఃసిద్ధమైన ప్రేమ కాదు. అది నిఖార్సైన ప్రేమ కాదు. డబ్బుంటే ప్రేమించి, డబ్బు లేకపోతే ప్రేమించకపోతే ఆ ప్రేమ ఉన్నది మనిషిమీదా, డబ్బుమీదా? నిస్సందేహంగా డబ్బుమీదే!

ఈ విషయాలను విశ్లేషిస్తే ప్రేమ వెనక కారణం అర్థమవుతుంది. దీన్ని ఇంగ్లీషులో **లాజిక్ ఆఫ్ లవ్** అంటారు.

1. **ముఖ్య ప్రేమ** – ముఖ్య ప్రేమ అంటే నిఖార్సైన, స్వతఃసిద్ధమైన, సహజమైన ప్రేమ. అది నామీద నాకు ఉంటుంది. ఎదుటివారిని ఎందుకు ప్రేమిస్తాను? అది **నాకోసం, నా ఆనందంకోసం**. అది వచ్చిపోయేది, కాని నామీద నాకు ప్రేమ వచ్చిపోయేది కాదు.

2. **ఆనంద హేతువు** – ఎవరినైనా ఎందుకు ప్రేమిస్తారు? వారు తనకు ఆనందాన్ని కలిగిస్తారు కాబట్టి. ఒక వస్తువును ప్రేమిస్తే అది ఆనందాన్ని ఇస్తుంది; ఒక వస్తువును ద్వేషిస్తే అది దుఃఖాన్ని కలుగజేస్తుంది. అందువల్ల ఎక్కడ స్వార్థంతో కూడిన ప్రేమ ఉందో, ఆ ఆనందం నిఖార్సైన ఆనందం కాదు. ఆనందం కలిగినట్టుగా అనిపిస్తుంది కాని, అది ఆనందం కాదు.

అందువల్ల లాజిక్ ఆఫ్ లవ్ తెలుసుకుంటే జీవితం బాగుంటుంది. లేకపోతే షాక్ తినాల్సి ఉంటుంది. మనం తెలుసుకునే తర్కం ఏమిటి? ఆత్మప్రేమ ఒకటే అసలైన ఆనందహేతువు.

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**

ఈ విషయం అర్థం చేసుకుంటే ఎవరిమీదా ద్వేషం పెంచుకోము. ఇంతవరకూ మా అబ్బాయికి నేనంటే చాలా ప్రేమ, ఇప్పుడు పెళ్ళయ్యాక మారిపోయాడు, భార్యకొంగు పట్టుకుని తిరుగుతున్నాడని బాధ పడతారు తల్లులు. ప్రేమసూత్రం అర్థం కాకపోవటంవల్ల ఈ దుఃఖం కలుగుతున్నది.

ఆత్మ పరమానంద స్వరూపం. ఆత్మ ఆనందస్వరూపం కాబట్టి, తక్కినవన్నీ దుఃఖస్వరూపం లేదా ఆనంద అభాసరూపం. తక్కినవన్నీ వేదాంతపరిభాషలో అనాత్మలోకి వస్తాయి. అందువల్ల మనం ఆత్మవైపు తిరిగి, అనాత్మమీద వైరాగ్యం పెంచుకోవాలి. అనాత్మమీద వైరాగ్యం పెంచుకోవాలంటే తక్కినవాటిని ద్వేషించమని కాదు అర్థం. వైరాగ్యం పెంచుకోవటమంటే అనాత్మనుంచి నిజమైన ఆనందం లేదా నిఖార్సైన ప్రేమను ఆశించక పోవటం.

పరిస్థితులమీద ఆధారపడి ఏర్పడిన ప్రేమను స్వీకరించండి; అదే సమయంలో మీరు ప్రేమించిన వ్యక్తి లేదా వస్తువు మీకు దూరమైనా కూడా ఆ వ్యక్తిని లేదా ఆ వస్తువును వదులుకోవటానికి సిద్ధపడండి. ఈ విధమైన మనస్థత్వాన్ని పెంపొందించుకుంటే, జీవితంలో ఏది ఎదురైనా తట్టుకునే శక్తి మీకు వస్తుంది. ఎవరైనా మీకు దూరమైనా మీకు బాధవేయదు. అందువల్ల వైరాగ్యం అంటే ఎవరినీ ద్వేషించనవసరం లేదు, ద్వేషించకూడదు కూడా. వైరాగ్యం అంటే ప్రేమతర్కాన్ని అర్థం చేసుకోవటం.

మీకు నిజమైన ఆనందం కావాలంటే ఆత్మానందంవైపుకు తిరగండి. అది దుఃఖరూపమూ కాదు, ఆనంద అభాసరూపమూ కాదు; అది అసలు సిసలు ఆనంద రూపం. ఇప్పుడు, ఈ నేపథ్యంతో మంత్రంలోకి అడుగు పెడదాము.

**స హోవాచ న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవత్యాత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి** – యాజ్ఞవల్క్యుడు తన బోధను మొదలు పెడుతున్నాడు. అరే అంటూ తన భార్యను తరచు సంబోధిస్తున్నాడు. ఓ మైత్రేయీ! నిశ్చయంగా భర్తను భర్తగా ప్రేమించటం లేదు; తనకు ఆనందం కలుగజేస్తున్నాడు కాబట్టి భర్తను

భార్య ప్రేమిస్తుంది. ముందే చెప్పినట్టుగా ఇది అందరికీ, ముఖ్యంగా ఆడవారికి షాక్ యిచ్చేటటువంటి వాక్యంగా కనిపిస్తుంది. కాని లోతుగా విశ్లేషిస్తే అదే నిజం. భర్తను భర్తగా ప్రేమిస్తే అతన్ని అతని లోటుపాట్లతో సహా, అతని బలహీనతలతో సహా ప్రేమించాలి. అతనితో పోట్లాడకూడదు. అతను నన్ను బాధిస్తున్నాడు కాబట్టి నాకు యిష్టం అని ఏ భార్యా చెప్పదు. అతను నాకు కావాల్సినవన్నీ చేస్తున్నాడు, నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు అంటారు.

పూజ్య స్వామీజీ **వియ్ లవ్ అదర్స్ ఫర్ అవర్ ప్లీజ్డ్** సెల్ఫ్ అంటారు ఈ మంత్రం వివరించేటప్పుడు. దానికి ఆయనిచ్చే వివరణ యిలా ఉంటుంది –

**నాకు ఫలానా వ్యక్తి అంటే యిష్టం**
**అతను నాకు ఇష్టమైన పనులు చేస్తాడు**

అంటే ఏమిటర్థం? అతను అతనుగా యిష్టం లేదు; అతను నాకు ఆనందం కలుగజేస్తాడు కాబట్టి యిష్టం. ఎప్పుడైతే ఆనందం కలగజేయటం మానేస్తాడో, అప్పుడే ప్రేమ కూడా తగ్గిపోతుంది.

ఇది ఒక్క భార్య విషయంలోనే కాదు, భర్తకు కూడా వర్తిస్తుంది.

**న వా అరే జాయాయై కామాయ జాయా ప్రియా భవత్యాత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి** – భార్యని భర్త ఎందుకు ప్రేమిస్తున్నాడు? తనకు ఆమె ఆనందాన్ని కలగజేస్తుంది కాబట్టి. ఒక భర్త తన భార్యను పొగుడుతూ, 'నేను కూర్చోమంటే కూర్చుంటుంది, నిల్చోమంటే నిల్చుంటుంది,' అని గర్వంగా చెబుతాడు. అంటే ఆమె అతని ఆనందంకోసం పాటుపడుతుంది కాబట్టి అతనికి ఆమె అంటే ఇష్టం. అంతదాకా ఎందుకు? యాజ్ఞవల్క్యుడు కూడా ముందు మంత్రంలో ఏమన్నాడు?

**ప్రియా బతారే నస్సతీ ప్రియం భాషసే**

నువ్వు నాకు నచ్చావు సుమా! ఎందుకు? అతని మనస్సుకు నచ్చే మాటలను పలికింది కాబట్టి.

**న వా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవంత్యాత్మనస్తు కామాయ పుత్రాః ప్రియా భవంతి** – ఇదే సూత్రం పుత్రులకు కూడా వర్తిస్తుంది. ఒక తల్లి, తన కొడుకు ఇంటికి వచ్చేటంతవరకూ హాల్లో కూర్చుని ఉన్నది కూడా చటుక్కున లేచి లోపలికి వెళ్ళిపోతుంది. ఎందుకు? కొడుకు తనను వెతుక్కుంటూ లోపలికి వస్తాడా లేక హాల్లోనే భార్యతో కూర్చుండిపోతాడా పరీక్షించడానికన్నమాట. అతను లోపలికి రాకపోతే, విషయం చెప్పనవసరం లేదు.

**న వా అరే విత్తస్య కామాయ విత్తం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ విత్తం ప్రియం భవంతి** – ఇదే సూత్రం ధనానికి కూడా వర్తిస్తుంది. పూజ్యస్వామీజీ దీని గురించి ఒక ఉదాహరణ చెబుతారు. ఒక వ్యక్తి దగ్గర అంతులేని నల్లధనం ఉందిట. ఒక రాత్రి దొంగలు పడి, ఆ నల్లధనాన్ని మొత్తం ఎత్తుకుపోయారుట. పోలీసు కంప్లైంట్ యివ్వలేదు; ఎవరికీ మనస్సు విప్పి చెప్పలేదు. గుండెపోటు వచ్చినంత పనయింది. సరిగ్గా ఆ సమయంలోనే ఇన్‌కంటాక్స్ అధికారులు అతని ఇంటిమీదకు దండెత్తారుట.

వారిని ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ఎక్కడ కావాలంటే అక్కడ వెతుక్కోమన్నాడు. తను పట్టుపడనన్న ఆనందం అతని మొహంలో చిందులు వేస్తున్నది. క్షణం క్రితం ఏ ధనమైతే అతన్ని మరణం అంచుల దాకా తీసుకు వెళ్ళిందో, అదే ధనం యిప్పుడు ఆనందంలో ఓలలాడించింది. అంటే దీన్నిబట్టి చూస్తే ఆనందం ధనంలో ఉందా, అతనిలో ఉందా? నిస్సందేహంగా అతనిలోనే ఉంది. తనను తృప్తి పరచటంకోసం ధనాన్ని ప్రేమించాడు కాని, ధనాన్ని ధనంగా ప్రేమించలేదు.

ఇదే శైలిలో ఈ మంత్రం కొనసాగుతుంది కాబట్టి మిగతా వాక్యాలు చూడకుండా ఆ పట్టికలో ఇంకేమున్నాయో చూద్దాము. విత్తం తర్వాత వచ్చిన విషయాలు వరుసగా - బ్రాహ్మణుడు, క్షత్రియుడు, లోకాలు, దేవతలు, ప్రాణులు.

**న వా అరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి** - ఇంత పెద్ద పట్టిక చెప్పీ చెప్పీ అలసిపోయి చివరకి ఏది తీసుకున్నా ఇదే సూత్రం వర్తిస్తుందంటున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**

ఇది అక్షరలక్షలు విలువజేసే వాక్యమని ముందే చూశాము. నా ఆనందంకోసం అన్నీ ప్రియమైనవి అవుతాయి. అంటే నాకు ఏది ఆనందం కలిగిస్తే అది నాకు ప్రియమైనది. ఆఖరికి భగవంతుడిని కూడా వదలము. భగవంతుడు నా కోరికలు తీరిస్తేనే ఆయనను నేను కొలుస్తాను.

స్వచ్ఛమైన ప్రేమ ఒక్క ఆత్మమీదే (అంటే నామీదే) సాధ్యమవుతుంది. భగవంతునిమీద స్వచ్ఛమైన ప్రేమ పుట్టాలంటే నేనూ, భగవంతుడూ ఒకటే అవాలి. ఇప్పుడు ప్రార్థిస్తున్నది అనాత్మరూప భగవంతుణ్ణి. ద్వైతభావనలో ఉంటే, ఇద్దరి మధ్య స్వచ్ఛమైన ప్రేమ ఉండదు.

అనాత్మ అసలు ఆనందాన్ని ఇవ్వలేదు అనే సారాంశాన్ని పంచదశిలో విద్యారణ్యులవారు కూడా టూకీగా చెబుతారు. తక్కినవారిమీద ప్రేమ స్వార్థంతో కూడుకున్నదనీ, తనమీద తనకున్న ప్రేమ గొప్పదనీ చూపిస్తారు ఆయన. ఆత్మ ఆనందస్వరూపం, శాశ్వతం.

**అహమేవ సుఖం నాఽన్యదన్యచ్చేన్నైవ తత్సుఖమ్।**
**అమదర్థం న హి ప్రియో మదర్థం న స్వతః ప్రియమ్॥** - అద్వైత మకరందం

ఇదే భావన ఇందులో కూడా. ఆత్మ పరమానందరూపం. అంటే పరిపూర్ణత్వం. ఆ విధంగా వైరాగ్యం సూచించబడింది.

అనాత్మ దుఃఖరూపం. అందువల్ల అనాత్మనుంచి ఆత్మవైపు తిరగాలి. వైరాగ్యం అంటే అనాత్మనుంచి వెనక్కి తిరగటం, ముముక్షుత్వం అంటే ఆత్మవైపు తిరగటం.

ఇది రెండు దశల్లో చేయాలి.

మొదటి దశ ఆనంద ప్రాప్తి = ఆత్మప్రాప్తి అని తెలుసుకోవటం. అంటే పరమానందం కావాలంటే ఆత్మను తెలుసుకోవాలి.

రెండవ దశ ఆత్మప్రాప్తి = జ్ఞానప్రాప్తి అని తెలుసుకోవటం. అంటే ఆత్మను తెలుసుకోవాలంటే ఆత్మ గురించిన జ్ఞానం పొందాలి అని తెలుసుకోవాలి.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – ఆత్మా వా అరే ద్రష్టవ్య అంటే అపరోక్షతయా జ్ఞాతవ్యః అంటే ఆత్మ నాకు భిన్నంగా లేదు అని తెలుసుకోవటం. అపరోక్ష ఆత్మను తెలుసుకుంటేనే అపరోక్ష ఆత్మను పొందటం. అంటే ఇక్కడ తెలుసుకుంటేనే పొందటం.

అనాత్మ విషయంలో అలా కాదు; తెలుసుకుంటే పొందినట్టు కాదు. స్వర్గం గురించిన జ్ఞానం పొందితే, స్వర్గప్రాప్తి కలగదు. అనాత్మ విషయంలో రెండు దశలుంటాయి. అవి జ్ఞానం పొందటం, దానికి తగ్గ కర్మ చెయ్యటం. స్వర్గం గురించి జ్ఞానం పొంది, దానికి తగ్గ కర్మ చెయ్యాలి.

జ్ఞానం + కర్మ = అనాత్మ; జ్ఞానం = ఆత్మ.

కాని, ఆత్మ విషయంలో జ్ఞానం పొందితేనే చాలు మోక్షం పొందుతాము. ఎందుకంటే నేను పొందాలనుకున్నది నాకు భిన్నంగా లేదని తెలుసుకుంటాను. స్వప్నపురుషుడు నిద్ర లోంచి లేస్తే చాలు జాగ్రద్ పురుషుడు అయిపోతాడు. దానికోసం అతను ఏ కర్మ కూడా చెయ్యనవసరం లేదు. అలాగే ఆత్మ గురించిన అపరోక్షజ్ఞానం పొందితే చాలు, ఏ కర్మా చెయ్యనవసరం లేదు.

ఆత్మ గురించి తెలుసుకోవాలంటే ఆత్మ గురించిన శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి.

## శ్రవణ, మనన, నిదిధ్యాసనల విశ్లేషణ

**శ్రవణం** – శ్రవణం అంటే కేవలం వినటం కాదు.

**ఉపక్రమాది షడ్లింగైః వేదాంతానాం తాత్పర్య నిశ్చయః**

వేదాంతంయొక్క తాత్పర్యాన్ని ఒక క్రమపద్ధతిలో విశ్లేషిస్తూ చెప్పిన సమర్థవంతమైన గురువు దగ్గర కొన్ని సంవత్సరాలు నేర్చుకోవటం శ్రవణం.

ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని గమనించాలి. శ్రోతవ్య అంది ఉపనిషత్తు. అంటే ఒక క్రమపద్ధతిలో వేదాంతంయొక్క తాత్పర్యాన్ని విశ్లేషించటం అని చూశాము. కాని వేదాంతం దేని గురించి బోధిస్తున్నది? ఆత్మ గురించి. ఈ పదాన్ని మంతవ్య, నిదిధ్యాసితవ్యకు కూడా కలుపుకోవాలి. అప్పుడు ఆత్మ శ్రోతవ్యః, ఆత్మ మంతవ్యః, ఆత్మ నిదిధ్యాసితవ్యః అని అర్థం వస్తుంది.

ఆత్మ గురించి తెలుసుకోవాలంటే, మననం చెయ్యాలంటే, నిదిధ్యాసనం చెయ్యాలంటే, దానికి ఒక ప్రమాణం కావాలి. సూక్ష్మక్రిములను చూడాలంటే మైక్రోస్కోప్, నక్షత్రాన్ని చూడాలంటే టెలిస్కోప్ వాడాలి. ఆత్మను విశ్లేషించటానికి ఏ స్కోప్ ఉంది? ఆత్మ ప్రత్యక్షాది ప్రమాణాలకు అందదని చూశాము. అయితే మరి ఆత్మజ్ఞానం పొందటం ఎలా?

కొంతమంది బాహ్యప్రపంచంనుంచి విడివడి, అంతర్ముఖులయి, 'నేనెవరు?' అని ధ్యానం చెయ్యాలి అంటారు. కళ్ళు మూసుకుని, నేనెవరు అని లోతుగా ఆలోచిస్తే ఆత్మ గురించి తెలుస్తుంది అంటారు కాని అది లాభం లేదు. మనస్సు, బుద్ధి కూడా ఆత్మవల్లనే పని చేస్తాయి. అందువల్ల ధ్యానం చెయ్యటంవల్ల ఆత్మ గురించి తెలుసుకోలేము; తర్కం ఉపయోగించి ఆత్మ గురించి తెలుసుకోలేము; ప్రత్యక్షప్రమాణంవల్ల ఆత్మ గురించి తెలుసుకోలేము; ఈ ప్రమాణాలేవీ పనిచెయ్యవు.

ఆత్మ గురించి శబ్దప్రమాణంవల్ల మాత్రమే తెలుసుకోగలము. అందువల్ల శ్రోతవ్యః అంటే వేదాంత అధ్యయనం చెయ్యాలి. వేదాంత ప్రమాణానికి రాకుండా ఆత్మ గురించి ఎవరూ తెలుసుకోలేరు. అందువల్ల ఆత్మ శ్రోతవ్యః అంటే వేదాంత శ్రోతవ్యః.

వేదాంత వాక్యాలను విశ్లేషించిన కొద్దీ, మనం లోతుగా తెలుసుకునేది మన స్వరూపం గురించే. వేదాంతవిశ్లేషణ అంటే ఆత్మవిశ్లేషణ. వేదాంతాన్ని ఎంత లోతుగా అర్థం చేసుకుంటే, ఆత్మ గురించి అంత పరిపూర్ణంగా అర్థమవుతుంది.

వేదాంతవిచారణ బాహ్యంగా ఉన్నట్టు అనిపించినా నిజానికి అది మనను అంతర్ముఖులను చేస్తుంది. శాస్త్రం నేర్చుకోవటం అద్దంలోకి చూడటం లాంటిది. అద్దంలో చూస్తే బాహ్యముఖంగా చూస్తున్నట్టు అనిపిస్తుంది కాని నిజానికి మనం అద్దంలో చూసేది ఎవరిని? మననే! అద్దంలో చూసేది అద్దాన్ని కాదు. చూడటానికి బాహ్యంగా ఉన్న అద్దాన్ని చూస్తున్నట్టు అనిపిస్తుంది కాని నిజానికి దానిలో తేరిపార చూసినకొద్దీ మనను మనం బాగా స్పష్టంగా చూసుకుంటాము.

ఒకవేళ మన మొహం స్పష్టంగా కనపడకపోతే అద్దాన్ని తుడుస్తాము; అయినా సరిగ్గా కనపడకపోతే అద్దాన్ని మరింత బాగా తుడుస్తాము. మన మొహం బాగా స్పష్టంగా కనపడేంతవరకూ తుడుస్తాము. వేదాంతవిచారణ కూడా అలాగే చెయ్యాలి. ఆత్మ గురించి స్పష్టమైన జ్ఞానం పొందేటంతవరకూ విచారణ చెయ్యాలి. వ్యాకరణం, మీమాంస, తర్కం నేర్చుకునేది అందుకే. ఇవి సమయాన్ని వృథా చేస్తున్నట్టుగా భావించకూడదు. వ్యాకరణం, మీమాంస, తర్కం నేర్చుకోవటం అద్దంలో మొహం స్పష్టంగా కనపడేందుకు తుడవటం లాంటిది. అవి ఎంత బాగా అర్థమయితే, ఆత్మ అంత బాగా అర్థమవుతుంది. అందువల్ల ఆత్మ గురించి వేదాంతశ్రవణం చెయ్యాలి.

వేదాంతశ్రవణం చేస్తే కలిగే ఫలం ఏమిటి? అజ్ఞాననివృత్తి. మన గురించిన అజ్ఞానం తొలగుతుంది. మన గురించిన అజ్ఞానం మనకు ఏం ఉంది? మన దుఃఖస్వరూపులం అనుకుంటాము. అందువల్ల ఆనందం బయటనుంచి రావాలని కోరుకుంటాము. ఆత్మజ్ఞానం పొందేవరకూ, ఈ అపోహలోనే జీవిస్తాము.

బాహ్యవస్తువులలో ఆనందం ఉందనే ఆలోచన మనలో ఎంతగా జీర్ణించుకుపోయిందంటే, అది నిజమనుకుంటాము. అది నిజమా కాదా అనే సందేహమే రాదు ఎప్పుడూ. ఆ భ్రమలో కూరుకుపోవటంవల్ల మనం చేసే అతి స్వల్పమైన పనినుంచీ, అత్యంత పెద్ద పనిదాకా, మనం ఆనందం పొందటంకోసం చేస్తాము. ఒక వ్యక్తి ప్రేమ పొందితే ఆనందంగా ఉంటాము అనుకుంటాము; ఒక వస్తువును పొందితే ఆనందంగా ఉంటాము అనుకుంటాము.

నా భార్య నా పక్కన ఉంటే ఆనందంగా ఉంటాను అనుకుంటాను. ఆమె నన్ను విడిచి ఒక్కరోజు వెళ్ళినా దుఃఖం కలుగుతుంది. అలాంటిది ఆమె నాకు మరణంద్వారా శాశ్వతంగా దూరమయితే దుఃఖసాగరంలో మునిగిపోతాను. అలాగే పిల్లలమీదే ప్రాణాలన్నీ పెట్టుకుంటాను. వారు పై చదువుల కోసమో, ఉద్యోగరీత్యానో విదేశాలకు వెళ్ళిపోతే, నాలో ఒక భాగం వారితో పాటు వెళ్ళిపోయినట్టుగా బాధపడతాను. ఆ విధంగా నేను చేసే ప్రతి ఒక్కపనీ, నేను చూపించే ప్రతి ఒక్క స్పందన. నేను వేసే ప్రతి ఒక్కప్రణాళికా, అన్నీ నాకున్న ఒక్క అపోహవల్ల జరుగుతున్నాయి. ఏమిటవి?

**అహం దుఃఖరూపః అస్మి**

ఆ దుఃఖం పోవాలంటే నాకు బాహ్య వస్తువులనుంచి ఆనందం రావాలి అనే అపోహ ఉంది.

ఈ ప్రాథమిక అపోహనే అజ్ఞానం లేదా అధ్యాస అంటారు. అజ్ఞాన నివృత్తి కలిగితేనే మనం ఆనందరూపులం అవగలము. ఆనందం వస్తువులలో లేదు; ఆనందం మనుష్యులలో లేదు; ఆనందం పరిస్థితులలో లేదు. మనం జీవించటానికి వస్తువులూ, మనుష్యులూ, పరిస్థితులూ కావాలి కాని ఆనందంగా జీవించటానికి మాత్రం కాదు. ఆనందంగా, పరిపూర్ణంగా జీవించటానికి ఇవేమీ అవసరం లేదు. మనుష్యులు ఉన్నా ఆనందమే; లేకపోయినా ఆనందమే. ఇలాంటి స్థితప్రజ్ఞత ఎప్పుడు కలుగుతుంది? అజ్ఞాననివృత్తి కలిగినప్పుడు కలుగుతుంది. దీన్ని పరమానంద ప్రాప్తి అంటారు. ఇది శ్రవణసాధన. **శ్రవణం అంటే అజ్ఞాననివృత్తి.**

**మననం** – మననం సంశయనివృత్తి చేస్తుంది. శ్రవణంలో నేర్చుకున్నదాన్ని నిస్సంశయ జ్ఞానంగా మలుచుకోవాలి మననంలో. శ్రవణంలాగానే, మననం కూడా వేదాంతబోధమీద ఆధారపడి ఏర్పడినదే. మనకు ఏవైనా సంశయాలు ఉంటే, వాటిని మననంలో తీర్చుకోవాలి.

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాఽ పరః**

ఇదీ వేదాంతసారం. బ్రహ్మసత్యం వరకూ ఏ సమస్యా లేదు. బ్రహ్మ సత్యాన్ని అందరూ, విశిష్టాద్వైతులు, ద్వైతులు కూడా ఒప్పుకుంటారు. వచ్చిన చిక్కల్లా జగన్మిథ్యా దగ్గరే. కనబడే జగత్తు నిజం కాదు, మిథ్య అనే జ్ఞానం పొందగానే మన కనుబొమ్మలను ఆశ్చర్యంగా పైకి ఎత్తుతాము. బుద్ధి బుద్ధిగా ఊరుకోదు. అనేక సందేహాలను కలుగజేస్తుంది.

జగత్తు ఎలా మిథ్య అవుతుంది? జగత్తు మన కంటికి అక్షరాలా కనిపిస్తోంది; జగత్తు తర్కానికి అందుతుంది. జగత్తులో మనం అనేక వ్యవహారాలు నడపటమే కాదు, ఆ జగత్తు మన జీవితాన్ని ప్రభావితం చేస్తుంది కూడా. జగత్తు విలువ జగత్తుకు ఉంది. అది మనకు సుఖదుఃఖాలను ఇస్తుంది. ఆకలి వేస్తే అన్నం పెడుతుంది; భయం వేస్తే రక్షణ ఇస్తుంది; ఆనందం కావాలంటే ఆనందంలో ఓలలాడిస్తుంది. అటువంటి జగత్తు లేదని ఎలా చెప్పగలరు? ఈ ప్రశ్న ద్వైతవాదులనే కాదు, అద్వైతానికి వచ్చినవారిని కూడా కుదిపివేస్తుంది.

అన్నం తింటే ఆకలి పోతున్నది. అటువంటి అన్నం లేదని ఎలా చెప్పగలరు? మందు వేసుకుంటే అనారోగ్యం పోతున్నది, అలాంటి మందు లేదని ఎలా చెప్పగలరు? నాకు అనారోగ్యాన్ని నయం చేసిన వైద్యుడు అక్షరాలా

నా కళ్ళముందు కనపడుతుంటే, ఆయన లేడని ఎలా చెప్పగలరు? జగత్తు మిథ్య అనగానే ఇలా గజిబిజిగా అనేక సందేహాలు కలుగుతాయి.

పోనీ అని ఎలాగోలా దీనికి ఒప్పుకున్నా కూడా మూడవవాక్యం అస్సలు స్వీకరించలేను. జీవో బ్రహ్మైవ నాఽపరః . నేను బ్రహ్మను, నేను ఆనందస్వరూపుడను, నేను నిత్యుడను; నేను శాశ్వతడను; నేను సర్వవ్యాపకుడను వంటి వాక్యాలను ఎలా స్వీకరించగలను? నా అనుభవం దానికి భిన్నంగా ఉంది. అనుభవం నేను జీవిని, నేను దుఃఖస్వరూపుడిని, నేను అనిత్యుడిని, నేను అశాశ్వతుడిని, నేను పరిచ్ఛిన్నుడిని అని చెబుతున్నది.

నేను బ్రహ్మను అని కాగితాలమీద రాసుకోవటానికి బాగుంటుంది కాని, నిజజీవితంలోకి వచ్చేసరికి, నాకేదైనా కష్టం కలిగితే ఆ బ్రహ్మకు మొర పెట్టుకోవటమే తెలుసు. నేను బ్రహ్మను అనే వాక్యం సత్యం. సత్యం అంటే అన్నివేళలా ఉంటుంది. వేదాంతం నేర్చుకునే ఆ గంటా ఉండి, తర్వాత నేను జీవిని అని ఆలోచనకు జారిపోకూడదు. కాని ఈ విషయాన్ని తార్కికంగా ఆలోచించే బుద్ధి అంత తేలికగా స్వీకరించలేదు. బుద్ధిపరంగా ఎన్నో సందేహాలు కలుగుతాయి. అందువల్ల మననంలో ఈ సందేహాలను నివృత్తి చేసుకోవాలి.

సంశయనివృత్తి కలిగితేనే 'అహం బ్రహ్మ అస్మి,' వాక్యాన్ని సత్యంగా అన్నివేళలా స్వీకరించగలుగుతాము. నాకు ఎటువంటి సమస్య వచ్చినా నేను చలించను అనగలిగే ధైర్యం ఉండాలి. అహం బ్రహ్మ అస్మి అని క్లాసులోనేకాక, అనారోగ్యం కలిగినప్పుడు కూడా అనగలగాలి. అంతేకాదు అంత్యకాలం సమీపించి, ఈ ప్రపంచంనుంచి నిష్క్రమించాల్సి వచ్చినప్పుడు కూడా అనగలగాలి. ఇదీ మననంయొక్క ప్రయోజనం. మననం అంటే బుద్ధిలో కలిగే సంశయాలను తొలగించటం. **మననం అంటే సంశయనివృత్తి.**

**నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం అంటే విపరీత భావనా నివృత్తి.

**నిస్సంశయే అర్థే మనసః స్థాపనమ్**

మననం స్థాయిలో నిస్సంశయజ్ఞానం కలుగుతుంది. జ్ఞాననిష్ఠలో నిలబడటం నిదిధ్యాసనం. ఒకవేళ నిస్సంశయజ్ఞానం కలగకపోతే, ఇంకా కొంత మననం చెయ్యాలి. అలా నిస్సంశయజ్ఞానం కలిగాక, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి. అంటే ఆ వేదాంతవాక్యాలమీద కొంతసేపు సమయాన్ని వెచ్చించి, వాటి గురించి ఆలోచించాలి.

నిదిధ్యాసనంలో తర్కం ఉపయోగించము. తర్కం ఉపయోగించాలంటే మననానికి వెళ్ళాలి. నిదిధ్యాసనం కూడా ధ్యానంలాంటిదే కాని దానికీ దీనికీ చాలా తేడాలున్నాయి. ధ్యానంలో ఒకచోట కూర్చోవాలి, నిటారుగా కూర్చోవాలి, కళ్ళు మూసుకోవాలి, మనస్సులోని ఆలోచనలను అరికట్టాలి. కాని నిదిధ్యాసనం సముద్రపుటొడ్డున నడుస్తూ కూడా చెయ్యవచ్చు, నిటారుగా కూర్చోనవసరం లేదు, కళ్ళు మూసుకోనవసరం లేదు. ముఖ్యంగా మనుస్సులోంచి ఆలోచనలను తొలగించనవసరం లేదు.

నిజానికి నిదిధ్యాసనంలో మనస్సు ఉండాలి. మనస్సులో ప్రయత్నపూర్వకంగా శ్రుతివాక్యాలను ప్రవేశపెడతాము. ఉదాహరణకు 'నేను అంతకుముందూ, ఇప్పుడూ, ఎప్పుడూ బ్రహ్మనే,' అనే వాక్యం. మోక్షం కావాలని నిదిధ్యాసనం చెయ్యము. ఎందుకంటే మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు అని తెలుసుకుంటాము. నేను అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ముక్తపురుషుడినే.

అందువల్ల నిదిధ్యాసనంలో మోక్షాన్ని ఆశించము; కొత్త అనుభవాన్ని ఆశించము; కొత్త జ్ఞానాన్ని ఆశించము. నిదిధ్యాసనంలో మోక్షం కలగదు; సందేహనివృత్తి కలగదు; తర్కం ఉండదు. నేర్చుకున్న వేదాంతబోధద్వారా విపరీతభావాలను తొలగించుకోవాలి.

విపరీతభావనలు అంటే మనస్సులో కలిగే సహజమైన రాగద్వేషాలు, షడ్వికారాలైన కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలు. సంసారం అంటే అహంకారమమకారాలు అంటారు. నేను అనే అహంకారం, నావారు అనే మమకారం. వారిమీద నేను పెట్టుకున్న ఆశలు ఎల్లప్పుడూ నెరవేరవు. అందువల్ల నాకు బాధ కలుగుతుంది. సంసారాన్ని ఇంకో విధంగా వర్ణించాలంటే బాధ, పశ్చాత్తాపం. ఎవరైనా నన్ను ఏదైనా అంటే నాకు బాధ కలుగుతుంది. ఎవరినైనా నేను ఏదైనా తీవ్రంగా అనేస్తే, అనేశాక చాలా బాధపడతాను. దాన్ని పశ్చాత్తాపం అంటారు.

బుద్ధిలో అహం బ్రహ్మ అస్మి జ్ఞానం కలిగినా కూడా, మనస్సులో రాగద్వేషాలు పోవు. మనస్సు ప్రశాంతంగా ఉండదు. అలా మనస్సులో రాగద్వేషాలు పోకపోతే, నేర్చుకున్న జ్ఞానం వంటపట్టదు. మనస్సు ప్రశాంతంగా లేకపోతే, నేను ఆనందస్వరూపుడిని అని గట్టిగా చెప్పలేను.

నిదిధ్యాసనం అంటే మనస్సులో కలిగే భావోద్రేకాలను పారద్రోలి, జ్ఞానాన్ని నిలబెట్టటం. ఇది ఏదో ఒక సమయంలో ఒకచోట కాసేపు కూర్చుని చేసేది కాదు. ఇది నిరంతరం నా మానసిక ఉద్రేకాలను గమనిస్తూ అహంకారమమకారాలను తొలగించుకునేందుకు చేసే ప్రయత్నం. రోజులో ఎన్నిసార్లు నాకు కోపం వస్తోంది, ఎన్నిసార్లు ఎవరినైనా బాధపెట్టాను అనేది గమనిస్తూ, వాటిని తగ్గించుకుంటూ రావాలి. **నిదిధ్యాసనం అంటే విపరీతభావనా నివృత్తి.**

ఇప్పుడు ఈ మూడింటినీ ఒక్కముక్కలో చెప్పాలంటే – శ్రవణం–అజ్ఞాననివృత్తి; మననం–సంశయనివృత్తి; నిదిధ్యాసనం–విపరీతభావనా నివృత్తి.

శంకరులవారు ఈ మూడూ సమానంగా ముఖ్యమే అంటారు. ఒకటి పాటించి, ఇంకొకటి వదిలేస్తాననే అవకాశమే లేదు. అత్మజ్ఞాననిష్ఠలో ఉండాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు మూడూ చెయ్యాలి. మూడు సాధనలూ ముఖ్యమే అన్నా కూడా, దేని పాత్ర ఎంతమేరకు అనే విషయంలో చాలా అయోమయం ఉంది కొందరిలో. ఆ వాదనలేమిటో చూద్దాము.

**ఒక వాదన** – శ్రవణం పరోక్షజ్ఞానాన్నిస్తే, నిదిధ్యాసనం అపరోక్షజ్ఞానాన్నిస్తుంది – ఇది ఒక వాదన. అంటే శ్రవణంలో కలిగిన జ్ఞానాన్ని అనుభవించాలంటే నిదిధ్యాసనం చెయ్యాలి అంటారు వారు. దానికి వారు మన అనుభవం తీసుకుంటారు.

లౌకిక జీవనంలో మనం ఒక ఆపిల్‌పండు గురించి విన్నామంటే, దాని గురించిన పరోక్షజ్ఞానమే కలుగుతుంది మనకు. దాని రంగు, రుచి, ఆకారం లాంటివి వారు వర్ణిస్తారు కాని నిజంగా ఆ ఆపిల్‌ను తింటేనే దాని గురించిన అపరోక్షజ్ఞానం కలుగుతుంది మనకు అంటారు వారు. ఈ ఉదాహరణని తీసుకుని, అలాగే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పరోక్షజ్ఞానం, ఆ బ్రహ్మను నేనే అని అనుభవంలోకి రావాలంటే నిదిధ్యాసనం చెయ్యాలి.

అందువల్ల శ్రవణం ఆత్మజ్ఞానం ఇస్తే నిదిధ్యాసనం ఆత్మ సాక్షాత్కారం ఇస్తుంది అంటారు వారు. అంటే శ్రవణంలో నేర్చుకున్న ఆత్మను నిదిధ్యాసనంలో అనుభవిస్తాము అంటారు వారు. ఇది సరియైన వాదన కాదు.

**అద్వైత సిద్ధాంతి జవాబు** – శ్రవణం అపరోక్ష జ్ఞానాన్ని ఇస్తుంది; శ్రవణం మాత్రమే అపరోక్షజ్ఞానాన్ని ఇస్తుంది. దీన్ని శబ్ద అపరోక్షజ్ఞానం అంటారు. ఒకవేళ శ్రవణంలో అపరోక్షజ్ఞానం కలగకపోతే, మనన, నిదిధ్యాసనల్లో కలగదు. మనం కూడా ఈ విషయాన్ని మన అనుభవంలోంచే చెప్పగలము. దానికి రెండు ఉదాహరణలు చెప్పవచ్చు. అవి సోఽయం దేవదత్తః, దశమస్త్వమసి.

**సోఽయం దేవదత్తః** – దేవదత్త అనే వ్యక్తికోసం ఒక వ్యక్తి వెతుకుతున్నాడు. ఆ దేవదత్తుణ్ణి ఇతను ఎప్పుడో 25 సంవత్సరాల క్రిందట చూశాడు. ఇప్పుడు అతని రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. జుట్టు తెల్లబడి పోయింది, శరీరం ముడతలు పడిపోయింది. ఎవరో వచ్చి నువ్వు వెతుకుతున్న దేవదత్తుడు ఇతనే అని చెబుతాడు. ఆ మాటలు వింటే కలిగేది పరోక్షజ్ఞానమా, అపరోక్షజ్ఞానమా? అపరోక్షజ్ఞానమే.

**దశమస్త్వమసి** – అలాగే రెండవ ఉదాహరణ – నువ్వే ఆ పదవ మనిషి. ఒక మనిషి తగ్గిపోయాడని ఖంగారు పడుతుంటే ఎవరో వచ్చి నువ్వు వెతుకుతున్న పదవ మనిషివి నువ్వే అని చెబుతాడు. అది అపరోక్షజ్ఞానమా, పరోక్షజ్ఞానమా? అపరోక్షజ్ఞానమే.

రెండు రకాల పదాలు ఉన్నాయి. అవి పరిచయపదాలు, వర్ణణాత్మకపదాలు. పరిచయపదాలు అపరోక్షజ్ఞానాన్ని ఇస్తాయి. వర్ణాత్మక పదాలు దూరంగా ఉన్న పదాన్ని వర్ణిస్తాయి. అందువల్ల అవి పరోక్షజ్ఞానాన్ని ఇస్తాయి. పరిచయపదాలు తెలిసిన విషయాన్ని పరిచయం చేస్తాయి. దేవదత్తుడు ముందే తెలుసు, అతనే ఇతను అని పరిచయం చేసింది. వేదాంతంలో పరిచయవాక్యాలు ఉంటాయి. అవి నా ఆత్మను నాకు పరిచయం చేస్తాయి. అందువల్ల శ్రవణంద్వారా అపరోక్షజ్ఞానం కలుగుతుంది. మనన, నిదిధ్యాసనలు ప్రతిబంధాలను నివృత్తి చేస్తాయి.

ఇక్కడితో శ్రవణ, మనన, నిదిధ్యాసనల విశ్లేషణ ముగిసింది.

## తవ్యకారం విశ్లేషణ

**ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః** – ప్రతి పదానికీ చివర 'తవ్య' కారం వచ్చి చేరింది. సంస్కృత వ్యాకరణం ప్రకారం తవ్య అంటే విధివాక్యం. చేసితీరాలని అర్థం. కర్తవ్యం అంటే ఆ పనిని చేసితీరాలి. దీన్ని విధిలింగ్ లేదా విధి ప్రత్యయం అంటారు.

మీమాంస శాస్త్రంలో ఈ విధిలింగ్ చాలా ముఖ్యమైన అంశం. ఈ విధి ప్రత్యయాన్ని వేదాంతంలో కూడా చూస్తాము. ఈ ఉపనిషత్తులోనే విద్యాసూత్రంలో చూశాము.

**ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి** – 1.4.7

అక్కడ ఉపాసీత ఉంటే ఇక్కడ ద్రష్టవ్య, శ్రోతవ్య అని ఉంది. ఈ విధి ప్రత్యయం గురించి చూద్దాము. ఇక్కడ వాక్యం మళ్ళీ ఒకసారి చూద్దాము.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – ఈ వాక్యాన్ని రెండుగా చూద్దాము.

1. ఆత్మా వా (అరే) ద్రష్టవ్యః.
2. (ఆత్మా వా) శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః.

ఆత్మా వా ద్రష్టవ్యః అంటే ఆత్మా వా అరే అపరోక్షతయా ద్రష్టవ్యః అంటే ఆత్మ నేను అని తెలుసుకోవాలి.

ఇక్కడ ఒక సంగతి గమనించాలి. వేదాంతంలో ఎక్కడ విధిప్రత్యయం వచ్చినా దాన్ని విధివాక్యంగా తీసుకోకూడదు, మామూలు వాక్యంగా తీసుకోవాలి. ఎందుకంటే వేదాంతం ప్రకారం జ్ఞానం విషయం వచ్చేసరికి ప్రత్యేకించి దేన్నీ విధించలేము. కర్మ విషయంలోనే విధివాక్యం వస్తుంది.

జ్ఞానానికి విధివాక్యం రాదు, కర్మకు మాత్రమే విధివాక్యం వస్తుంది అనటంలో జ్ఞానం వేరు, కర్మ వేరు అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. కర్మ జ్ఞానం కాదు; జ్ఞానం కర్మ కాదు. అందువల్ల వేదాంతంలో జ్ఞానం పొందటం కర్మ కిందికి రాదు. జ్ఞానం పొందటం కర్మ కిందికి ఎందుకు రాదు? దానికి రెండు కారణాలున్నాయి. అవి ఫలభేదం, నిర్ణయభేదం.

1. **ఫలభేదం** – ఫలం లేదా ప్రయోజనంలో కర్మకు, జ్ఞానానికి మధ్య భేదం ఉంది. కర్మ చేస్తే నాలుగు ఫలాలు వస్తాయి. జ్ఞానం ఈ నాలుగింటిలో దేన్నీ కలుగజేయదు.

ఆ నాలుగు ఫలాలు ఆప్తి, ఉత్పత్తి, మార్పు, శుద్ధి. అంటే ఒకచోటికి చేరటం, ఉత్పత్తి చెయ్యటం, అది మారటం, శుద్ధి చెయ్యటం. ఉదాహరణకు ఉత్పత్తి చెయ్యటం అంటే పంట పండించటం, దాన్ని శుద్ధి చెయ్యటం అంటే వడ్లను బియ్యంనుంచి విడదీయటం; ఆప్తి అంటే పల్లెటూరునుంచి పట్నానికి తరలించటం; మార్పు చెయ్యటం అంటే బియ్యాన్ని అన్నంగా వండటం.

ఇప్పుడు జ్ఞానం విషయానికి వస్తే, జ్ఞానం పొందినంత మాత్రాన ఈ నాలుగింటిలో ఏ పనీ అవదు. ఉదాహరణకు నేను లండన్ గురించి నేర్చుకున్నంత మాత్రాన లండన్ వెళ్ళను. అలా జ్ఞానం పొందితేనే వెళ్ళగలిగితే టికెట్టు కొనటం, ప్రయాణం చెయ్యటంలాంటి ప్రయాసలు ఉండవు. అంటే ఆప్తి లేదు. ఇడ్లీ గురించి తెలుసుకుంటే ఇడ్లీని ఉత్పత్తి చెయ్యలేను. అంటే ఉత్పత్తి లేదు. సాంబారులో ఉప్పు తక్కువగా ఉందని తెలిసినంత మాత్రాన సాంబారు రుచి మారదు. అంటే మార్పు చెందదు. ఈ ప్రదేశం శుద్ధంగా లేదని తెలిసినంత మాత్రాన ఈ ప్రదేశం శుద్ధి చెందదు. అందువల్ల జ్ఞానం పొందితే ఆప్తి, ఉత్పత్తి, మార్పు, శుద్ధి – ఫలాలు కలగవు.

అయితే జ్ఞానఫలం ఏమిటి? అది ఒక వస్తువును ఉన్నది ఉన్నట్టుగా చూపిస్తుంది. దాన్ని వస్తుస్ఫురణం, వస్తుప్రకాశకం, వస్తు ఆవరణ నివృత్తి అంటారు. ఈ జ్ఞానం జ్ఞానఫలం. కర్మ ఇటువంటి జ్ఞానఫలాన్ని ఇవ్వదు. ఒకవేళ మీకు ఒక గడియారం గురించి తెలియలేదు అనుకోండి. అదేమిటో తెలుసుకోవటానికి ఎన్ని కర్మలు చేసినా లాభం లేదు. ఆ విధంగా కర్మఫలం వేరు, జ్ఞానఫలం వేరు.

2. **నిర్ణయ భేదం** – జ్ఞానం పొందటానికి కూడా మనస్సును (బుద్ధిని) ఉపయోగించమా? లేదు. కర్మకు మనస్సును (బుద్ధిని) ఉపయోగిస్తాము. ఒక పని చెయ్యాలా వద్దా అని బుద్ధి నిర్ణయిస్తుంది. కర్మలో ఉపాసన,

ధ్యానం కూడా వస్తాయి. జ్ఞానం బుద్ధిమీద ఆధారపడదు. జ్ఞానాన్ని జ్ఞానతంత్రం అనీ, కర్మను కర్మతంత్రం అనీ అంటారు. ఈ క్రింది ఉదాహరణను చూస్తే అర్థమవుతుంది.

అగ్నిమీద ఉపాసన చెయ్యాలా వద్దా అనేది మనిషి ఇష్టంమీద ఆధారపడివుంటుంది. కాని జ్ఞానం అలా కాదు. ఇంకో విధంగా చెప్పాలంటే జ్ఞానం జ్ఞాతా అదుపులో లేదు కాని కర్మ కర్త అదుపులో ఉంది. అదెలా?

ఉదాహరణకు మీరు ఈ బృహదారణ్యకోపనిషత్తు గురించి తెలుసుకోవాలనుకున్నారనుకోండి. దానికి స్వామీజీ బోధకు వెళ్ళాలి. బోధకు వెళ్ళటం, మానటం మీ చేతిలో ఉంది. అంటే కర్తగా మీకు ఎన్నుకునే అధికారం ఉంది. బోధకు వెళ్ళాలనిపిస్తే వెళ్ళవచ్చు, లేకపోతే ఇంట్లోనే కూర్చోవచ్చు. కాని ఒకసారి బోధకు వెళ్ళాక, మీరు జ్ఞాత అవుతారు. తెలుసుకునే వ్యక్తి అవుతారు. జ్ఞాతగా మీకు ఎన్నుకునే నిర్ణయం లేదు. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఆ బోధను వినాలి. మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా స్వామీజీ ఏంచెపితే అది వినాలి. ఆయన సంస్కృతం వాడినా, ఇంగ్లీషులో చెప్పినా మీకేమీ అందులో అధికారం లేదు.

ఇదే సూత్రం అన్ని ఇంద్రియాలకూ వర్తిస్తుంది. మీరు ద్రష్ట అవాలని నిర్ణయించుకున్నాక ఏం చూడాలో మీ ఇష్టంలో లేదు. ఎదురుగా ఏది ఉంటే అది చూడాలి. అలా శ్రోత అయితే, ఎవరు ఏది చెపితే అది వినాలి. ఆ విధంగా కర్మ కర్మతంత్రం, జ్ఞానం జ్ఞానతంత్రం.

కర్మలో కర్తకు అధికారం ఉంది; జ్ఞానంలో జ్ఞాతకు అధికారం లేదు. అందువల్ల కర్మకూ, జ్ఞానానికి భేదం ఉంది. ఇది రెండవ భేదం. ఈ భేదం అర్థమయితే, తేలిగ్గా ఒక ఉపసిద్ధాంతాన్ని ఏర్పరచుకోవచ్చు. ఏమిటది?

ఎక్కడ ఛాయిస్ ఉందో, అక్కడ విధివాక్యం ఉంటుంది. నిర్ణయం తీసుకునే అధికారం లేనిచోట విధివాక్యానికి చోటు లేదు. నిజానికి ఈ సూత్రాన్ని ఉపయోగించే, మనిషికి ఫ్రీవిల్ ఉందని మనం నిరూపిస్తున్నాము. శాస్త్రం విధివాక్యాలు, నిషేధవాక్యాలు చెబుతున్నదంటేనే దాని అర్థం మనకు ఫ్రీవిల్ ఉందని. దాన్నే ఛాయిస్ అంటారు. నిజం చెప్పాలా వద్దా అనేది మన చేతిలో ఉంది. అహింస పాటించాలా, హింస చూపాలా అనేది మన చేతిలో ఉంది. అందువల్ల శాస్త్రం సత్యం వద, ధర్మం చర అని చెబుతుంది.

ఒకవేళ మనకు ఛాయిస్ లేకుండా మనం ఒద్దనుకున్నా మంచివారుగా ఉంటే, శాస్త్రం పని కట్టుకుని మంచి పని చెయ్యండి అని ఆదేశించనవసరం లేదు. అలాగే వద్దనుకున్నా చెడుపని చేసేటట్టు ఉంటే, శాస్త్రం పని కట్టుకుని చెడు చెయ్యకండి అని ఆదేశించనవసరం లేదు. కర్మకాండలో, కర్మ చెయ్యటంలో ఛాయిస్ ఉంది కాని జ్ఞానం పొందటంలో ఛాయిస్ లేదు.

అందువల్ల ఆత్మా వా అరే ద్రష్టవ్యః అంటే అది విధివాక్యం కాదు. విధివాక్యంలా అనిపించినా, ఇది జ్ఞానకాండకు చెందింది కాబట్టి ఇది విధివాక్యం కాదు. ఇది మొదటి భాగం.

**ఆత్మా వా అరే శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – ఆత్మజ్ఞానం పొందాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. ఈ వాక్యం విధివాక్యం. అంటే ద్రష్టవ్యలో విధివాక్యం లేదు కాని శ్రోతవ్య, మంతవ్య, నిదిధ్యాసితవ్యలో విధివాక్యం ఉంది.

మీమాంస శాస్త్రంలో విధివాక్యాలు మూడు రకాలు ఉన్నాయి. అవి – అపూర్వవిధి, నియమవిధి, పరిసంఖ్యావిధి.

ఎ) **అపూర్వ విధి** – దీన్ని విధివాక్యం అంటారు.

**వ్రీహీన్ ప్రోక్షతి**

ఇది మీమాంస శాస్త్రంలో ఎప్పుడూ ఇచ్చే ఉదాహరణ. బృహిః అంటే పొట్టు. ఇది వచ్చిన సందర్భం చూస్తే మనకు ఈ వాక్యం తేలికగా అర్థమవుతుంది.

పూర్వమీమాంసలో అనేక యజ్ఞాలను చర్చిస్తారు. వాటిలో ఒక యజ్ఞం దర్శపూర్ణమాస యాగం. ఆ యజ్ఞంలో వేసే ఒక ఆహుతి పేరు పురోడాశం. దాన్ని బియ్యంతో చేస్తారు. ఈ పురోడాశం చెయ్యాలంటే బియ్యం కావాలి. బియ్యం కావాలంటే వడ్లు కావాలి. వడ్లను దంచి పొట్టు తియ్యాలి. అంటే ఈ యజ్ఞకర్త వడ్లను సరాసరి పొలంనుంచి తెచ్చి, తనే స్వయంగా వాటిని దంచాలి. పొట్టు తీసాక వచ్చిన బియ్యంతో పురోడాశం చెయ్యాలి.

ఆ సందర్భంలో వేదం ముందు ఆ వడ్లను ప్రోక్షణం చెయ్యమంటుంది. ప్రోక్షణం అంటే నీళ్ళు చల్లటం. ఆ వడ్లమీద నీళ్ళు చల్లుతూ కొన్ని మంత్రాలు చదవాలి. వేదం ఒకవేళ ఈ విధివాక్యం చెప్పకపోతే ఎవరూ ప్రోక్షణం చెయ్యరు. ఈ ప్రోక్షణం ఏమిటో బొత్తిగా తెలియదు కాబట్టి, వేదం దాన్ని నిర్దేశిస్తున్నది.

బొత్తిగా తెలియని కర్మను చెయ్యమని ఆదేశిస్తే అది అపూర్వ విధి.

బి) **నియమ విధి** – ప్రోక్షణం చేశాక ఏం చెయ్యాలి? వడ్లు దంచాలి. ప్రోక్షణం ఎవరికీ తెలియదు కాని, వడ్లు దంచాలని అందరికీ తెలుసు. కాని ఇక్కడ కూడా ఒక చిన్న సమస్య ఉంది. ఇది అందరికీ తెలిసినదే అయినా, దీన్ని అనేక విధాలుగా చెయ్యవచ్చు. ఉదాహరణకు వడ్లను దంచవచ్చు, లేదా రాయితో రుద్దవచ్చు, లేదా ఒక్కొక్క గింజకు చేతిగోరుతో పొట్టు తీయవచ్చు.

ఇలాంటి సందర్భంలో నియమవిధి వస్తుంది. దీనికి ఉదాహరణ –

**వ్రీహీన్ అవహన్తి**

అవహన్తి అంటే దంచాలి. అంటే వడ్లని దంచాలి కాని వేరే తక్కిన పద్ధతులను ఉపయోగించకూడదు. అంటే మనకు తెలిసిన మూడు, నాలుగు పద్ధతుల్లోంచి ఒక పద్ధతిని నిర్దేశిస్తున్నది శాస్త్రం. తెలిసిన నాలుగు పద్ధతుల్లో ఒక పద్ధతిని పాటించమని ఆదేశిస్తే అది నియమ విధి.

అపూర్వవిధిలో బొత్తిగా తెలియని కర్మను చెయ్యమని ఆదేశిస్తే, నియమవిధిలో తెలిసిన నాలుగు పద్ధతుల్లో ఒక పద్ధతిలో కర్మ చెయ్యమని చెప్పటం. అంటే తక్కిన పద్ధతులను నిషేధించాలి.

సి) **పరిసంఖ్యా విధి** – ఇది అనుమతిని ఇచ్చే విధి.

**ఏకాదశ్యామ్ ఫలాహారం కుర్యాత్**

ఏకాదశిరోజు ఫలాలు తినవచ్చు. ఏకాదశిరోజు ఉపవాసం ఉన్నప్పుడు, ఒకవేళ ఆకలి వేస్తే ఆకలి పోవటానికి అనేక వస్తువులు తినే అవకాశం ఉంది. శాస్త్రం వాటన్నిటిలో ఒకదానికి అనుమతిని ఇచ్చింది. ఏమిటది? పండ్లను తినవచ్చు. ఇక్కడ జాగ్రత్తగా ఒక విషయం గమనించాలి. ఏకాదశిరోజు ఉపవాసం ఉంటే పండ్లను తినవచ్చు అని అనుమతిని ఇచ్చింది కాని తిని తీరాలి అనలేదు. పండ్లు కూడా తినకుండా ఉపవాసం ఉండగలిగితే తిని తీరాలనే నియమం లేదు.

తెలిసిన నాలుగు పద్ధతుల్లో ఒక పద్ధతిని పాటించవచ్చని అనుమతిని ఇస్తే అది పరిసంఖ్యావిధి. ఇక్కడ కూడా ఒక పద్ధతి పాటించవచ్చు అని చెపితే, తక్కిన పద్ధతులను నిషేధించినట్టే అర్థం.

ఇప్పుడు మూడు విధులనూ టూకీగా ఒకసారి చూస్తే –

1. అపూర్వవిధి – బొత్తిగా తెలియని పనిని చెయ్యమని ఆదేశించటం.
2. నియమవిధి – తెలిసిన నాలుగింటిలోంచి ఒక పద్ధతిని చెయ్యమని ఆదేశించటం.
3. పరిసంఖ్యావిధి – తెలిసిన నాలుగింటిలోంచి ఒక పద్ధతిని చెయ్యవచ్చని అనుమతిని ఇవ్వటం.

చూడటానికి రెండు, మూడు విధులు ఇంచుమించుగా ఒకటిగా ఉన్నా వాటిలో స్వల్పభేదం ఉంది. ముందు ఈ రెండింటికీ మధ్యనున్న సమాన అంశాలు చూద్దాము.

1) రెండింటిలోనూ మూడు, నాలుగు పద్ధతులు లేదా కర్మలు ఉన్నాయి.
2) రెండింటిలోనూ ఉన్న మూడు, నాలుగు పద్ధతులు అందరికీ తెలుసు. వాటిని శ్రుతి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.
3) రెండింటిలోనూ తెలిసిన అనేక పద్ధతుల్లోంచి శ్రుతి ఒక పద్ధతిని ఆదేశిస్తుంది.
4) రెండింటిలోనూ తెలిసిన అనేక పద్ధతుల్లోంచి శ్రుతి ఒక పద్ధతిని ఆదేశించిందంటే, తక్కిన పద్ధతులను పాటించకూడదని అర్థం.

ఉదాహరణకు నియమవిధిలో వడ్లు దంచాలి అంటే, వాటిని రాయితోనో, చేతిగోరుతోనో విడదీయకూడదని అర్థం. అలాగే పరిసంఖ్యావిధిలో పండ్లు తీసుకోవచ్చు అంటే వేరే ఆహారం ఏదీ తీసుకోకూడదని అర్థం. అయితే మరి ఏమిటి భేదం?

నియమవిధిలో చెయ్యమని చెప్పిన కర్మ చేసి తీరాలి. అంటే వడ్లని దంచి తీరాలి కాని పరిసంఖ్యావిధిలో చెయ్యమని చెప్పిన కర్మని చెయ్యనవసరం లేదు. పండ్లు తినవచ్చు అంటే పండ్లు తిని తీరాలని కాదు అర్థం, పండ్లు తినవచ్చు లేదా తినకుండా కూడా ఉండవచ్చు. ఉపవాసం ఉండవచ్చు. ఉండలేనివారికి ఇది సడలింపుకోసం ఇచ్చిన అనుమతి. కాని రెండింటిలోనూ తక్కిన కర్మలు చెయ్యకూడదు. వడ్లను వేరే విధంగా విడదీయకూడదు. ఇందులో ఫలాలు కాకుండా ఇతర ఆహారం తీసుకోకూడదు.

అందువల్ల పరిసంఖ్యావిధిలో నిషేధవిధి ముఖ్యం. పరిసంఖ్యావిధిని పరివర్జనవిధి అని కూడా అనవచ్చు. అంటే ఈ విధిని అనుమతిని ఇచ్చే విధి అనేదానికన్నా కూడా నిషేధవిధి అని చెప్పవచ్చు. ఈ పరిసంఖ్యావిధికి 'సత్యం వద' అనే విధి వాక్యాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

'సత్యం వద' అనే విధివాక్యం నియమవిధి కింద వస్తుందా లేక పరిసంఖ్యావిధి వాక్యం కింద వస్తుందా? సత్యం పలకటం నియమవిధి కాదు. ప్రపంచంలో మనకు తెలిసిన ప్రతి సత్యమూ పలికితీరాలనే నియమం లేదు. నిజానికి, మనం నిజమే పలకాల్సివుంటే వ్యవహారాలన్నీ నడపలేము. సత్యం పలకవచ్చు లేదా ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండవచ్చు. ఇందులో ముఖ్యాంశం ఎన్నడూ అబద్ధం ఆడకూడదు. అంటే నిషేధం

ముఖ్యం. ఒకవేళ మాట్లాడాల్సివస్తే సత్యం చెప్పవచ్చు; లేదా ఏదీ చెప్పకుండా నిశ్శబ్దంగా ఉండవచ్చు. అనుమతినివ్వనిది దేనికి? అసత్యం పలకటానికి. ఆ విధంగా సత్యం వద అంటే అనృతం చెప్పవద్దు అని అర్థం.

ఈ విధంగా మూడు విధివాక్యాలు ఉన్నాయి. అవి అపూర్వవిధి, నియమవిధి, పరిసంఖ్యావిధి.

**ఆత్మా వా అరే శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – ఈ విధి ఈ మూడింటిలో దేని కిందకు వస్తుందన్నది ప్రశ్న. ఈ మూడు పదాలనూ అంటే శ్రవణ మనన నిదిధ్యాసనలను కలిపి శ్రవణవిధి అన్నాడు ఒక భాష్యకారుడు. ఇప్పుడు ఈ శ్రవణవిధి ఏ విధి కిందకు వస్తుంది? శంకరాచార్యులవారు వేరే సందర్భంలో నియమవిధి కిందకు వస్తుందని నిరూపించారు. నియమవిధి అంటే ఏమిటో చూశాము. తెలిసిన నాలుగు పద్ధతుల్లో ఒక పద్ధతిని పాటించమని ఆదేశిస్తే అది నియమవిధి.

ఒక సాధకుడు ఆత్మజ్ఞానం పొందాలనే లక్ష్యం ఏర్పరచుకుంటే, అతను శ్రవణ, మనన, నిదిధ్యాసనలు మాత్రమే చెయ్యాలి. అంటే శ్రవణవిధిని పాటించాలి. ఇది గృహస్థుగా ఉండి చెయ్యగలిగితే ఫర్వాలేదు, గృహస్థుగా ఉండి చెయ్యలేకపోతే సన్న్యాసం స్వీకరించవచ్చు. ముఖ్యమైన విధి ఆత్మజ్ఞానం పొందటానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి తీరాలి.

నియమవిధిలో ముఖ్యమైన అంశం నిషేధం. ఎవరైనా సహజంగానే శ్రవణవిధి పాటిస్తే అతనికి ప్రత్యేకించి చెప్పదు శాస్త్రం. ఎవరైనా వడ్లు దంచితే వారికి ప్రత్యేకించి నియమం చెప్పదు. రోడ్డుమీద ఎడమవైపు వెళితే, పోలీసు ఏమీ అనడు. కాని ఆ నియమాన్ని పాటించకుండా ఉంటేనే, పోలీసు రంగంలోకి దిగాల్సి వుంటుంది.

ఎవరైనా సన్న్యాసి అయి, గురువు వద్దకు వెళ్ళి వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలు చేస్తే అతనికి నియమవిధిని గుర్తు చెయ్యాల్సిన అవసరం లేదు. అదే ఆ సన్న్యాసి శ్రవణ మనన నిదిధ్యాసనలు తప్ప అన్ని పనులూ చేస్తే, నియమవిధి నియమించాల్సి ఉంటుంది. రుద్రాక్షల వ్యాపారమో, ఆలయాల నిర్మాణమో, అనాథ శరణాలయాల నిర్వహణో చేస్తుంటే నియమవిధి వచ్చి అతని విధిని పాటించాలని నిర్దేశిస్తుంది. సన్న్యాసిగా అతని విధి శ్రవణ మనన నిదిధ్యాసనలు చెయ్యటం.

ఇక్కడితో తవ్యకారం విశ్లేషణ ముగిసింది.

ఈ బ్రాహ్మణంలో యాజ్ఞవల్క్యుడు ఆత్మ పరమానంద రూపం అని తన బోధను మొదలుపెట్టాడు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, ఆత్మ ఆనందరూపం అనే అంశాన్ని తార్కికంగా నిరూపిస్తున్నాడు. శ్రుతి నిజానికి తర్కం వాడనవసరం లేదు. శ్రుతి ప్రత్యక్షంగా ఆత్మ ఆనందరూపం అని చెప్పేయవచ్చు. ఎందుకంటే శ్రుతే ఒక ప్రమాణం. అది చెపితే దానికింక తిరుగులేదు. దాన్ని స్వతః ప్రమాణం అంటారు.

శ్రుతి అలా స్వతః ప్రమాణం అయినా కూడా, కొన్నిచోట్ల శ్రుతే తను చెప్పినదానికి తర్కాన్ని జోడిస్తుంది. అంటే యుక్తి ప్రమాణాన్ని కూడా జత చేస్తుంది. ఇది అటువంటి ఒక సందర్భం. ఐదవ మంత్రంలో ఆత్మను పరమానంద స్వరూపంగా నిరూపించాక, అటువంటి ఆత్మను ఎలా పొందాలో చెప్పింది. దానికి ఒక సాధన చెప్పింది. అది –

**మైత్రేయ్యాత్మనో వా అరే దర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానేనేదం సర్వం విదితమ్** – దర్శనం అంటే జ్ఞానం. ఆనందప్రాప్తి సాధ్యం అయితే, ఆత్మదర్శనం సాధన.

ఢిల్లీకి వెళ్ళటానికి రాజధాని ఎక్స్‌ప్రెస్ మార్గం లేదా సాధన. కాని రాజధాని ఎక్స్‌ప్రెస్ ఎక్కటానికి ఎలా వెళ్ళాలి? బస్సులోనో, కారులోనో వెళ్ళాలి. రైలు ఎక్కేముందు బస్సు లేదా కారు సాధన, రైలు సాధ్యం. రైలు ఎక్కాక ఢిల్లీ సాధ్యం, రైలు సాధన. ఇదే సూత్రాన్ని ఆత్మజ్ఞానానికి వినియోగిస్తే ఆనందప్రాప్తి సాధ్యం, ఆత్మ దర్శనం (జ్ఞానం) సాధన. ఇప్పుడు ఆత్మజ్ఞానం సాధ్యం అయితే, దానికి కావాల్సిన సాధన ఏమిటి? శ్రవణ, మనన, నిదిధ్యాసనలు సాధన. అంటే ఇవి పరస్పర సాధ్యసాధనలు అయ్యాయి.

ఆత్మనో వా అరే దర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానేనేదం సర్వం విదితమ్ – ఈ వాక్యంలోని దర్శనేన చివరికి తెచ్చుకోవాలి. అంటే శ్రవణ మనన నిదిధ్యాసనలు చేసి అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందితే, ఇదం సర్వం విదితమ్ (భవతి) – సర్వజ్ఞానం పొందుతాడు.

ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి – ముండకం

ఆత్మజ్ఞానం పొందితే సర్వజ్ఞానం పొందుతాడు. ఆత్మజ్ఞానం పొందితే సర్వజ్ఞానం పొందుతాడని చెప్పటం ద్వారా యాజ్ఞవల్క్యుడు ఒక ముఖ్యమైన అంశాన్ని సూచిస్తున్నాడు. ఏమిటది? ఇది అర్థం చేసుకోవటానికి ఆల్జీబ్రా ఈక్వేషను చూద్దాము.

**8x = 8y అంటే x=y**

రెండు పక్కలా 8 సమానంగా ఉంది కాబట్టి 8ని కొట్టివేస్తే మిగిలినవి x, y. అందువల్ల x=y. అదే సూత్రాన్ని ఇక్కడ అన్వయిస్తే –

**ఆత్మజ్ఞానం = సర్వజ్ఞానం అంటే ఆత్మ = సర్వం**

రెండు వైపులా జ్ఞానం సమానంగా ఉంది కాబట్టి జ్ఞానం పదాన్ని కొట్టివేస్తే మిగిలినవి ఆత్మ, సర్వం. అంటే ఆత్మ = సర్వం.

**సర్వమ్ ఆత్మమయం జగత్ ఆత్మ వ్యతిరిక్తం కించిత్ నాస్తి**

ఈ వాక్యాలను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. దీనివల్ల యాజ్ఞవల్క్యుడు చెప్పదలుచుకున్న అంశం ఆత్మే సర్వం. అనాత్మ అంటూ ఏమీలేదు. ఇదే భావాన్ని తక్కిన మంత్రాల్లో విశదీకరించబోతున్నాడు.

ఈ మంత్రంలో ఈ విధంగా మూడు రత్నాల్లాంటి దశలను సూచించాడు యాజ్ఞవల్క్యుడు.

1. ఆనందప్రాప్తి = ఆత్మప్రాప్తి

ఆత్మ పరమానంద స్వరూపం అని తార్కికంగా నిరూపించాడు యాజ్ఞవల్క్యుడు. అందువల్ల ఆనందం పొందాలంటే ఆత్మప్రాప్తి పొందాలి.

2. ఆత్మప్రాప్తి = ఆత్మజ్ఞానప్రాప్తి

ఆత్మ అజ్ఞానం ఉంది కాబట్టి ఆత్మ గురించి జ్ఞానం పొందాలి.

3. ఆత్మజ్ఞానప్రాప్తి = శ్రవణ మనన నిదిధ్యాసన ప్రాప్తి

ఆత్మజ్ఞానం పొందటానికి ఒక్కటే మార్గం ఉంది. అది వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలు చెయ్యటం.

జ్ఞానప్రాప్తి గురించి చెప్పాక, యాజ్ఞవల్క్యుడు ఫలం గురించి కూడా చెప్పాడు. జ్ఞానప్రాప్తి ఆత్మప్రాప్తికి దారి తీస్తుందని, ఆత్మప్రాప్తి ఆనందప్రాప్తికి దారి తీస్తుందనీ ఇప్పుడే చూశాము. అంటే ఆత్మజ్ఞానఫలం ఆనందప్రాప్తి. కాని దీన్ని యాజ్ఞవల్క్యుడు ఇంకొక విధంగా చెప్పాడు. ఏమిటది?

**ఆత్మజ్ఞానేన సర్వజ్ఞానీ భవతి. సర్వజ్ఞః ఆనందం ప్రాప్నోతి**

మొదటి ఫలం ఆనందప్రాప్తి; రెండవ ఫలం సర్వజ్ఞుడు అవటం. ఆనందప్రాప్తి మనస్సుకు చెందినది. అంటే భావపరంగా పూర్ణత్వం, తృప్తి, ఆనందం పొందుతాడు. సర్వజ్ఞత్వం బుద్ధికి చెందినది. బుద్ధికి సర్వజ్ఞ జ్ఞానం కలుగుతుంది.

## మంత్రం 2.4.6

**బ్రహ్మ తం పరాదాద్యోఽన్యత్రాత్మనో బ్రహ్మ వేద క్షత్రం తం పరాదాద్యోఽన్యత్రాత్మనః క్షత్రం వేద లోకాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో లోకాన్ వేద దేవాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో దేవాన్ వేద భూతాని తం పరాదుర్యోఽన్యత్రాత్మనో భూతాని వేద సర్వం తం పరాదాద్యోఽన్యత్రాత్మనస్సర్వం వేదేదం బ్రహ్మేదం క్షత్రమిమే లోకా ఇమే దేవా ఇమాని భూతానీదగ్ం సర్వం యదయమాత్మా ॥**

వేదాంతాన్ని ఒక ఉరుములా పరిచయం చేశాక, యాజ్ఞవల్క్యుడు అసలు బోధను ఆరవ మంత్రంనుంచీ మొదలుపెడతాడు. ఈ బ్రాహ్మణంలో ప్రతి మంత్రమూ ముఖ్యమే, అందులో ఈ మంత్రం మరీ ముఖ్యం.

ఈ మంత్రం ద్వైతాన్ని, విశిష్టాద్వైతాన్ని కూడా ఖండిస్తుంది. ఇందులో అద్వైతం నిరూపించబడుతుంది. దీన్నిబట్టి అద్వైతం శంకరాచార్యులవారి సిద్ధాంతం కాదనీ, అది ఉపనిషత్తుల బోధ అనీ తెలుస్తున్నది.

ఈ మంత్రం శ్రవణాన్ని సూచిస్తుంది. ఇంతకుముందు మంత్రంలో చెప్పిన సర్వాత్మ భావనను వివరిస్తుంది.

**సర్వమ్ ఆత్మ ఇతి భావదర్శనం జ్ఞానమ్**

ఉన్నదంతా నేనే, నాకు భిన్నంగా ఏదీ లేదు అనే భావనే నేను పరిపూర్ణుడను, నేను అనంతుడను అని గ్రహించేలా చేస్తుంది. ఇదీ ఈ బోధ సారాంశం. ఈ సర్వాత్మ భావన కలుగకపోతే, మనం నష్టపోయేది ఏమిటో కూడా సూచిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**ఇదం బ్రహ్మేదం క్షత్రమిమే లోకా ఇమే దేవా ఇమాని భూతానీదగ్ం సర్వం యదయమాత్మా** – ఈ బ్రాహ్మణుడు, ఈ క్షత్రియుడు, ఈ లోకాలు, ఈ దేవతలు, ఈ ప్రాణులు, ఈ సర్వమూ ఆత్మనే. సర్వమూ ఆత్మనే అని సూచించటానికి శ్రుతి ఆత్మకు దేన్నైనా భిన్నంగా చూసినవారిని విమర్శిస్తున్నది. ఆత్మ గొప్పతనాన్ని నిరూపించటానికి ఆత్మకు భిన్నంగా దేన్నైనా చూసినవారిని నిందిస్తున్నది. అంటే ఏది సరియైన దృష్టి? ఉన్నదంతా ఆత్మనే అనేది సరియైన దృష్టి.

### ఆత్మ ఐక్యదర్శనం సామాన్యదర్శనమ్ ఆత్మ అన్యదర్శనం అసామాన్యదర్శనమ్

ఆత్మ అన్యదర్శనం చేసిన వారిని ఈ మంత్రం మొదటి భాగంలో విమర్శిస్తున్నది శ్రుతి. బృహదారణ్యకోపనిషత్తు ఏం చెప్పినా ప్రత్యేక పద్ధతిలో చెబుతుంది. బృహదారణ్యకోపనిషత్తు అందుకే బృహత్ ఉపనిషత్తు అయింది.

సర్వాత్మ భావన లేకపోతే కలిగే దారుణ ఫలితాలు ఏమిటి?

1. **అనాత్మ దృష్టి** – ఎవరినైనా మనకు భిన్నంగా చూస్తే, వారిని మనం పరోక్షంగా తిరస్కరించినట్లు అవుతుంది. ఎవరినైనా మనకు భిన్నంగా చూస్తే, వారిని మనినించి వేరు చేసినట్లు అవుతుంది. వారిని వేరుచేసి చూడటం అంటే తిరస్కరించినట్లు. దేన్నైనా మనకు భిన్నంగా చూస్తే అది అనాత్మ అవుతుంది. అనాత్మ అయితే అది అప్రియం అవుతుంది. అప్రియ వస్తువును తిరస్కరిస్తాము. అటువంటి తిరస్కరణను భేదబుద్ధి అంటారు.

అందువల్ల ఎవరిమీదనైనా తిరస్కారభావన లేదని చూపించాలంటే ఏం చేస్తాం? వారిని దగ్గరికి తీసుకుంటాము. నువ్వే నేను అనే భావన కలుగజేస్తుంది ఆ పరిష్వంగన. కాని భేదభావన చూపిస్తే అది అనాత్మ అవుతుంది. అప్పుడు అంతకుముందు యాజ్ఞవల్క్యుడు సూచించిన తర్కం గుర్తుకు తెచ్చుకోవాలి.

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**

మనను మనమే ప్రేమించుకుంటాము అంటే తక్కినవారిని ప్రేమించినట్లు కనిపించినా అది నిజమైన ప్రేమ కాదు.

2. **ఇతరులకు అనాత్మ దృష్టి** – మనం ఇతరులను అనాత్మగా చూస్తే, దీని సహజ పరిణామం ఏమిటి? ఇతరులకు మనం అనాత్మ అవుతాము. నా పుత్రుణ్ణి నేను అనాత్మగా భావిస్తే అతను నన్ను అనాత్మగా చూస్తాడు. నా పుత్రుడు నా ఆనందంకోసం పాటుపడడు, తన ఆనందంకోసమే పాటుపడతాడు. నేను అతన్ని కూడా ఆత్మగా చూడగలిగితే, అప్పుడు నేను జ్ఞానిని అవుతాను. అప్పుడు అతనిమీద నాకు ద్వేషభావన ఉండదు.

ఎప్పుడైతే నేను ప్రపంచాన్ని తిరస్కరిస్తానో, అప్పుడే ప్రపంచం నన్ను తిరస్కరిస్తుంది. ప్రపంచం నన్ను తిరస్కరిస్తే, నేను మానసికంగా కృంగిపోతాను. ప్రపంచం నన్ను తిరస్కరించటం శారీరకంగా అవవచ్చు లేదా మానసికంగా అవవచ్చు. మానసికంగా అయితే కృంగిపోతాను. ఈ విశాలప్రపంచంలో నేను ఏకాకిని అని ఒంటరితనం బాధిస్తుంది. ద్వైతదర్శనంవల్ల కలిగే బాధ ఈ ఒంటరితనం.

ఈ ఒంటరితనం, ఈ పరిచ్ఛిన్నత్వం, ఈ తిరస్కారభావనలను సంసారం అంటారు. నేను ఇతరులను తిరస్కరిస్తాను కాని వారిని వారు ప్రేమించుకున్న దానికన్నా వారు నన్ను ఎక్కువ ప్రేమించాలని కోరుకుంటాను. కాని ఒక విషయం గ్రహించాలి, నేను ఇతరులను అనాత్మగా భావిస్తే, వారు నన్ను అనాత్మగా భావిస్తారు.

**పరాదాత్** – ఉపనిషత్తు అది సూచించటానికి పరాదాత్ పదం వేసింది. పరాదాత్ అంటే నిరాకరిస్తాడు.

**బ్రహ్మ తం పరాదాద్యోఽన్యత్రాత్మనో బ్రహ్మ వేద** – బ్రహ్మ అంటే బ్రాహ్మణజాతి. బ్రాహ్మణజాతిని ఎవరైతే ఆత్మకంటే భిన్నంగా చూస్తాడో అతన్ని బ్రాహ్మణుడు నిరాకరిస్తాడు. ఈ వాక్యంలో సూక్ష్మమైన అర్థం ఉంది. ఇలా భేదబుద్ధితో చూసే వ్యక్తి పూర్ణత్వాన్ని పొందడు.

ఉదాహరణకు ఒక గడియారాన్ని నాకు భిన్నంగా చూస్తే, నేను ఎంత పెద్దగా ఉన్నా, నాలో ఆ గడియారం లేదు కాబట్టి, గడియారం అంతమేరకు నేను అపూర్ణుణ్ణి. గడియారంవల్ల నేను అపూర్ణుడిని అయితే దానికి కారణం ఎవరు? నేనా, గడియారమా? శాస్త్రం నువ్వే దానికి కారణమని నన్నే అంటుంది. ఆ గడియారం నన్ను అపూర్ణుడిని చెయ్యటానికి నేనే కారణమంటుంది. గడియారాన్ని నాకు భిన్నంగా చూడటంవల్ల నేనే అది నన్ను అపూర్ణుడిని చెయ్యటానికి దానికి అవకాశమిచ్చాను. ఇంకోవిధంగా చెప్పాలంటే నాకు మోక్షం రాకుండా చేసేది ఎవరో కాదు, నేనే. నాకు నేనే అడ్డుపడుతున్నాను.

**క్షత్రం తం పరాదాద్యోఽన్యత్రాత్మనః క్షత్రం వేద** – ఎవరైతే క్షత్రియుడు తనకంటే భిన్నుడని భావిస్తాడో, అతనిని క్షత్రియుడు పరాభవిస్తాడు. అందువల్ల అనాత్మ భావన ఉండకూడదు. అనాత్మ నన్ను పురుషార్థ అయోగ్యునిగా చేస్తుంది. ఇదే అర్థంతో సాగుతాయి తక్కినవన్నీ.

**లోకాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో లోకాన్ వేద దేవాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో దేవాన్ వేద భూతాని తం పరాదుర్యోఽన్యత్రాత్మనో భూతాని వేద** – ఎవరైతే లోకాలు తనకంటే భిన్నంగా ఉన్నాయని భావిస్తాడో, అతన్ని లోకాలన్నీ పరాభవిస్తాయి. లోకాలంటే పధ్నాలుగు లోకాలూ వస్తాయి. అలాగే దేవతలను తనకు భిన్నంగా చూస్తే, దేవతలు కూడా అతన్ని నిరాకరిస్తారు. తక్కిన ప్రాణులు కూడా అతనిని నిరాకరిస్తాయి.

నేను ఇతరులను అనాత్మగా చూస్తే, ఇతరులు నన్ను అనాత్మగా చూస్తారు. ఇలా పట్టిక ఇచ్చుకుంటూ పోవటమెందుకని సర్వం పదం వేసింది శాస్త్రం.

**సర్వం తం పరాదాద్యోఽన్యత్రాత్మనస్సర్వం వేద** – ఎవరైతే సర్వం ఆత్మకంటే భిన్నమని భావిస్తాడో, అతనిని సర్వం పరాభవిస్తుంది అంటున్నది శాస్త్రం. ఈ మంత్రంలో అద్వైతబోధ చాలా స్పష్టంగా వస్తున్నది. అది ఒక్కొక్క అంశాన్నీ చెప్పుకుంటూ వచ్చి, దానిద్వారా ప్రపంచం నీకు భిన్నంగా లేదని అంటున్నది. ఆత్మకు భిన్నంగా బ్రాహ్మణజాతి లేదు, క్షత్రియజాతి లేదు, లోకాలు లేవు, దేవతలు లేరు, భూతాలు లేవు, ఏదీ లేదు. సర్వం ఆత్మ ఏవ. ఈ జ్ఞానమే శ్రవణం.

**ఇదం బ్రహ్మ** – ఈ బ్రాహ్మణజాతి; **ఇదం క్షత్రమ్** – ఈ క్షత్రియజాతి; **ఇమే లోకా** – ఈ లోకాలు; **ఇమే దేవాః** – దేవతలందరూ; **ఇమాని భూతాని** – ఈ జీవులందరూ; **ఇదం సర్వమ్** – ఇవన్నీ; **యదయమాత్మా** – ఇవన్నీ అయం ఆత్మ అంటే నేను.

ఇదంతా ఆత్మ అంటే పరమాత్మ ఎక్కడో దూరంగా ఉన్నాడు, ఆ పరమాత్మే సర్వం అనుకునే ప్రమాదముంది. ఎక్కడో ఆకాశంలో ఉన్న ఆత్మ గురించి చెప్పటం లేదు. అయమాత్మా గురించి చెబుతున్నది. నేను ఆత్మను, నేను సర్వాత్మను అంటున్నది ఉపనిషత్తు.

**అహమన్నమహమన్నమహమన్నాదో** – తైత్తిరీయం

ఆత్మ సర్వం కాబట్టి నేను ఆత్మను అని తెలుసుకుంటే, నేను సర్వం అని తెలుసుకోవటమవుతుంది. నేను సర్వం అని తెలుసుకుంటే నాకు భిన్నంగా ఏదీ లేదని అర్థం; నాకూ ఒక వస్తువుకూ దూరం లేదు. దేనిమీదైనా నాకు కోరిక ఎప్పుడు కలుగుతుంది? అది నాకు దూరంగా ఉంటేనో, నాకు భిన్నంగా ఉంటేనో కలుగుతుంది. నా దగ్గర ఆ వస్తువు ముందే ఉంటే నాకు కోరిక ఎందుకు కలుగుతుంది?

3. **పూర్ణత్వ ప్రాప్తి** – నాకూ, ఆ గడియారానికీ మధ్య దూరం లేకపోతే నేను ఆ గడియారాన్ని కోరను. ఆత్మజ్ఞానం ఈ దూరాన్ని తొలగిస్తుంది. ఆత్మజ్ఞానం కోరికలను తొలగిస్తుంది. ఆత్మప్రాప్తి పొందితే, సర్వకామప్రాప్తి కలుగుతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే –

**ఆత్మప్రాప్తి = పూర్ణత్వప్రాప్తిః**

అప్పటినుంచి ఏదీ లేదనే కొరత ఉండదు. ఎంత అద్భుతమైన విషయం! ఎవరైనా నీకేం కావాలని అడిగితే ఆలోచించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఏ కొరతా ఉండదు నాకు. ఏదో వారిని తృప్తి పరచటంకోసం ఏదో ఒకటి అడగాల్సి ఉంటుంది. ఎంత అద్భుతమైన భావన. ఈ విధంగా ఈ మంత్రంలో పూర్ణత్వప్రాప్తిని వివరించింది ఈ మంత్రం.

4. **సర్వాత్మ భావన** – ఆత్మజ్ఞానం పొందాక అందరినీ సమానంగా ప్రేమిస్తాను. ఈ పూర్ణత్వభావన కలగకపోతే నేను ఆత్మను, తక్కినదంతా అనాత్మ అనుకుంటాను. ప్రేమ గురించి శాస్త్రం చెప్పిన సూత్రం ఏమిటి? ప్రేమ ప్రయత్నపూర్వకంగా పుట్టేది కాదు, పెంపొందించుకునేది కాదు, ప్రేమ స్వాభావికం అంది. స్వాభావికంగా నన్ను నేను ప్రేమిస్తాను కాని ఇతరులను ప్రేమించను అంది. జ్ఞాని అందరినీ ప్రేమిస్తాడు. ఎందుకంటే జ్ఞాని తనలో అందరినీ చూస్తాడు. మనం అలాంటి జ్ఞానులమవాలని ఉపనిషత్తు కోరిక.

కాని నేను జ్ఞాని అవకముందు నేను ఆత్మ, తక్కినవారు అనాత్మ అని భావించినన్నాళ్ళూ, వారిని నేను మనస్ఫూర్తిగా ప్రేమించలేను. వారు కూడా నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించలేరు. అది స్వార్థపూరితమైన ప్రేమ అవుతుంది. ఆ విషయం తెలిసినప్పుడు తగిలిన ఎదురుదెబ్బనుంచి ఒక్కోసారి త్వరగా కోలుకోలేను. నా భార్య నన్ను మాత్రమే ప్రేమిస్తుందని మురిసిపోతాను, పిల్లవాడు పుట్టాక తెలుస్తుంది అది నిజం కాదని. నా కొడుకు నా చుట్టే తిరుగుతాడనుకుంటుంది ఒక తల్లి; కాని అది నిజం కాదని, భార్యకొంగు పట్టుకుని తిరగటం చూశాక తెలుస్తుంది.

ప్రపంచాన్ని నాకు భిన్నంగా, అనాత్మగా చూసినన్నాళ్ళూ స్వచ్ఛమైన ప్రేమ దక్కదు. మరి మనమూ చూపించలేము. అందరినీ సమానంగా ప్రేమించాలంటే ఏం చెయ్యాలి? ఆత్మ, అనాత్మ భేదాన్ని వదిలివేయాలి. ఉన్నదంతా ఆత్మే. ఆత్మకు భిన్నంగా అనాత్మ లేదు.

**ఇదగ్ం సర్వం యదయమాత్మా**

ఆత్మజ్ఞానం మాత్రమే ఈ సర్వజనీన ప్రేమను చూపించేలా చేస్తుంది.

5. **జగన్మిథ్యాత్వం** – ఉన్నదంతా ఆత్మే అని చెపితే, ఆత్మకు భిన్నంగా వేరే ఏదీ లేదని పరోక్షంగా చెప్పినట్టు. అదికాక ఆత్మమీద ఆధారపడకుండా ఏదీ లేదు. అంటే జగత్తుకు విడిగా ఉనికి లేదు.

**ఆత్మ వ్యతిరిక్త సత్తా అభావాత్ స్వయం సత్తా అభావాత్ సర్వం మిథ్యా ఇతి సిద్ధం భవతి**

అంటే ఆత్మకు భిన్నంగా దేనికీ ఉనికి లేదు కాబట్టి జగత్తు మిథ్య అయింది.

# ఇదగ్ం సర్వం యదయమాత్మా విశ్లేషణ

ఇదం, సర్వం, యత్, అయం, ఆత్మా – ఈ పదాలన్నీ ఒకే రకంగా ఉన్నాయి. ఇటువంటి వాక్యాన్ని వ్యాకరణంలో సమానాధికరణ్యం అంటారు. అంటే పదాలన్నీ సమానంగా ఉన్నాయి అని అర్థం. అధికరణం అంటే ఆబ్జెక్టు. సమానం అధికరణం అంటే ఒకటే ఆబ్జెక్టు. సాధారణంగా ఒక వాక్యంలో రెండు, మూడు పదాలు ఉంటే, రెండు మూడు ఆబ్జెక్టులు ఉంటాయి. కుర్చీ, బల్ల, కలం, పుస్తకం – అంటే ఇందులో నాలుగు ఆబ్జెక్టులు ఉన్నాయి.

**దశరథపుత్రః సీతాపతిః లక్ష్మణభ్రాతా రామః**

ఈ వాక్యంలో మూడు పదాలూ రామునికే వర్తిస్తాయి. రాముడు దశరథ పుత్రుడు, సీతభర్త, లక్ష్మణుని అన్న. దీన్ని సమానాధికరణ్యం అంటారు.

ఈ సమానాధికరణ్యంలో విభక్తులు ఉండవు. కిన్, కున్, యొక్క, లోన్, లోపల వంటి పదాలు ఉండవు. శాస్త్రం జగత్తు బ్రహ్మలో ఉంది. బ్రహ్మ**యొక్క** జగత్తు అనదు. **జగత్తుబ్రహ్మ** అంటుంది.

ఈ సామానాధికరణ్యంలో నాలుగు రకాల వాక్యాలు ఉన్నాయి. అవి –

1. **విశేషణ విశేషభావే సమానాధికరణ్యమ్** – ఈ సమానాధికరణ్యంలో పదాలు ఒకటే విభక్తిలోకి వస్తాయి. విశేషణం, నామవాచకం ఒకే విభక్తికి చెందుతాయి. వీరః రామః, – రెండూ ప్రథమావిభక్తిలోకి వస్తాయి. వీరః గుణం, రామః గుణి. అంటే రాముని గుణం వీరః అని చెబుతుంది. శాస్త్రం ఇచ్చే ఉదాహరణ – **నీలం ఉత్పలం.** అంటే నీలిరంగులో ఉన్న కలువపువ్వు.

2. **ఐక్య సమానాధికరణ్యమ్** – రెండు పదాలు ఒకటే ఆబ్జెక్టు గురించి మాట్లాడితే అది ఐక్య సమానాధికరణ్యం అవుతుంది. విష్ణుసహస్రనామం మొత్తం ఐక్య సమానాధికరణ్యం.

**విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః.**

సహస్రనామం పేరు వచ్చిందే అందుకు. వెయ్యినామాలు ఒకటే విష్ణువుకు చెందుతాయి. విశ్వం పదానికీ, భూతభవ్యప్రభుఃకి సంబంధం లేదు. కాని రెండు పదాలూ ఒకే విష్ణువు గురించి చెబుతాయి. కాని మొదటి రకం వాక్యంలో రెండు పదాలలో ఒకటి విశేషణం, ఇంకొకటి నామవాచకం. శాస్త్రం ఇచ్చే ఉదాహరణ – సోఽయం దేవదత్తః – అతడే దేవదత్తుడు. ఇది విశేషణ విశేషసంబంధం కాదు. ఇందులో అతడే దేవదత్తుడు, దేవదత్తుడే అతడు.

శాస్త్రంలో వచ్చే మహావాక్యాలన్నీ ఈ ఐక్య సమానాధికరణ్యంలోకి వస్తాయి. తత్త్వమసి, అహం బ్రహ్మ అస్మి, అయమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ.

3. **ఉపాసనాయామ్ సమానాధికరణ్యమ్** – ఇందులో రెండు పదాలూ ఒకటే విభక్తికి చెందుతాయి. శాస్త్రం ఇచ్చే ఉదాహరణ – పురుషః అగ్ని. పురుషుడు అగ్నిలో లేడు, అగ్నికి చెందడు, అగ్నిమీద లేడు, అగ్ని కింద లేడు.

అయితే పురుషః అగ్ని అంటే అర్థం ఏమిటి? పురుషుడిని అగ్నిగా భావించి ఉపాసన చెయ్యాలి. ఇది ఛాందోగ్యోపనిషత్తులో పంచాగ్నివిద్యలో వస్తుంది. అగ్ని పురుషుడు కాదు, పురుషుడు అగ్ని కాదు; కాని పురుషుణ్ణి అగ్నిగా భావించి ఉపాసన చెయ్యాలి.

4. **బాధాయామ్ సమానాధికరణ్యమ్** - పొరపాటుగా చూసిన వస్తువును సరియైన వస్తువుతో మార్చటం. దీనికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ -

అయం సర్పః రజ్జుః - నువ్వు చూస్తున్న పాము తాడు.

అంటే అక్కడ తాడు ఉంటే, చిరుచీకటిలో తాడుని చూసి పాముగా పొరపాటు పడతాడు. ఆ పొరపాటు ఏ విధంగా పడినా, దాన్ని పాము అనుకుంటాడు. ఎవరో వచ్చి అతని పొరపాటుని సరిదిద్దుతాడు. ఈ పొరపాటు పడిన వ్యక్తి అక్కడ పాము ఉంది అంటాడు. ఆ వచ్చిన వ్యక్తి అక్కడ తాడు ఉంది అంటే చాలదు. ఆ పొరపాటు పడిన వ్యక్తి అక్కడ రెండు వస్తువులు ఉన్నాయి కాబోలు అనుకుంటాడు. అక్కడ నాకు పాము కనిపిస్తోంది, వేరేచోట గురువుకు తాడు కనిపిస్తోంది అంటే పాము అలాగే ఉంది అనుకుంటాడు.

గురువు ఏమని చెప్పాలి? అయం సర్పః రజ్జుః అనాలి. అంటే నువ్వు చూస్తున్న పాము, పాము కాదు; అది తాడు అని చెప్పాలి. లేకపోతే అక్కడ రెండు ఉన్నాయనుకుంటాడు అతను. గురువు నువ్వు చూస్తున్న పాము తాడు అని చెప్పటంవల్ల, పామును తిరస్కరించి, పాము స్థానంలో తాడును చూస్తాడు. ఒకదాన్ని తీసి ఇంకొక దాన్ని చూడటం అంటే ముందు తప్పుగా చూసినట్టు అర్థం. ఇలా పాముని తీసి, తాడుని చూపటం సమానాధికరణ్యం అంటారు. సమానాధికరణ్యం అంటే సరిదిద్దటం. పాముగా చూడటాన్ని పొరపాటుగా చూపించి, తాడుగా సరిదిద్దాడు గురువు. ఒకదాన్ని తీసి ఇంకొకటి పెట్టటాన్ని బాధాయామ్ సమానాధికరణం అంటారు.

ఇప్పుడు దీన్ని జగత్తుకు, బ్రహ్మకు అన్వయిస్తే, మనం ముందు జగత్తును చూస్తాము. తర్వాత భగవంతుణ్ణి పరిచయం చేసింది. ఇప్పుడు మనకు రెండు వస్తువులు ఉన్నాయి. అవి జగత్తు, భగవంతుడు. అలా ఉంటే మన సమస్య తీరదు. జగత్తు + భగవంతుడు అనకూడదు, జగత్తు బదులుగా భగవంతుడు ఉన్నాడు అనాలి. అంటే జగత్తును తీసివేసి, ఆ స్థానంలో భగవంతుణ్ణి పెట్టాలి. జగత్తుతో పాటు **భగవంతుడు కూడా ఉన్నాడు** అనదు శాస్త్రం. ఉన్నదంతా భగవంతుడే అంటుంది శాస్త్రం.

నువ్వు చూస్తున్న పాము తాడు అని గురువు ఎలా చెప్పాడో అలాగే నువ్వు చూస్తున్న జగత్తు బ్రహ్మ అని గురువు చెప్పాలి. ఎలా తాడుకు భిన్నంగా పాము లేదో, అలా బ్రహ్మకు భిన్నంగా జగత్తు లేదు. ఒకదాన్ని తీసి, ఇంకొకదాన్ని పెట్టటాన్ని బాధాయాం సమానాధికరణ్యం అంటారని చూశాము.

ఇప్పుడు ఈ నాలుగు రకాల సమానాధికరణ్యాలలో **ఇదగ్ం సర్వం యదయమాత్మా** వాక్యం దేనికి చెందుతుందో చూడాలి. ఒక్కొక్క సమానాధికరణ్యాన్నీ అన్వయించి చూద్దాము.

1. **విశేషణ విశేష భావే సమానాధికరణ్యమ్ - నీల ఉత్పలమ్.** జగత్తును బ్రహ్మకు విశేషణంగా చూద్దామా? జగత్తును బ్రహ్మకు విశేషణంగా చూస్తే అది విశిష్టాద్వైతం అవుతుంది. గుణా-గుణీ సంబంధం ఉందంటుంది

విశిష్టాద్వైతం. దాని వివరాలలోకి మనం ఇప్పుడు వెళ్ళటం లేదు. బ్రహ్మకు జగత్తును గుణంగా వర్ణిస్తే అది మనకు సరిపోదు. ఎందుకంటే మనం బ్రహ్మను నిర్వికారం, నిర్గుణం బ్రహ్మ అంటాము.

జగత్తును బ్రహ్మకు విశేషణంగా ఎందుకు తీసుకోము? దానికి అనేక కారణాలు చెప్పవచ్చు కాని ఇక్కడ ఒక తార్కిక సమాధానం చూద్దాము. జగత్తు, బ్రహ్మ రెండూ రెండు భిన్నధృవాలు.

**తమః ప్రకాశవత్ విరుద్ధస్వభావయోః**

వెలుగు చీకట్లలాగా జగత్తు, బ్రహ్మ (ఆత్మ) రెండు భిన్నధృవాలు. జగత్తు జడం – బ్రహ్మ చేతనం; జగత్తు సవికారం – బ్రహ్మ నిర్వికారం; జగత్తు అశుద్ధం – బ్రహ్మ శుద్ధం. అశుద్ధ జగత్తును శుద్ధ ఆత్మకు విశేషణంగా తీసుకుంటే ఏమవుతుంది? అప్పుడు శుద్ధ ఆత్మ అశుద్ధ జగత్తు అవుతుంది. ఎందుకంటే విశేషణానికీ, నామవాచకానికీ అనుబంధం ఉంటుంది. అందువల్ల ఈ సామానాధికరణ్యం చెల్లదు.

2. **ఐక్య సమానాధికరణ్యమ్ – సోఽయం దేవదత్తః** – బ్రహ్మ జగత్తు ఒకటే అందామా? అంటే బ్రహ్మే జగత్తు, జగత్తే బ్రహ్మ అందామా అదీ కుదరదు. ఎందుకు? ముందు చెప్పిన కారణమే ఇక్కడ కూడా వర్తిస్తుంది. బ్రహ్మ, ఆత్మ రెండూ రెండు భిన్నధృవాలు. లక్షణ భేదాత్ వస్తు భేదః. జడప్రపంచం చేతన ఆత్మతో ఎలా సమానం? సవికార ప్రపంచం నిర్వికారం ఆత్మ ఎలా సమానం? అశుద్ధప్రపంచం శుద్ధప్రపంచం ఎలా సమానం? ఈ ఐక్యం విశేషణభావంకన్నా కష్టం. అందువల్ల ఈ సామానాధికరణ్యం కూడా చెల్లదు.

3. **ఉపాసనాయాం సమానాధికరణ్యమ్– పురుషః అగ్ని** – జగత్తును బ్రహ్మమీద ఉపాసన చెయ్యి అందామా? దీనికి జవాబు శంకరులవారు ఇంకొక సందర్భంలో చెప్పారు. ఇది కూడా కుదరదు. ఎందుకు? ఉపాసన వేరు, జ్ఞానం వేరు. పురుషః అగ్నిలో పురుషుణ్ణి అగ్నిమీద ఉపాసన చేస్తాము. దాన్ని **అతస్మిన్ తత్‌బుద్ధి** అంటారు. అందువల్ల ఇది అయదార్థ జ్ఞానం. అంటే అది నిజంగా జ్ఞానం కాదు, ఊహ మాత్రమే. ఉదాహరణకు అహంగ్రహ ఉపాసనలో తనే బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాడు ఉపాసకుడు. అతనికి జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం ఉండదు. అది ఊహ మాత్రమే.

ఆ జ్ఞానం ఉంటే అది జ్ఞానకాండలోకి వస్తుంది. జ్ఞానం లేకపోతే కర్మకాండలోకి వస్తుంది. అది కర్మ అయితే, అది ఎన్నడూ అమృతత్వానికి దారితీయలేదు. ఇక్కడ అమృతత్వం అంటే మోక్షం. కర్మ ఎన్నటికీ మోక్షాన్ని ప్రసాదించలేదు. కర్మ అశాశ్వత ఫలాన్ని లేదా పరిచ్ఛిన్నఫలాన్ని మాత్రమే ప్రసాదిస్తుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన** – కైవల్యం

కర్మవల్ల, పిల్లలవల్ల, ధనంవల్ల మోక్షం రాదని కైవల్యోపనిషత్తు స్పష్టంగా చెబుతుంది. ఇక్కడ యాజ్ఞవల్క్యుడు అమృతత్వం పొందటానికి బోధ చేస్తున్నాడు. మైత్రేయి ప్రత్యేకించి అడిగింది, 'ఈ భూమ్మీద ఉన్న ఐశ్వర్యం అంతా నాకు ఉంటే నాకు మోక్షం వస్తుందా?' ధనంవల్ల రాదు, జ్ఞానంవల్లనే వస్తుంది. అందువల్ల ఈ సామానాధికరణ్యం కూడా చెల్లదు.

4. **బాధాయాం సమానాధికరణ్యం – అయం సర్పః రజ్జుః** – నువ్వు పాముగా చూస్తున్నది పాము కాదు, తాడు. అలాగే నువ్వు ప్రపంచంగా చూస్తున్నది నిజానికి ప్రపంచం కాదు, బ్రహ్మ. జగత్తు మిథ్య, దానికి స్వతంత్రంగా ఉనికి లేదు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

సూత్రాన్ని ఈ మంత్రం నిరూపిస్తుంది. వేదాంతసారం బ్రహ్మ సత్యం జగన్మిథ్యా – కాని ఇది వేరే ఏ ఇతర ఉపనిషత్తులోనూ దొరకదు. ఇది బృహదారణ్యకానికే చెందింది.

**సర్వాత్మ భావన = సర్వమ్ ఆత్మా ఇతి భావః**

ఉన్నదంతా ఆత్మ మాత్రమే అని అర్థం. ఆత్మ అంటే బ్రహ్మ అని మర్చిపోకూడదు. సర్వాత్మభావన అంటే సర్వమిథ్యాదర్శనం అంటే ఉన్నదంతా ఆత్మ మాత్రమే. జగత్తు మిథ్య.

ఇదగ్ం సర్వం యదయమాత్మా అంటే బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా. అందువల్ల దీనికి బాధాయాం సమానాధికరణ్యం సరిపోతుంది.

ఇక్కడితో ఇదగ్ం సర్వం యదయమాత్మా – విశ్లేషణ అయిపోయింది.

**మంత్రాలు 2.4.7 – 2.4.9 ఉపోద్ఘాతం**

ఆరవ మంత్రంలో యాజ్ఞవల్క్యుడు ఆత్మ సర్వం అన్నాడు. ఆత్మజ్ఞానేన సర్వజ్ఞానం భవతి. అంటే ఆత్మ జ్ఞానం పొందితే ఇంకేదీ పొందనవసరం లేదని అర్థం. ఇందులో ముఖ్య బోధ బ్రహ్మసత్యం, జగన్మిథ్య అని చూశాము. బ్రహ్మ అంటే ఆత్మ. ఆత్మ అంటే నేను. నాకు భిన్నంగా ఉన్నదంతా మిథ్య. అందువల్ల ఈ జగత్తు నన్ను బాధించలేదు. ఇది శ్రవణభాగం.

7–12 మంత్రాలు మనన భాగాన్ని సూచిస్తాయి.

1. **ఆత్మ కారణం** – ఆత్మను కారణంగా చూపిస్తున్నది ఉపనిషత్తు. ఆత్మ కారణం, జగత్తు కార్యం.

**సర్వం జగత్ ఆత్మైవ ఆత్మ కార్యత్వాత్**

జగత్తు మొత్తం ఆత్మ ఎందుకంటే జగత్తు అనే కార్యం ఆత్మ అనే కారణంనుంచి ఉత్పత్తి చెందింది. ఎలా చెప్పగలుగుతున్నారు? కుండని చూసి. కుండ అంతటా ఉన్నది మట్టి కాబట్టి.

**సర్వే ఘటాః మృదేవ మృత్కార్యత్వాత్**

కుండలన్నీ మట్టే ఎందుకంటే కుండలు అనే కార్యం మట్టి అనే కారణంనుంచి వచ్చాయి. ఆ విధంగా జగత్తు అంతా బ్రహ్మనుంచి వచ్చింది. ఆ విధంగా ఆత్మ కారణం. ఇది మొదటి దశ.

2. **జగత్తు కార్యం** – ఆత్మ లేదా బ్రహ్మ కారణం అయితే ఈ జగత్తు మొత్తం కార్యం. ఇది ఎలా నిరూపిస్తాము? ఒక వస్తువునుంచి వచ్చి, దాన్నించి స్థితి పొంది, దానిలో లయమయ్యేదానిని కార్యం అంటారు. ఆభరణాలు

కార్యం. ఎందుకంటే అవి బంగారంనుంచి వచ్చి, బంగారంవల్లే స్థితి పొంది, వాటిని కరిగిస్తే బంగారంలోనే లయమవుతాయి. అలాగే కుండలు కార్యం. ఎందుకంటే కుండలు మట్టినుంచి వచ్చి, మట్టిలో స్థితి పొంది, మట్టిలో లయమవుతాయి. ఇదే సూత్రాన్ని జగత్తుకు వర్తిస్తే, జగత్తు బ్రహ్మనుంచి వచ్చి బ్రహ్మలో స్థితి పొంది, బ్రహ్మలో లయమవుతుంది. ఆ విధంగా బ్రహ్మ సృష్టి, స్థితి, లయ కారణం అయింది.

సృష్టి మాత్రకారణం నిమిత్తకారణం అవుతుంది. కుండ విషయం తీసుకుంటే కుమ్మరి నిమిత్తకారణం, మట్టి ఉపాదానకారణం. కుమ్మరి కుండను తయారుచేస్తాడు తప్ప, దాని స్థితి, లయకారకుడు కాదు. మట్టి సృష్టి స్థితి లయకారణం. అంటే ఉపాదాన కారణం సృష్టి స్థితి లయకారణం. ఆత్మను ఉపాదానకారణంగా నిరూపిస్తే ఆత్మకు భిన్నంగా ఏదీ లేదని నిరూపించగలము. ఈ విషయాన్ని తార్కికంగా ఒక్కొక్క దశగా వివరించుకు వస్తున్నది ఉపనిషత్తు. 7, 8, 9 మంత్రాలు ఆత్మస్థితి కారణం అని చూపిస్తున్నాయి. ఇంకో భాషలో చెప్పాలంటే మొత్తం జగత్తుయొక్క సారం ఆత్మ. 10వ మంత్రం సృష్టికారణం ఆత్మ అని చెపితే; 11, 12 మంత్రాలు లయకారణం ఆత్మ అని చూపిస్తున్నాయి.

ఆత్మ ఉపాదానకారణం అని తార్కికంగా చూపిస్తున్నది అని చూశాము కదా. అది ఎలా చూపిస్తున్నది? మట్టి లేకుండా కుండ లేదు; బంగారం లేకుండా ఆభరణాలు లేవు; చెక్క లేకుండా బల్ల లేదు. దీన్నిబట్టి ఒక సూత్రం చెప్పవచ్చు. మట్టి లేకుండా కుండ లేదు అంటే మట్టి కుండయొక్క సారం. ఇదే సూత్రాన్ని అన్వయిస్తే చైతన్యం లేకుండా జగత్తు లేదు.

మట్టి, కుండ ఉదాహరణ తీసుకుంటే మట్టి సామాన్యరూపం, కుండ విశేషవస్తువు. బంగారం, ఆభరణాల విషయం తీసుకుంటే బంగారం సామాన్యరూపం, ఆభరణం విశేషవస్తువు. అదే విధంగా చైతన్యం సామాన్యరూపం, జగత్తు విశేషవస్తువు అవుతుంది. విశేషవస్తువుద్వారా సామాన్యరూపాన్ని గ్రహించగలుగుతాము. ఈ విషయాన్ని వివరించటానికి కుండ మట్టి ఉదాహరణనివ్వకుండా, ఉపనిషత్తు మూడు ఉదాహరణలను చూపిస్తున్నది. అవి– దుందుభి, శంఖం, వీణ.

మూడూ మూడు రకాల వాయిద్యాలు. దుందుభి అంటే కొట్టే వాయిద్యం, శంఖం అంటే గాలి ఊదే వాయిద్యం, వీణ అంటే తీగలమీద వాయించే వాయిద్యం. ఈ మూడింటిలోనూ రెండు రకాల శబ్దాలు ఉన్నాయి. అవి సామాన్యశబ్దం, విశేషశబ్దం. సామాన్యశబ్దం అంటే వాయిద్యం వాయిస్తున్నంతసేపూ మ్రోగే శబ్దం, విశేషశబ్దం అంటే అందులో వచ్చే రకరకాల శబ్దాలు, రాగాలు, హెచ్చుతగ్గుల స్థాయిలు.

ఇక్కడ ఉపనిషత్తు చెప్పాలనుకున్న విషయం విశేషశబ్దం సామాన్యశబ్దానికి భిన్నంగా లేదు. అంటే సామాన్యశబ్దం లేనిదే విశేషశబ్దం లేదు. దీని వెనకనున్న తర్కం ఏమిటి? విశేషశబ్దాన్ని అనుభవించాలంటే, ముందు సామాన్యశబ్దగ్రహణం ఉండాలి. ఇంకో విధంగా చెప్పాలంటే సామాన్యశబ్దాన్ని వినగలిగితేనే, విశేషశబ్దాన్ని వినగలుగుతాము. అంటే సామాన్యశబ్దాన్ని వినలేకపోతే, విశేషశబ్దాన్ని వినలేము. ఉదాహరణకు వీణ కచేరీకి వెళితే, కచేరీ సాగుతున్నంతసేపూ తీగల శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. భిన్నరాగాలు వచ్చి పోతుంటాయి. తీగల శబ్దాన్ని సామాన్యశబ్దం అంటే రాగాలను విశేషశబ్దం అంటారు.

అటువంటి వీణ కచేరీకి చెవిటివాడిని తీసుకెళ్ళి, ఒక పాట విన్నాక, ఇది ఏ రాగమో చెప్పమంటే అసలు వీణ తీగలశబ్దమే వినిపించని వానికి, అందులోని రాగాలు ఏం వినిపిస్తాయి? దీన్నిబట్టి సామాన్యశబ్దమే ముఖ్యమని అర్థమవుతున్నది. అందువల్ల సామాన్యశబ్దం సత్యం, విశేషశబ్దం మిథ్య అవుతాయి. ఎందుకంటే సామాన్యశబ్దం లేకుండా విశేషశబ్దానికి విడిగా ఉనికి లేదు.

ఇదే సూత్రం చైతన్యానికి వర్తిస్తుంది. నేను, నేను, నేను అనేది సామాన్యం. నేను మనిషిని, నేను భర్తను, నేను వింటున్నాను, నేను చూస్తున్నాను అని నేను తర్వాత వచ్చే పదాలన్నీ విశేషచైతన్యం కిందికి వస్తాయి. 'నేను' అనే నేను లేకుండా నేను జగత్తును చూడలేను.

**చైతన్యమ్ ఏవ స్థితికారణమ్**

ఈ తర్కాన్ని 7, 8, 9 మంత్రాల్లో చూస్తాము. మూడు మంత్రాల సారం ఒక్కటే. ఉదాహరణలు మాత్రం వేరు.

## మంత్రం 2.4.7

**స యథా దున్దుభేర్హన్యమానస్య న బాహ్యాన్ శబ్దాన్ శక్నుయాద్గ్రహణాయ దున్దుభేస్తు గ్రహణేన దున్దుభ్యాఘాతస్య వా శబ్దో గృహీతః ॥**

ఇందులో దుందుభి ఉదాహరణను చూస్తాము. దుందుభి అంటే నగారా. దుందుభిని మ్రోగించినప్పుడు దుందుభి శబ్దం సామాన్యశబ్దం, దానినుంచి వచ్చే తారాస్థాయి, మంద స్వరభేదాలు విశేషశబ్దాలు. అవి సామాన్య శబ్దానికి భిన్నంగా లేవు.

## మంత్రం 2.4.8

**స యథా శఙ్ఖస్య ధ్మాయమానస్య న బాహ్యాన్ శబ్దాన్ శక్నుయాద్గ్రహణాయ శఙ్ఖస్య తు గ్రహణేన శఙ్ఖధ్మస్య వా శబ్దో గృహీతః ॥**

దీనిలో శంఖం ఉదాహరణను చూస్తాము. శంఖం శబ్దం సామాన్యశబ్దం, దానినుంచి వచ్చే స్థాయీభేదాలు విశేషశబ్దాలు.

## మంత్రం 2.4.9

**స యథా వీణాయై వాద్యమానాయై న బాహ్యాన్ శబ్దాన్ శక్నుయాద్గ్రహణాయ వీణాయై తు గ్రహణేన వీణావాదస్య వా శబ్దో గృహీతః ॥**

ఇందులో వీణ ఉదాహరణను చూస్తాము. వీణ శబ్దం సామాన్యశబ్దం. దానినుంచి వచ్చే తారాస్థాయి, మంద స్వరభేదాలు విశేషశబ్దాలు. అవి సామాన్యశబ్దానికి భిన్నంగా లేవు.

ఈ మూడు ఉదాహరణలోనూ ఒకటే భావన చొప్పించబడింది. దుందుభి విశేషశబ్దానికి దుందుభి సామాన్యశబ్దం ఉండాలి. శంఖం విశేషశబ్దానికి శంఖం సామాన్యశబ్దం ఉండాలి. వీణ విశేషశబ్దానికి వీణ సామాన్యశబ్దం ఉండాలి. దీనినుంచి ఒక సూత్రాన్ని చెప్పవచ్చు. ఏమిటది? విశేషశబ్దం సామాన్యశబ్దానికి భిన్నంగా ఉండలేదు. స్వతంత్రంగా ఉనికి ఉన్నది సత్యం, స్వతంత్రంగా ఉనికి లేనిది మిథ్య. ఈ సూత్రం ప్రకారం సామాన్యశబ్దం సత్యం, విశేషశబ్దం మిథ్య.

ఇప్పుడు ఈ సూత్రాన్ని జగత్తుకు అన్వయించి చూద్దాము. జగత్తులో అనేక వస్తువులను చూస్తాము. మనిషి ఉన్నాడు, చెట్టు ఉంది, బల్ల ఉంది, కుర్చీ ఉంది. అన్ని వాక్యాల్లోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? ఉన్నాడు/ఉంది. ఈ ఉన్నాడు/ఉంది పదం లేకుండా ఆ వ్యక్తిని/వస్తువును వివరించగలమా? ఉనికి లేని వస్తువును చూడలేము. అంటే ఉనికి లేనిదే ఆ వస్తువును చూడలేము. ఉనికిని సత్తా అంటారు. సామాన్య సత్తా లేనిదే విశేషసత్తాను చూడలేము. నిర్విశేష సత్తావల్లనే విశేషసత్తాను చూస్తున్నాము. ఏది సామాన్యసత్తా, ఏది విశేషసత్తా?

ఉనికి సామాన్యసత్తా, జగత్తులోని భిన్న వస్తువులు విశేషసత్తా. మన తర్కం ప్రకారం సామాన్యసత్తా సత్యం, విశేషసత్తా మిథ్య. ఎందుకంటే స్వతంత్ర వస్తువుమీద మిథ్యా వస్తువు ఆధారపడివుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ఉనికి సత్యం, మనిషి మిథ్య.

దీన్నే ఇంకో విధంగా చూస్తే, నేను మనిషిని చూస్తే నాకు మనుష్యజ్ఞానం కలుగుతున్నది; చెట్టును చూస్తే వృక్షజ్ఞానం కలుగుతున్నది; కుండను చూస్తే ఘటజ్ఞానం కలుగుతున్నది. వీటన్నిటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? జ్ఞానం, జ్ఞానం. దేని గురించిన జ్ఞానం అని ప్రశ్నిస్తే ఆ వస్తువులు మారుతున్నాయి. అంటే సాధారణజ్ఞానం సామాన్యజ్ఞానం; విశేషంగా ఒక్కొక్క వస్తువు గురించి తెలియటం విశేషజ్ఞానం. అంటే మనిషి, చెట్టు, కుండలాంటి పదాలు విశేషజ్ఞానం. వేదాంతం సామాన్యజ్ఞానాన్ని సత్యమనీ, విశేషజ్ఞానాన్ని మిథ్య అనీ అంటున్నది. ఈ జ్ఞానాన్ని ఎఱుక అని కూడా అంటారు.

**సచ్చిదాత్మక ఆత్మ ఏవ స్థితికారణమ్ అపి**

జగత్తుయొక్క స్థితికారణం సత్, చిత్ అయిన ఆత్మ. ఈ ఆత్మను ఎక్కడ పొందుతాము? అర్థం లేని ప్రశ్న. దీనికి జవాబు చెప్పకూడదు, తిరిగి ప్రశ్నించాలి, 'ఎక్కడ పొందలేవు?' అనాలి. బంగారం అనుభవం పొందాలంటే ఏ ఆభరణంలో చూడాలి అన్నట్టు ఉంటుంది. ఏ ఆభరణం చూసినా దానిలో ఉండేది బంగారమే. ఏ విశేష అనుభవం పొందినా, దానిలో సామాన్య అనుభవం ఇమిడి ఉంటుంది. అలాంటప్పుడు సామాన్య అనుభవం అయిన ఆత్మ అనుభవం ఎక్కడ పొందుతాను అనే ప్రశ్నలో ఏమైనా అర్థం ఉందా? ఈ పుస్తకాన్ని అనుభవిస్తే, ఆత్మను అనుభవించినట్టే, ఆత్మ స్వయంప్రకాశకం. ఎప్పటికీ ఆత్మ అనుభవం ఉంటుంది. ఇంకా చెప్పాలంటే ఆత్మ లేకుండా దేనినీ అనుభవించలేరు.

కాని వచ్చిన చిక్కేమిటంటే ఇంతా విని చాలామంది వేదాంతం నాకు చాలా చక్కగా అర్థమయింది, కాని ఆత్మ అనుభవమే కలగటం లేదు అంటారు. ఇంకా మాట్లాడితే ఆత్మసాక్షాత్కారం పొందటానికి సమాధిలోకి వెళ్ళాలి అంటారు. సమాధిలో పొందే అనుభవం ఏమిటి? విశేష అనుభవం. ప్రతి ఒక్క విశేష అనుభవమూ

మిథ్య అని నొక్కి వక్కాణించింది ఉపనిషత్తు. అన్నీ అంత స్పష్టంగానూ విని, అర్థం చేసుకుని కూడా ఆత్మను విశేష అనుభవంగా అనుభవించాలి అనుకుంటాము.

ఆత్మ మూడు అవస్థల్లోనూ ఉంది. సుషుప్తిలో విశేష అనుభవాలు ఉండవు కాని, సామాన్య అనుభవం ఉంటుంది. అంటే నిర్విశేషచైతన్యం ఉంటుంది. తక్కిన అవస్థల్లో ఈ నిర్విశేషచైతన్యంవల్లనే విశేష అనుభవాలు కలుగుతున్నాయి. అంటే సామాన్య ఎరుక అయిన ఆత్మవల్లనే విశేష ఎరుక కలుగుతున్నది. ఆ విధంగా ఆత్మ ఉపాదానకారణం, ఆత్మ స్థితికారణం.

## మంత్రం 2.4.10

**స యథాఽఽర్ద్రైధాగ్నేరభ్యాహితాత్పృథగ్ధూమా వినిశ్చరన్త్యేవం వా అరేఽస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాస్సూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానాన్యస్యైవైతాని నిశ్వసితాని ॥**

ఇంతకుముందు మూడు మంత్రాల్లోనూ ఆత్మను స్థితికారణంగా చూశాము. ఈ మంత్రంలో సృష్టి కారణంగా చూస్తాము. ఆత్మనుంచి మొత్తం సృష్టి వచ్చింది.

ఆత్మనుంచి సృష్టి వచ్చిందని నిరూపించటానికి ఇంకొక ఉదాహరణను చూస్తాము. ఈ బ్రాహ్మణము మొత్తం చాలా ముఖ్యమైనదని ముందే చూశాము. నిజానికి ఈ మంత్రమే బ్రహ్మసూత్రాల్లోని మూడవ సూత్రానికి ఆధారం. అది –

**శాస్త్రయోనిత్వాత్**

ఏమిటా ఉదాహరణ? తడికట్టెలు. తడికట్టెలను కాలిస్తే అగ్ని వస్తుంది. ఆ అగ్ని ముందే తడికట్టెల్లో ఉంది. అంటే చెక్కకు అగ్నితత్త్వం ఉంటుంది. అగ్నితో పాటు పొగ, నిప్పురవ్వలు కూడా వస్తాయి. ఆ తడికట్టెలను కాల్చకముందు పొగ, నిప్పురవ్వలు, అగ్ని ఎక్కడ ఉన్నాయి? అవి అవ్యక్తంగా ఆ కట్టెలలో ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు వ్యక్తంలోకి వచ్చాయి. దాన్నే కాలటం అంటున్నాము మనము.

అలాగే ఆత్మలో అవ్యక్తస్థితిలో ఈ సృష్టి మొత్తం, సృష్టికి పూర్వం ఉంది. సమయం వచ్చినప్పుడు పొగలాంటి జగత్తు, నిప్పురవ్వలలాంటి జీవాలు ఆత్మనుంచి వచ్చాయి. కాని ఉపనిషత్తు జగత్తు వచ్చింది అనకుండా వేదాలు వచ్చాయి అంటున్నది. వేదాలంటే ఒక్క వేదాలనే తీసుకోకూడదు, మొత్తం జగత్తును తీసుకోవాలి. దాన్ని ఉపలక్షణం అంటారు. వేదాలు వచ్చాయి అంటే జగత్తు వచ్చింది అని ఎలా చెప్పగలము? దానికి శంకరులవారు సమాధానం చెబుతున్నారు.

వేదాలు శబ్దప్రపంచం లేదా నామప్రపంచం లేదా పదప్రపంచం. పదం పదార్థానికి భిన్నంగా ఉండదు. జగత్తును నామరూపాత్మక జగత్తు అంటారు. నామం లేకుండా రూపం లేదు; వాక్కు లేకుండా వాక్యార్థం లేదు; శబ్దం లేకుండా శబ్దార్థం లేదు; నామం లేకుండా నామి లేదు. అందువల్ల శబ్దప్రపంచం పుట్టింది అంటే దానితోపాటు అర్థప్రపంచం కూడా పుట్టిందని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. ఉదాహరణకు ఆకాశం విషయం

తీసుకుంటే ఆత్మనుంచి ఆకాశశబ్దం పుట్టింది అంటే, ఆత్మనుంచి ఆకాశపదార్థం కూడా పుట్టిందని అర్థం. అలాగే వాయువు శబ్దం పుట్టింది అంటే వాయువు పదార్థం కూడా పుట్టిందని అర్థం. ఒక్కముక్కలో చెప్పాలంటే వేదాలు, ప్రపంచం కూడా ఆత్మనుంచి పుట్టాయి. ఇది ఒక అంశం.

ఇంకొక అంశం కూడా ఉంది. వేదాలు ఆత్మనుంచి పుట్టాయి అని చెప్పేటప్పుడు ఉపనిషత్తు ఒక ఉదాహరణను చూపిస్తున్నది. మనిషి శ్వాస వదిలినట్టుగా సృష్టి ఆత్మనుంచి వచ్చింది అంటున్నది. ఈ ఉదాహరణ ద్వారా రెండు ముఖ్యమైన విషయాలను సూచిస్తున్నది ఉపనిషత్తు.

1. **సునాయాసం** – శ్వాస పీల్చి వదలటానికి మనమేమీ శ్రమ పడము. చాలా సునాయాసంగా చేస్తాము. శ్వాసపీల్చటం ప్రయత్నపూర్వకంగా చెయ్యాల్సివస్తే, మనం వేరే పనులను చెయ్యలేము. కాని మనం శ్వాసపీలుస్తున్నట్టు కూడా మనకు తెలియదు. అదే విధంగా పరమాత్మ లేదా మాయాసహిత ఈశ్వరుడు ఈ జగత్తును అంత సునాయాసంగా సృష్టించాడు.

2. **వృత్తాకారం** – శ్వాస పీల్చి వదలటం అనేది వృత్తాకారంలో సాగుతుంది. అది అనాది. అలాగే భగవంతుడు తననుంచి సృష్టిని బయటకు తెస్తాడు, తనలోనే మళ్ళీ లయం చేసుకుంటాడు. అంటే సృష్టి అవ్యక్తరూపంలో భగవంతునిలో ఉంది. అది వేదాల రూపంలో వ్యక్తమవుతున్నది, అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అలా సృష్టి–లయం ఒక వృత్తాకారంలో సాగుతుంది.

ఈ నేపథ్యంతో మంత్రాన్ని చూద్దాము.

**స యథాఽఽర్ద్రైధాగ్నేరభ్యాహితాత్పృథగ్ధూమా వినిశ్చరంతి** – అది ఎలాగంటే – తడికట్టెలు ఇంధనంగా కలిగి అన్నివైపులా మండుతున్న అగ్నినుంచి పొగ వెలువడుతుంది. ఆర్ద్రైధాగ్నేః అంటే తడికట్టెలతో రగల్చబడిన నిప్పు.

అభ్యాహితాత్పృథగ్ధూమా అంటే బాగా మండుతున్న దాన్నించి పొగ; వినిశ్చరంతి – వెలువడుతున్నాయి. పొగతో పాటు నిప్పురవ్వలు, మంట తీసుకోవాలి.

**ఏవం వా అరే (మైత్రేయీ)** – అదేవిధంగా, మైత్రేయీ,

**అస్య మహతో భూతస్య నిశ్వసితమేతత్** – అనంతరూపమైన పరమాత్మయొక్క నిశ్వాసమే ఇది.

**యదృగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాంగిరసః** – నాలుగు వేదాలు అంటే ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం వచ్చాయి. అథర్వణ వేదాన్ని అథర్వాంగిరస వేదం అని కూడా అంటారు.

వేదంలో రెండు భాగాలుంటాయి. అవి బ్రాహ్మణ భాగం, మంత్రభాగం.

**మంత్రబ్రాహ్మణయోః వేదనామధేయమ్**

మంత్రభాగాన్ని నాలుగు భాగాలుగా విభజిస్తారు. అవే నాలుగు వేదాలైన ఋగ్, యజుర్, సామ, అథర్వణ వేదాలు. బ్రాహ్మణ భాగాన్ని ఎనిమిది భాగాలుగా విభజిస్తారు. అవి –

**ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాస్సూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానాన్యస్యై వైతాని నిశ్వసితాని** – ఆ ఎనిమిది బ్రాహ్మణ భాగాలు ఇతిహాసం, పురాణం, విద్య, ఉపనిషత్తు, శ్లోకం, సూత్రం, అనువ్యాఖ్యానం,వ్యాఖ్యానం.

మామూలుగా ఇతిహాసం అంటే రామాయణ, మహాభారతాలు. పురాణం అంటే భాగవత పురాణం, మార్కండేయ పురాణం లాంటివి. కాని ఇక్కడ ఆ అర్థాలు రావు. ఎందుకు? వేదాలు మాత్రమే పరమాత్మనుంచి వచ్చాయి కాని రామాయణ, మహాభారతాలు వాల్మీకి, వ్యాసమహర్షులనుంచి వచ్చాయి. ఇక్కడ మనం భగవంతునినుంచి వచ్చిన సృష్టి గురించి మాట్లాడుతున్నాము. అందువల్ల శంకరులవారు ఇతిహాసం అంటే ఊర్వశి పురూరవుల కథ అని చెబుతున్నారు. అలాగే పురాణం అంటే సృష్టివాక్యాలు. ఎందుకంటే పురాణం అంటే పూర్వం ఎప్పుడో జరిగినది అని అర్థం. సృష్టి పురాణం కింద వస్తుంది.

విద్య – అంటే దేవజన విద్య అంటే దేవతలకు తెలిసిన అనేక లలితకళలు.

ఉపనిషత్తు – అంటే ఉపనిషత్తు కాదు, రహస్యనామం అని ఈ ఉపనిషత్తులోనే చూశాము. సత్యస్య సత్యం ఒక రహస్యనామం అని చూశాము.

శ్లోకం – అంటే బ్రాహ్మణభాగంలో ఉటంకించే మంత్రాలు.

**తదేష శ్లోకో భవతి** – తైత్తిరీయం

సూత్రాణి – అంటే సంగ్రహ వాక్యాలు. మొత్తం వేదాంత సారాన్ని చిన్న వాక్యాల్లో చెప్పటం.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్** – తైత్తిరీయం
**ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి**– విద్యాసూత్రం
**అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవగ్ం స దేవానామ్॥**
– అవిద్యా సూత్రం

ఈశ్వరుడు వేరు, నేను వేరు అనుకోవటం అవిద్య; ఈశ్వరుడు, నేను ఒకటే అని అర్థం చేసుకోవటం (అనుకోవటం కాదు) విద్య. వేదాంతసారాన్ని చిన్న వాక్యంలో చెప్పేది సూత్రం. కాని ఇక్కడ బ్రహ్మసూత్రాలను ఉదాహరణగా చెప్పకూడదు. ఇంతకుముందు చెప్పిన కారణమే దీనికీ వర్తిస్తుంది. బ్రహ్మసూత్రం పౌరుషేయం, మనం చెపుతున్నది అపౌరుషేయం గురించి.

అనువ్యాఖ్యానాని – సూత్రభూతమంత్రాలను వివరించేది. **బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్** సూత్రాన్ని తర్వాత మంత్రాలు వివరిస్తాయి. అలాగే విద్యాసూత్రాన్ని వివరిస్తుంది మొత్తం రెండవ అధ్యాయం.

వ్యాఖ్యానాని – బ్రాహ్మణభాగంలో ఉన్న మంత్రాలను వివరించటాన్ని వ్యాఖ్యానాని అంటారు. అనువ్యాఖ్యానాని సూత్రవివరణ చేస్తే, వ్యాఖ్యానాని మంత్రవివరణ చేస్తాయి. దీన్నే శ్లోకవివరణ అని కూడా అనవచ్చు. దీనికి కూడా ఉదాహరణను ఈ ఉపనిషత్తులోనే చూడవచ్చు. మొదటి అధ్యాయంలోని ఐదవ బ్రాహ్మణాన్ని సప్తాన్న బ్రాహ్మణం అంటారు. ఆ సప్తాన్న బ్రాహ్మణంలో మొదటి నాలుగైదు మంత్రాలు మంత్రభాగం అయితే, తర్వాత వచ్చే మంత్రాలు వాటి వివరణ.

ఇంకో ఉదాహరణ కూడా ఈ ఉపనిషత్తులోంచే ఇవ్వవచ్చు. మొదటి అధ్యాయంలోనే అసతోమా సద్గమయ మంత్రం ఉంది. దానికి వివరణ ఉపనిషత్తే ఇచ్చింది. అలా మంత్రభాగాన్ని శ్లోకం అనీ, వివరణ భాగాన్ని వ్యాఖ్యానం అనీ అంటారు.

ఆ విధంగా చతుర్విధ మంత్రభాగాలూ, అష్టవిధ బ్రాహ్మణభాగాలూ సర్వం –

ఏతాని నిశ్వసితాని – పరమాత్మయొక్క నిశ్వాసాలు మాత్రమే. పరమాత్మ అంటే మాయాసహిత ఈశ్వరుడు. ఎప్పుడైతే సృష్టి ప్రకరణం వస్తుందో అప్పుడే మాయ ప్రసక్తి వస్తుంది. వేదాలను భగవంతుడు సృష్టించలేదు. అది అవ్యక్తరూపంలో ప్రళయంలో ఉంది. మనం ఊపిరి తీసుకుని, వదిలేలాగా, ప్రళయకాలంలో వేదం లయమవుతుంది; సృష్టి జరిగినప్పుడు వ్యక్తంలోకి వస్తుంది.

ఆ విధంగా ఈశ్వరుడు శబ్దప్రపంచాన్ని, అర్థప్రపంచాన్ని సృష్టించాడు. ఈశ్వరుడు సర్వసృష్టి కారణం. ఇంతవరకు ఈశ్వరుణ్ణి సృష్టి, స్థితికారకునిగా చూశాము. ఇప్పుడు లయకారకుడిగా చూడాలి. అది 11,12 మంత్రాలలో చూస్తాము.

## మంత్రం 2.4.11

**స యథా సర్వాసామపాగ్ం సముద్ర ఏకాయనమేవగ్ం సర్వేషాగ్ం స్పర్శానాం త్వగేకాయనమేవగ్ం సర్వేషాం గన్ధానాం నాసికే ఏకాయనమేవగ్ం సర్వేషాగ్ం రసానాం జిహ్వైకాయనమేవగ్ం సర్వేషాగ్ం రూపాణాం చక్షురేకాయనమేవగ్ం సర్వేషాగ్ం శబ్దానాగ్ం శ్రోత్రమేకాయనమేవగ్ం సర్వేషాగ్ం సఙ్కల్పానాం మన ఏకాయనమేవగ్ం సర్వాసాం విద్యానాగ్ం హృదయమేకాయనమేవగ్ం సర్వేషాం కర్మణాగ్ం హస్తావేకాయనమేవగ్ం సర్వేషామానన్దానాముపస్థ ఏకాయనమేవగ్ం సర్వేషాం విసర్గాణాం పాయురేకాయనమేవగ్ం సర్వేషామధ్వనాం పాదావేకాయనమేవగ్ం సర్వేషాం వేదానాం వాగేకాయనమ్ ॥**

ఈ మంత్రం ఆత్మను లయస్థానంగా అభివర్ణిస్తుంది. **ఏకాయనమ్** పదం లయస్థానాన్ని సూచిస్తుంది.

అన్నీ ఒకదానిలో లయమవటం. ద్వైతం అద్వైతంగా మారటం. అన్ని నదులు ఒక సముద్రంలో కలిసినట్టుగా, జగత్తు మొత్తం పరమాత్మలో లయమవుతుంది.

నిజానికి పరమాత్మను సముద్రం అనవచ్చు. ఈ ఉపనిషత్తులోని మొదటి బ్రాహ్మణంలో **సర్వేషామ్ ఆపః** అని వచ్చింది. ఆపః అంటే అన్ని రకాల నదులు, సెలయేర్లు, వాననీరు కూడా. మనం తేలిగ్గా అర్థం చేసుకోవటానికి ప్రపంచాన్ని పన్నెండు భాగాల కింద విభజించింది ఉపనిషత్తు. అవి పంచజ్ఞానేంద్రియ విషయాలు, పంచకర్మేంద్రియ విషయాలు, సంకల్పవిషయాలు, బుద్ధివిషయాలు. అంటే పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి కలిసి 12 అయ్యాయి.

లయ క్రమబద్ధంగా, ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది. ఇందులో ఆ క్రమపద్ధతిలోంచి మొదటిదశ మాత్రమే వర్ణించబడింది. తక్కినవి మనం అర్థం చేసుకోవాలి.

**స యథా సర్వాసామపాగ్ం సముద్ర ఏకాయనమ్** – ఏ విధంగా నదులు, సెలయేర్లలో ఉండే నీరంతా సముద్రంలో లయమవుతుందో;

**ఏవగ్ం సర్వేషాగ్ం స్పర్శానాం త్వగేకాయనమ్** – ఇదే విధంగా స్పర్శలన్నిటికీ చర్మం ఒక్కటే గమ్యం. మామూలుగా ఇక్కడ త్వగ్ అంటే స్పర్శేంద్రియం కాని ఈ సందర్భంలో త్వగ్ అంటే సామాన్య స్పర్శ. విశేష స్పర్శలన్నీ సామాన్య స్పర్శలో లయమవుతాయి. ఇదే సూత్రాన్ని తక్కిన పదకొండు అంగాలకీ అన్వయించాలి.

**ఏవగ్ం సర్వేషాం గంధానాం నాసికే ఏకాయనమ్** – ఇదే విధంగా అన్ని వాసనలు సామాన్య వాసనలో లయమవుతాయి.

**ఏవగ్ం సర్వేషాగ్ం రసానాం జిహ్వైకాయనమేవగ్ం సర్వేషాగ్ం రూపాణాం చక్షురేకాయనమేవగ్ం సర్వేషాగ్ం శబ్దానాగ్ం శ్రోత్రమేకాయనమ్** – ఇదే విధంగా విశేష రుచులన్నీ సామాన్య రుచిలో, విశేష రూపాలన్నీ సామాన్య రూపంలో, విశేష శబ్దాలన్నీ సామాన్య శబ్దంలో లయమవుతాయి. ఇక్కడితో పంచజ్ఞానేంద్రియాల విషయవస్తువులు అయిపోయాయి.

**ఏవగ్ం సర్వేషాగ్ం సంకల్పానాం మన ఏకాయనమ్** – అదే విధంగా విశేష సంకల్పాలన్నీ సామాన్య సంకల్పంలో లయమవుతాయి.

**ఏవగ్ం సర్వాసాం విద్యానాగ్ం హృదయమేకాయనమ్** – ఇక్కడ హృదయం అంటే సామాన్యబుద్ధి. ఇక్కడ బుద్ధి అంటే సామాన్యవిద్య. విశేషవిద్యలన్నీ సామాన్యవిద్యలో లయమవుతాయి. ఇక్కడితో మనస్సు, బుద్ధి విషయవస్తువులు అయిపోయాయి. ఇప్పుడు పంచకర్మేంద్రియాలు.

**సర్వేషాం కర్మణాగ్ం హస్తావేకాయనమ్** – హస్తా అంటే సామాన్యకర్మ. అంటే విశేషకర్మలన్నీ సామాన్యకర్మలో లయమవుతాయి.

**సర్వేషామానందాముపస్థ ఏకాయనమ్** – ఉపస్థ అంటే సామాన్య ఆనందం. విశేష ఆనందాలన్నీ సామాన్య ఆనందంలో లయమవుతాయి.

**ఏవగ్ం సర్వేషాం విసర్గాణాం పాయురేకాయనమ్** – పాయు అంటే సామాన్య విసర్జనం. విశేష విసర్జనలన్నీ సామాన్య విసర్జనంలో లయమవుతాయి.

**ఏవగ్ం సర్వేషామధ్వనాం పాదావేకాయనమ్** – విశేష గతులన్నీ సామాన్యగతిలో లయమవుతాయి. విశేష గతులంటే విమానం, రైలు, కార్లలో చేసే ప్రయాణాలు.

**ఏవగ్ం సర్వేషాం వేదానాం వాగేకాయనమ్** – అలాగే విశేష వాక్కులన్నీ సామాన్య వాక్కులో శబ్దంలో లయమవుతాయి.

ఇక్కడితో పంచకర్మేంద్రియాల, విషయ వస్తువులు అయిపోయాయి. మొదటిదశలో విశేషశబ్దాలు, విశేషవాసనలు సామాన్యశబ్దంలో, సామాన్యవాసనలో లయమవుతాయి. అంతవరకే ఉపనిషత్తు చెప్పింది. అంటే విషయవస్తువులు లయమవటం చెప్పింది కాని ఇంద్రియాలు లయమవటం చెప్పలేదు.

రెండవదశ విజ్ఞానం లేదా ఎరుక మొత్తం జగత్తుకు లయస్థానం. ఎలా చెప్పగలము? జవాబు చాలా తేలిక. మనం పడుకున్న మరుక్షణమే పంచజ్ఞానేంద్రియాలు లయమవుతాయి, జ్ఞానేంద్రియాల విషయవస్తువులు లయమవుతాయి, కర్మేంద్రియాలు లయమవుతాయి; మనస్సు, బుద్ధి లయమవుతాయి. మిగిలింది ఏమిటి? సాక్షిచైతన్యం. అలా అన్నీ లయమవుతాయి అని చెప్పటానికి సుషుప్తి ఒక ఉదాహరణ. విశేషజ్ఞానం సామాన్యజ్ఞానంలో లయమవుతుంది. అది చివరికి విజ్ఞానం లేదా ప్రజ్ఞానంలో లయమవుతుంది. అలా అంతా చివరికి చైతన్యంలో లయమవుతుంది.

మొదటి ఉదాహరణ నిద్ర, ఇంకొక ఉదాహరణ ప్రళయం, మూడవ ఉదాహరణ విదేహముక్తి. మూడింటిలోనూ జగత్తు లయమవుతుంది. కాని విదేహముక్తికి మాత్రమే ఆత్యంతిక ప్రళయం అనే పదాన్ని చూస్తాము. ముండకోపనిషత్తులో దీన్ని పరాంతకాలే అంటారు. ఎందుకు?

నిద్రలో జగత్తు, ఇంద్రియాలు లయమవుతాయి, నిజమే కాని నిద్ర లేవగానే అన్నీ మళ్ళీ తిరిగివస్తాయి. ప్రళయంలో కూడా జగత్తు అవ్యక్తంలోకి వెళ్ళిపోయినా, మళ్ళీ సృష్టి జరిగినప్పుడు, అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వస్తాయి. కాని విదేహముక్తిలో జ్ఞాని మోక్షం పొంది, మళ్ళీ తిరిగిరాడు. అతనికి మళ్ళీ జన్మ లేదు.

ఈ మంత్రం నిద్ర, ప్రళయం, విదేహముక్తులను సూచిస్తుంది. ఈ మూడింటికీ ఆత్మే లయస్థానం. విదేహముక్తిని ఆత్యంతిక ప్రళయం అని చెప్పటానికి సూచన ఉంది. ఏదేమైనా మనం తీసుకోవాల్సిన సారం ఆత్మ లయకారణం. ఆ విధంగా **ఆత్మ సృష్టి స్థితి లయకారణం**.

## మంత్రం 2.4.12

**స యథా సైన్ధవఖిల్య ఉదకే ప్రాస్త ఉదకమేవానువిలీయేత న హాస్యోద్గ్రహణాయేవ స్యాత్। యతో యతస్త్వాదదీత లవణమేవైవం వా అర ఇదం మహద్భూతమనన్తమపారం విజ్ఞానఘన ఏవ ॥ ఏతేభ్యో భూతేభ్యస్సముత్థాయ తాన్యేవాను వినశ్యతి న ప్రేత్య సంజ్ఞాస్తీత్యరే బ్రవీమీతి హోవాచ యాజ్ఞవల్క్యః ॥**

జ్ఞానికి విదేహముక్తి కలుగుతుందని ఈ మంత్రంలో ఇంకా స్పష్టంగా వస్తుంది. జ్ఞానికి విదేహముక్తి కలిగినప్పుడు ఏమవుతుంది? అది తెలుసుకునేందుకు జ్ఞాని విదేహముక్తి పొందకముందు ఎలా ఉన్నాడో తెలుసుకోవాలి.

జ్ఞాని జీవించి ఉండగా, చైతన్యం కార్యకరణసంఘాతంలో ఉన్నట్టుగా ఉంది. చైతన్యం సర్వవ్యాపకం, రూపరహితం అయినా మనశ్శరీరాలలో అందుబాటులో ఉండటంవల్ల దానికి పరిమితి ఉన్నట్టుగా ఉంది. నిజానికి నేనొక చైతన్యజీవిని అని చెప్పినప్పుడు నేను సర్వవ్యాపకమైన చైతన్యం గురించి చెబుతున్నానా, అరవై కేజీల బరువున్న ఈ శరీరం గురించి చెబుతున్నానా? అరవై కేజీల బరువున్న శరీరం గురించే చెబుతున్నాను.

కాని విదేహముక్తిలో ఏం జరుగుతుంది? ఎలాగైతే మంచుముద్దలా గడ్డకట్టిన ఐస్‌బర్గ్ వేడికి కరిగిపోయి సముద్రంలో కలిసిపోతుందో అలాగే శరీరంలో పరిమితంగా ఉన్నట్టు కనిపిస్తున్న చైతన్యం సర్వవ్యాపకమైన

చైతన్యంలో కలిసిపోతుంది. అంటే విశేషచైతన్యం సామాన్యచైతన్యంలో కలిసిపోతుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే జ్ఞాని స్థూలశరీరం స్థూలప్రపంచంతో, సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంతో, కారణశరీరం కారణప్రపంచంతో లయమవుతాయి. అందువల్ల అతనికి పునర్జన్మ ఉండదు. దీన్నే ఆత్యంతిక ప్రళయం లేదా విదేహముక్తి అంటారు. ఆత్యంతిక ప్రళయం అంటే జ్ఞానియొక్క విదేహముక్తి అని శంకరులవారు వివరిస్తారు.

ఈ మంత్రంలో ఇంకా లయకారణం కొనసాగుతున్నది. దీనికి ఉదాహరణ సైంధవ లవణాన్ని చూస్తాము.

**స యథా సైంధవఖిల్య ఉదకే ప్రాస్త ఉదకమేవానువిలీయేత** – సముద్రం నీరులో ఏమీ విభజన లేదు. కాని అదే నీరు పృథివియొక్క వేడికి గడ్డకడితే అందులో ఉప్పు స్ఫటికాలు ఏర్పడతాయి. అప్పుడు వాటికి నామరూపాలు, పరిమితులు ఏర్పడుతాయి. ఉప్పు కణికె నీటినుంచి పుట్టింది; నీటిలో ఉంది; చివరకి నీటిలో కరిగి పోతుంది. ఒక ఉప్పు కణికె ఎప్పుడైతే నీటిలో లయమయిపోతుందో, అప్పుడు దానికి కాలపరిమితి లేదు; దేశపరిమితి లేదు; నామరూపాలు లేవు. అంతే కాదు –

**న హాస్యోద్గ్రహణాయేవ స్యాత్ యతో యతస్త్వాదదీత లవణమ్** – దానిని నీటినుంచి ఎవరూ కూడా ఇదిగో ఇక్కడుంది అని పైకి తీయలేరు. ఒక స్థానానికి పరిమితమైన ఉప్పు కణికె, దాని పరిమితిని కోల్పోతుంది. సముద్రమంతటా వ్యాపిస్తుంది. ఎక్కడ రుచి చూచినా, సముద్రం నీరు ఉప్పగానే ఉంటుంది.

కాలపరిమితి లేని, వస్తుపరిమితి లేని, సర్వవ్యాపకమైన చైతన్యం సామాన్యచైతన్యం. దేహేంద్రియ మనోబుద్ధులవల్ల, అవిద్యాజన్యకార్యకరణ ఉపాధి సంఘాతంవల్ల సర్వవ్యాపకమైన చైతన్యం వ్యష్టిగా అనిపిస్తుంది. దాన్ని చిదాభాస అంటారు. సామాన్యచైతన్యాన్ని సముద్రంతో పోలిస్తే, అందులో ఉప్పు కణికె వేడివల్ల పుడితే; జీవుని విషయంలో చిదాభాస అవిద్యా సంబంధంవల్ల పుడతాడు.

చిదాభాస ఏమిటి? చిత్‌యొక్క ప్రతిబింబం. చిదాభాసవల్లనే జీవుడు 'నేను' అనుకుంటాడు. అంతేకాదు, 'నేను పరిమితి ఉన్న చైతన్యాన్ని; నాకు కాలపరిమితి, వస్తుపరిమితి ఉన్నాయి,' అనుకుంటాడు. ఈ చిదాభాసను విశేషచైతన్యం అని కూడా అంటారు.

**ఏవమేవ వా అరే ఇదం మహద్భూతమనంతమపారం విజ్ఞానఘన ఏవ** – ఎలాగైతే ఉప్పుకణికెను సముద్రంలో వేస్తే, అది సముద్రంలో లయమయిపోతుందో, అదే విధంగా అవిద్య తొలగి, ఒక వ్యక్తికి అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం కలిగి, తాను బ్రహ్మను అని అర్థం చేసుకుంటే, అతని కార్యకరణ ఉపాధి పోతుంది, చిదాభాస లేదా విశేషచైతన్యం పోతుంది. జ్ఞాని మరణం తర్వాత విదేహముక్తి పొందుతాడు.

లయం తర్వాత జ్ఞాని సామాన్యనిర్గుణ అనంతచైతన్యం అవుతాడు. జ్ఞాని 'అహం బ్రహ్మ అస్మి,' అని చెప్పటానికి విశేషచైతన్యం కావాలి; కాని విశేషచైతన్యం సామాన్యచైతన్యంలో కలిసిపోయింది. ఎలాగైతే ఉప్పు సముద్రంలో కలిసిపోయిందో, అలా జ్ఞాని విశేషచైతన్యం, సామాన్యచైతన్యంలో కలిసిపోతుంది. ఇదీ ఈ మంత్రం సారాంశం.

ఈ మంత్రం చాలా ముఖ్యమైనది. ఇందులో రెండు చైతన్యాలు స్పష్టంగా సూచించబడ్డాయి. అవి సామాన్యచైతన్యం, విశేషచైతన్యం. సామాన్యచైతన్యాన్ని చిత్ అనీ, విశేషచైతన్యాన్ని చిదాభాస అనీ అంటారు.

చిదాభాస గురించి ఉపనిషత్తులలో తరచూ వింటూంటాము కాని చిదాభాస గురించిన **ప్రమాణం** ఈ మంత్రం. అందువల్ల ఈ మంత్రం చాలా ముఖ్యమైనది. ఆత్మతత్వాన్ని లవణ దృష్టాంతంతో వివరిస్తున్నది ఉపనిషత్తు.

**మహద్భూతం** – ఈ పదానికి రెండు అర్థాలు వస్తాయి.

1. త్రికాలేపి తిష్ఠతి – మూడు కాలాల్లోనూ ఉంటుంది – అది సత్.
2. పారమార్థిక సత్యం – ఆత్మ ప్రాతిభాసిక సత్యం కాదు, వ్యావహారిక సత్యం కాదు, పారమార్థిక సత్యం.

**అనంతమ్ అపారమ్** – చిత్‌కు విశేషణాలు యివి. చిత్ అనంతం, అపారం. అంతం లేదు, పరిమితి లేదు. సురేశ్వరాచార్యులు ఈ పదాల మధ్య సూక్ష్మబేధాన్ని సూచిస్తున్నారు. అనంతం అంటే కారణరహితం, అపారం అంటే కార్యరహితం; అంటే చైతన్యం.

**కార్యకారణ విలక్షణం స్వయమ్**

చైతన్యనాన్ని ఇప్పుడే సృష్టి, స్థితి, లయ కారణంగా నిరూపించాము, జగత్తును కార్యం అన్నాము. ఇప్పుడేమో చైతన్యాన్ని కార్యకారణ విలక్షణం అంటున్నాము. అదెలా సాధ్యం? జగత్తును మిథ్యా ప్రపంచంగా చూపించినప్పుడు జగత్తు ఉన్నా లేనట్టే. రజ్జు సర్ప భ్రాంతిలో నిజంగా పాము ఉందా? లేదు! కలలో కనబడిన ఏనుగు నిజంగా ఉందా? లేదు! అలాగే జగత్తుకు విడిగా ఉనికి లేదు. కారణం లేకుండా కార్యానికి ఉనికి లేనప్పుడు కార్యం మిథ్య అవుతుంది. మిథ్యాకార్యం లేకపోతే కారణానికి కారణత్వం ఉండదు. అందువల్ల చైతన్యం కార్యకారణవిలక్షణం, శుద్ధచైతన్యం, ఏకమేవాద్వితీయం.

శంకరాచార్యులు దీన్ని ఘనం అంటున్నారు. ఉన్నదొక్కటే చైతన్యం అని దాని అర్థం. చైతన్యమొక్కటే ఉందని ఎలా చెబుతారు, కళ్ళముందు ప్రపంచం అక్షరాలా కనిపిస్తుంటే? అంటే నిజానికి మొత్తం అనాత్మ ప్రపంచం అంతా జడవస్తువు. చైతన్యం, జడ ప్రపంచం రెండూ ఉన్నాయి. చూసే నేను చైతన్యాన్ని, చూడబడే ప్రపంచం జడం. ద్వైతం అనుభవంలోకి వస్తున్నది. కాని జడప్రపంచానికి చైతన్యం లేకుండా ఉనికి లేదు. దీనికి దుందుభి శబ్దదృష్టాంతాన్ని గుర్తు తెచ్చుకోవాలి.

**ప్రపంచాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**
**బ్రహ్మను తప్పుగా అర్థం చేసుకుంటే అది ప్రపంచం**

ప్రపంచం మిథ్య. కార్యకరణ సంఘాతంవల్ల విశేషచైతన్యం ఏర్పడుతుంది. కార్యం అంటే స్థూలశరీరం; కరణం అంటే సూక్ష్మశరీరం; సంఘాతం అంటే కూటమి. జీవి అంటే స్థూల, సూక్ష్మశరీరాల కూటమి. ఇంకో విధంగా చూస్తే స్థూలశరీరం అంటే భౌతికశరీరంగానూ; సూక్ష్మశరీరాన్ని మనస్సుగానూ తీసుకోవచ్చు. అప్పుడు కార్యకరణసంఘాతం అంటే బాడీమైండ్ కాంప్లెక్స్ అవుతుంది.

**ఏతేభ్యో భూతేభ్యస్సముత్థాయ** – ఈ వాక్యం వేదాంతంలో చాలా ముఖ్యమైన వాక్యం. కార్యకరణసంఘాతంవల్ల విశేషచైతన్యం లేదా చిదాభాసం పుడుతుంది. దీనికి ఉదాహరణగా అద్దం తీసుకోవచ్చు. అద్దంలో సూర్యుని

ప్రతిబింబం ఏర్పడుతుంది. అది సూర్యుని అసలు కాంతి కాదు; ప్రతిబింబం. అద్దంవల్ల పుడుతుంది; అద్దం ఉన్నంతసేపూ ఉంటుంది. అద్దం తీసేస్తే ప్రతిబింబం పోతుంది.

ఒక బాల్చీ (బకెట్), అందులో నీళ్ళు ఉన్నాయనుకోండి. దాన్ని సూర్యకాంతిలో పెడితే సూర్యుని ప్రతిబింబం ఆ నీటిలో ఏర్పడుతుంది. బాల్చీని స్థూలశరీరంతోనూ, నీటిని సూక్ష్మశరీరంతోనూ, సూర్యప్రతిబింబాన్ని చిదాభాసతోనూ పోల్చవచ్చు. బాల్చీని తన్నేస్తే ఏమవుతుంది? నీరు ఒలకిపోతుంది. నీటిలో పడ్డ సూర్యప్రతిబింబం సూర్యబింబంతో కలిసిపోతుంది. అందువల్లనేనేమో ఎవరైనా చనిపోయారు అని చెప్పటానికి బాల్చీ తన్నాడు అని తెలుగులో; హి కిక్డ్ ది బకెట్ అని ఇంగ్లీషులో అంటారు. స్థూలశరీరంలోకి చిదాభాసతో కూడిన సూక్ష్మశరీరం రావటం జననం. స్థూలశరీరంనుంచి చిదాభాసతో కూడిన సూక్ష్మశరీరం వెళ్ళిపోవటం మరణం.

చిత్, చిదాభాసల లయం రెండు మూడు సందర్భాలలో అవుతుంది.

1. **సుషుప్తిలో** – సుషుప్తిలో గాఢనిద్ర పోయినప్పుడు స్థూలశరీరం, సూక్ష్మశరీరం పడుకుంటాయి. మనస్సు కూడా పడుకుంటుంది కాబట్టి, మనస్సు ప్రతిబింబింపచేసే చిదాభాస ప్రకటితమవదు. అది చిత్‌లో అంటే తన స్వస్వరూపంలో లయమవుతుంది. కాని పొద్దున్న లేస్తూనే మళ్ళీ చిదాభాస ప్రకటితమవుతుంది.

2. **ప్రళయంలో** – ప్రళయంలో కూడా చిత్, చిదాభాసలు లయమవుతాయి.

చిత్, చిదాభాసలలో చిత్ లేదా బింబచైతన్యం సత్యం, అనంతం, సర్వవ్యాపకం. దానికి నాశనం లేదు.

**తాన్యేవానువినశ్యతి** – స్థూలశరీరం నశించగానే చిదాభాస నశిస్తుంది.

**న ప్రేత్య సంజ్ఞాస్తీత్యరే బ్రవీమీతి హోవాచ యాజ్ఞవల్క్యః** – దేహభాగంనుంచి విముక్తుడయ్యాక నేను ఫలానా అనే విశిష్టమైన నామరూపాలు ఉండవు. ఓ మైత్రేయీ నేను నీకు చెబుతున్నాను అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు.

చైతన్యం అంటే మనం మామూలుగా వాడే స్పృహ అనే అర్థం కాదు. కోమాలో ఉన్న వ్యక్తికి చైతన్యం లేదు అంటాము కాని అతను స్పృహలో ఉన్నా లేకపోయినా చైతన్యం ఉంటుంది. అతనికి మనస్సు పనిచెయ్యదు కాబట్టి చైతన్యం చిదాభాసగా ప్రకటితమవదు. చైతన్యాన్ని బింబచైతన్యం లేదా సామాన్య చైతన్యం అంటారు. చిదాభాసను ప్రతిబింబ చైతన్యం లేదా విశేష చైతన్యం అంటారు.

**సామాన్య చైతన్యాన్ని గుర్తించటానికి విశేష చైతన్యం కావాలి**
**కాని సామాన్య చైతన్యం లేకుండా విశేష చైతన్యం లేదు**

బల్ల జడం అని ఎందుకంటాము? ఇదే కారణం. బల్లకు మనస్సు లేదు కాబట్టి, బల్ల విశేషచైతన్యాన్ని ప్రతిబింబింప చేయలేదు కాబట్టి జడం అంటాము. కాని దానిలో కూడా మహద్భూతం, అనంతం, విజ్ఞానఘనం అయిన చైతన్యం ఉంది. అందువల్ల ప్రపంచాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. సామాన్యచైతన్యం + విశేషచైతన్యం ఉన్నవి
2. సామాన్యచైతన్యం మాత్రమే ఉన్నది

కాని ఒక విషయం గమనించాలి. సామాన్యచైతన్యం లేకుండా ఏదీ లేదు. అయితే ఒక్క సామాన్యచైతన్యమే ఉంటుంది లేదా రెండూ ఉంటాయి. ఒక్క సామాన్యచైతన్యమే ఉన్నవాటిని జడం అనీ, రెండూ ఉన్న వాటిని చేతనం అనీ అంటాము.

సుషుప్తిలో విశేషచైతన్యం ప్రకటితమవదు. ప్రపంచాన్ని చూడాలంటే సామాన్యచైతన్యం ఒక్కటే సరిపోదు. విశేషచైతన్యం కూడా ఉండాలి. అందువల్ల కోమాలో ఉన్న వ్యక్తి ప్రపంచాన్ని చూడలేడు. జ్ఞాని విషయంలో కూడా విశేషచైతన్యం ప్రకటితమవదు, కాని జ్ఞానికి, కోమాలో ఉన్న వ్యక్తికి చిన్న తేడా ఉంది. ముందే చెప్పినట్టుగా కోమాలో ఉన్న వ్యక్తికి విశేషచైతన్యం ప్రకటితమవదు కాబట్టి అతను బాహ్యప్రపంచాన్ని చూడలేడు; జ్ఞాని విశేషచైతన్యంతోనే బాహ్యప్రపంచాన్ని చూస్తాడు కాని విశేషచైతన్యంతో మమేకం చెందడు. అతను కేవలం సామాన్య బ్రహ్మచైతన్యరూపంలో ఉంటాడు. అతను 'నేను జ్ఞానిని' అని కూడా చెప్పడు. 'నేను' అంటాడు అంతే. నేను జ్ఞానిని అంటే విశేషచైతన్యంతో మమేకం చెందినట్టవుతుంది.

ఈ విధంగా ఆత్మ సృష్టి, స్థితులతో బాటు లయకారణం కూడా అని యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బోధించాడు.

టూకీగా చెప్పాలంటే –

జీవులన్నీ ఆత్మనుంచి చిదాభాస రూపంలో పుట్టాయి;
జీవులన్నీ ఆత్మలో చిదాభాస రూపంలో స్థితి పొందుతున్నాయి;
జీవులన్నీ ఆత్మలో చిదాభాస రూపంలో లయమవుతున్నాయి.

నేను చేయాల్సిన పని ఏమిటి? నేను చిత్‌నా, చిదాభాసనా తెలుసుకోవాలి.

నేను చిదాభాసను అనుకుంటే నేను సంసారిగా మిగులుతాను.
నేను చిత్‌ను అని అర్థం చేసుకుంటే అసంసారిని అయి, మోక్షం పొందుతాను.

## మంత్రం 2.4.13

**సా హోవాచ మైత్రేయ్యత్రైవ మా భగవానమూముహన్న ప్రేత్య సంజ్ఞాస్తీతి స హోవాచ న వా అరేఽహం మోహం బ్రవీమ్యలం వా అర ఇదం విజ్ఞానాయ ॥**

ముందు మంత్రంలో **న ప్రేత్య సంజ్ఞాస్తీతి** అని యాజ్ఞవల్క్యుడు చెప్పటంలోని ఉద్దేశ్యం, మరణించాక విశేషచైతన్యం ఉండదు అని. కాని యాజ్ఞవల్క్యుడు ప్రత్యేకించి రెండు చైతన్యాలు ఉన్నాయి అని చెప్పలేదు కాబట్టి మైత్రేయి దాన్ని సామాన్య చైతన్యంగా పొరపడింది. ఆది, అంతం లేని సర్వవ్యాపకమైన చైతన్యం ఎలా లయమవుతుంది అనుకుంది. అందువల్ల మైత్రేయి మీరు నన్ను అయోమయంలో పడేశారు, దాన్ని వివరించండి అని అడుగుతుంది ఇక్కడ.

**సా హోవాచ మైత్రేయ్యత్రైవ మా భగవానమూముహన్న ప్రేత్య సంజ్ఞాస్తీతి** – మైత్రేయి ఇక్కడ యాజ్ఞవల్క్యుని భగవాన్ అని సంబోధిస్తున్నది. ఆయనను గురువుగా స్వీకరించింది కాబట్టి, ఆ సంబోధన.

యాజ్ఞవల్క్యుడు **న ప్రేత్య సంజ్ఞాస్తీతి** అని చెప్పాడు. మైత్రేయి అవే పదాలు వాడి అంటే న ప్రేత్య సంజ్ఞాస్తీతి అని చెప్పి నన్ను మోహంలో పడేశావు అంటున్నది. దేహభావంనుంచి విడివడ్డాక, విశేషచైతన్యం ఉండదు అని యాజ్ఞవల్క్యుని ఉద్దేశం. ఆమె దాన్ని సామాన్యచైతన్యంగా తీసుకుంది. ఒకచోట చైతన్యం నిత్యం అంటూ ఇంకోచోట చైతన్యం లేదు అని ఎలా అంటారు అనేది ఆమె సందేహం. అది ఆమె స్పష్టంగా చెప్పదు. మనం అర్థం చేసుకోవాలి. మోహం అంటే అయోమయంలో పడవేశావు అని అర్థం.

**న వా అరేఽ హం మోహం బ్రవీమ్యలం వా అర ఇదం విజ్ఞానాయ** – యాజ్ఞవల్క్యుడు దీనికి జవాబు యిస్తున్నాడు. నేను నిన్ను అయోమయంలో పడేయలేదు. నేను భిన్నవాక్యాలను చెప్పటం లేదు. ఓ మైత్రేయీ, ఇది బ్రహ్మజ్ఞానానికి చాలు.

**న ప్రేత్య సంజ్ఞాస్తీతి** అని యాజ్ఞవల్క్యుడు చెప్పినప్పుడు ఆయన విశేషచైతన్యం గురించి చెప్పాడు. అందువల్ల విశేషచైతన్యం పోతుంది కాని సామాన్యచైతన్యం అలాగే ఉంటుంది. ప్రతి ఒక్కరిలో సామాన్యచైతన్యం + విశేషచైతన్యం ఉంటాయి.

పంచదశిలో విద్యారణ్యులవారు ఒక అద్భుతమైన ఉదాహరణనిస్తారు. పగటిపూట ఒక అద్దాన్ని తీసుకువెళ్ళి బయటవున్న గోడ దగ్గర పెడితే, అది సూర్యకాంతిని ఆ గోడమీద ప్రతిబింబింప చేస్తుంది. ఇప్పుడేమయింది? గోడమీద రెండు కాంతులు ఉన్నాయి.

1. సామాన్య సూర్యప్రకాశం
2. విశేష సూర్యప్రకాశం

ఇప్పుడు అద్దం తీసేశాము. అప్పుడేమవుతుంది? గోడమీద ఒకటే ఉంటుంది. 1. సామాన్య సూర్యప్రకాశం.

అద్దం ఉన్నా లేకపోయినా, సూర్యకాంతి ఆ గదంతా వ్యాపిస్తూ, ఆ గోడమీద కూడా పడుతున్నది. కాకపోతే మనం అది గమనించము. మనం అద్దం పెడితే రెండో కాంతి పడుతోంది, తీసేస్తే మాయమవుతోంది. అలాగే మన శరీరంలో కూడా సామాన్యచైతన్యం, విశేషచైతన్యం ఉన్నాయి. విశేషచైతన్యం ప్రకటితమవాలంటే దాన్ని ప్రతిబింబింపచేసే అద్దంలాంటి మనస్సు కావాలి. అందుకే చూడండి, మనస్సును విడిగా కూడా అద్దంతో పోలుస్తారు. అద్దం ఎంత బాగుంటే, అది చూపించే ప్రతిబింబం అంత బాగుంటుంది.

నేను చెప్పింది చాలు అంటూనే యాజ్ఞవల్క్యుడు ఇంకో నిర్వచనం ఇస్తాడు. ఇది చాలా ముఖ్యమైన మంత్రం.

## మంత్రం 2.4.14

**యత్ర హి ద్వైతమివ భవతి తదితర ఇతరం జిఘ్రతి తదితర ఇతరం పశ్యతి తదితర ఇతరగ్ం శృణోతి తదితర ఇతరమభివదతి తదితర ఇతరం మనుతే తదితర ఇతరం విజానాతి యత్ర వా అస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం జిఘ్రేత్తత్కేన కం పశ్యేత్తత్కేన కగ్ం శృణుయాత్తత్కేన కమభివదేత్తత్కేన కం మన్వీత తత్కేన కం విజానీయాత్‌। యేనేదగ్ం సర్వం విజానాతి తం కేన విజానీయాద్విజ్ఞాతారమరే కేన విజానీయాదితి ॥**

ఇది ఒక అద్భుతమైన మంత్రం. శంకరులవారు దీన్ని తరచు ఉటంకిస్తూ ఉంటారు.**న ప్రేత్య సంజ్ఞాస్తీతి**. విదేహ ముక్తిలో జ్ఞానికి చైతన్యం ఉండదని తను చెప్పటంలోని అర్థాన్ని ఇక్కడ విడమరచి చెపుతున్నాడు యాజ్ఞవల్క్యుడు.

విశేషచైతన్యం ఉండాలి అంటే దానికి మొట్టమొదటి నిబంధన కార్యకరణసంఘాతం ఉండాలి. అద్దం ఉంటేనే ప్రతిబింబం ఏర్పడినట్టుగా, అద్దంలాంటి మనస్సు ఉంటేనే ప్రతిబింబ చైతన్యం ఏర్పడుతుంది. అందువల్ల కార్యకరణ సంఘాతం ఉంటే చిదాభాస ఏర్పడుతుంది; అహంకారం ఏర్పడుతుంది; జీవుడు ఏర్పడుతాడు; వ్యష్టి ఏర్పడుతుంది. ఎప్పుడైతే వ్యష్టిజీవి వస్తాడో, అప్పుడే సమష్టిప్రపంచం వస్తుంది. శరీరం వస్తే ప్రపంచం వస్తుంది. **అహమ్** అనే నేను ఏర్పడితే, **ఇదమ్** అనే ప్రపంచం దానితోపాటే వస్తుంది అంటే ద్వైతభావన వస్తుంది. అంటే చిదాభాస ఉంటే, ప్రపంచం తెలుస్తుంది. చిదాభాస లయమయితే, ప్రపంచం లయమవుతుంది. ఎలా నిరూపించగలము? మన అవస్థాత్రయమే దానికి స్పష్టమైన నిదర్శనం.

నేను జాగ్రదావస్థలో ఉండగా, చిదాభాస మనస్సు, ఇంద్రియాలు, శరీరంద్వారా వ్యవహారం నడుపుతుంది.
నేను స్వప్నావస్థలో ఉండగా, చిదాభాస మనస్సుద్వారా వ్యవహారం నడుపుతుంది.
నేను సుషుప్తిలో ఉండగా, మనస్సు పడుకుంటుంది కాబట్టి చిదాభాస కూడా పడుకుంటుంది.

జాగ్రదావస్థలో ద్వైతం చూస్తుంది; సుషుప్తిలో అద్వైతం అనుభవిస్తుంది. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**యత్ర హి ద్వైతమివ భవతి** – ఎప్పుడైతే ద్వైతంలాగా ఉంటుందో; అప్పుడేమవుతుంది?

**తదితర ఇతరం జిఘ్రతి** – ఆఘ్రాణించే వ్యక్తి ఆఘ్రాణించే వస్తువును ఆఘ్రాణిస్తాడు.

చిదాభాస మాత్రమే విశేషజ్ఞానాన్ని పొందగలదు. ఎందుకంటే విశేషజ్ఞానం పొందటానికి వృత్తి కావాలి; వృత్తికి మనస్సు కావాలి; మనస్సుకు చిదాభాస కావాలి. వృత్తి అంటే ఆలోచన.

మొదటి ఇతర అంటే – మనస్సు + చిదాభాస
రెండవ ఇతరం అంటే – వస్తువు

అందువల్ల మిగతా వాక్యాలను ఇలా తీసుకోవచ్చు –

**తదితర ఇతరం పశ్యతి** – చిదాభాసతో కూడిన మనస్సు వస్తువులను చూస్తుంది;
**తదితర ఇతరగ్ం శృణోతి** – చిదాభాసతో కూడిన మనస్సు శబ్దాలను వింటుంది;
**తదితర ఇతరమభివదతి** – చిదాభాసతో కూడిన మనస్సు మాటలు మాట్లాడుతుంది;
**తదితర ఇతరం మనుతే** – చిదాభాసతో కూడిన మనస్సు ఆలోచనలు చేస్తుంది;
**తదితర ఇతరం విజానాతి** – చిదాభాసతో కూడిన మనస్సు జ్ఞానం పొందుతుంది.

ఆ విధంగా మనస్సు ద్వైతభావనలో ఉంటుంది. నేను వేరు, ప్రపంచం వేరు అనుకుంటుంది. అందువల్లనే మనం ప్రతిదానికీ బాధపడతాము లేదా కృంగిపోతాము. అందువల్లనే ఏదైనా కష్టం రాగానే, నాకే ఎందుకు వచ్చింది అని వాపోతాము.

ఇప్పుడు విశేషచైతన్యం, సామాన్యచైతన్యం రెండూ లయమయితే, ద్వైతభావన పోతుంది. అప్పుడు దేనితో దేన్ని చూస్తాడు? దేనితో దేన్ని వింటాడు వంటి ప్రశ్నలు అడుగుతున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**యత్ర వా అస్య సర్వమాత్మైవాభూత్తత్** – ఎప్పుడైతే అతనికి సర్వం ఆత్మయే అవుతుందో, అప్పుడేమవుతుంది?

**కేన కం జిఘ్రేత్** – దేనితో దేనిని వాసన చూస్తాడు?

**కేన కం పశ్యేత్** – దేనితో దేనిని చూస్తాడు?

**కేన కం శృణుయాత్** – దేనితో దేనిని వింటాడు?

**కేన కమభివదేత్** – దేనితో దేని గురించి మాట్లాడతాడు?

**తత్కేన కం మన్వీత** – అప్పుడు దేనితో దేని గురించి ఆలోచిస్తాడు?

**తత్కేన కం విజానీయాత్** – అప్పుడు దేనితో దేనిని తెలుసుకుంటాడు?

నిజానికి మన ప్రాపంచిక వ్యవహారాలు నడపటానికి మనకు మనస్సు, ప్రపంచం, చిదాభాస కావాలి. ఇది ద్వైతం. విదేహముక్తి పొందిన పురుషునికి ఏమవుతుంది? శరీరం లేదు; చిదాభాస లేదు; అందువల్ల ప్రపంచం కూడా లేదు. అతనికి సర్వం ఆత్మయే అయినప్పుడు దేనితో దేన్ని చూస్తాడు? కర్తా, శ్రోతా, ద్రష్టా, మంతా లాగా వ్యవహారాలు నడపడు. ఎందుకంటే అతను చిదాభాసతో మమేకం చెందడు. అంతమాత్రాన జ్ఞాని కూడా లేనట్టు కాదు. అతను శుద్ధచైతన్యరూపంలో సర్వవ్యాపకంగా ఉంటాడు. ఇటువంటి లయాన్ని **ఆత్యంతిక ప్రళయం** అంటారు.

**యేనేదగ్ం సర్వం విజానాతి తం కేన విజానీయాద్విజ్ఞాతారమరే కేన విజానీయాదితి** – ఓ మైత్రేయీ, దేనితో ఈ సర్వాన్ని తెలుసుకుంటాడో, దానిని దేనితో తెలుసుకోవాలి? విజ్ఞాతను దేనితో తెలుసుకోవాలి?

ఇక్కడ గురువు చెప్పిన బోధ సారాంశం ఇది –

ద్వైతం లేకపోతే విశేషజ్ఞానం సాధ్యం కాదు.

దానికి కొందరు తప్పుగా తీసిన అర్థం ఇది –

విశేషజ్ఞానం ఉంటే ద్వైతం ఉంది.

విశేషజ్ఞానం లేకపోతే అద్వైతం అవుతుంది.

అందువల్ల అద్వైతం పొందాలంటే విశేషజ్ఞానం పోవాలి.

ఒక్క విషయం పొరపాటుగా అర్థం చేసుకోవటంవల్ల ఎన్ని అర్థాలు తీస్తారో చూడండి. మోక్షం పొందాలంటే అద్వైతం పొందాలి అని తెలుసుకున్నారు, బాగానే ఉంది, కాని అద్వైతం పొందటానికి విశేషజ్ఞానం వదిలేయాలి అని అర్థం చేసుకున్నారు. అక్కడ వస్తుంది చిక్కంతా!

విశేషజ్ఞానం గాని, దానివల్ల వచ్చిన అనుభవం గాని ఎన్నాళ్ళు ఉంటుంది? వృత్తిజ్ఞానం ఉన్నంత వరకూ ఉంటుంది. అంటే వృత్తులను నాశనం చేయాలి. వారి వాదనను బలపరచుకోవటానికి వారు యోగశాస్త్రంలో చెప్పిన చిత్తవృత్తి నిరోధం, నిర్వికల్ప సమాధిలాంటి విషయాలను పేర్కొంటారు. కాని వృత్తులను నిరోధిస్తే, కొత్త వృత్తులు పుట్టుకొస్తాయి. అందువల్ల వాసనలను నిరోధించాలంటారు. కాని వాసనలు అనాదిగా వస్తున్నాయి,

అవి అవిద్యవల్ల ఏర్పడ్డాయి అని తెలుసుకుంటారు. అప్పుడు మనస్సు ఉండటంవల్ల కదా వాసనలు కొనసాగుతున్నాయి; ఏకంగా మనస్సునే నాశనం చేయాలి అంటారు.

ఆ విధంగా వారు ద్వైత నివృత్తి చేయాలంటే మనోనాశనం చేయాలి అంటారు. కాని వేదాంతం దీన్ని ఒప్పుకోదు. మనస్సు అనేది లేకపోతే అతనికీ, జడవస్తువైన బల్లకూ ఏం తేడా ఉంటుంది? ఇదంతా ఎందుకు వచ్చింది? ద్వైతం లేకపోతే విశేషజ్ఞానం లేదు

ఈ వాక్యాన్ని వారు ఇలా అర్థం చేసుకున్నారు.

విశేషజ్ఞానం లేకపోతే ద్వైతం పోతుంది.

కాని విశేషజ్ఞానాన్ని నిరోధించటంవల్ల అద్వైతం రాదు. మరయితే అద్వైతం ఎలా వస్తుంది? అద్వైతం ఎన్నడూ రాదు; ఎన్నడూ పోదు. అద్వైతం ఎప్పటికీ ఉంది, ఉంటుంది. ఈ విషయం బాగా అర్థం చేసుకోవాలి. అద్వైతానికి నిర్వికల్ప సమాధికి వెళ్ళనవసరం లేదు; వృత్తి నివృత్తి చేయనవసరం లేదు; వాసనా నివృత్తి చేయనవసరం లేదు; మనోనివృత్తి అసలే చేయనవసరం లేదు.

అంటే అద్వైతసిద్ధికి పైన చెప్పినవేవీ నిరోధించనవసరం లేదు. ఒక్కటే నిరోధించాలి – ఏమిటది? అవి **సత్యమ్** అనే భావనను నిరోధించాలి. సత్యత్వ బుద్ధి పోవాలి; సత్యత్వ వాసనలు పోవాలి. ఎప్పుడైతే సత్యత్వ బుద్ధి పోతుందో, అప్పుడే వృత్తులు మిథ్య అవుతాయి; వాసనలు మిథ్య అవుతాయి; మనస్సు మిథ్య అవుతుంది. ఎప్పుడైతే వృత్తులు, వాసనలు, మనస్సు మిథ్య అవుతాయో, వాటినుంచి ఏర్పడిన విశేషజ్ఞానం కూడా మిథ్య అవుతుంది.

అయితే విశేషజ్ఞానం ఉన్నప్పుడు కూడా అద్వైతం ఉందా? ఉంది. అద్వైతం విశేషజ్ఞానం ఉన్నప్పుడూ ఉంది, లేనప్పుడూ ఉంది. అలా ఎలా చెప్పగలరు? విశేషజ్ఞానం ఉంటే ద్వైతం అనుభవంలోకి వస్తుంది కదా! అప్పుడు అద్వైతం ఎలా ఉంటుంది? నిజమే, విశేషజ్ఞానం ఉన్నప్పుడు ద్వైత అనుభవం ఉంటుంది; కాని ద్వైత అనుభవం మిథ్యా అనుభవం; అది అద్వైతానికి అడ్డురాదు. ద్వైతం ఉండనివ్వండి; ఏమీ నష్టంలేదు; విశేషజ్ఞానం ఉండనివ్వండి; ఏమీ నష్టం లేదు; జాగ్రదావస్థను అంగీకరించండి; జాగ్రదావస్థలో కలిగే వికల్పాలన్నీ మిథ్య అని గ్రహించండి చాలు. ఎప్పుడైతే వికల్పాలు మిథ్య అవుతాయో, మిథ్యా వికల్పం సత్య నిర్వికల్ప ఆత్మను ఇబ్బంది పెట్టదు.

అందువల్ల మిథ్యా వికల్పాలు, మిథ్యాద్వైతం, మిథ్యా విశేషజ్ఞానం సత్యనిర్వికల్ప అద్వైత సామాన్య జ్ఞానరూప ఆత్మను ఏమీ చేయలేవు.

అందువల్ల నేను అద్వైతంలో ఎప్పుడు ఉన్నాను అంటే అద్వైతంలో ఎప్పుడు లేను అనాలి! నేను నిర్వికల్ప ఆత్మను అనే జ్ఞానం పొందాలి కాని అది నిర్వికల్ప అనుభవమో, నిర్వికల్ప అవస్థో, నిర్వికల్ప తురీయమో కాదు. నేను జాగ్రదావస్థలో కూడా నిర్వికల్ప అవస్థలో ఉన్నాను అని అర్థం చేసుకోవటమే అద్వైతం. దీన్నే ఆత్మజ్ఞానం అంటారు. అద్వైతం సత్యం అంటే మీరు అద్వైతంకోసం ప్రయత్నించనవసరం లేదు; మీరు చేయాల్సిన పని ఒక్కటే– అద్వైతంకోసం ప్రయత్నించకపోవటం.

అందువల్ల మిథ్యాద్వైతం ఉన్నా, మిథ్యాద్వైతం లేకపోయినా, అద్వైతం ఉంటుంది. మిథ్యాద్వైతం ఉంటే ఉండనివ్వండి. దాన్ని మిథ్యాద్వైతంగా అర్థం చేసుకుంటే చాలు. బాగానే ఉంది కాని ద్వైతం మిథ్య అని ఎలా చెప్పగలరు?

**యత్ర హి ద్వైతమివ భవతి**

ఈ వాక్యంలోని ఇవ పదం అక్షరలక్షలు విలువ చేసే పదం. ఇవ అంటే నిజంగా కాదు, ఉన్నట్టుగా అనిపిస్తుంది అని అర్థం. అందువల్ల ద్వైతం ఉన్నట్టుగా ఉంది అని ఎవరైతే అర్థం చేసుకుంటారో, అతను జీవన్ముక్తుడు అవుతాడు.

యాజ్ఞవల్క్యుడు ఈ విధంగా తన బోధను రెండు ప్రముఖవాక్యాలతో ముగించాడు. ఇక్కడ మనం రెండు విషయాలను చర్చించుకోవాలి.

1. జ్ఞాని విదేహముక్తి పొందాక, తాను ఉంటాడు అని జ్ఞానికి తెలుస్తుందా? అహం బ్రహ్మ అస్మి జ్ఞానం ఉంటుందా?

దానికి యాజ్ఞవల్క్యుడు ద్వైతావస్థద్వారా జవాబు చెబుతాడు. ద్వైతావస్థలో మనస్సు, బుద్ధి ఉన్నప్పుడే ఒక వ్యక్తికి అహం బ్రహ్మ అస్మి అని తెలియదు. ఆత్మ ఆబ్జెక్టు కాదు, ఆత్మ సబ్జెక్టు. అందువల్ల ద్వైతావస్థలో ఉండి గురువు, శాస్త్రం ద్వారా నేర్చుకుంటేనే ఆత్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అనే విషయం జీర్ణించుకోవటం కష్టంగా ఉంది. ద్వైతావస్థలో ఆత్మ గురించిన జ్ఞానం పొందలేకపోతే, ఇంక అద్వైతం గురించి వేరే చెప్పాలా? అద్వైతంలో మనస్సు ఉండదు; వృత్తి ఉండదు. అప్పుడెలా పొందుతారు?

ఈ ఉద్దేశం ఈ వాక్యాలలో చెబుతున్నాడు

**యేనేదగం సర్వం విజానాతి** – ఏ ఆత్మవల్ల అన్నీ తెలుసుకుంటాడో

**తం కేన విజానీయాత్** – దాన్ని దేనితో తెలుసుకుంటాడు?

**విజ్ఞాతారమరే కేన విజానీయాదితి** – విజ్ఞాతను దేనితో తెలుసుకుంటాడు?

ఈ వాక్యాల సారాంశం సబ్జెక్టు, ఆబ్జెక్టు ఎన్నటికీ కాలేదు. ఆత్మ ఎప్పటికీ సబ్జెక్టు, ఎన్నటికీ ఆబ్జెక్టు కాదు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

అనుభవించే నువ్వే ఎప్పటికీ ఆత్మవు, అనుభవించబడే వస్తువు ఎన్నడూ కాదు. ఆత్మ ఎన్నడూ ఆబ్జెక్టు కాదు కాబట్టి. ద్వైతావస్థలో సబ్జెక్టు, ఆబ్జెక్టుల భేదం ఉన్నా కూడా ఆత్మను సబ్జెక్టుగా తెలుసుకోలేడు అన్నప్పుడు ఆబ్జెక్టు, సబ్జెక్టుల భేదం లేని అద్వైతంలో ఎలా తెలుసుకుంటాడు? అంటే తెలియదు అని అర్థం.

ఇది ఇంకొక ప్రశ్నకు దారి తీయవచ్చు.

2. ఆత్మజ్ఞానం ఎన్నటికీ పొందలేనప్పుడు శాస్త్రం, గురువు, సాధనసంపత్తి ఎందుకు? ఎప్పుడో ఒకప్పుడు ఆత్మ జ్ఞానం పొందటానికి కదా ఈ ప్రయత్నం అంతా!

దానికి జవాబు ఆత్మజ్ఞానం పొందటమంటే **ఆత్మ అజ్ఞానం తొలగించుకోవటం**. శాస్త్రాన్ని అధ్యయనం చేసే ఉద్దేశం స్వయంప్రకాశక ఆత్మను కప్పివేస్తున్న అధ్యాసా నివృత్తి చేసుకోవటానికి.

జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ నేను ద్వైతంలో ఉన్నాను, సుషుప్తిలో అద్వైతంలో ఉన్నాను. సుషుప్తిలో ఆత్మ గురించిన విశేష విజ్ఞానం లేదు. విశేష విజ్ఞానం అంటే అజ్ఞాన నివృత్తి లేదా అధ్యాస నివృత్తి.

దీనితో మైత్రేయీ బ్రాహ్మణం అయిపోయింది. ఈ బ్రాహ్మణంలో ముఖ్యాంశాలు **వైరాగ్యం, సర్వాత్మ భావన**. సర్వాత్మ భావన శ్రవణ, మననాలద్వారా చూపించింది. శ్రవణం ఆరవ మంత్రంలో, మననం ఏడవ మంత్రం నుంచీ వస్తాయి.

# 2.5 – మధు బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో మధుపదం అనేకసార్లు వచ్చింది కాబట్టి దీన్ని మధు బ్రాహ్మణము అన్నారు. మధు అసలు అర్థం తేనె లేదా మత్తు పానీయం. ఇక్కడ ఈ రెండు అర్థాలూ రావు. వేరే అర్థం ఉంది, దాన్ని తర్వాత చూద్దాము.

ఈ బ్రాహ్మణాన్ని అథర్వణ ఋషి, అశ్వినీ కుమార్ల మధ్య జరిగిన సంవాదం. ఈ గురుశిష్యుల పేర్లు చివర్లో అంటే పదహారవ మంత్రంలో వస్తాయి.

ఈ బ్రాహ్మణాన్ని శంకరులవారు రెండు కోణాలనుంచి విశ్లేషిస్తారు. దీన్ని నిదిధ్యాసనం భాగంగా తీసుకోవచ్చని ఒక వైపూ, కాదు మనన భాగంగా తీసుకోవచ్చని ఇంకోవైపూ చూపిస్తారు. శ్రవణ, మనన, నిదిధ్యాసనలంటే ఏమిటో చూద్దాము.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గర శాస్త్ర అధ్యయనం చేయటం.

**ఇదం సర్వం యదయమాత్మా**

ఈ వాక్యం శ్రవణం భాగంలోకి వస్తుంది.

**మననం** – నిశ్చయజ్ఞానం పెంపొందించుకోవటం. నేను కారణం, ప్రపంచం కార్యం; అందువల్ల నేనే అనేక నామరూపాలున్న జగత్తుగా కనబడుతున్నాను. స్వప్నప్రపంచంలో అనేక నామరూపాలున్నా, స్వాప్నికుడు నిద్ర లేచాక నేనే స్వప్నాన్ని సృష్టించాను అంటాడు.

నేను + నామరూపాలు = స్వప్నం

ఇదే సూత్రాన్ని జాగ్రద్ప్రపంచానికి కూడా అన్వయించుకోగలగాలి.

నేను + నామరూపాలు = జాగ్రత్ ప్రపంచం

ప్రపంచం నన్ను ఇబ్బంది పెట్టనంతవరకూ ఫర్వాలేదు; అది నన్ను ఇబ్బంది పెడుతుంటే నేను జగత్తుకు అధిష్ఠానాన్ని, జగత్తు నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకోవాలి. దీన్ని యుక్తి అంటారు. ఇది మననం.

**నిదిధ్యాసనం** – మనం, మననంలో పొందిన నిశ్చయ జ్ఞాననిష్ఠలో ఉండగలగటం నిదిధ్యాసనం.

అహం సత్యం జగన్మిథ్యా. నిదిధ్యాసనంలో బ్రహ్మ సత్యం దగ్గర అహం సత్యం అనుకోవాలి.

ప్రపంచం మిథ్య కాబట్టి, అందులో జరిగే విషయాలేమీ అధిష్ఠానం ఆత్మ అయిన నన్ను బాధించవు. నిదిధ్యాసనంలో **జగత్తు మిథ్య** అనే భావనమీద నెలకొని ఉండాలి.

జగత్తు మనను బాధిస్తున్నప్పుడు అహం బ్రహ్మ అస్మి అని ధ్యానం చేసే బదులు; జగత్తు మిథ్య అని ధ్యానం చేయాలి. శరీరం మోకాలి నొప్పితో బాధ పెడుతున్నప్పుడు శరీరాన్ని కేవలం ఒక నామరూపంగా చూడాలి. అది ప్రారబ్ధకర్మవల్ల ఏర్పడింది; అది నేను కాదు అని తెలుసుకోవాలి.

అందువల్ల నిదిధ్యాసనం అంటే బ్రహ్మ సత్యత్వంకన్నా జగన్మిథ్యాత్వంమీద దృష్టి పెట్టటం.

ఈ విధంగా చూస్తే ఈ మధు బ్రాహ్మణం నిదిధ్యాసనం అవుతుంది.

**మననం** – ఇంకో కోణంలోంచి చూస్తే ఈ మధు బ్రాహ్మణము మననం అవుతుంది. అదెలాగో చూద్దాము.

ముందు బ్రాహ్మణంలో మననం ఎలా జరిగింది? జగత్తు కార్యం; ఆత్మ ఉపాదాన కారణం; కార్య ప్రపంచం కారణ ఆత్మకు భిన్నంగా ఉండలేదు కాబట్టి జగత్తు కార్యరూపేణ మిథ్య; ఆత్మ కారణరూపేణ సత్యం.

కార్యం సర్వం కారణరూప ఆత్మ ఏవ

ఇది అంతకుముందు బ్రాహ్మణములో నిరూపించబడింది. ఈ మధు బ్రాహ్మణములో ఇదం సర్వం యదయమాత్మ అని ఇంకో తర్కం ద్వారా నిరూపిస్తుంది. ఆ విధంగా చూస్తే ఈ బ్రాహ్మణము మననం అవుతుంది.

అలా ఈ బ్రాహ్మణము నిదిధ్యాసనం బ్రాహ్మణము అవవచ్చు, మననం బ్రాహ్మణము కూడా అవవచ్చు. కాని శంకరులవారు దీన్ని కూడా మననం కిందకే తీసుకుంటారు. ఎందుకు? నిదిధ్యాసనంలో తర్కం ఉండదు. మననంలో తర్కం ఉపయోగించి, నిశ్చయ జ్ఞానం కలిగాకే, నిదిధ్యాసనకు వస్తారు. మీరు నిశ్చయంగా నమ్మిన దానిమీదనే కదా ధ్యానం చేస్తారు!

నిశ్చయజ్ఞానం కలిగాక, నిదిధ్యాసనం చేయటం ఎందుకు అని మీకు సందేహం రావచ్చు. ఎందుకంటే మీలో ఎన్నో సంవత్సరాలుగా పాతుకుపోయిన పాత భావనలు పోవాలి. అది నిదిధ్యాసనంవల్లనే సాధ్యమవుతుంది. ఉదాహరణకు మీలో కోపం, నిరాశానిస్పృహలు, ఒంటరితనం, కోరికలులాంటి అనేక భావనలు రాజ్యమేలుతుంటాయి. వాటిలో ఒక్కొక్కదాన్నీ తీసుకుని విడిగా వాటిని పోగొట్టుకోవాలి. ఉదాహరణకు కోపం. నాకు ఎందుకు కోపం వస్తోంది? నేను ఎవరు? ఇలాంటివి విశ్లేషించుకోవాలి.

ఆ విధంగా ఈ బ్రాహ్మణం మననం కిందకే వస్తుంది. సర్వాత్మ భావనకు ఇక్కడ ఇంకో యుక్తి చూస్తాము. ఇది మననం అంటే నిదిధ్యాసనం కాదా? నిదిధ్యాసనం కూడా ఉన్నట్టే అనుకోవాలి. ఇంకో సందర్భంలో సురేశ్వరాచార్యులు శ్రవణ, మననాలతో కలిసిపోయి సహజంగా ఉంటుంది నిదిధ్యాసనం అంటారు.

వేదాంతంమీద శ్రద్ధ ఉన్న విద్యార్థికి, తను విన్న అంశాలన్నీ మనస్సుకు హత్తుకుపోతాయి. అవి నిరంతరం అతని మనస్సులో మెదులుతూనే ఉంటాయి. అదే శ్రద్ధ పెట్టకుండా వింటే ఏమవుతుంది? శ్రవణ మననంలో వేదాంతం ఉంటుంది కాని, తర్వాత ప్రాపంచిక విషయాలు అతని మనస్సులో చోటు చేసుకుంటాయి. అందువల్ల నిదిధ్యాసనాన్ని కూడా మననంతో పాటు తీసుకోవాలి.

ఇప్పుడు మంత్రాలలోకి వెళ్ళేముందు ఈ బ్రాహ్మణం సారాంశం ఏమిటో చూద్దాము. జగత్తు మొత్తం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉందని చూపిస్తున్నది ఉపనిషత్తు. ఎప్పుడైతే రెండు వస్తువులు ఒకదానిమీద

ఒకటి ఆధారపడి ఉన్నాయని నిరూపిస్తామో, అప్పుడే ఆ రెండింటిలో ఏదీ స్వతంత్రమైనది కాదని చెప్పకనే చెప్పినట్టువుతుంది.

జగత్తులో అన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయంటే, జగత్తులో ఏదీ స్వతంత్రమైనది కాదు. స్వతంత్రమైనవి కావంటే, అవి మిథ్య అని అర్థం. జగత్తులో ఒకదానిమీద ఒకటి ఆధారపడినవన్నీ మిథ్య అయితే, వాటికి భిన్నమైన అధిష్ఠానం ఏదో ఉండి ఉండాలి. ఇలా ఒకదానిమీద ఒకటి ఆధారపడిన మిథ్యా వస్తువులకు సత్య అధిష్ఠానం ఉండాలి.

ఈ భావాన్ని వివరించటానికి ఉపనిషత్తు మొత్తం ప్రపంచాన్ని మూడు భాగాలుగా విభజించింది – అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం.

అధ్యాత్మం – ఒక వ్యక్తిలో ఉన్న పందొమ్మిది అంగాలు. ఉదా: కన్ను, చెవి, వాక్కు, మనస్సు మొ॥
అధిభూతం – బాహ్యంగా ఉన్న స్థూలపంచభూతాలు: పృథివి, అగ్ని మొ॥
అధిదైవం – మన అంగాలన్నిటికీ అధిష్ఠానదేవతలు ఉంటాయి. ఉదా: సూర్యుడు, చంద్రుడు, మొ॥

కొన్ని ఉదాహరణలు చూద్దాము.

| **అధ్యాత్మం** | **అధిభూతం** | **అధిదైవం** |
|---|---|---|
| కన్ను | సూర్యమండలం | సూర్యదేవత |
| వాక్కు | అగ్ని మండలం | అగ్నిదేవత |
| నాలుక | జలం | వరుణ దేవత |

వీటినే వేరే విధంగా చెప్పాలంటే జీవ, జగత్తు, ఈశ్వరులు అనవచ్చు. అధ్యాత్మం – జీవుడు; అధిభూతం – జగత్తు; అధిదైవం – ఈశ్వరుడు. ఈ మూడూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయని చెబుతున్నది ఉపనిషత్తు. అంటే జీవుడు–జీవుడు ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉన్నారు; జీవుడు–జగత్తు ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉన్నారు; జీవుడు–ఈశ్వరుడు ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉన్నారు. ఈ ఆధారపడి ఉండటానికి ఉపనిషత్తు **మధువు** అనే పదం వాడుతున్నది. ఈ మధువుమీద ఉపాసన చేయాలి. మధువు పదానికి చాలా ప్రాముఖ్యత ఉంది. శంకరులవారు దీనికి రెండు అర్థాలు ఇస్తున్నారు.

1. **కార్యం** – ఎలాగైతే తేనె అనేక పుష్పాలనుంచి ఉత్పత్తి చెందుతుందో అలా కార్యం దాని కారణంనుంచి ఉత్పత్తి చెందుతుంది. కార్యం ఎలా వస్తుంది? కర్మఫలంగా వస్తుంది. అందువల్ల మధువు అంటే కార్యం లేదా కర్మఫలం అని ఒక అర్థం.

2. **భోగ్య వస్తువు** – ఒక కార్యం లేదా కర్మఫలం ఎందుకు సృష్టించబడుతుంది? అది అనుభవించబడటానికి. ఉదాహరణకు ఒక బల్ల ఎందుకు తయారు చేస్తారు? దాన్ని ఉపయోగించుకోవటానికి. ఆ విధంగా బల్ల భోగ్యవస్తువు అవుతుంది. అందువల్ల మధువు అంటే భోగ్యవస్తువు అని ఇంకో అర్థం.

కార్యం పదం కాని, భోగ్యవస్తువు పదం కాని వాడామంటే, వాటి వెన్నంటే రెండు పదాలు వస్తాయి. ఒక వస్తువును కార్యం అంటే దానికొక కారణం ఉంటుంది; ఒక వస్తువును భోగ్యవస్తువు అంటే దాన్ని అనుభవించే భోక్త ఒకడు ఉంటాడు. ఆ విధంగా సృష్టిలో ప్రతిదీ కార్య–కారణ రూపంలోనో; భోక్తృభోగ్య రూపంలోనో ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఈ భోక్తృభోగ్య అనుబంధం తారుమారు అవుతూ ఉంటాయి. ఒక కోణంలో చూస్తే ఒకరు భోక్త; ఇంకొకరు భోగ్యవస్తువు; అదే జంటను ఇంకో కోణంలోంచి చూస్తే భోక్త భోగ్య వస్తువు అవుతాడు; భోగ్యవస్తువు భోక్త అవుతాడు. ఉదాహరణకు కొన్ని జంటలు చూద్దాము.

1. **గురుశిష్యుల అనుబంధం:** వీరిద్దరి అనుబంధం చూస్తే, ఒక కోణంలో గురువు భోక్త, శిష్యులు భోగ్యవస్తువులు; ఇంకో కోణంలో చూస్తే శిష్యులు భోక్త, గురువు భోగ్యవస్తువు. శిష్యులు ఉంటేనే గురువు; గురువు ఉంటేనే శిష్యులు ఉంటారు.

2. **జీవుడు–దేవతలు:** నిజానికి ఈ ఉపనిషత్తులోనే పంచమహాయజ్ఞాల గురించి చర్చించినప్పుడు ఈ విషయం వచ్చింది (1.4.16). జీవుడి పరంగా చూస్తే దేవతలు భోగ్యవస్తువులు, దేవతలు మనను దీవించాలి కాబట్టి. దేవతల పరంగా చూస్తే జీవుడు భోగ్యవస్తువు, జీవుడు దేవతలకు యజ్ఞాలు చేస్తాడు కాబట్టి.

3. **పితృదేవతలు–జీవుడు:** పితృదేవతలకు మీరు శ్రాద్ధకర్మలు పెట్టినప్పుడు, మీరు భోగ్యవస్తువు, పితృదేవతలు భోక్తలు అవుతారు. కాని వారు మిమ్మల్ని దీవించినప్పుడు మీరు భోక్త, పితృదేవతలు భోగ్యవస్తువు అవుతారు.

4. **పితా–పుత్రుడు:** పిల్లల పరంగా చూస్తే తండ్రి పిల్లలకు భోగ్యవస్తువు. పిల్లలు తండ్రి ప్రారబ్ధకర్మను క్షయం చేయటానికి పుడతారు. వారు మంచి పిల్లలయితే పుణ్య ప్రారబ్ధకర్మ క్షయమవుతుంది; వారు చెడ్డవారయితే పాప ప్రారబ్ధకర్మ క్షయమవుతుంది. అలాగే తండ్రిపరంగా చూస్తే కొడుకు భోగ్యవస్తువు అవుతాడు తండ్రికి.

ఇదే సూత్రం కార్య–కారణ భావనకు కూడా వర్తిస్తుంది. దీనికి కూడా రెండు ఉదాహరణలు చూద్దాము.

1. **జీవ–జగత్తు:** మనం ఉన్నాము కాబట్టి, జగత్తు ఉందా? జగత్తు ఉంది కాబట్టి మనం ఉన్నామా? రెండూ నిజమే! జగత్తు ఉంది కాబట్టి మనం ఉన్నాము. అదెలా? మనం కార్యకరణ సంఘాతమైన ఈ శరీరంతో ఉన్నాము. అది ఎలా వచ్చింది? అది పంచభూతాలనుంచి వచ్చింది. మనకు అన్నం జగత్తునుంచే వస్తుంది. అంటే మనం జగత్తువల్లనే పుట్టాము; జగత్తులోని ఆహారాన్ని తీసుకుంటున్నాము కాబట్టి జగత్తు భోక్త, మనం దానికి భోగ్యవస్తువు. అలా జగత్తు కారణం; జీవుడు కార్యం.

ఇప్పుడు ఇదే జంటను ఇంకో కోణంలోంచి చూస్తే ఏమవుతుంది? మనం ఉన్నాము కాబట్టి జగత్తు ఉంది. మనం ఎందుకు పుట్టాము? మన పుణ్యపాప కర్మలను అనుభవించటానికి లేదా క్షయం చేసుకోవటానికి. అవి అనుభవించాలంటే జగత్తు ఉండాలి కదా! అందువల్ల మన కర్మ ఈ జగత్తు రావటానికి మూలకారణమైంది. మనం కారణం; జగత్తు కార్యం. ఈ ఉపనిషత్తులోనే సప్తాన్న బ్రాహ్మణంలో జగత్తును జీవసృష్టిగా చూశాము. జీవుడు ఉన్నంతవరకూ జగత్తు ఉంటుంది. జీవుడు కర్మలు చేయక మానడు; పుణ్యపాపాలను పొందక మానడు; దానికోసం జగత్తు రాకమానదు అని చూశాము అందులో. అలా జగత్తు కర్మవల్ల; కర్మ జీవునివల్ల పుట్టింది.

2. **పురుషార్థ బుద్ధి-ప్రారబ్ధకర్మ:** అన్నిటికన్నా జటిలమైన సమస్య ఈ జంటనుంచి ఉత్పన్నమవుతుంది. పురుషార్థ బుద్ధివల్ల ప్రారబ్ధకర్మ ఏర్పడుతుందా? ప్రారబ్ధకర్మవల్ల పురుషార్థ బుద్ధి కలుగుతుందా? పురుషార్థబుద్ధిని ఫ్రీవిల్ అంటాము; ప్రారబ్ధకర్మను ఫేట్ అంటాము. మనిషికొక్కనికే ఈ ఫ్రీవిల్ ఉంటుంది. కర్తుమ్, అకర్తుమ్, అన్యథాకర్తుమ్ అని అతనికి మూడు అవకాశాలు ఉంటాయి ప్రతి సందర్భంలోనూ.

ఉదాహరణకు ఈ బృహదారణ్యక పుస్తకం విషయంలోనే చూడండి! ఈ పుస్తకం ఏదో విధంగా మీ చేతికి వచ్చిందనుకోండి; మీరు దీన్ని చదవవచ్చు, చదవకపోవచ్చు; దీన్ని పక్కనపెట్టి వేరే మీకిష్టమైన పుస్తకాన్ని చదవవచ్చు.

ఇప్పుడు ఫ్రీవిల్, ఫేట్ విషయాలను తీసుకుంటే, మన ఫేట్‌వల్ల ఈ మానవశరీరం వచ్చింది. మనం పుణ్యకర్మలు చేయటంవల్లనే మనుష్యజన్మ వచ్చింది. మనిషికే ఫ్రీవిల్ ఉందని చూశాము కదా! అందువల్ల మన ప్రారబ్ధకర్మవల్ల మనకు పురుషార్థబుద్ధి వచ్చింది; మన పురుషార్థబుద్ధివల్ల మన ప్రారబ్ధకర్మ ఏర్పడింది. అందువల్ల ఏది ముందు అని లోతుగా ఆలోచించకూడదు. రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి; ఈ రెండింటికీ పైన అధిష్ఠానదేవత ఇంకొకటి ఉందని అర్థం చేసుకోవాలి. ఎప్పుడు ఫ్రీవిల్ అనుకోవాలి, ఎప్పుడు ఫేట్ అనుకోవాలి?

**ఫ్రీవిల్** – మన దైనందిన జీవితంలో కర్మలు చేసేటప్పుడు, ఫేట్ గురించి మాట్లాడకూడదు. ఫ్రీవిల్ ఉపయోగించాలి. ఫేట్‌మీద ఆధారపడితే అసలే బద్ధకస్తులమయిన మనం ఏ పనీ చేయము. తమోగుణంలో పడి పోతాము. అందువల్ల **కర్మ చేసేటప్పుడు ఫ్రీవిల్ ఉపయోగించాలి**. అలాగే అనారోగ్యం పాలైనప్పుడు కూడా ఫ్రీవిల్ ఉపయోగించాలి. ప్రారబ్ధకర్మ క్షయమవాలి, మందులు వేసుకోకూడదు, డాక్టరు దగ్గరకు పోకూడదు అనే అపోహ చాలా మందిలో ఉంది. అది సరైన ఆలోచన కాదంటారు స్వామీజీ. ఆ సందర్భంలో ఫ్రీవిల్ ఉపయోగించి, శాయశక్తులా ప్రయత్నించాలి.

**ఫేట్** – ఫేట్ అని ఎప్పుడు అనుకోవాలి? కర్మ చేసేటప్పుడు ఫ్రీవిల్ ఉపయోగిస్తే, కర్మఫలం అనుభవించేటప్పుడు ఫేట్ లేదా ప్రారబ్ధకర్మఫలం అనుకోవాలి. డాక్టరు దగ్గరకు వెళ్ళే ప్రయత్నం చేయాలి; కాని ఒకవేళ అనారోగ్యం నయం కాకపోతే, అప్పుడు దాన్ని కర్మఫలంగా తీసుకోవాలి.

ఇంకో విధంగా చెప్పాలంటే, గతంలో జరిగిన విషయాలను తలచుకున్నప్పుడు, దాన్ని తప్పించలేము కాబట్టి దాన్ని మన **ఫేట్‌గా అంగీకరించాలి**; వర్తమానంలో, భవిష్యత్తులో కర్మలు చేసేటప్పుడు **ఫ్రీవిల్ ఉపయోగించాలి**. ఇలా ఆలోచించటం శ్రేయస్కరం. అంతకు మించి దీన్ని లోతుగా విశ్లేషించకూడదు.

ఈ భోక్త-భోగ్యవస్తువు; కార్యం-కారణం అనే పరస్పర సంబంధాలతో కూడిన ఈ మధు బ్రాహ్మణమునకు బీజంగా తైత్తిరీయోపనిషత్తులో ఒక అంశం ఉంది. అక్కడ అన్న-అన్నాదం; ప్రతిష్ఠా-ప్రతిష్ఠితం పదాలను చూశాము.

**అన్న–అన్నాద సంబంధం – ఉదా: ప్రాణం–శరీరం**

| **అన్నం (తినబడేది)** | **అన్నాదం (తినేది)** | **ఉదాహరణ** |
|---|---|---|
| ప్రాణం | శరీరం | శ్వాసక్రియద్వారా శరీరం ప్రాణాన్ని తింటుంది |
| శరీరం | ప్రాణం | కసరత్తువల్ల ప్రాణం శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. అంటే శరీరాన్ని ప్రాణం తింటుంది. |

**ప్రతిష్ఠా–ప్రతిష్ఠితం సంబంధం – ఉదా: అగ్ని–జలం**

| **ప్రతిష్ఠా (ఆధారం)** | **ప్రతిష్ఠితం (ఆధేయం)** | **ఉదాహరణ** |
|---|---|---|
| అగ్ని | జలం | సృష్టిక్రమంలో అగ్నినుంచి జలం పుట్టింది. అగ్ని జలానికి ఆధారం అయింది |
| జలం | అగ్ని | వర్షం పడే సమయంలో విద్యుల్లతలు ఏర్పడతాయి. అంటే జలతత్త్వం అగ్నికి ఆధారం |

ఆ విధంగా ప్రతిదీ ఇంకోదానిమీద ఆధారపడుతుంది. ఇక్కడ మధు బ్రాహ్మణములో అలా అనేక అంశాల మధ్య ఉన్న పరస్పర అనుబంధాన్ని చూస్తాము. **యత్పరస్పర ఉపకార్య ఉపకారక భూతం తదన్య అధిష్ఠానకమ్** దీన్ని వ్యాప్తి అంటారు. దీనర్థం ఒకదానిమీద ఒకటి ఆధారపడినప్పుడు, వాటికి అధిష్ఠానం భిన్నంగా ఉంటుంది. జగత్తుకు అధిష్ఠానం ఆత్మ –

**సర్వం జగత్తుకు ఆత్మ అధిష్ఠానం**
**పరస్పర ఉపకార్య ఉపకారక భూతత్వాత్ స్వప్నవత్**

దీనికి సాధారణంగా స్వప్నవృత్తాంతం ఉదాహరణగా చెబుతారు. స్వప్నంలో స్వాప్నికుడు స్వప్నప్రపంచం మీద ఆధారపడతాడు; స్వప్నప్రపంచం స్వాప్నికునిమీద ఆధారపడుతుంది. ఇంకో విధంగా, చెప్పాలంటే –

స్వప్న ప్రపంచాన్ని అనుభవించకుండా స్వాప్నికుడు ఉండలేదు;
స్వాప్నికుడు అనుభవించకపోతే స్వప్నప్రపంచానికి ఉనికి లేదు.

ఆ విధంగా స్వప్నప్రపంచం, స్వాప్నికుడు – పరస్పర ఉపకారక భూతం. ఈ రెండింటికీ భిన్నంగా ఉన్న అధిష్ఠానం ఎవరు? జాగ్రద్ పురుషుడు.

ఇదే సూత్రాన్ని జాగ్రత్ ప్రపంచానికి విస్తరింపజేస్తే, జగత్తులో కూడా అన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. అవి ఒకదానిమీద ఒకటి ఆధారపడితే, జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నప్రపంచంలాగా మిథ్య అవుతుంది. దానికి అధిష్ఠానం అయిన ఆత్మ సత్యం అవుతుంది.

బృహదారణ్యకంలో అలా అనేక విధాలుగా **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా** వస్తుంది. ఈ సూత్రాన్ని విడమరచి చెప్పే ఈ మధు బ్రాహ్మణము అనుమాన వాక్యం లేదా తర్కం రూపంలో ఉంది కాబట్టి దీన్ని కూడా మననంలోకే పరిగణిస్తాము. మననం మైత్రేయీ బ్రాహ్మణం మధ్యలోనుంచి మొదలయింది.

మధు బ్రాహ్మణంలో మొదటి పధ్నాలుగు మంత్రాలు ఈ పరస్పర అనుబంధం గురించి వివరిస్తాయి. ఈ పరస్పర అనుబంధాన్ని చూపించటానికి, నాలుగు అంశాలను తీసుకుంది ఉపనిషత్తు. అవి - సర్వాణి భూతాని (అన్ని జీవరాశులు), అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం. వీటిని మూడు జంటలుగా తీసుకుంది. అవి-

**సర్వాణి భూతాని - అధ్యాత్మమ్**
**సర్వాణి భూతాని - అధిభూతమ్**
**సర్వాణి భూతాని - అధిదైవమ్**

అంటే మూడు జంటల్లోనూ సర్వాణి భూతాని సమానంగా వస్తుంది. ఈ పరస్పర అనుబంధాన్ని చూపించ టానికి **మధువు** అనే పదం తీసుకుందని చూశాము. మధువు అంటే కార్యం అనీ, భోగ్యవస్తువు అని కూడా చూశాము. మొదటి మంత్రం వివరంగా చూస్తే అదే పద్ధతిలో తక్కిన పదమూడు మంత్రాలూ కొనసాగుతాయి.

మంత్రం 2.5.1

**ఇయం పృథివీ సర్వేషాం భూతానాం మధ్వస్యై పృథివ్యై సర్వాణి భూతాని మధు యశ్చాయమస్యాం పృథివ్యాం తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం శారీరస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

**జత-1**

ఈ పృథివి సర్వభూతాలకు మధువు అంటే పృథివి కార్యం, భోగ్య వస్తువు. సర్వభూతాలూ కారణం, భోక్త. పృథివి భోగ్యం, సర్వభూతాలూ భోక్త; పృథివి కార్యం, సర్వభూతాలు కారణం.

**జత-2**

సర్వభూతాలకూ అంటే అన్ని జీవులకూ అధిభూతం మధువు; అధిభూతానికి అన్ని జీవులూ మధువు.

**జత-3**

అన్ని జీవులకూ అధిదైవం మధువు. అధిదైవం అన్ని జీవులకు మధువు అంటే జీవి-జీవి; జీవి-జగత్తు; జీవి-ఈశ్వరుడు ఒకరికి ఒకరు మధువు. అందువల్ల అధ్యాత్మ, అధిభూత, అధిదైవం అన్నీ మధువు అయిన ప్రపంచం ఆత్మ. అది అధిష్ఠాన ఆత్మ.

పరస్పరం ఒకదానిమీద ఒకటి ఆధారపడిన ఈ ప్రపంచం అధిష్ఠాన ఆత్మకు భిన్నంగా లేదని చెప్పటంలోని ఉద్దేశం పరస్పర మధువుగా నిలిచిన ప్రపంచం మిథ్య. ఇదీ ఈ మంత్రం సారాంశం. ఈ నేపథ్యంతో మొదటి మంత్రాన్ని చూద్దాము.

**జత–1**

ఇయం పృథివీ సర్వేషాం భూతానాం మధు
అస్యై పృథివ్యై సర్వాణి భూతాని మధు

ఈ పృథివి సకల ప్రాణులకు మధువు. ఈ పృథివికి సకల ప్రాణులు మధువు.

**జత–2**

యశ్చాయమస్యాం పృథివ్యామ్ (సః సర్వేషాం భూతానాం మధు)
తేజోమయః అమృతమయ పురుషః (తస్య సర్వాణి భూతాని మధు)

ఈ పృథివీ దేవత సకల ప్రాణులకు మధువు. ఈ పృథివీ దేవతకు సకల ప్రాణులు మధువు.

**జత–3**

యశ్చాయమధ్యాత్మగ్ం శారీరః (సః సర్వేషాం భూతానాం మధు)
తేజోమయః అమృతమయః పురుషః (తస్య సర్వాణి భూతాని మధు)

ఈ అధ్యాత్మశరీరం సకల ప్రాణులకు మధువు. ఈ ఆధ్యాత్మ శరీరానికి సకల ప్రాణులు మధువు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. **తేజోమయః అమృతమయః పురుషః** రెండుసార్లు వచ్చింది; ఇలాగే తర్వాత వచ్చే పదమూడు మంత్రాల్లో కూడా వస్తుంది. అందువల్ల వాటి మధ్య ఉన్న తేడా ఏమిటో మనం ఇప్పుడే స్పష్టంగా తెలుసుకోవాలి.

మొదటి పురుషః అంటే అధిదైవం లేదా అధిదేవత. ఉదాహరణకు పృథివీదేవత, అగ్నిదేవత, వాయుదేవత. ఇది సమష్టి. ఈ పురుషుడిని సమష్టి సూక్ష్మప్రపంచం+చిదాభాసగా తీసుకోవాలి. తేజోమయః అమృతమయః పదాలు చైతన్యతత్త్వాన్ని (సాపేక్షిక), శాశ్వతత్త్వాన్ని సూచిస్తాయి. చిదాభాసవల్ల తేజోమయం; మనుష్యులకన్నా ఎక్కువకాలం ఉంటారు కాబట్టి అమృతమయం. సాపేక్షికం అని ఎందుకన్నామంటే వారు కూడా శాశ్వతం కాదు కాబట్టి. అందువల్ల మొదటి పురుషః అధిదైవాన్ని సూచిస్తే, రెండవ పురుషః అధ్యాత్మికాన్ని సూచిస్తుంది. ఈ పురుషుని అర్థం వ్యష్టి సూక్ష్మశరీరం+చిదాభాస. దీన్ని కూడా తేజోమయః అమృతమయః అంది ఉపనిషత్తు. ఎందుకంటే వ్యష్టి సూక్ష్మశరీరం కూడా చిదాభాసవల్ల తేజోమయమవుతుంది. సూక్ష్మశరీరం కూడా స్థూలశరీరంతో పోలిస్తే చాలా ఎక్కువకాలం ఉంటుంది.

ఇప్పుడు మంత్రంలో చివరిభాగం చూద్దాము.

**అయమేవ సయోఽయమాత్మా** – ఈ ప్రపంచం, మధ్యాత్మక ప్రపంచం. అంటే అధిభూత, అధిదైవ మధ్యాత్మక ప్రపంచః అయమాత్మా. ఇది అధిష్ఠాన ఆత్మకు భిన్నంగా లేదు. **అయమేవ సః** అంటే ఈ ప్రపంచం  ఆ ఆత్మయే. ఏ ఆత్మ?

**యోఽయమాత్మా** – యోయమాత్మా అంటే మైత్రేయీ బ్రాహ్మణంలో ఏ ఆత్మ గురించి చెప్పబడిందో ఆ ఆత్మ.

**ఇదమమృతమ్** – ఇదం అంటే అధిష్ఠాన ఆత్మజ్ఞానం; అమృతం అంటే అమృత సాధనం. ఈ ఆత్మజ్ఞానం అమృత సాధనం అవుతుంది.

**ఇదం బ్రహ్మ** – ఇక్కడ ఇదం అంటే అధిష్ఠానతత్త్వం; అధిష్ఠానతత్త్వం అయిన ఆత్మ ఏదో కాదు, బ్రహ్మయే.

**ఇదం సర్వమ్** – ఇక్కడ కూడా ఇదం అంటే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం పొందితే సర్వాత్మభావన కలుగుతుంది.

ఈ చివరిభాగం అంతా క్రోడీకరిస్తే ఈ విధంగా అర్థం వస్తుంది –

**ఎప్పుడైతే నేను అధిష్ఠానం ఆత్మను, ఒకదానిమీద ఒకటి ఆధారపడ్డ జగత్తును కాను అని అర్థం చేసుకుంటానో, అప్పుడు ఇలా పరస్పరంగా ఆధారపడ్డ జగత్తు మిథ్య అనీ నేను స్వతంత్రమైన సత్యాన్ని అనీ, అందువల్ల నేనే ఈ పరస్పరంగా ఆధారపడ్డ జగత్తుగా పొరపాటుగా కనిపిస్తున్నాను అనీ తెలుసుకుంటాను.**

దీన్ని సర్వప్రాప్తి అంటారు. నేను అన్నం–అన్నాదాన్ని; నేను భోక్త–భోగ్యాన్ని; నేను ప్రతిష్ఠా–ప్రతిష్ఠితాన్ని అని తెలుసుకోవటం సర్వాత్మభావన.

దీన్ని శంకరులవారు మొదటి అధ్యాయంలోని మంత్రంతో కలుపుతున్నారు.

**తస్మాత్ తత్ సర్వమభవత్ – 1.4.10**

అక్కడ సర్వప్రాప్తిః చెప్పబడింది. దాని వివరణ ఇక్కడ వచ్చింది. దీన్ని ఆ వాక్యానికి **నిగమనం** అంటారు. ఒక మంత్రం అర్థమయితే తక్కిన అన్ని మంత్రాలూ అర్థమయినట్లే. వాటిని మనం ఒకేసారి ఒక పట్టికలో చూడవచ్చు.

మంత్రం 2.5.2

**ఇమా ఆపస్సర్వేషాం భూతానాం మధ్వాసామపాగ్ం సర్వాణి భూతాని మధు యశ్చాయమాస్వప్సు తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం రైతసస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

మంత్రం 2.5.3

**అయమగ్నిస్సర్వేషాం భూతానాం మధ్వస్యాగ్నేస్సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్నగ్నౌ తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం వాఙ్మయస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

మంత్రం 2.5.4

**అయం వాయుస్సర్వేషాం భూతానాం మధ్వస్య వాయోస్సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్ వాయౌ తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం ప్రాణస్తేజోమయోఽ మృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

మంత్రం 2.5.5

అయమాదిత్యస్సర్వేషాం భూతానాం మధ్వస్యాదిత్యస్య సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్నాదిత్యే తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం చాక్షుషస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥

మంత్రం 2.5.6

ఇమా దిశస్సర్వేషాం భూతానాం మధ్వాసాం దిశాగ్ం సర్వాణి భూతాని మధు యశ్చాయమాసు దిక్షు తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం శ్రౌత్రః ప్రాతిశ్రుత్కస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ సయోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥

మంత్రం 2.5.7

అయం చంద్రస్సర్వేషాం భూతానాం మధ్వస్య చంద్రస్య సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిగ్ంశ్చంద్రే తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం మానస స్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్॥

మంత్రం 2.5.8

ఇయం విద్యుత్సర్వేషాం భూతానాం మధ్వస్యై విద్యుతస్సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్ విద్యుతి తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం తైజసస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥

మంత్రం 2.5.9

అయగ్ం స్తనయిత్నుస్సర్వేషాం భూతానాం మధ్వస్య స్తనయిత్నోస్సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్ స్తనయిత్నౌ తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం శాబ్దస్సౌవరస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥

మంత్రం 2.5.10

అయమాకాశస్సర్వేషాం భూతానాం మధ్వస్యాకాశస్య సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్నాకాశే తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం హృద్యాకాశస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥

మంత్రం 2.5.11

**అయం ధర్మస్సర్వేషాం భూతానాం మధ్వస్య ధర్మస్య సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్ ధర్మే తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం ధార్మస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

మంత్రం 2.5.12

**ఇదగ్ం సత్యగ్ం సర్వేషాం భూతానాం మధ్వస్య సత్యస్య సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్ సత్యే తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మగ్ం సాత్యస్తేజోమయోఽ మృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

మంత్రం 2.5.13

**ఇదం మానుషగ్ం సర్వేషాం భూతానాం మధ్వస్య మానుషస్య సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్మానుషే తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమధ్యాత్మం మానుషస్తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

మంత్రం 2.5.14

**అయమాత్మా సర్వేషాం భూతానాం మధ్వస్యాఽఽత్మనస్సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్నాత్మని తేజోమయోఽమృతమయః పురుషో యశ్చాయమాత్మా తేజోమయోఽమృతమయః పురుషోఽయమేవ స యోఽయమాత్మేదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్ ॥**

| **మంత్రం** | **అధిభూతం** | **అధిదైవం** | **అధ్యాత్మం** |
|---|---|---|---|
| 1 | పృథివి | పృథివిదేవత | శరీరం |
| 2 | జలం | జలదేవత | రేతస్సు (పురుషబీజం) |
| 3 | అగ్ని | అగ్నిదేవత | వాక్కు |
| 4 | వాయువు | వాయుదేవత | ప్రాణం |
| 5 | ఆదిత్యుడు | ఆదిత్య దేవత | చక్షువు |
| 6 | దిశలు | దిగ్దేవత | శ్రోత్రం |
| 7 | చంద్రుడు | చంద్రదేవత | మనస్సు (మానస పురుషుడు) |
| 8 | విద్యుత్ | విద్యుద్దేవత | శరీరంయొక్క తేజస్సు |
| 9 | ఉరుములు | ఉరుముల దేవత | అక్షరాల స్వరం |
| 10 | ఆకాశం | ఆకాశదేవత | హృదయాకాశం |
| 11 | ధర్మం (అంతర్గతం) | ధర్మదేవత | ధర్మపురుషుడు |

| | | | |
|---|---|---|---|
| 12 | సత్యం (బాహ్యం) | సత్యదేవత | సత్యపురుషుడు |
| 13 | మనుష్యజాతి | మనుష్య దేవత | మానుషం (వ్యష్టి స్థాయి) |
| 14 | ఆత్మ | ఆత్మ | ఆత్మ |

(ఈ చివరి దానికి ఈ మూడు బేధాలు లేవు)

పద్నాల్గవ మంత్రాన్ని వివరంగా చూద్దాము. ఇది తక్కినవాటికి కొంచెం భిన్నంగా ఉంది. ఈ మంత్రంలో సగం వరకూ పరస్పర అనుబంధం గురించి వస్తుంది.

**అయమాత్మా సర్వేషాం భూతానాం మధ్వస్యాఽఽత్మనః సర్వాణి భూతాని మధు యశ్చాయమస్మిన్నాత్మని తేజోమయోఽమృతమయః పురుషః** – ఇంతవరకూ మధువు భాగం వస్తుంది. ఈ ఆత్మ సకల ప్రాణులకు మధువు; సకల ప్రాణులు ఆత్మకు మధువు. ఇక్కడ ఆత్మ అంటే అధ్యాత్మ. అధిభౌతిక, అధిదైవిక విభజనలు లేవు. ఆధ్యాత్మ, అధిభౌతిక, అధిదైవిక విశేషరహిత ఆత్మ. అంటే వ్యష్టికీ, సమష్టికీ మధ్యనున్న అనుబంధం గురించి చెబుతున్నది.

**యశ్చాయమాత్మా తేజోమయోఽమృతమయః పురుషః** – ఈ రెండో పురుషశబ్దాన్ని జీవాత్మగా తీసుకోవాలి. అంటే వ్యష్టిగా తీసుకోవాలి. దీన్ని తర్వాత వాక్యంతో కలపాలి.

**అయమేవ స యోఽయమాత్మా** – ఈ జీవాత్మ మైత్రేయి బ్రాహ్మణంలో చర్చించిన ఆత్మకు భిన్నంగా లేదు. ఆ విధంగా జీవాత్మ పరమాత్మ ఐక్యం వస్తుంది ఇక్కడ. ఈ ఆత్మ అంటే – అధ్యాత్మ, అధిభౌతిక, అధిదైవ. అధిష్ఠాన భూత ఆత్మనే మైత్రేయీ బ్రాహ్మణంలో చర్చించారు.

**ఇదమమృతమిదం బ్రహ్మేదగ్ం సర్వమ్** – దీని అర్థం అంతకు ముందు చూసినదే. ఎవరైతే ఈ ఆత్మజ్ఞానం పొందుతాడో, అతను సర్వాత్మభావనను పొందుతాడు.

## మంత్రం 15

**స వా అయమాత్మా సర్వేషాం భూతానామధిపతిస్సర్వేషాం భూతానాగ్ం రాజా ॥**
**తద్యథా రథనాభౌ చ రథనేమౌ చారాస్సర్వే సమర్పితా ఏవమేవాస్మిన్నాత్మని సర్వాణి భూతాని సర్వే దేవాస్సర్వే లోకాస్సర్వే ప్రాణాస్సర్వ ఏత ఆత్మానస్సమర్పితాః ॥**

ఈ మంత్రంలో అధిష్ఠాన ఆత్మస్వరూపం గురించిన వర్ణన వస్తుంది. ఇప్పటివరకూ పరస్పర ఉపకార్య ఉపకార రూప ప్రపంచం గురించిన వర్ణన చూశాము. అంటే మిథ్యా ప్రపంచాన్ని చూశాము. ఇప్పుడు ఆ మిథ్యా ప్రపంచపు అధిష్ఠాన ఆత్మ లక్షణం చూస్తాము.

**స వా అయమాత్మా సర్వేషాం భూతానామధిపతి స్సర్వేషాం భూతానాగ్ం రాజా** – ఈ ఆత్మ నిశ్చయంగా సర్వభూతాలకు అధిపతి, సకలభూతాలకు రాజు. ఈ ఆత్మ అంటే మిథ్యా ప్రపంచపు అధిష్ఠాన ఆత్మ. సకల మిథ్యాప్రపంచం దాని ఉనికికోసం ఆత్మమీద ఆధారపడివుంది కాబట్టి ఆత్మను అధిపతి అంది. అధిపతి అంటే అధిష్ఠానం.

అంతేకాదు అన్ని జీవులకు రాజు. అన్నీ ఆత్మమీదే ఆధారపడివున్నాయి. దానికి ఒక ఉదాహరణనిస్తున్నది.

**తద్యథా రథనాభౌ చ రథనేమౌ చారాస్సర్వే సమర్పితాః** – ఎలాగయితే, రథంయొక్క ఇరుసులో రథంచక్రం ఆకులు గుచ్చబడివున్నాయో,

**ఏవమేవాస్మిన్నాత ని సర్వాణి భూతాని సర్వే దేవాస్సర్వే లోకాస్సర్వే ప్రాణాస్సర్వ ఏత ఆత్మానస్సమర్పితాః** – అదే విధంగా ఈ ఆత్మలో సకల భూతాలు, సకల దేవతలు, సకల లోకాలు, సకల ప్రాణులు, సకల జీవాత్మలు సమర్పించబడివున్నాయి.

రథనాభి ఉదాహరణను ఉపనిషత్తులలో తరచు చూస్తాము.

**అరా ఇవ రథనాభౌ సంహతా యత్ర నాద్యః**
**స ఏషోఽన్తశ్చరతే బహుధా జాయమానః। – ముండకం**

రథంలోని ఆకులు అనేకం, కాని వాటికి ఆధారమైన రథనాభి ఒకటే. అలాగే జగత్తు అనే రథచక్రానికి ఆత్మ రథనాభి. దీని గొప్పతనం ఏమిటంటే, చక్రాలు కదులుతాయి, ఆకులు కదులుతాయి కాని వాటికి ఆధారమైన రథనాభి కదలదు. అలాగే కదలని ఆత్మమీద కదిలే ప్రపంచం ఆధారపడివుంది. సర్వాణి భూతాని అంటే అధిభూతం; సర్వేదేవా అంటే అధిదైవం; సర్వేలోకాః అంటే అన్ని లోకాలు; సర్వేప్రాణాః అంటే అధ్యాత్మం అన్నీ చైతన్యరూప ఆత్మమీద ఆధారపడివున్నాయి. ఇక్కడ సర్వ ఏత ఆత్మానః అంటే చిదాభాస అని అర్థం చేసుకోవాలి. చిదాభాస రూప జీవాత్మతో సహా అన్నీ అధిష్ఠాన ఆత్మమీద ఆధాపడివున్నాయి.

ఆత్మ సర్వం అన్నప్పుడు ఆత్మతో మాయను కలుపుకోవాలి. నిర్గుణ ఆత్మను సర్వ అధిష్ఠానం అనలేము. ఎందుకంటే సర్వం అనగానే సృష్టి వస్తుంది; సృష్టి మాట రాగానే, మాయ కూడా రావాలి. రథనాభిలో మాయా సహిత బ్రహ్మను తీసుకోవాలి. ఆ విధంగా సర్వాత్మభావనను మళ్ళీ ఈ పదిహేనవ మంత్రంలో చర్చించింది ఉపనిషత్తు.

## మంత్రం 2.5.16

**ఇదం వై తన్మధు దధ్యఙ్జాథర్వణోఽశ్విభ్యామువాచ । తదేతదృషిః పశ్యన్నవోచత్। తద్వాం నరా సనయే దగ్ంస ఉగ్రమావిష్కృణోమి తన్యతుర్న వృష్టిమ్ । దధ్యఙ్ హ యన్మధ్వాథర్వణో వామశ్వస్య శీర్ష్ణా ప్ర యదీమువాచేతి ॥**

ఇక్కడనుంచీ పంతొమ్మిదవ మంత్రం వరకూ ఉపసంహార మంత్రాలు అంటాము. వీటిల్లో మధువిద్యా స్తుతి, మధువిద్యా సారాంశం వస్తాయి.

మధువిద్య ఎవరు ఎవరికి బోధించారో వస్తుంది ముందు.

**ఇదం వై తన్మధు దధ్యఙ్జాథర్వణోఽశ్విభ్యామువాచ** – ఈ మధువిద్యను దధ్యచ మహర్షి అశ్వినీ దేవతలకు చెప్పాడు. దధ్యచ ఋషిని అథర్వణుడు అని కూడా అంటారు. ఎందుకంటే అతను అథర్వణ వేదవేత్త.

మధువిద్య అంటే జగత్తు మొత్తం పరస్పరం ఒకదానిమీద ఒకటి ఆధాపడివుందనీ, అలా ఆధారపడివుంది కాబట్టి జగత్తు మిథ్య అనీ, దానికి అధిష్ఠానం సత్య ఆత్మ అనీ వస్తుంది. ఈ బోధ మామూలు పద్ధతిలో జరగలేదు. మామూలుగా శిష్యుడు గురువు దగ్గరకు వెళ్ళి అడిగితే, గురువు చెప్పటం కాదు. ఇదొక ప్రత్యేక పరిస్థితిలో బోధించబడింది. దీనికొక కథ ఉంది.

దధ్యచ ఋషికి మధువిద్య తెలుసు. ఒకసారి అశ్వినీ కుమారులు దధ్యచ ఋషిని సమీపించి, 'మాకు మధువిద్యను బోధించండి,' అని అడిగారు. కాని దధ్యచ ఋషికి ఒక సమస్య ఉంది. దేవేంద్రుడు ఈ విద్యని ఎవరికీ బోధించవద్దని హెచ్చరించాడుట. విద్యను రహస్యంగా ఉంచాలి. పైపెచ్చు హెచ్చరిక ఇచ్చి ఊరుకోకుండా, ఎవరికైనా బోధిస్తే అతని తల నరుకుతానని బెదిరించాడట కూడా ఇంద్రుడు. అందువల్ల తన నిస్సహాయతను తెలియచేశాడు ఋషి. కాని అశ్వినీ కుమారులు ఊరుకోలేదు. వారు దేవతలకు వైద్యులు. అందువల్ల వారి దగ్గర ఒక పరిష్కారం ఉందన్నారు వారు. ఏమిటది?

వారు వైద్యులు కాబట్టి, శరీరంలో ఏ భాగాన్నైనా తీయగలమనీ, మళ్ళీ వెనక్కి పెట్టగలమనీ చెప్పారు. అందువల్ల ఋషి తల తీసి భద్రంగా ఎక్కడో దాచి, ఒక గుర్రం తల తెచ్చి అతికిస్తామనీ, ఆ గుర్రం తలతో తమకు బోధ చేయమనీ, అది తెలిసిన ఇంద్రుడు ఆ గుర్రం తలను నరుకుతాడనీ, అప్పుడు ఆయన అసలు తలను వెనక్కి పెడతామనీ అన్నారు. అలా చేయటంవల్ల వారు విద్య నేర్చుకున్నవారు అవుతారు, ఆయన తల ఆయనకు భద్రంగాను ఉంటుంది. ఇదీ కథ. దీన్ని ఇంతకుమించి లోతుల్లోకి వెళితే దాని అందం పోతుంది.

**తదేతదృషిః పశ్యన్నవోచత్** – ఆ ఈ కర్మను చూసిన ఇంకొక ఋషి ఇలా అన్నాడు. ఇక్కడ ఋషి అంటే దధ్యచ ఋషి కాదు. అతను తలమార్పిడి చేయించుకుని బోధ చేసేసాడు. అది మొదటి వాక్యంలో చూశాము. దాన్ని కళ్ళారా చూసిన ఇంకొక ఋషి అశ్వినీ కుమారులతో ఇలా అంటున్నాడు.

**తద్వాం నరా సనయే దగ్ంస ఉగ్రమావిష్కృణోమి** – ఓ నరులారా! మీరు చేసిన క్రూరమైన కర్మ గురించి నాకు తెలుసు. అది మధువిద్య పొందటానికి చేశారు. క్రూర కర్మ తలతీసి గుర్రం తల పెట్టటం, మళ్ళీ గురువు తల వెనక్కి పెట్టటం. ఇంత సాహసం ఎందుకు చేశారంటే మధువిద్య పొందటంకోసం. అలా అశ్వినీ కుమారులు సాహసం చేశారని మెచ్చుకుంటున్నాడు.

దధ్యచ మహర్షి చేసిన సాహసం ఇంకా గొప్పది. మామూలు ఆపరేషనే ఒక్కోసారి ప్రాణహాని కలుగజేయ వచ్చునంటారు. అలాంటిది తల తీయించుకుని, ఇంకో తల పెట్టించుకోవటం చాలా సాహసంతో కూడినది. అయినా మీకు విద్య చెప్పటంకోసం ఆయన ఆ సాహసం చేశారు. అందువల్ల అది నేను అందరికీ చాటి చెపుతాను అంటున్నాడు. దానికి ఒక ఉదాహరణనిస్తున్నాడు.

**తన్యతుర్న వృష్టిమ్** – మేఘాలు ప్రపంచమంతటా వర్షం కురిపించినట్టుగా, నేను ఈ వార్తను ప్రపంచమంతటా చాటి చెబుతాను. ఏ వార్తను?

**దధ్యఙ్ హ యన్మధ్వాథర్వణో వామశ్వస్య శీర్ష్ణా ప్ర యదీమువాచేతి** – ఎలా అథర్వణ వేదవేత్త అయిన దధ్యచుడు మీకోసం గుర్రపు తలతో మధువిద్య నేర్పాడో చెబుతాను.

ఈ మంత్రంలో రెండు సాహసాలు గురించి వస్తుంది. శిష్యులు చేసిన కర్మ, గురువు చేయించుకున్న ధైర్యం మెచ్చుకోబడతాయి. గురుశిష్యులు ఇద్దరూ ఇంత సాహసం చేశారంటే, విద్య ఎంత గొప్పదో చూడండి! మధువిద్య మామూలు విద్య కాదు. ఏదైనా తేలికగా వస్తే దాని విలువ తెలియదు మనకు. మధు అంటే మధువిద్య. మధువిద్య సారాంశం - **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

## మంత్రం 2.5.17

**ఇదం వై తన్మధు దధ్యఙ్ఙాథర్వణోఽశ్విభ్యామువాచ। తదేతదృషిః పశ్యన్నవోచత్ । ఆథర్వణాయాశ్వినౌ దధీచేఽశ్వ్యగ్ం శిరః ప్రత్యైరయతమ్ । స వాం మధు ప్రవోచదృతాయన్త్వాష్ట్రం యద్దస్రావపి కక్ష్యం వామితి ॥**

**ఇదం వై తన్మధు దధ్యఙ్ఙాథర్వణోఽశ్విభ్యామువాచ** – ఆ ఈ మధువును అథర్వణ వేదవేత్తయైన దధ్యచ మహర్షి అశ్వినీ దేవతలకు బోధించాడు.

**తదేతదృషిః పశ్యన్నవోచత్** – ఆ ఈ కర్మను చూసిన ఇంకొక ఋషి ఇలా చెప్పాడు;

**అథర్వణాయాశ్వినౌ దధీచేఽశ్వ్యగ్ం శిరః ప్రత్యైరయతమ్** – ఓ అశ్వినీ దేవతలారా! మీరిద్దరు దధ్యచ మహర్షికి గుర్రం తలను తీసుకువచ్చారు.

**స వాం మధు ప్రవోచదృతాయన్** – ఆయన మీకు మధువిద్యను చెప్పాడు. ఎందుకంటే ఆయన సత్యమును పాటించువాడు.

**త్వాష్ట్రం యద్దస్రావపి కక్ష్యం వామితి** – ఆయన రెండు రకాల మధువిద్యను చెప్పాడు. త్వాష్ట్రమ్ మధు, కక్ష్యం మధు.

త్వాష్ట్రమ్ మధుకు కూడా ఒక కథ ఉంది. ఒకసారి విష్ణుమూర్తి అసురులతో యుద్ధం చేసి విజయం పొందాడుట. ఈ విజయంతో విష్ణుమూర్తికి గర్వం వచ్చిందిట. తక్కిన దేవతలకు ఆయనమీద అసూయ పుట్టింది. యుద్ధం చేసి అలసిపోయిన విష్ణుమూర్తి తన తలను వింటినారికి ఆనించి పడుకున్నాడు. విల్లు ఎక్కుపెట్టే ఉంది. దేవతలు చిన్న పురుగులుగా మారి ఆ వింటినారిని కొరికారు.

ఎక్కుపెట్టి వున్న వింటినారినుంచి విల్లంబు దూసుకువచ్చింది. వింటినారికి ఆనుకుని ఉన్న విష్ణుమూర్తి గడ్డానికి అది తగిలి, ఆయన తల ఆకాశానికి ఎగిరిపోయింది. ఆ తల సూర్యభగవానుడు. ఆదిత్యుడు విష్ణుమూర్తి శిరస్సు. విష్ణుమూర్తి తల ఎగిరిపోయేసరికి దేవతలు ఖంగారు పడిపోయి, అశ్వినీ కుమారులను సంప్రదించారు. అప్పుడు వారు తలను తిరిగి అతికించారు. ఈ కథ శతపథ బ్రాహ్మణంలో వస్తుంది. త్వష్టా అంటే ఆదిత్యుడు. ఆదిత్యునికి సంబంధించిన ఉపాసన గనుక దీన్ని త్వాష్ట్రమ్ అంటారు. ఆ తలను తిరిగి అతికించటానికి ప్రవర్గ్య కర్మ చేయబడుతుంది. ప్రవర్గ్యకర్మకు అంగఉపాసన పేరు త్వాష్ట్ర మధువు.

రెండవ మధువిద్య పేరు కక్ష్యం మధు. కక్ష్యం మధు అంటే మనం ఈ బ్రాహ్మణంలో చూసిన మధువిద్య.

**యద్దస్రా** – యత్ హే దస్రౌ అంటే అశ్వినీ కుమారులు. శత్రుసైన్యములను క్షీణింపజేయువారు అని అర్థం. దధ్యచ ఋషి అశ్వినీ కుమారులకు విద్యను బోధిస్తానని మాట ఇచ్చాక, తనకున్న శాపం గుర్తుకొచ్చింది. కాని మాట నిలబెట్టుకోవటంకోసం అంత సాహసం చేశాడు. అందువల్ల దీని సారాంశం, మధువిద్య గొప్పది, దీన్ని తేలిగ్గా తీసుకోకండి.

## మంత్రం 2.5.18

**ఇదం వై తన్మధు దధ్యఙ్ఙాథర్వణో౽శ్విభ్యామువాచ । తదేతదృషిః పశ్యన్నవోచత్ । పురశ్చక్రే ద్విపదః పురశ్చక్రే చతుష్పదః । పురస్స పక్షీ భూత్వా పురః పురుష ఆవిశదితి । స వా అయం పురుషస్సర్వాసు పూర్షు పురిశయో నైనేన కించనానావృతం నైనేన కించనాసంవృతమ్ ॥**

**ఇదం వై తన్మధు దధ్యఙ్ఙాథర్వణోశ్విభ్యామువాచ తదేతదృషిః ప్రశ్యన్నవోచత్** – ఆ ఈ మధువును దధ్యచ మహర్షి అశ్వినీ దేవతలకు చెప్పాడు. ఆ ఈ కర్మను చూసిన ఋషి వారితో ఇలా చెప్పాడు.

ఇంతవరకూ ఇంతకుముందు చూసిన మాటలే. మధువిద్యను ముందు రెండు మంత్రాలలో స్తుతించాక, ఇప్పుడు వచ్చే రెండు మంత్రాలూ మధువిద్య సారాంశాన్నిస్తాయి. ఈ మంత్రంలో సర్వాత్మభావన సారాంశం వస్తుంది.

ఈ మంత్రం సారాంశం – ఆత్మయే అంతా అయింది. అంతా అంటే ఇక్కడ స్థూలశరీరాలు. ఆత్మయే మనుష్యుల స్థూలశరీరాలు, జంతువుల స్థూలశరీరాలు వగైరా అయింది. అన్ని స్థూలశరీరాలను సృష్టించాక సూక్ష్మశరీరరూపంలో ఆత్మయే అనుప్రవేశం చేసింది.

**సో౽కామయత। బహుస్యాం ప్రజాయేయేతి।** - తైత్తిరీయం

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆత్మ అంతా 'అయింది' అంటే ఆత్మ పరిణామికారణం కాదు వివర్తకారణం. విశిష్టాద్వైతంలో ఆత్మ, జగత్తు రెండూ సత్యం. కాని అద్వైతంలో జగత్తు మిథ్య. పరిణామికారణంలో ఉపాదానకారణం మార్పు చెందుతుంది. పాలను పెరుగుగా తోడువేస్తే, అది పెరుగుగా మారి, పాల లక్షణాలను కోల్పోతుంది. అదే వివర్తకారణంలో ఉపాదానకారణం మారదు. ఉదాహరణ స్వప్నం. స్వప్నంకనే నేను మారను. ఈ ఉపనిషత్తు బ్రాహ్మణోపనిషత్తు. అది మంత్రోపనిషత్తునుంచి కొన్ని వాక్యాలను చెబుతున్నది.

ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**పురశ్చక్రే ద్విపదః పురశ్చక్రే చతుష్పదః** – ఆ పరమాత్మ రెండు పాదాల స్థూలశరీరాలను, నాలుగు పాదాల స్థూలశరీరాలను సృష్టించాడు. పురః అంటే స్థూలశరీరాలు. శంకరాచార్యులవారి భాష్యం లేకపోతేనూ, పరమార్థానందస్వామివారి బోధలు లేకపోతేనూ ఈ మంత్రం, ముందు మంత్రం అర్థం చేసుకోవటం కష్టమయ్యేది. చక్రే అంటే చక్రం కాదు. ఆయన సృష్టించాడు. ఎలా? తననుంచి సృష్టించాడు. అందువల్ల ఆయనే అయ్యాడు. ఆయనే రెండు కాళ్ళ, నాలుగు కాళ్ళ జీవులుగా అయ్యాడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే పరమాత్మ అన్ని జీవుల స్థూలశరీరాలుగా అయ్యాడు. అయ్యాడు అంటే వివర్త ఉపాదానకారణం అని గుర్తుంచుకోవాలి. పరమాత్మ పారమార్థిక సత్యం, జీవాత్మశరీరాలు వ్యావహారిక సత్యంలోకి వస్తాయి. స్థూలశరీరాలను సృష్టించాక పరమాత్మ ఏం చేశాడు?

**పురస్స పక్షీ భూత్వా పురః పురుష ఆవిశదితి** – పరమాత్మ సూక్ష్మశరీరాలుగా స్థూలశరీరాల్లో అనుప్రవేశం చేశాడు. పక్షీ అంటే ఈ సందర్భంలో సూక్ష్మశరీరం. పరమాత్మ అనుప్రవేశం చేశాడు అంటే **చేసినట్టుగా** అనుకోవాలి.

(ఈ ఉపనిషత్తులోనే మొదట్లో అనుప్రవేశభాష్యం ఉంది. దాన్ని చూడవచ్చు)

పరమాత్మ జీవాత్మగా అనుప్రవేశం చేశాక, వ్యవహారాలు మొదలవుతాయి. పరమాత్మ అవ్యవహారి. కార్యకరణ సంఘాతమైన స్థూలసూక్ష్మశరీరాల కలయికవల్ల వ్యవహారం నడుస్తుంది. అందువల్ల నేర్పించే గురువూ పరమాత్మే, నేర్చుకునే విద్యార్థీ పరమాత్మే, వేదాంతకృత్, వేదవిత్ ఇద్దరూ పరమాత్మలే.

(అహం బ్రహ్మ అస్మి భాష్యం కూడా మొదట్లో ఉంది. దాన్ని కూడా చూడవచ్చు)

తర్వాత ఉపనిషత్తే ఈ మంత్రాన్ని వివరిస్తున్నది. అనుప్రవేశంవల్ల పరమాత్మకు **పురుషః** అనే ప్రత్యేక పేరు ఏర్పడింది. ఉపనిషత్తే ఆ పదాన్ని రెండు రకాలుగా నిర్వచిస్తున్నది.

**స వా అయం పురుషస్సర్వాసు పూర్షు పురిశయః** – ఈ పురుషుడు అన్ని స్థూలశరీరాలలో నిశ్చయంగా ఉన్నాడు.

మొదటి నిర్వచనం – **పురిశయః ఇతి పురుషః** – శరీరాల్లో ఉన్నాడు. పురి అంటే స్థూలశరీరం; శయనాత్ అంటే ఉన్నాడు; సూక్ష్మశరీరరూపంలో స్థూలశరీరంలో ఉన్నాడు.

**నైనేన కించనానావృతం నైనేన కించనాసంవృతమ్** – ఈ పురుషునితో కప్పివేయబడనది ఏదీ లేదు. ఈ పురుషునితో వ్యాపించబడనిది ఏదీ లేదు.

రెండవ నిర్వచనం – **పూరయతి సర్వం ఇతి పురుషః** – సర్వవ్యాపకం. కాని ఈ సర్వవ్యాపకత్వాన్ని ప్రత్యక్షంగా చెప్పకుండా రెండు వ్యతిరేక పదాలతో చెబుతున్నది. దానివల్ల చెబుతున్న భావనకు బలం వస్తుంది.

న + అనావృతం = ఆవృతం

ఈ పురుషునితో కప్పివేయబడనిది ఏదీ లేదు. నిజానికి అనావృతం పదానికీ అసంవృతమ్ పదానికీ పెద్దగా తేడా లేదు. కాని శంకరులవారు సూక్ష్మమైన భేదాన్ని సూచిస్తున్నారు. కప్పివేయబడనిది ఏదీ లేదు అంటే పరమాత్మచే లోపల ప్రవేశించబడనిది కూడా ఏదీ లేదు. ఈ పరమాత్మే బయట, లోపల ఉన్నాడు అంటే అన్నిటికీ అధిష్ఠానంగా ఉన్నాడు. ఈ విధంగా ఈ మంత్రంలో **సర్వాత్మ భావన** నెలకొల్పబడింది.

## మంత్రం 2.5.19

**ఇదం వై తన్మధు దధ్యఙ్జాథర్వణోఽ శ్విభ్యామువాచ। తదేతదృషిః పశ్యన్నవోచత్ । రూపగ్ం రూపం ప్రతిరూపో బభూవ తదస్య రూపం ప్రతిచక్షణాయ । ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే యుక్తా హ్యస్య హరయశ్శతా దశేతి ॥**

**అయం వై హరయోఽయం వై దశ చ సహస్రాణి బహూని చానన్తాని చ తదేతద్బ్రహ్మా పూర్వమనపరమనన్తరమబాహ్యమయమాత్మా బ్రహ్మ సర్వానుభూరిత్యనుశాసనమ్ ॥**

మొదటి రెండు వాక్యాలు మళ్ళీ అవే మాటలు. అశ్వినీ కుమారులకు దధ్యచ ఋషి మధువిద్యను బోధించటం చూసిన ఇంకో ఋషి వారితో ఇలా అన్నాడు. ఇక్కడ కూడా ఒక ఋగ్మంత్రాన్ని చూస్తాము. ముందు మంత్రంలో చూసిన సర్వాత్మభావనే ఇక్కడ కూడా వస్తుంది.

**రూపగ్ం రూపం ప్రతిరూపో బభూవ** – పరమాత్మ స్థూల,సూక్ష్మశరీరాల రూపం **తీసుకున్నట్టుగా** అనిపిస్తాడు. పరమాత్మకు రూపం లేదు, పరిమితులు లేవు. కాని స్థూల,సూక్ష్మశరీరాలలో ప్రవేశించినప్పుడు ఆయా రూపాలలో ఉన్నట్టుగా ఉంటుంది. రూపంలేని ఆత్మరూపం ఉన్న ఆకారాన్ని తీసుకునేసరికి శరీర ఆకారమే ఆత్మ ఆకారంగా అనిపిస్తుంది. అంతేకాదు ఆ శరీరసరిహద్దులకే పరిమితమైనట్టు అనిపిస్తుంది. అలా శరీరంలో ప్రతిబింబం ఏర్పడుతుంది.

**తదస్య రూపం ప్రతిచక్షణాయ** – తదస్య రూపం అంటే అలా ఏర్పడిన పరమాత్మయొక్క ప్రతిబింబం లేదా చిదాభాస. అది ఆత్మజ్ఞానం పొందటానికి తోడ్పడుతుంది. చిదాభాసవల్లనే ఆత్మజ్ఞానం పొందగలము. చిత్‌వల్ల పొందలేము. ఐతరేయోపనిషత్తులో కూడా పరమాత్మ అనుప్రవేశం చేసేముందు, నేనెవరు అని జీవాత్మకు ఎప్పుడో అనిపించి, ఆత్మజ్ఞానం పొందటానికి వస్తాడు అనుకున్నాడుట. అందువల్ల పరమాత్మ చిదాభాస రూపం ఆత్మజ్ఞానానికి తోడ్పడుతుంది.

**ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే** – ఇక్కడ ఇంద్ర అంటే దేవేంద్రుడు కాదు, పరమాత్మ. సర్వగత చైతన్యం. ఐతరేయోపనిషత్తులో పరమాత్మను **ఇదంద్రుడు**గా చూస్తాము. పరమాత్మ మాయ సహాయంతో అనేకంగా అయ్యాడు. ఒక్క పరమాత్మ అనేక రూపాలు దాల్చాడు. ఇక్కడ మాయను చిదాభాసగా చూస్తాము. నా చుట్టూ పది అద్దాలు ఉంటే నేను అనేకంగా కనిపిస్తాను.

పురురూప అంటే అనేక రూపాలు. ఆ విధంగా ఒక్క పరమాత్మ అనేక జీవాత్మలుగా కనిపిస్తున్నాడు. అంతేకాదు, ఎప్పుడైతే పరమాత్మ ప్రతిబింబచైతన్యం రూపం తీసుకున్నాడో, పరమాత్మ ప్రతిబింబచైతన్యంద్వారా శరీరాలలో తక్కిన అంగాలతో కలుస్తాడు.

**యుక్తాహ్యస్య హరయశ్శతా దశేతి** – ఈ పరమాత్మకు వంద, పది ఇంద్రియాలు ఉన్నాయి. హరయ అంటే ఇంద్రియాలు. ఇంద్రియాలు విషయాలను తీసుకుంటాయి. పరమాత్మ చిదాభాసద్వారా ఇంద్రియాలతో, ఇంద్రియాలద్వారా అనేక విషయవస్తువులతో ముడిపడివున్నాడు. ఇంద్రియాలద్వారా అనేక విషయాల జ్ఞానం పొందవచ్చు.

ఈ ఇంద్రియాలు ఎన్ని ఉన్నాయి? వ్యష్టిపరంగా చూస్తే పది ఉన్నాయి – పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు. మొత్తం మానవాళిని తీసుకుంటే వందలకొద్దీ ఉన్నాయి. ఇక్కడ వంద, పది చెప్పిందంటే వాటిని అక్షరాలా తీసుకోకూడదు. బహుత్వాన్ని తీసుకోవాలి. ఉన్నది ఒకటే పరమాత్మ. ఆయనే చిదాభాస

రూపంలో అనేకంగా భాసిల్లుతున్నాడు. పరమాత్మే అన్ని జీవాత్మల్లో ఉన్నాడు. అందువల్ల పరమాత్మయే ఈ జగత్తులో అన్నీ అనుభవిస్తున్నాడు. దీనితో ఋగ్ మంత్రం అయిపోయింది.

ఇప్పుడు ఉపనిషత్తు అందుకుని ఈ వాక్యాన్ని విశ్లేషిస్తున్నది. ఈ ఋగ్ మంత్రం ఒక సందేహాన్ని రేకెత్తించ వచ్చు. ఏమిటది? యుక్తాహ్యస్య హరయ – అంది ఋగ్మంత్రం. ఇంద్రియాలు పరమాత్మతో కలిసివున్నాయి. పరమాత్మలో కలిసివున్నాయి అంటే ఇంద్రియాలు వేరు, పరమాత్మ వేరా? పరమాత్మ వ్యతిరిక్త ఇంద్రియ అస్తిత్వ శంక వస్తుంది. ఇంద్రియాలు వేరు, పరమాత్మ వేరు అంటే ద్వైతభావన వస్తుంది. వేదాంతం అద్వైతభావనను బోధిస్తుంది. అందువల్ల ఆ సందేహాన్ని రాబోయే బ్రాహ్మణ భాగం తీరుస్తుంది. ఏమని?

**అయం వై హరయః** – పరమాత్మే ఇంద్రియాల రూపంలో ఉన్నాడు. అయం వై హరయ వాక్యం బాధసామానాధికరణ్యం. (సామానాధికరణ్యాల గురించి అంతకు ముందు చూశాము)

**అయం వై దశ చ సహస్రాణి బహూని చానంతాని చ** – ఈ పరమాత్మే పది, వేలు, అనేకాలు, అనంతాలు కూడా అవుతున్నాడు. అనేక, అనంత ఇంద్రియాలుగా అవుతున్నాడు.

ఈ విషయం స్వప్నవృత్తాంతం తీసుకుంటే బాగా అర్థమవుతుంది. కలలో నేను అనేక వస్తువులను చూస్తాను. కాని వాటన్నింటిలో నేనున్నాను. అనేక వస్తువులుగా నేనే భాసిల్లుతున్నాను. అలా పరమాత్మ అనేక ఇంద్రియాలుగా కనబడుతున్నాడు. ఇవన్నీ పరమాత్మ ప్రతిబింబం అయితే, పరమాత్మ అసలు స్వరూపం ఏమిటి? ఇక్కడ అనేక మహావాక్యాలు వస్తాయి.

**తదేతద్బ్రహ్మాపూర్వమనపరమ్** – ఈ బ్రహ్మ అపూర్వం, అపరం. పూర్వం అంటే కారణం; అపరం అంటే కార్యం. ఎప్పుడూ కారణం ముందు, కార్యం తరువాత వస్తాయి. అపూర్వం అంటే కారణం కాదు, అనపరం అంటే కార్యం కాదు. అంటే బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

కాని బ్రహ్మను జగత్తు నిమిత్త ఉపాదాన కారణంగా వర్ణిస్తాము ఎన్నోచోట్ల. మైత్రేయీ బ్రాహ్మణంలోనే బ్రహ్మను సృష్టి, స్థితి, లయ కారణంగా చూశాము. తడిబొగ్గుతో ఏర్పడిన అగ్నిని సృష్టికి; దుందుభి, శంఖం ఉదాహరణ స్థితికీ, లవణ దృష్టాంతం లయకూ చూశాము. బ్రహ్మ కారణం, జగత్తు కార్యం అని చూశాము. ఒకచోట బ్రహ్మను కారణంగా, జగత్తును కార్యంగా చూపిస్తూ, ఇంకోచోట బ్రహ్మ కారణమూ కాదు, బ్రహ్మకు కార్యమూ లేదు అని చెపితే, ఏది సరియైనది?

రెండూ సరియైనవే! రెండూ రెండు భిన్నవాక్యాలు కదా, రెండూ సరియైనవే ఎలా అవుతాయి? రెండూ సరియైనవి ఒకే ఒక నిబంధనలో అవుతాయి. అది ఏమిటంటే కార్యాన్ని మిథ్యగా తీసుకోవాలి. వ్యావహారిక దృష్టిలో కార్యం ఉంది; పారమార్థిక దృష్టిలో కార్యం లేదు. అనుభవంలో కార్యం ఉంది. సత్యంగా చూస్తే కార్యం లేదు. ఇది కూడా కలలా శాశ్వతం కాదు.

స్వప్నవృత్తాంతం తీసుకుంటే స్వప్న అనుభవం ఉంది; స్వప్నంలో డబ్బు కూడా ఉంది; స్వప్నంలో ఉన్నంత సేపూ అది నిజమనే అనిపిస్తుంది. కాని స్వప్నంలో ఉన్న డబ్బును నిజజీవితంలో అనుభవించలేము కదా!

అదే విధంగా ఈ జగత్తు వ్యావహారిక స్థాయిలో నిజంగానే అనిపిస్తుంది; జగత్తు అనుభవం ఉంటుంది. కాని పారమార్థిక స్థాయికి ఎదిగితే, ఇది స్వప్నంలా కరిగిపోతుంది.

పారమార్థిక స్థాయిలో సృష్టి లేదు, ప్రళయం లేదు; గురువు లేడు, శిష్యుడు లేడు; శ్రవణం లేదు, మననం లేదు. అందువల్ల బ్రహ్మ కారణం కాదు, బ్రహ్మనుంచి కార్యం రాలేదు.

**అనంతరమబాహ్యమ్** – అంతరము లేని వాడు, బాహ్యం లేనివాడు. జగత్తు బ్రహ్మ బయట ఉందా, బ్రహ్మ లోపల ఉందా? ద్వైతవాదులు జగత్తు బ్రహ్మ బయట ఉంది అంటారు; విశిష్టాద్వైతవాదులు జగత్తు బ్రహ్మలో ఒకభాగం అంటారు. కాని అద్వైతం జగత్తు బయటా లేదు, లోపలా లేదు అంటుంది. మీరు కలలో చూసిన ఏనుగు, మీ లోపల ఉందా, బయట ఉందా? లోపలా లేదు, బయటా లేదు. అంత పెద్ద ఏనుగు మీ లోపల ఎలా ఉంటుంది? మన ఒక చిన్న మంచంమీద పడుకుని కలగంటూంటే, ఆ పక్కన ఎలా ఉంటుంది? అందువల్ల కలలోని ఏనుగు **ఉన్నట్టుగా ఉంటుంది** తప్ప నిజంగా లేదు.

అదే జవాబు జగత్తు బ్రహ్మలో ఉందా, బయటవుందా ప్రశ్నకు. ఏ జవాబిచ్చినా సమస్యే అవుతుంది. అందువల్ల బ్రహ్మ అనంతరం, అబాహ్యం అంటాము. బ్రహ్మ లోపలా లేదు, బయటా లేదు. రజ్జు సర్పభ్రాంతిలో పాము తాడు లోపల ఉందా, బయట ఉందా? ఎక్కడా లేదు. తాడు బదులు పామును చూస్తున్నాము. అది భ్రాంతి మాత్రమే. అలాగే జగత్తు వచ్చినట్టుగా భ్రాంతి కలుగజేస్తుంది అంతే.

భాష్యకారులు ఈ పదాలకు ఇంకో అర్థాన్నిస్తారు. అనంతరం అంటే నిస్సామాన్యం; అబాహ్యం అంటే నిర్విశేషం అంటారు. బ్రహ్మ సామాన్య విషయమూ కాదు, ప్రత్యేక విషయమూ కాదు. మనుష్యులందరిలో సామాన్యంగా ఉండే మనుష్యత్వాన్ని సామాన్య విషయం అంటాము. అలాగే చెట్లు తీసుకుంటే అన్ని చెట్లనీ కలిపి సామాన్యంగా వృక్షాలు అంటాము. అందులో ఒక చెట్టు గురించి, మామిడిచెట్టు గురించి చెపితే అది విశేషం అవుతుంది. మనుష్యుల్లో శ్రీగోపాలకృష్ణ విశేషం. అలా ఈ సృష్టిలో ప్రతిదీ సామాన్యంలోకి అయినా విశేషంలోకి అయినా వస్తుంది. బ్రహ్మ సామాన్యమూ కాదు, విశేషమూ కాదు. అందువల్ల అనంతరం, అబాహ్యం.

**అయమాత్మా బ్రహ్మ** – ఇది ఒక మహావాక్యం. ఆ బ్రహ్మను నేను. ఇది సంపూర్ణమైన బోధ. వేదాంతసారమంతా ఒక్క వాక్యంలో వచ్చేసింది.

అయమాత్మా బ్రహ్మ – మాండూక్యం

మాండూక్యంలో కూడా ఇదే వాక్యం వచ్చింది. ఇది బ్రహ్మను, జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్నీ కూడా వివరించింది.

అయమాత్మా బ్రహ్మ అనే మహావాక్యాన్నిచ్చి, ఉపనిషత్తే బ్రహ్మను, ఆత్మను వివరిస్తున్నది.

అపూర్వం, అనంతరం, అనపరం, అబాహ్యం బ్రహ్మ అంది. ఇదొక అద్భుతమైన నిర్వచనం బ్రహ్మకు.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ – తైత్తిరీయం**

తైత్తిరీయంలోని ఆ నిర్వచనానికి ధీటుగా నిలుస్తుంది ఈ నిర్వచనం. శంకరులవారు తరచు ఈ రెండూ ఉటంకిస్తుంటారు. బ్రహ్మ కారణం కాదు, కార్యం కాదు; బ్రహ్మ బయటా లేదు, బ్రహ్మ లోపలా లేదు. ఇదే నిర్వచనాన్ని ఇంకో విధంగా చెప్పాలంటే సజాతీయ, విజాతీయ, స్వగతభేదరహితం బ్రహ్మ.

**చిదేవ ఇదమగ్ర ఆసీత్** – ఐతరేయం

ఆత్మ నిర్వచనం ఏమిటి?

**సర్వానుభూః** – ఈ ఆత్మయే సర్వాన్ని అనుభవిస్తుంది. అంటే సాక్షిచైతన్యం. ఇక్కడ అనుభవిస్తుంది అనే పదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఇంగ్లీషు పదాలు చూస్తే ఇంకా తేలిగా అర్థమవుతుంది – రైటర్ అంటే రాసేవాడు; వాకర్ అంటే నడిచేవాడు; థింకర్ అంటే ఆలోచించేవాడు – అలా ఎక్స్‌పీరియన్సర్ అంటే అనుభవించేవాడు. ఆత్మ గురించి మనం పదేపదే ఈ వాక్యాన్ని చెబుతాము కూడా!

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

అనుభవించే నువ్వు అని పదం వాడినా ఆత్మ కర్మ చేయకుండా అనుభవిస్తుంది. ఆత్మ నిర్వికారసాక్షి. అంటే ఆత్మ ఏదీ ప్రయత్నపూర్వకంగా తెలుసుకోదు. ఆత్మ మనస్సులా కాదు. మనస్సు బాహ్యప్రపంచం గురించి తెలుసుకోవాలంటే, మనస్సులో వృత్తులు ఏర్పడతాయి, మనస్సు మారుతుంది, ప్రపంచాన్ని అనుభవిస్తుంది. కాని ఆత్మవిషయంలో ఆత్మ పరిణామం చెందదు; పని చేయదు. మరి ఏం జరుగుతుంది? ఆత్మ సమక్షంలో ఆత్మ ప్రయత్నం లేకుండా మనస్సులో చిదాభాస ఏర్పడుతుంది. చిదాభాస మనస్సును ప్రకాశింపజేస్తుంది.

ఆత్మ సమక్షంలో మనస్సు ప్రకాశవంతమవుతుంది కాబట్టి, ఆత్మను అనుభవించే ఆత్మగా అభివర్ణించటం జరుగుతుంది. ఇది అద్దంలో మీ ప్రతిబింబం ఏర్పడటం లాంటిది. మీరు అద్దం ముందు నిల్చుంటే, మీ వైపునుంచి ఏమీ ప్రయత్నం లేకుండా, మీ ప్రతిబింబం అద్దంలో ఏర్పడుతుంది. ఒక్కోసారి, అద్దంలో మీ ప్రతిబింబం ఏర్పడినట్టు కూడా మీరు గమనించకపోవచ్చు. అంటే మీ ప్రతిబింబం ఏర్పడటానికి మీ ప్రయత్నం లేదు. మీ పురుషబుద్ధి లేదు, మీలో ఏ మార్పూ రాలేదు. అందువల్ల అద్దంలో మీరు కనిపిస్తున్నారు అంటే, మీ సమక్షంలో మీకు ఇష్టమున్నా లేకపోయినా దానంతట అదే మీ ప్రతిబింబం ఏర్పడింది.

అదే విధంగా ఆత్మ అనుభవిస్తుంది అంటే, ఆత్మ సమక్షంలో మీకు ఇష్టమున్నా లేకపోయినా, ఆత్మ పురుషబుద్ధి ఉపయోగించకుండా, పనులు అవుతాయి. మీకు ఇష్టమున్నా లేకపోయినా జాగ్రత్ అనుభవం, స్వప్న అనుభవం, సుషుప్తి అనుభవాల్లో ఏదో ఒకటి అనుభవిస్తూ ఉంటారు. ఆత్మకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఒక అనాత్మ అనుభవం తర్వాత ఇంకొక అనాత్మ అనుభవం అవుతూనే ఉంటుంది. దీన్నే సర్వానుభూః అన్నారు.

ఈ నిర్వచనం కొంచెం సూక్ష్మంగానూ, కష్టంగానూ ఉంది కాబట్టి, ఈ సర్వానుభూః పదంకు సురేశ్వరాచార్యులు వేరే నిర్వచనం ఇస్తున్నారు. సర్వానుభూః అంటే సర్వ + అనుభూః. సర్వ అంటే మొత్తం జడప్రపంచం, అను అంటే చైతన్యం. అందువల్ల ఆత్మ జడప్రపంచం, చైతన్య ప్రపంచం కూడా; అది అనాత్మ, ఆత్మ కూడా; దృశ్యం, దృక్కు కూడా. దీన్ని సర్వానుభూః అంటారు. సర్వానుభూః అంటే సర్వాన్ని అనుభవించేది.

**సర్వాత్మనా సర్వమనుభవతీతి సర్వానుభూః**

**ఆత్మ = చైతన్యరూపం**
**బ్రహ్మ = సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం**

అందువల్ల ఆత్మ = బ్రహ్మ. చైతన్యరూపమైన ఆత్మే సజాతీయ, విజాతీయ స్వగతభేదరహితమైన బ్రహ్మ. ఆ విధంగా జీవాత్మ పరమాత్మ ఐక్యం వచ్చింది. ఇది మధువిద్యా బోధ. సర్వాత్మ భావనను బోధిస్తున్నాడు. ఇదే భావనను మైత్రేయీ బ్రాహ్మణంలో కూడా చూస్తాము. ఇక్కడితో మధు బ్రాహ్మణము అనే ఐదవ బ్రాహ్మణము ముగిసింది. ఇప్పుడు ఆరవ బ్రాహ్మణములోకి అడుగు పెడదాము.

# 2.6 - వంశ బ్రాహ్మణము

మధు బ్రాహ్మణముతో అసలు బోధ ముగిసింది. ఆరవ బ్రాహ్మణము విద్యాస్తుతికోసం చెప్పబడింది. ఈ విద్యను అనేక విధాలుగా స్తుతిస్తారు, కాని ఇక్కడ ఒక ప్రత్యేక పద్ధతిలో స్తుతింపబడుతున్నది. దీనిద్వారా ఇది ఆధునిక విద్య కాదని, ఎవరో ఒక వ్యక్తి తెలివినుంచి ఉత్పన్నమయినది కాదని తెలుస్తుంది. పురుషబుద్ధినుంచి వచ్చినదాంట్లో లోటుపాట్లు ఉండే అవకాశం ఉంది. అందువల్ల ప్రతిజ్ఞానానికీ మార్పులూ, చేర్పులూ చూస్తూ ఉంటాము.

కాని బ్రహ్మవిద్యలో అలాంటి దోషాలు ఉండవు. ఎందుకంటే ఇది అనాదిగా వస్తున్నది; పరంపరగా వస్తున్నది. ఇది పరంపరగా ప్రాప్తిస్తున్న విద్య అని నిరూపించటానికి ఆరవ బ్రాహ్మణము గురుశిష్యుల పరంపరను చెప్పుకొస్తున్నది.

గురుశిష్యుల పరంపరను చెప్పుకొస్తున్నది కాబట్టి దీన్ని వంశబ్రాహ్మణము అంటారు. వంశం అంటే కుటుంబం. ఇక్కడ గురుశిష్యుల కుటుంబం గురించి చెపుతున్నది. ఇది సాక్షాత్తూ హిరణ్యగర్భనుంచి ప్రారంభమవుతున్నది అంటే సృష్టి ఆరంభకాలంలో ప్రారంభమై, నేటి 21వ శతాబ్దం వరకూ వచ్చింది.

ఈ బ్రాహ్మణాన్ని ఇలా చెప్పటంలో ఇంకో ముఖ్యకారణం ఉంది అంటున్నారు శంకరులవారు. అనాది పరంపర మాత్రమే అయితే, ఉపనిషత్తు టూకీగా ఇది అనాది పరంపరా ప్రాప్తం అని ఒక ముక్క చెప్పేసి ఊరుకుని ఉండవచ్చు. కాని చాలా శ్రద్ధగా పేర్లన్నీ పేర్కొంది. ఎందుకు?

**మంత్రశ్చాయం స్వాధ్యాయార్థో జపార్థశ్చ**

ఈ బ్రాహ్మణము స్వాధ్యాయంకోసం, జపించటంకోసం కూడా చెప్పబడింది.

గురుశిష్యుల పేర్లు వస్తాయని చూశాము. మంత్రార్థం చూసేముందు కొన్ని విషయాలు గమనించాలి. కొన్ని పేర్లు పదేపదే వస్తున్నాయి. అది అచ్చు తప్పు కాదు. అనేక ఋషులకు ఒకే పేర్లు ఉన్నాయన్నమాట. కొందరు శిష్యులకు ఇద్దరు గురువులు ఉన్నారు – చ కారం ఆ విషయాన్ని సూచిస్తుంది. మనం చూసిన దధ్యచ ఋషి పేరు కూడా మధ్యలో వస్తుంది.

ఇంకొక విషయం శిష్యుని పేరు ముందు, గురువు పేరు తర్వాత వస్తుంది. ఉదాహరణకు పౌతిమాష్యో గౌపవనాత్ – పౌతిమాష్యుడు గౌపవనునినుంచి నేర్చుకున్నాడు. ఇప్పుడు మంత్రాలు చూద్దాము.

మంత్రం 2.6.1

**అథేదానీం వగ్ంశః। పౌతిమాష్యో గౌపవనాద్గౌపవనః పౌతిమాష్యాత్పౌతిమాష్యో గౌపవనాద్గౌపవనః కౌశికాత్కౌశికః కౌండిన్యాత్కౌండిన్యశ్శాండిల్యాచ్ఛాండిల్యః కౌశికాచ్చ గౌతమాచ్చ గౌతమః ॥**

తర్వాత ఇప్పుడు వంశం. పౌతిమాష్యుడు గౌపవనునినుంచి, గౌపవనుడు పౌతిమాష్యునినుంచి, పౌతిమాష్యుడు గౌపవనునినుంచి, గౌపవనుడు కౌశికునినుంచి, కౌశికుడు కౌండిన్యునినుంచి, కౌండిన్యుడు శాండిల్యునినుంచి, శాండిల్యుడు కౌశికుడు మరియు గౌతముడు అనే ఇద్దరినుంచి, గౌతముడు (అగ్నివేశ్యునినుంచి బ్రహ్మవిద్యను గ్రహించారు).

## మంత్రం 2.6.2

**ఆగ్నివేశ్యాదాగ్నివేశ్యశ్శాండిల్యాచ్చానభిమ్లాతాచ్చానభిమ్లాత ఆనభిమ్లాతాదానభిమ్లాత ఆనభిమ్లాతాదానభిమ్లాతో గౌతమాద్గౌతమస్సైతవప్రాచీనయోగ్యాభ్యాగ్ం సైతవప్రాచీనయోగ్యౌ పారాశర్యాత్పారాశర్యో భారద్వాజాద్భారద్వాజో భారద్వాజాచ్చ గౌతమాచ్చ గౌతమో భారద్వాజాద్భారద్వాజః పారాశర్యాత్పారాశర్యో బైజవాపాయనాద్బైజవాపాయనః కౌశికాయనేః కౌశికాయనిః ॥**

(గౌతముడు) అగ్నివేశ్యునినుంచి, అగ్నివేశ్యుడు శాండిల్యునినుంచి మరియు ఆనభిమ్లాతునినుంచి, ఆనభిమ్లాతుడు ఆనభిమ్లాతునినుంచి, ఆనభిమ్లాతుడు ఆనభిమ్లాతునినుంచి, ఆనభిమ్లాతుడు గౌతమునినుంచి, గౌతముడు సైతవుడు మరియు ప్రాచీనయోగ్యులనుంచి, సైతవుడు మరియు ప్రాచీనయోగ్యుడు పారాశర్యునినుంచి, పారాశర్యుడు భారద్వాజునినుంచి, భారద్వాజుడు భారద్వాజుడు మరియు గౌతములనుంచి, గౌతముడు భారద్వాజునినుంచి, భారద్వాజుడు పారాశర్యునినుంచి, పారాశర్యుడు బైజవాపాయనునినుంచి, బైజవాపాయనుడు కౌశికాయనినుంచి, కౌశికాయని (ఘృతకేశికునినుంచి బ్రహ్మవిద్యను గ్రహించారు).

## మంత్రం 2.6.3

**ఘృతకౌశికాద్ఘృతకౌశికః పారాశర్యాయణాత్పారాశర్యాయణః పారాశర్యాత్పారాశర్యో జాతూకర్ణ్యాజ్జాతూకర్ణ్య ఆసురాయణాచ్చ యాస్కాచ్చాసురాయణస్త్రైవణేస్త్రైవణిరౌపజంధనేరౌపజంధనిరాసురేరాసురిర్భారద్వాజాద్భారద్వాజ ఆత్రేయాదాత్రేయో మాణ్టేర్మాణ్టిర్గౌతమాద్గౌతమో గౌతమాద్గౌతమో వాత్స్యాద్వాత్స్యశ్శాండిల్యాచ్ఛాండిల్యః కైశోర్యాత్కాప్యాత్కైశోర్యః కాప్యః కుమారహారితాత్కుమారహారితో గాలవాద్గాలవో విదర్భీకౌణ్డిన్యాద్విదర్భీకౌణ్డిన్యో వత్సనపాతో బాభ్రవాద్వత్సనపాద్బాభ్రవః పథస్సౌభరాత్పంథాస్సౌభరోఽయాస్యాదాంగిరసాదయాస్య ఆంగీరస ఆభూతేస్త్వాష్ట్రాదాభూతిస్త్వాష్ట్రో విశ్వరూపాత్త్వాష్ట్రాద్విశ్వరూపస్త్వాష్ట్రోఽశ్విభ్యామశ్వినౌ దధీచ ఆథర్వణాద్దధ్యఙ్ఙాథర్వణోఽథర్వణో దైవాదథర్వా దైవో మృత్యోః ప్రాధ్వగ్ంసనాన్మృత్యుః ప్రాధ్వగ్ంసనః ప్రధ్వగ్ంసనాత్ప్రధ్వగ్ంసన ఏకర్షేరేకర్షిర్విప్రచిత్తేర్విప్రచిత్తిర్వ్యష్టేర్వ్యష్టిస్సనారోస్సనారుస్సనాతనాత్సనాతనస్సనగాత్సనగః పరమేష్ఠినః పరమేష్ఠీ బ్రహ్మణోబ్రహ్మ స్వయమ్భు బ్రహ్మణే నమః ॥**

(కౌశికాయని) ఘృతకౌశికునినుంచి, ఘృతకౌశికుడు పారాశర్యాయణునినుంచి, పారాశర్యాయణుడు పారాశర్యునినుంచి, పారాశర్యుడు జాతూకర్ణ్యునినుంచి, జాతూకర్ణ్యుడు అసురాయణుడు మరియు యాస్కులనుంచి, అసురాయణుడు త్రైవణినుంచి, త్రైవణి ఔపజంధనినుంచి, ఔపజంధని ఆసురినుంచి, ఆసురి భారద్వాజునినుంచి, భారద్వాజుడు ఆత్రేయునినుంచి, ఆత్రేయుడు మాంటినుంచి, మాంటి గౌతమునినుంచి, గౌతముడు గౌతమునినుంచి, గౌతముడు వాత్స్యునినుంచి, వాత్స్యుడు శాండిల్యునినుంచి, శాండిల్యుడు కైశోర్య కాప్యునినుంచి, కైశోర్య కాప్యుడు కుమారహారితునినుంచి, కుమారహారితుడు గాలవునినుంచి, గాలవడు విదర్భీ కౌండిన్యునినుంచి, విదర్భీ కౌండిన్యుడు వత్సనపాత్ బాభ్రవునినుంచి, వత్సనపాత్ బాభ్రువుడు పంథా సౌభరునినుంచి, పంథా సౌభరుడు అయాస్య అంగిరసునినుంచి, అయాస్య అంగిరసుడు ఆభూతి త్వాష్ట్రునినుంచి, ఆభూతి త్వాష్ట్రుడు విశ్వరూప త్వాష్ట్రునినుంచి, విశ్వరూప త్వాష్ట్రుడు అశ్వినీదేవతలనుంచి, అశ్వినీ దేవతలు దధ్యఙ్ అథర్వుణునినుంచి, దధ్యఙ్ అథర్వుణుడు అథర్వణ దైవునినుంచి, అథర్వణ దైవుడు మృత్యు ప్రాధ్వంసనునినుంచి, మృత్యు ప్రాధ్వంసనుడు ప్రధ్వంసనునినుంచి, ప్రధ్వంసనుడు ఏకర్షినుంచి, ఏకర్షి విప్రచిత్తినుంచి, విప్రచిత్తి వ్యష్టినుంచి, వ్యష్టి సనారువునుంచి, సనారువు సనాతనునినుంచి, సనాతనుడు సనగునినుంచి, సనగుడు పరమేష్ఠినుంచి, పరమేష్ఠి బ్రహ్మనుంచి బ్రహ్మవిద్యను గ్రహించారు. బ్రహ్మ స్వయంభువు. బ్రహ్మకు నమస్కారములు.

బ్రహ్మ స్వయంభువు. బ్రహ్మకు బ్రహ్మవిద్య ఈశ్వరుని కృపవల్ల దానంతట అదే వస్తుంది. గురువు అవసరం లేదు. బ్రహ్మ అంటే హిరణ్యగర్భ. ఈశ్వరుడు హిరణ్యగర్భకు జ్ఞానాన్ని గురుశిష్యుల రూపంలో ఇవ్వలేదు, కేవలం ఆయన దీవెనద్వారానే వచ్చింది. అందువల్ల హిరణ్యగర్భను వేదాలుగా కొలుస్తారు. బ్రహ్మను చతుర్ముఖబ్రహ్మ అని కూడా అంటారు. ఆయన నాలుగు ముఖాలు నాలుగు వేదాలను సూచిస్తాయి.

గురుశిష్య పరంపరలనిచ్చాక, ఉపనిషత్తే బ్రహ్మకు నమస్కారం చేస్తున్నది. బ్రహ్మణే నమః అంటున్నది. దీనితో వంశ బ్రాహ్మణం అయిపోయింది. రెండవ అధ్యాయం అయిపోయింది, మధు కాండము అయిపోయింది.

# అధ్యాయము 2 - సారాంశము

**మొదటి అధ్యాయానికి రెండవ అధ్యాయానికి మధ్య సంబంధం**

అధ్యారోప అపవాద ప్రక్రియలో, మొదటి అధ్యాయం అధ్యారోపాన్ని సూచిస్తే, రెండవ అధ్యాయంలో మొదటి మూడు బ్రాహ్మణాలూ అపవాదాన్ని సూచిస్తాయి.

నాలుగు, ఐదవ బ్రాహ్మణాలు మొదటి అధ్యాయంలో నాలుగవ బ్రాహ్మణములో (1.4.7) వచ్చిన విద్యాసూత్రంమీద భాష్యం.

ఆరవ అధ్యాయం ఉపసంహారం.

రెండవ అధ్యాయములో ఆరు బ్రాహ్మణాలు ఉన్నాయి. అవి

| బ్రాహ్మణము | | బోధ |
|---|---|---|
| 1. అజాతశత్రు బ్రాహ్మణము | – | జీవాత్మ పరమాత్మ ఐక్యం |
| 2. శిశు బ్రాహ్మణము | – | ప్రాణా వై సత్యంలో ప్రాణం వివరణ |
| 3. మూర్తామూర్త బ్రాహ్మణము | – | ప్రాణా వై సత్యంలో సత్యం వివరణ |
| 4. మైత్రేయీ బ్రాహ్మణము | – | ఇదం సర్వం యదయమాత్మ |
| 5. మధు బ్రాహ్మణము | – | బ్రహ్మ సత్యం, జగన్మిథ్య |
| 6. వంశ బ్రాహ్మణము | – | గురుశిష్య పరంపర |

1.**అజాతశత్రు బ్రాహ్మణము** – అజాతశత్రువు, గార్గ్యల మధ్య సంవాదం. గార్గ్య అజాతశత్రువుకు సగుణబ్రహ్మ గురించి బోధిస్తే, అతనికి పూర్తిగా తెలియదని చెప్పి అజాతశత్రువు, గార్గ్యకు నిర్గుణబ్రహ్మ గురించి బోధిస్తాడు. సుప్త పురుషుని ఉదాహరణద్వారా ఆత్మచైతన్యం, జగత్ కారణమైన బ్రహ్మకు భిన్నంగా లేదని చూపిస్తాడు. ఆత్మకు రహస్యనామం **సత్యస్య సత్యం** అని చెబుతాడు (2.1.20). అంటే ప్రాణా వై సత్యం తేషాం ఏవ సత్యం.

**2.శిశు బ్రాహ్మణము** – ప్రాణా వై సత్యంలో ప్రాణం గురించిన చర్చ వస్తుంది. ప్రాణం అంటే కార్యకరణ సంఘాతం. ప్రాణానికి రహస్యనామం శిశువు.

**3.మూర్తామూర్త బ్రాహ్మణము** – ప్రాణా వై సత్యంలో సత్యం గురించిన వివరణ వస్తుంది. స్థూలశరీరం మూర్తప్రపంచం, సూక్ష్మశరీరం అమూర్తప్రపంచం. సత్యంలోని **సత్** పదం మూర్తప్రపంచాన్ని, **త్యం** పదం అమూర్తప్రపంచాన్ని సూచిస్తాయి. అందువల్ల సత్యం అంటే మూర్తామూర్తప్రపంచం. ప్రాణా వై సత్యం అంటే ప్రాణం మూర్తామూర్తప్రపంచం.

ఆత్మ సత్యస్య సత్యం అంటే మూర్తామూర్త ప్రపంచస్యసత్యం. మూర్తామూర్త ప్రపంచంయొక్క అధిష్ఠానం.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా**

అధిష్ఠానం ఆత్మను 'నేతి నేతి' ద్వారా వర్ణిస్తుంది. అధిష్ఠానం ఎవరో కాదు నువ్వే. నువ్వు చైతన్యరూపమైన ఆత్మవు (2.3.6).

**4.మైత్రేయీ బ్రాహ్మణము** – ఇందులో యాజ్ఞవల్క్యుడు, మైత్రేయీల మధ్య సంవాదం రూపంలో ముందు **ఆత్మ పరమానంద రూపం** అనే బోధ వస్తుంది. చాలా ముఖ్యమైన సూత్రంద్వారా దాన్ని నిర్వచిస్తాడు.

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి

**ఆత్మజ్ఞానం పొందే మార్గం** చాలా స్పష్టంగా వస్తుంది.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్య**

ఆత్మజ్ఞానం శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారానే పొందగలము, వేరే మార్గం లేదు అని ప్రతి ఉపనిషత్తులోనూ ఏదో విధంగా చెబుతాము. కాని ఇక్కడ స్పష్టంగా ఆ విషయం వస్తుంది.

**సర్వాత్మ భావన** – ఆత్మ సర్వాత్మభావనను కూడా ఇందులో చాలా స్పష్టంగా చూస్తాము.

**ఇదం సర్వం యదయమాత్మా**

మళ్ళీ దీనిద్వారా వేదాంతసారం వస్తుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**ఆత్మ జగత్ కారణం** – ఆత్మ జగత్ సృష్టి, స్థితి, లయ కారణంగా చూస్తాము. సృష్టిని అగ్ని ఉదాహరణద్వారా, స్థితిని దుందుభి; శంఖ, వీణ దృష్టాంతాలద్వారా, లయను లవణ దృష్టాంతంద్వారా చూస్తాము. ఆత్మను జగత్ కారణంగా చూపటంద్వారా సర్వాత్మ భావన, తద్వారా బ్రహ్మ సత్యం, జగన్మిథ్య చూపటం జరుగుతుంది.

**5.మధు బ్రాహ్మణము** – మధువు అంటే కార్యం అనీ, భోగ్యవస్తువు అనీ వర్ణిస్తుంది ఉపనిషత్తు. ఈ బ్రాహ్మణము సారాంశం రెండు అంశాలు –

జగత్తులో ప్రతిదానికీ ఉపకారక, ఉపకారస్య సంబంధం ఉంది. అలా రెండు ఒకదానిమీద ఒకటి ఆధారపడ్డాయంటే, ఆ రెండింటికీ స్వతంత్రంగా ఉనికి లేదు, అంటే జగత్తు మిథ్య.

ఆ రెండింటికీ భిన్నంగా అధిష్ఠానం ఇంకోటి ఉంది. అదే అధిష్ఠానం బ్రహ్మ. బ్రహ్మ సత్యం. సర్వాత్మభావన కూడా వస్తుంది.

ఆ విధంగా మళ్ళీ **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా** సూత్రం వస్తుంది.

దీనితో బోధ అయిపోయింది.

**6.వంశ బ్రాహ్మణము** – గురుశిష్యుల పరంపర వస్తుంది. దీనికి కూడా రెండు కారణాలు ఉన్నాయి –

1. విద్యాస్తుతికోసం
2. జపం చేయటంకోసం.